www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 14-4-2024 | పేజీలు: 12 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 360 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి ఉ. 11.44 తదుపరి సప్తమి; నక్షత్రం: ఆర్ద్ర రా.1.35 తదుపరి పునర్వసు; వర్జ్యం: ఉ. 6.29-11.08; దుర్ముహూర్తం: సా. 4.48-5.37; అమృతఘడియలు: మ. 3.15-4.54; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.27 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అమ్మకానికి ఎండీసీ!

విదేశీ ఇన్వెస్టర్‌కు వాటాలు

ఆ షరతుతో 14,000 కోట్ల అప్పు

- విదేశీ ఇన్వెస్టర్ వివరాలు బయటపెట్టని జగన్ సర్కారు
- ఇప్పటికే 7,000 కోట్ల రుణం
- మే 2న మరో రూ.7,000 కోట్లు
- ఆ డబ్బు ఎందుకోసమో?
- వేల కోట్ల ఆస్తులున్న ఎండీసీకి ఆర్థిక శాఖ గ్యారెంటీ ఎందుకు?
- అప్పిచ్చిన ఇన్వెస్టర్‌కు వడ్డీతో పాటు వాటాలు, ప్రభుత్వ గ్యారెంటీ కూడా
- ప్రభుత్వ తీరుపై ఎన్నో సందేహాలు
- సీఎం, సీఎస్ సహా సాగిలపడ్డ వైనం

ఏపీఎండీసీ.. 100 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాటాలున్న సంస్థ. రూ.కోట్ల విలువ చేసే గనులున్నాయి. ఆర్థికంగా, వ్యాపార కార్యకలాపాల పరంగా స్థిరంగా ఉంది. అలాంటి ఏపీఎండీసీలో వాటాలు విదేశీ ఇన్వెస్టర్‌కు అమ్మాలని నిర్ణయించారు. ఆ విదేశీ ఇన్వెస్టర్ పేరేదో, ఊరేదో తెలియదు. అంతా రహస్యం. ఎలాంటి కాంపిటీషన్ లేకుండా ఎందుకు అమ్మాలనుకుంటున్నారు? విదేశీ ఇన్వెస్టర్ ఇస్తున్న డబ్బు సక్రమంగా సంపాదించిందేనా? ఏపీఎండీసీని వాడుకుని అక్రమ సొమ్మును సక్రమం చేసుకుంటున్నారా? ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డి, గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, సీఎస్ జవహర్ రెడ్డి ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా?



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు గత ఐదేళ్లుగా అడ్డగోలుగా అప్పులు చేసింది. ప్రభుత్వ ఆస్తులు, భవనాలు, ఆదాయాన్ని తాకట్టు పెట్టింది. కార్పొరేషన్ల ద్వారా రుణాలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిధులనూ దారి మళ్లించింది. రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా మార్చేసింది. ఎన్నికల ముందు జగన్ సర్కారు మరో అడ్డగోలు నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)ను ఏకంగా అమ్మకానికి పెట్టింది. ఎండీసీలో వాటాలు అమ్ముతామన్న షరతుతో ఇప్పటికే రూ.7,000 కోట్లు అప్పు తీసుకోగా, మే 2వ తేదీన మరో రూ.7,000 కోట్లు అప్పు తీసుకురానుంది. ఈ అప్పిస్తున్న విదేశీ ఇన్వెస్టర్‌కు ఎండీసీలో వాటాలు అమ్మబోతోంది. వాటాల అమ్మకం నుంచి విదేశీ ఇన్వెస్టర్ ఎవరన్న విషయాన్ని జగన్ సర్కారు రహస్యంగా ఉంచింది. వాటాలు అమ్మడం ద్వారా ఏపీఎండీసీ వాల్యుయేషన్‌ను, ఇమేజ్‌ను పెంచుతున్నామని టర్మ్‌షీట్‌లో రాశారు. ఇప్పటికే తెచ్చిన రూ.7,000 కోట్లు, మే 2వ తేదీన తేబోయే రూ.7,000 కోట్లను కార్పొరేషన్ పెట్టుబడుల అవసరాల కోసమంటూ కేబినెట్ మెమోలో, ఈ వ్యవహారానికి

మిగతా 2వ పేజీలో...



ప్రత్తిపాడులో నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న చంద్రబాబు

వెయ్యి మంది జగన్‌లు వచ్చినా..

అమరావతిని కదిలించలేరు

జూన్ 4న జగనాసుర వధ.. అమరావతి వేడుక: చంద్రబాబు

- రాజధాని అంటే 4 బిల్డింగులని ఈ మూర్ఖులు అనుకుంటున్నారు
- అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు ఎప్పుడో కట్టా
- కానీ రాజధాని అంటే ఆంధ్రుల ఆత్మగౌరవం
- గర్వంగా చెప్పుకొనే ప్రజల ఆస్తి
- నాలెడ్జ్ హబ్‌గా మార్చాలని కోరుకున్నా
- తిక్కలోడు వచ్చి నాశనం చేశాడు
- వాతలు పెడితే మూడు ముక్కల ఊసెత్తడు
- రాజధాని మహిళల పోరాటం అద్వితీయం
- వారి వల్లే అమరావతి గెలిచింది.. నిలిచింది
- కేంద్రంలో మోదీ, ఇక్కడ పవన్ మనకు తోడు
- సీఎం కాగానే ప్రజావేదిక పునర్నిర్మిస్తా
- జగన్ మొద్దబ్బాయి.. సీఎంగా పనికిరాడు
- వైసీపీలో సామాజిక న్యాయం నేతి బీరకాయే
- అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ
- వలంటీర్లు రాజీనామా చేస్తే భవిష్యత్ ఉండదు
- ప్రజాగళంలో టీడీపీ అధినేత స్పష్టీకరణ

రాజధానిపై తిక్కలోడి మూడు ముక్కలాట! మూడు రాజధానులు చేసేశానంటూ తమాషాలు చేస్తున్నాడు. వాతలు పెడితే అలా మాట్లాడడం మానేస్తాడు.

పోలీసులూ.. ఇకనైనా మారండి. మీ పిల్లలు కూడా ఇక్కడే ఉన్నారు. ఈ ప్రభుత్వముంటే వారికి ఉద్యోగాలు వస్తాయా? - చంద్రబాబు

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అంటే నాలుగు బిల్డింగులని ఈ మూర్ఖులు అనుకుంటున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు విరుచుకుపడ్డారు. అవైతే ఎప్పుడో కట్టేశానని.. అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు కట్టానని గుర్తుచేశారు. కానీ వాటితో రాజధాని కాదన్నారు. 'రాజధాని అంటే ఆంధ్రుల ఆత్మగౌరవం.. ఆత్మవిశ్వాసం. గర్వంగా చెప్పుకొనే ప్రజల ఆస్తి. హైదరాబాద్‌కు దీటుగా, దేశంలో నంబర్ వన్‌గా, ప్రపంచంలోని గొప్పనగరాల్లో ఒకటిగా నిర్మించాలనుకున్నా. విట్, అమృత, ఎస్ఆర్ఎం వంటి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను అమరావతికి

మిగతా 11వ పేజీలో...

జగన్‌పైకి రాళ్లు!

- నుదుటిపై స్వల్ప గాయం.. మాజీ మంత్రి వెలంపల్లికీ.. బెజవాడ రోడ్‌షోలో ఘటన
- ప్రథమ చికిత్స తర్వాత ముందుకు.. ఆనక ప్రభుత్వాస్పత్రికి.. సీఎం గాయానికి కుట్లు!
- భద్రతా చర్యల నుంచి దాడి వరకు ఎన్నెన్నో అనుమానాలు
- కరెంటు తీయించి మరీ చీకట్లో రోడ్‌షో.. కానరాని రోప్ పార్టీ, బస్సు చెంతకు జనం
- అప్పుడే దూసుకొచ్చిన రాళ్లు.. కచ్చితత్వంతో తగలడంతో క్యాట్‌బాల్ వాడారనే డౌట్స్
- ఇంత జరిగినా జనాన్ని క్లియర్ చేయలేదు.. బుల్లెట్ ప్రూఫ్ షీట్స్ వాడలేదెందుకో?
- అంతా అయ్యాక ప్రభుత్వాసుపత్రిలో చికిత్సతో సరి!.. టీడీపీకి వ్యతిరేకంగా వైసీపీ శ్రేణుల నినాదాలు.. దాడిని ఖండించిన మోదీ, చంద్రబాబు



1



2



3

(1) సీఎం జగన్‌కు రాయి తగిలిన దృశ్యం
(2) నుదుటిపై గాయం
(3) గాయానికి ప్లాస్టర్ వేస్తున్న డా.హరికృష్ణ

విజయవాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ 'మేమంతా సిద్ధం' రోడ్‌షోలో రాళ్ల దాడి జరిగింది. శనివారం రాత్రి విజయవాడ సింగ్‌నగర్‌లో యాత్ర సాగుతుండగా ఆగంతకులు ఆయనపైకి రెండు రాళ్లు విసిరారు. దీంతో బస్సుపై నిలబడి ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్ ఎడమ కంటికి పైభాగాన నుదుటిపై స్వల్ప గాయమైంది. ఆయన పక్కనే ఉన్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌కు కంటి కింద గాయం తగిలింది. ఆ వెంటనే బస్సులోకి వెళ్లిన జగన్‌కు సీఎంఆర్ఎఫ్ ఇన్‌చార్జ్, వృత్తిరీత్యా సీనియర్ వైద్యుడైన హరికృష్ణ ప్రథమ చికిత్స చేసి, గాయానికి ప్లాస్టర్ వేశారు. ఆ తర్వాత కొద్దిసేపు బస్సు నుంచే ప్రజలకు అభివాదం చేసిన జగన్.. తర్వాతి సెంటర్‌లో మళ్లీ బస్సుపైకెక్కి యథావిధిగా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. యాత్ర గన్నవరం నియోజకవర్గ పరిధిలోకి ప్రవేశించగానే బస్సు ఎక్కిన వైసీపీ లోక్‌సభ అభ్యర్థి, డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్.. మరోసారి జగన్ గాయాన్ని శుభ్రపరచి, ఇంకోసారి ప్లాస్టర్ వేశారు. ఆ తర్వాత విజయవాడ పరిధి దాటి గన్నవరం మండలం కేసరపల్లి వరకు యాత్ర కొనసాగింది. ఆయన అక్కడ రాత్రి బస

మిగతా 12వ పేజీలో...



తిరువూరులో 'నిజం గెలవాలి' ముగింపు సభలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

మహిళనని చూడకుండా అసెంబ్లీలో అవమానించారు

- వైసీపీ పాలనలో మహిళలపై అడుగడుగునా దాడులే
- అభివృద్ధి కావాలంటే ఈ రాక్షస ప్రభుత్వాన్ని దించేయండి
- చంద్రబాబు అరెస్టు జీవితంలో మర్చిపోలేని దుర్దినం
- ఆయన తప్పు చేయరని బలంగా నమ్ముతాను
- అందుకే నిజం గెలవాలని బయటకు వచ్చాను
- 'నిజం గెలవాలి' ముగింపు సభలో భువనేశ్వరి ప్రసంగం
- భారీగా వచ్చిన మహిళలు.. కిక్కిరిసిన సభా ప్రాంగణం

12

జగన్‌వి హత్యారాజకీయాలు



ప్రొద్దుటూరులో కాంగ్రెస్ సభకు హాజరైన జనం, షర్మిల, సునీత అభివాదం



నేను వైఎస్సార్‌కు పుట్టలేదంట!

- తెలంగాణలోనూ వైఎస్సార్ పేరుతోనే పార్టీ పెట్టా
- మీలాగా యువజన శ్రామిక రైతు పార్టీ అని చెప్పుకోలేదు
- వివేకాను చంపించింది అవినాశ్ రెడ్డే అని జనం నమ్ముతున్నారు: షర్మిల
- న్యాయం కోసం తొక్కని గడప లేదు: సునీత
- కడప జిల్లాలో బస్సు యాత్ర విజయవంతం

కడప, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): 'నేను వైఎస్ షర్మిలారెడ్డిని కాదంట! వైఎస్సార్‌కు పుట్టలేదంట!' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోమారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే సైతం తనపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని వెల్లడించారు. 'జగన్ జైల్లో ఉంటే ఇదే రాజశేఖర్‌రెడ్డి బిడ్డ మూడువేల కి.మీ పాదయాత్ర చేసింది. ఏడాది పాటు నా బిడ్డను పక్కనపెట్టి రోడ్లమీద తిరిగా. మునిగిపోయే వైసీపీని నా భుజాన వేసుకుని నడిపాను. నేను పాదయాత్ర చేసినప్పుడు వైఎస్ షర్మిలారెడ్డి అయితే.. ఇప్పుడు నేను

మిగతా 11వ పేజీలో...

'కేసుల'పైనా కుట్రలు!

పోలీస్ సేవా యాప్ బంద్.. విపక్షంపై జగన్ కుట్ర

- ఎన్నికల సమయంలో కేసులు వారికి తెలియకూడదనే వ్యూహం
- అభ్యర్థుల నామినేషన్ల వేళ కేసుల అఫిడవిట్లు చాలా కీలకం
- కేసుల వివరాలు అందకుండా చేసి అనర్హులను చేయాలన్నదే లక్ష్యం
- దారుణ కుట్రకు ఖాకీల మద్దతు

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాల్సిందే. బెదిరింపులు, దొంగ ఓట్లు, ప్రత్యర్థులపై అక్రమ కేసులు, చివరికి రహస్య కేసులతో నామినేషన్ ఘట్టంలోనే దెబ్బకొట్టాలి!! ఇదీ వైసీపీ వ్యూహం. ఈ క్రమంలో కీలకమైన పోలీసు సేవా యాప్ బంద్ కావడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. విపక్ష నేతలపై నమోదైన కేసుల వివరాలు వారికి అందకుండా చేయడం ద్వారా నామినేషన్ల సమయంలోనే వారిని అనర్హులను చేయాలన్న కుట్ర దాగి ఉందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

11

అమ్మో.. అమెరికా!

- 4 నెలల్లో 11 మంది భారతీయుల మృతి
- గన్ కల్చర్, విద్వేష నేరాలు, జాతి దూషణలు



- హిందూ ఫోబియా కూడా ఓ కారణమేనా?
- ప్రముఖ డయాస్పోరా సంస్థ అధ్యయనం
- పుట్టెడు దుఃఖంలో 43 లక్షల రుణ భారం
- హైదరాబాదీ విద్యార్థి కుటుంబం వేదన

2

వైసీపీ నాయకుడు మంటల్లోకి

నెట్టేశాడు!

12

- ముఖం, ఎడమ చేతికి గాయాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ
- కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు

గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

- మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో ఎంపిక
- ప్రధాన పరీక్ష రాయనున్న 4,496 మంది
- సెప్టెంబరులో మెయిన్స్ పరీక్షలు
- శుక్రవారం అర్ధరాత్రి ఏపీపీఎస్సీ ప్రకటన

3

పుట్టెడు దుఃఖంలో 43 లక్షల రుణ భారం

అమెరికాలో హత్యకు గురైన హైదరాబాద్ విద్యార్థి

విద్యారుణం ఎలా తీర్చాలో తెలియక బాధిత కుటుంబం ఆవేదన



హైదరాబాద్, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): భవిష్యతు మీద కోటి ఆశలతో అమెరికా వెళుతున్న భారతీయుల్లో చాలా మంది ఇటీవల వేర్వేరు కారణాలతో అక్కడ ప్రాణాలు కోల్పోతున్నారు. దేశం కాని దేశంలో తమ వారు మరణిస్తుండగా.. వారిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కుటుంబసభ్యులకు మాత్రం కన్నీరే విఁగులుతోంది. ఇటీవల అమెరికాలో ప్రాణాలు కోల్పోయిన హైదరాబాద్ యువకుడు మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్(25) కుటుంబానిది అదే వ్యథ. ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి కుమారుడి భవిష్యత్తు కోసం తీసుకున్న రూ.43 లక్షల విద్యారుణం మరింత మనోవేదనకు గురి చేస్తోంది. ఓ వైపు కొడుకు లోకాన్ని వీడగా.. అతని కోసం తీసుకున్న అప్పును ఎలా తీర్చాలో తెలియక క్షోభకు గురవుతోంది. హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్(25) ఎంటెక్ చదివేందుకు అమెరికా వెళ్లాడు. డ్రగ్స్ ముఠాకు చెందిన కొందరు అర్ఫాత్‌ను కిడ్నాప్ చేసి మార్చి 17న అతని తండ్రి సలీంకు ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేశారు. 1200 అమెరికన్ డాలర్లు ఇస్తేనే అర్ఫాత్‌ను విడిచిపెడతామని లేదంటే కిడ్నీలు అమ్మేస్తామని బెదిరించారు. ఆ తర్వాత వారి నుంచి సలీంకు ఎలాంటి ఫోన్ రాలేదు. అర్ఫాత్ క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని ఆ కుటుంబం చాలా ప్రయత్నాలు చేసింది. అయితే, క్లీవ్‌ల్యాండ్ సమీపంలోని లేక్ ఎరీ వద్ద అర్ఫాత్ మృతదేహం లభించిందని ఏప్రిల్ 9న అమెరికా కాన్సులేట్ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని సలీంకు తెలియజేసింది. దీంతో ఆ కుటుంబం కుంగిపోయింది. అర్ఫాత్‌కు క్లీవ్‌ల్యాండ్ యూనివర్సిటీలో ఎంటెక్ చేయడానికి వెళ్లాడని, ఇందుకోసం రూ.43 లక్షల విద్యా రుణం తీసుకున్నామని సలీం తెలిపారు. అలాగే, అమెరికా వెళ్లేటప్పుడు అర్ఫాత్‌కు రూ.10 లక్షలు విలువ చేసే విదేశీ కరెన్సీ కూడా ఇచ్చామని చెప్పారు. ఉన్నత విద్యావంతుడై ఇంటి తిరిగి వస్తాడనుకున్న కొడుకు శవమై వచ్చాడని సలీం కన్నీటిపర్యంతమయ్యారు. కొడుకును కోల్పోయి బాధపడుతున్న తమకు రూ.43 లక్షల విద్యారుణం తీవ్ర మనోవేదనకు గురి చేస్తోందని వాపోయారు.

అమ్మో.. అమెరికా!

ప్రవాస భారతీయ విద్యార్థుల మెడపై కత్తి.. పీడకలగా మారుతున్న డాలర్ డ్రీమ్

- ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోపే పదకొండు మంది విద్యార్థుల మృత్యువాత
- పెరుగుతున్న గన్ కల్చర్, విద్వేష నేరాలు, వివక్ష, జాతి దూషణలతో భయాందోళనలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: విదేశాల్లో చదవడం, అక్కడే ఉద్యోగం చేయడం అనేది చాలామంది భారతీయ విద్యార్థుల కల. అందులోనూ అమెరికా చదువులకు ఉన్న క్రేజే వేరు. అక్కడైతే ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అ దేశ యూనివర్సిటీల్లో సీటు సంపాదిస్తే ఇక జీవితంలో సెటిల్ అయినట్లే అని విద్యార్థులు భావిస్తారు. అయితే ఈ డాలర్ డ్రీమ్ ఇప్పుడు విద్యార్థులకు ఒక పీడకలగా మారుతోంది. అక్కడ చదువుతున్న భారతీయ, భారత సంతతి విద్యార్థుల వరుస మరణాలతో కలకలం రేగుతోంది. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన విద్యార్థుల మెడపై కత్తి వేలాడుతోందా? అవకాశాల కోసం అంతదూరంవెళితే అనర్థాలు కొనితెచ్చుకోవడమేనా? అమెరికాలో చదువు కోసం ప్రాణాలను ఫణంగా పెట్టాల్సిన అవసరం ఉందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విదేశాల్లో, ముఖ్యంగా అమెరికాలో విద్యను అభ్యసించాలన్న భారతీయులకున్న బలమైన కోరిక అగ్రరాజ్యంలోని విశ్వవిద్యాలయాలకు వరంగా మారింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2022-23 విద్యాసంవత్సరానికి అమెరికాలో భారతీయ విద్యార్థుల సంఖ్య ఏకంగా 35% పెరిగిం ది. అక్కడున్న భారత విద్యార్థులు 2,75,000మంది కాగా, ఇది ఆ దేశంలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25%. వీరు చెల్లించే ఫీజులు, ఇతర ఖర్చుల ద్వారా ఏటా రూ.75,250 కోట్ల ఆదాయం సమకూరుతోందని 'ఓపెన్ డోర్స్' సంస్థ నివేదిక వెల్లడించింది. అమెరికా డిగ్రీలు అధిక వేతనంతో కూడిన ఉద్యోగాలకు మార్గం సుగమం చేస్తాయని భారతీయ విద్యార్థులు నమ్ముతారు. అయితే ఈ సంవత్సరం మొదటి 4నెలల్లోపే అమెరికాలో మృతిచెందిన భారతీయ, భారత సంతతి విద్యార్థుల సంఖ్య ఏకం గా 11కి చేరడం భద్రతా పరమైన ఆందోళనలను రేకెత్తిస్తోంది. అనుమానాస్పద మరణాలతో విద్వేషనేరాలపై భారతీయ, అమెరికన్ సమాజంలో వదంతులు పెరిగిపోయాయి. తూర్పు, మిడ్‌వెస్ట్ వర్సిటీల పరిధిలో, ఇండియానాలోని ఇల్లినాయిస్, ఒహియోలోని క్లీవ్‌లాండ్ ప్రాంతాల్లో ఎక్కువమంది మరణించడం ఈ వాదనలకు బలం చేకూర్చింది. కాగా, ఈ ఘటనలకు కారణాలను ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ (ఎఫ్ఐఐడీఎస్)విశ్లేషించింది. కాల్పులు/ కిడ్నాప్‌లు, భద్ర తాపరమైన అంశాలపై పరిజ్ఞానం లేకపోవడంవల్ల పర్యావరణ సంబంధ మరణాలు (మోనాక్సైడ్ పాయిజనింగ్, హైపోథెర్మియా), ఆత్మహత్యలను ప్రేరేపించే మానసిక సమస్యలు, హింసాత్మక నేరాలు, అనుమానాస్పద ప్రమాదాలు ఈ జాబితాలో ఉన్నాయి. విద్యార్థుల మరణాలను అరికట్టడానికి కృషి చేయాలని ప్రభుత్వ ఏజెన్సీలు, వర్సిటీలు, విద్యార్థి సంఘాలకు ఒక ప్రముఖ డయాస్పోరా సంస్థ విజ్ఞప్తి చేసింది. అమెరికాలో పెరుగుతున్న హిందూ ఫోబియా కూడా ఈ మరణాలకు ఓ కారణం కావచ్చని భావిస్తున్నారు.

విద్యార్థుల అకాల మరణాల్లో కొన్ని...

2024లో భారత సంతతికి చెందిన విద్యార్థులు వివిధ పరిస్థితుల్లో అమెరికాలో అకాల మరణానికి గురయ్యారు. వీరంతా 25ఏళ్లు, అంతకంటే తక్కువ వయసున్న వారే.

భారతీయ విద్యార్థి వివేక్ సైనీ(25) జార్జియాలో జనవరి 3న దారుణ హత్యకు గురయ్యాడు. యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ జార్జియాలో కంప్యూటర్ సైన్స్ మాస్టర్స్ చదువుతున్న సైనీ ఒక స్టోర్‌లో పనిచేసేవాడు. అక్కడ ఉండగానే డ్రగ్స్‌కు బానిసైన జూలియన్ ఫాల్క్‌నర్ సైనీపై దాడిచేసి సుత్తితో 50 సార్లు మోది హత్య చేశాడు.

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన గట్టు దినేశ్, నికేశ్ అనే 20ఏళ్ల వయసున్న ఇద్దరు భారతీయ విద్యార్థులు జనవరి 14న తమ ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించారు. గ్యాస్ లీక్ కావడమే వారి మృతికి కారణమని మీడియా కథనాలు పేర్కొన్నాయి.

పర్డ్యూ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి నీల్ ఆచార్య(22)జనవరి17న అనుమానాస్పద స్థితిలో మరణించాడు. మృతికి కారణాలింకాతెలియరాలేదు.

ఇల్లినాయిస్ అర్బానా-చాంపైన్ వర్సిటీ సమీపంలో 21 సంవత్సరాల అకుల్ ధావన్ మృతదేహాన్ని జనవరి 20న గుర్తించారు. కంప్యూటర్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న అతను నైట్ క్లబ్‌లోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో హైపోథెర్మియా కారణంగా మరణించాడని పోస్టుమార్టం నివేదికలో పేర్కొన్నారు.

ఒహియోలోని లిండర్స్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఫైనాన్స్ మొదటి సంవత్సరం చదువుతున్న భారత సంతతికి చెందిన శ్రేయాస్‌రెడ్డి బెనిగేరి(19)తన వసతి గృహంలో ఫిబ్రవరి 1న అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు.

పర్డ్యూ వర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ చేస్తున్న భారతీయఅమెరికన్ విద్యార్థి సమీర్ కామత్ ఫిబ్రవరి 5న ప్రకృతి సంరక్షణ కేంద్రంలో శవమయ్యాడు.


బోస్టన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న ఏపీకి చెందిన విద్యార్థి పరుచూరి అభిజిత్ (20)ను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. అతని మృతదేహాన్ని వర్సిటీ క్యాంపస్ సమీప అటవీ ప్రాంతంలో నిలిపి ఉంచిన కారులో మార్చి11న గుర్తించారు. అతని వద్ద ఉన్న డబ్బులు, ల్యాప్‌టాప్ కోసం దుండగుడు దాడి చేసి ఉంటాడని భావిస్తున్నారు.

నెల రోజులుగా కనిపించకుండా పోయిన భారత సంతతి విద్యార్థి మహ్మద్ అబ్దుల్ అర్ఫత్(25) ఏప్రిల్ 9న ఒహియోలోని క్లీవ్ ల్యాండ్‌లో శవమై కనిపించాడు. ఈ ఘటనకు కొద్దిరోజుల ముందే ఇదే ప్రాంతంలో భారత విద్యార్థి ఉమా సత్యసాయి గద్దె మృతదేహం లభ్యమైంది.

విద్యార్థుల భద్రతపై ఆందోళనలు

ఎన్నో ఆశలు, అంచనాలతో అమెరికాలో అడుగుపెట్టిన భారతీయ విద్యార్థుల వరుస మరణాలు ఆ దేశంలో వారి భద్రత, శ్రేయస్సుపై ఆందోళన రేకెత్తిస్తున్నాయి. విద్వేషపూరిత నేరాలు, వివక్ష, జాతి దూషణలతోపాటు గన్ కల్చర్ వంటివి వారిని భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఫిబ్రవరి 4న చికాగోలోని ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న సయ్యద్ మజాహిర్ అలీ అనే 23ఏళ్ల భారతీయ విద్యార్థిపై నలుగురు సాయుధులు దాడిచేశారు. తీవ్ర గాయాలతో అతను ఆస్పత్రి పాలయ్యాడు. ఈ భయానక ధోరణి, పెరుగుతున్న విద్వేష నేరాలు అమెరికా వీధుల్లో భారతీయ విద్యార్థుల భద్రతపై ఆందోళనలను లేవనెత్తుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కారానికి అక్కడి యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

లోకం తీరు



ఆస్ట్రేలియాలో కత్తితో దుండగుడి దాడి

- ఆరుగురి మృతి.. సిడ్నీ మాల్‌లో దుర్ఘటన

సిడ్నీ, ఏప్రిల్ 13: ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో శనివారం మధ్యాహ్నం ఓ దుండగుడు(40) బీభత్సం సృష్టించాడు. రద్దీగా ఉండే మాల్‌లో జనంపై విచక్షణారహితంగా దాడి చేసి పలువురిని కత్తితో పొడిచాడు. దీంతో ఆరుగురు మృత్యువాత పడ్డారు. వారిలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. దుండగుడిని పోలీసులు అక్కకక్కడే కాల్చి చంపారు. సిడ్నీనగరం తూర్పు ప్రాంతంలోని బోండి జంక్షన్‌లో వెస్ట్‌ఫీల్డ్ మాల్ జనంతో రద్దీగా ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుల్ని ఆస్పత్రికి తరలించగా అక్కడ ఒకరు మృత్యువాత పడినట్లు న్యూ సౌత్‌వేల్స్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ ఆంథోని కుక్ తెలిపారు. న్యూ సౌత్ వేల్స్ అంబులెన్స్ విభాగం ప్రతినిధి ఈ ఘటనపై మాట్లాడుతూ.. 8 మంది బాధితులను సిడ్నీలోని వేర్వేరు ఆస్పత్రులకు తరలించినట్లు చెప్పారు. వారిలో 9 నెలల చిన్నారి కూడా ఉన్నట్లు తెలిపారు.

పెరగనున్న వడగాడ్పులు

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రంగా ప్రాంతాల్లో వడగాడ్పులు మళ్లీ పెరగనున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఆదివారం 151 మండలాల్లో ఓ మోస్తరుగా, 18 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు ఉంటాయని తెలిపింది. సోమవారం 135 మండలాల్లో మోస్తరుగా, 33 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. కాగా శనివారం 41 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలిలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తాలో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, సీమల్లో ఎండ తీవ్రంగా ఉంటుందని, పలుచోట్ల వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 15 నుంచి మూడు రోజులపాటు ఉత్తరకోస్తాలో ఎండలు మరింత పెరిగి వడగాడ్పులు వీస్తాయని హెచ్చరించింది.

భారతీయ విద్యార్థులూ జాగ్రత్తగా ఉండాలి

పెప్సీకో మాజీ సీఈవో ఇంద్రానూయి

ఈ మధ్యకాలంలో అమెరికాలో భారతీయ విద్యార్థుల మరణాలకు సంబంధించిన పలు ఘటనలతో ఆ దేశంలోని భారత విద్యార్థుల భద్రత పట్ల సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలో భారత విద్యార్థులు ఎలా మసలుకోవాలి? ఏం చేయాలి? ఏం చేయవద్దో పెప్సీకో మాజీ సీఈవో ఇంద్రా నూయి ఇటీవల కొన్ని సూచనలు చేశారు. అవి...

విద్యార్థులు తాము చదువుకోవాలనుకునే యూనివర్సిటీతోపాటు కోర్సును చాలా జాగ్రత్తగా ఎంచుకోవాలి. అమెరికాలో చదువుకోవడం ఖరీదైన వ్యవహారం. కాబట్టి విద్యార్థులు అప్లయ్ చేసేటప్పుడు దీని గురించి ఆలోచించాలి.

అమెరికాకు వచ్చిన తొలినాళ్లలో ఎంచుకునే స్నేహితులు, కొత్తగా అలవరచుకునే అలవాట్ల పట్ల జాగరూకతతో ఉండాలి.

యూనివర్సిటీల్లో, స్థానిక కమ్యూనిటీలో అందుబాటులో ఉండే వనరుల పట్ల అవగాహన కలిగి ఉండాలి.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. మితిమీరి మద్యం సేవించరాదు. మానసిక, శారీరక ఆరోగ్యానికి డ్రగ్స్ హానికరం.

అమెరికాలో స్థానిక చట్టాలను కచ్చితంగా పాటించాలి. వీసా స్థాయి గురించి తెలుసుకోవడమే కాకుండా అది పార్ట్ టైమ్ ఉద్యోగానికి అనుమతించేదీ లేనిదీ చూసుకోవాలి.

విద్యార్థులు తాము నివసిస్తున్న లేదా ప్రయాణించే నగరంలో సురక్షిత ప్రాంతాల గురించికచ్చితంగా తెలుసుకోవాలి. రాత్రి పూట ఒంటరిగా చీకటి ప్రదేశాలకు వెళ్లకపోవడం మంచిది.

విద్యార్థులు మనీ స్కామ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు.

విద్యాభ్యాసం సందర్భంగా కలిగే ఒత్తిడులను అధిగవించే ప్రయత్నం చేయాలి.

అమ్మకానికి ఎండీసీ

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన ఫైలులో, టర్మ్‌షీట్‌లో రాసుకొచ్చారు. మార్చి 1న తెచ్చిన అప్పుకే అనుమతి తీసుకున్నారు. మే న తేబోయే అప్పునకు అధికారుల కమిటీ లేదా ఈసీ ఆమోదం కావాలి.

ఎవరా ఇన్వెస్టర్?

సచివాలయంలో 4 శాఖలకు తిరిగిన ఫైళ్లలో గాని, నోట్‌ఫైళ్లలో గాని, కేబినెట్ మెమోలో గాని, టర్మ్‌షీట్‌లో గాని, మోడల్ బాండ్‌లో గాని ఆ విదేశీ ఇన్వెస్టర్ పేరు లేదు. అలాగే ఎస్ఎస్‌డీఎల్, ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, బెకన్ ట్రస్టీషిప్ లిమిటెడ్, భైండ్ బిజినెస్ అడ్వైజరీ, లింక్ ఇన్‌టైమ్ ఇండియాలతో ఏపీఎండీసీ జరిపిన రాతపూర్వక సంభాషణల్లో కూడా ఎక్కడా పేరు లేదు. పేరు చెప్పకుండానే వాటాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఒప్పుకొంది. ఆర్థిక శాఖ గ్యారెంటీ ఇచ్చింది. వాణిజ్య, న్యాయ శాఖలు, కేబినెట్ మంత్రులు, సీఎస్, సీఎం తలలూపేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ఒక్కరోజు ముందు మార్చి 15వ తేదీ కేబినెట్‌కు షార్ట్‌సర్క్యులేషన్ ద్వారా ఎండీసీ వాటాల విక్రయం ఫైలు పంపారు. ఏపీఎండీసీ మార్కెట్లో ఎన్‌సీడీలు జారీ చేస్తున్నామని, ఒక పొటెన్షియల్ ఇన్వెస్టర్ ఎఫ్‌పీఐ (ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్) విధానంలో వాటిని 8.7 శాతానికి కొనడానికి ఒప్పుకున్నారని, మొత్తం రూ.7,000 కోట్ల అప్పు ఈ విధానంలో తీసుకొస్తున్నామని, వీటిని ఎండీసీ పెట్టుబడి కార్యపాలకు వాడుతున్నామంటూ అందుకు కేబినెట్ అనుమతి కోరారు. విదేశాలకు చెందిన పొటెన్షియల్ ఇన్వెస్టర్ ఇచ్చిన రూ.7,000 కోట్ల అప్పునకు రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా గ్యారెంటీ ఇస్తుందని, ఎండీసీ ఈ రుణం చెల్లించడంలో విఫలమైతే రాష్ట్ర ఖజానా నుంచి నేరుగా ఎండీసీ బాండ్ సర్వీస్ అకౌంట్‌కు డబ్బులు జమ చేసి మరీ చెల్లింపులు చేస్తామని, దీనికి కేబినెట్ అనుమతి కావాలని కోరారు. ఇందుకు కేబినెట్ అనుమతి ఇచ్చేసింది. టర్మ్‌షీట్‌లో ఉన్న నిబంధనల గురించి కేబినెట్ మెమోలో ప్రస్తావించలేదు.

గ్యారెంటీ ఎందుకో..?

- ప్రభుత్వానికే 100 శాతం వాటాలున్న ఏపీఎండీసీలో ఎవరికైనా వాటాలు అమ్మాలంటే కేబినెట్ ఒప్పుకోవాలి. కానీ కేబినెట్ మెమోలో ఈ విషయం ప్రస్తావించకుండా రూ.7,000 కోట్ల అప్పు తెచ్చామని, దానికి ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తోందన్న రెండు అంశాలే రాశారు.
- ఎక్కడైనా ఎవరైనా అప్పులిస్తే వడ్డీ, అసలు వెనక్కిచ్చేస్తారు. ఏపీఎండీసీలో ఏం చేస్తున్నారంటే అసలు, వడ్డీతో పాటు అందులో వాటాలు, ప్రభుత్వ గ్యారెంటీ కూడా ఇచ్చేశారు.
- ఏపీఎండీసీకి వేలకోట్ల విలువైన గనులున్నాయి. అలాంటప్పుడు నాన్ గ్యారెంటీ అప్పు తెచ్చుకోవచ్చు. అంటే సొంత ఆస్తులనే హామీగా చూపించి అప్పు తెచ్చుకోవచ్చు. కానీ ప్రభుత్వం బేషరతుగా గ్యారెంటీ ఇచ్చింది. ఇదొక వింత అనుకుంటే, ఏపీఎండీసీలో వాటాలు కూడా ఇవ్వడం పరాకాష్ట.
- ఆస్తుల్లేని అనామక కార్పొరేషన్ అయితే ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. కానీ, వేలకోట్ల ఆస్తులున్న ఎండీసీకి ప్రభుత్వం ఎందుకు గ్యారెంటీ ఇచ్చింది? ఆ విదేశీ ఇన్వెస్టర్‌పై ఎందుకంత ప్రేమ? టర్మ్‌షీట్‌లో అన్నీ అనుకూల నిబంధనలే ఉన్నాయని రాశారు. వాటాలు అమ్ముకోవడం అనుకూల నిబంధనా ?

విదేశీ ఇన్వెస్టర్‌కు లొంగిపోయారా?

మైనింగ్ శాఖలో మొదలైన ఫైలు సచివాలయంలో ఆర్థిక శాఖకు, పరిశ్రమలు-వాణిజ్య శాఖకు, న్యాయశాఖకు, కేబినెట్‌లో పెట్టడం కోసం జీఏడీకి, సీఎస్‌కు, సీఎంకు కూడా వెళ్లింది. అంతా సీనియర్ ఐఏఎస్ అధికారులున్న శాఖలే. ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రభుత్వ సంస్థలో వాటాలు అమ్మడం ఎందుకన్న ప్రశ్న అడగలేదు. ఆర్థిక శాఖ అయితే గ్యారెంటీ ఇచ్చింది. సంతకం పెట్టేటప్పుడైనా వాటాలు ఇస్తున్నప్పుడు ప్రత్యేకించి గ్యారెంటీ ఇవ్వడం ఎందుకన్న సందేహం రాలేదా? ఎండీసీకే ఆస్తులున్నప్పుడు ప్రభుత్వమెందుకు గ్యారెంటీ ఇవ్వాలన్న కనీస ఆలోచన రాలేదా? గ్యారెంటీ ఫైలు ప్రతిపాదన ఒప్పుకొన్న ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ఎస్ఎస్ రావత్‌కు, కేవీవీ సత్యనారాయణ ఇన్వెస్టర్ పేరు తెలీకుండానే ఎలా ఆమోదించారు? ఇక న్యాయశాఖ ఆమోదం కోసం వెళ్లినప్పుడు ఒక రాష్ట్ర ప్రభుత్వ సంస్థలో విదేశీ ఇన్వెస్టర్‌కు వాటాలు అమ్మడంపై ప్రశ్నలు ఎందుకు వేయలేదు? వివరాలు తెలుసుకోకుండా ఆర్థిక శాఖ గ్యారెంటీ ఇవ్వడం స్కామే.

కేబినెట్‌కూ పేరు తెలియదా!

కేబినెట్ మెమోరాండం మొదట సీఎస్ ద్వారా సీఎంకు చేరుతుంది. కేబినెట్‌లో పెట్టడానికి సీఎం అనుమతి ఇచ్చాక తిరిగి సీఎస్ వద్దకు వస్తుంది. అక్కడి నుంచి జీఏడీలోని కేబినెట్ సెక్షన్‌కు వస్తుంది. రాష్ట్ర అధికార వ్యవస్థకు అధిపతి అయిన సీఎస్ జవహర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సంస్థలోని వాటాలు అమ్మడం ఏంటని కనీసం వెంకటరెడ్డిని, గోపాలకృష్ణ ద్వివేదిని అడగలేదా? ఆ టర్మ్‌షీట్‌లో ఉన్న నిబంధనల గురించి తెలిసే మౌనంగా ఉన్నారా? 100 శాతం ప్రభుత్వ కంపెనీలో వాటా అమ్మడానికి సీఎస్ ఒప్పుకున్నట్టేనా?

ఫీజుల రూపంలో కోట్లు

మార్చి 1న తెచ్చిన రూ.7,000 కోట్ల అప్పు కోసం ఏపీఎండీసీ కోసం పనిచేసిన సంస్థలపై జగన్ సర్కార్ కోట్లు కుమ్మరించింది. ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్‌కు రూ.4.5 కోట్లు, అరేంజర్‌గా పనిచేసిన భైండ్ అడ్వైజరీకి జీఎస్టీతో కలిపి రూ.15 కోట్లు, రిజిస్ట్రార్‌గా పనిచేసిన లింక్‌టైమ్ ఇండియాకు పదేళ్లపాటు ఏడాదికి కోటిన్నర చొప్పున చెల్లించాలి. డిబెంచర్ ట్రస్టీగా ఉన్న బేకాన్ ట్రస్టీషిప్‌కి ఏడాదికి 1,50,000 చొప్పున పదేళ్లు చెల్లించాలి. మే 2న తేబోయే రూ.7,000 కోట్లకు కూడా మళ్లీ ఇవే ఫీజులు చెల్లిస్తారు.

ఎండీసీలో వాటాలు అమ్ముతామన్న కండీషన్‌పై తీసుకొస్తున్న రూ.14,000 కోట్లను ఎక్కడ, ఎలా ఇన్వెస్ట్ చేయాలన్న ప్లాన్ ఏమీ లేదు. భారీ మొత్తంలో అప్పు ఇస్తున్న విదేశీ ఇన్వెస్టర్‌కు 8.7 శాతం వడ్డీ చెల్లించాలి. డబ్బులు వచ్చాక, పెట్టుబడులు పెట్టడం ఆలస్యమైతే వాటిని అలాగే బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారట. దీనివల్ల అటు విదేశీ ఇన్వెస్టర్‌ను, ఇటు బ్యాంకులను ఉద్ధరించడం తప్ప ఎండీసీకి, రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం ఉండదు.

8.7% వడ్డీకి తెచ్చి 4.5%కి డిపాజిట్

ఎఫ్‌డీల మీద వివిధ బ్యాంకులు రకరకాల వడ్డీలు ఇస్తాయి. లాంగ్‌టర్మ్ ఎఫ్‌డీలపై 7.25 శాతం ఇస్తున్నాయి. కానీ ఎండీసీ లాంగ్‌టర్మ్ అంటే.. పదేళ్ల పాటు డబ్బును బ్యాంకులో ఉంచకపోవచ్చు. పెట్టుబడి కోసం విదేశాల నుంచి తెచ్చుకున్న రుణాన్ని ఏడాది కంటే ఎక్కువ కాలం ఎఫ్‌డీల్లో ఉంచే అవకాశం ఉండకపోవచ్చు. ఏడాదిలోపే తీసేస్తే 4.5 శాతం వడ్డీ మాత్రమే వస్తుంది. 8.7 శాతం వడ్డీకి అప్పు తెచ్చి 4.5 శాతానికి డిపాజిట్ చేయడం అత్యంత దారుణం.

ఇక మిగిలింది కేబినెట్‌లోని మంత్రులు. ఎప్పుడు ఏ అంశంపైనా నోరెత్తని మంత్రులు ఈ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనుకోవడం అత్యాశే. ఆ కేబినెట్ మెమోరాండంపై గుడ్డిగా సంతకాలు పెట్టేశారు. పలు శాఖల మధ్య ఈ ఫైలు తిరిగి, ఆఖరికి కేబినెట్‌కు చేరినా ఎక్కడా కూడా ఆ విదేశీ ఇన్వెస్టర్ పేరును రాయలేదు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థకు అప్పిస్తున్న, వాటాలు కొంటున్న వ్యక్తి పేరు కేబినెట్‌కు తెలియకపోవడం ఏంటి?

ముందే స్క్రిప్ట్ రెడీ

విదేశాల నుంచి రూ.14,000 కోట్లు రాష్ట్రంలోకి తెప్పించడానికి జగన్ సర్కార్ మాస్టర్ ప్లాన్ వేసింది. పేరుకే మార్కెట్లో ఏపీఎండీసీ ఆఫర్. కానీ, ఇక్కడ ఆఫర్ జరగలేదు. ముందే విదేశీ ఇన్వెస్టర్‌ను ఎంపిక చేసుకున్నారు. 8.7 శాతం వడ్డీరేటుకు మార్చి 1న రూ.7,000 కోట్ల విలువైన ఎన్‌సీడీలు కొనేశారు. మార్చి 15న మైనింగ్ శాఖ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది కేబినెట్ ఆమోదం తీసుకున్నారు. మే 2వ తేదీన మరో సారి ఎన్‌సీడీలు జారీ చేసి రూ.7,000 కోట్లు అప్పు తీసుకొస్తామని ఎస్ఎస్‌డీఎల్ కి ఏపీఎండీసీ సమాచారం ఇచ్చింది. అంటే.. మొత్తం రూ.14,000 కోట్లు. ఆఫర్ అంటే ఓపెనింగ్ డేట్, క్లోజింగ్ డేట్ ఉంటుంది. ఎంతమంది ఇన్వెస్టర్లు ఆసక్తి చూపించారు? ఎవరెంత వడ్డీరేటుకు ముందుకొచ్చారు? అనే వివరాలుంటాయి. వడ్డీ రేటు అనేది ఆఫర్ ముగిసే వరకు తెలియదు. ఇక్కడ అవేవీ లేవు. కేవలం ఒక విదేశీ పొటెన్షియల్ ఇన్వెస్టర్ 8.7 శాతం వడ్డీకి ఎఫ్‌పీఐ విధానంలో ఏపీఎండీసీకి అప్పులిచ్చారని కేబినెట్ నోట్‌లో స్పష్టంగా రాశారు. ఆఫర్ ముసుగులో ఘరానా మోసానికి పాల్పడుతున్నారు.

టెన్షన్ టెన్షన్!

ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్ సిద్ధం

- ఇజ్రాయెల్ నౌకను సీజ్ చేసిన టెహ్రాన్
- భారత్ వస్తుండగా దారి మళ్లింపు
- నౌకలో 17 మంది భారతీయులు



ఇరాన్ సీజ్ చేసిన ఇజ్రాయెల్ కంటైనర్ నౌక

టెల్‌అవీవ్/టెహ్రాన్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: పశ్చిమాసియాపై యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. క్షణక్షణం ఉద్రిక్త వాతావరణం పెరుగుతోంది. సరిహద్దుల్లో 150 డ్రోన్లు, 100 బాలిస్టిక్ క్షిపణులను మోహరించిన ఇరాన్.. ఏ క్షణాన్నైనా ఇజ్రాయెల్‌పై దాడి చేయవచ్చని అమెరికా నిఘా సంస్థలు శనివారం మరోమారు హెచ్చరికలు జారీ చేశాయి. ఇజ్రాయెల్‌కు అండగా అమెరికా తన రెండు యుద్ధ నౌకలను తూర్పు మధ్యధరా సముద్రంలో మోహరించేందుకు సన్నద్ధమైంది. ఈ క్రమంలో శనివారం హోర్ముజ్ జలసంధి మీదుగా వస్తున్న ఇజ్రాయెల్ కంటైనర్ నౌక (ఎంసీఎస్ ఎరీస్)ను ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సీజ్ చేశారు. అంతర్జాతీయ జలాల్లో.. భారత్‌వైపు వస్తున్న ఆ నౌకపైకి హెలికాప్టర్లతో దిగిన గార్డ్స్.. దాన్ని ఇరాన్ జలాల్లోకి తరలించారు. ఆ నౌకలో 17 మంది భారతీయులున్నట్లు భారత విదేశాంగ శాఖ గుర్తించింది. వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ నౌక స్వాధీనాన్ని ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ నిర్ధారించింది. నౌక హైజాక్‌పై ఇజ్రాయెల్ సీరియస్ అయ్యింది. తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇజ్రాయెల్ మిలటరీ అధికార ప్రతినిధి డేనియల్ హాగరి ఇరాన్‌ను హెచ్చరించారు. సిరియా రాజధాని డమాస్కస్‌పై ఈ నెల1న ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లో ఇరాన్‌కు చెందిన కీలక సైన్యాధికారి, మరో 12 మంది మరణించారు! దానికి ఇజ్రాయెల్ మూల్యం చెల్లించుకుంటుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. ఆ తర్వాత ఇరాన్ యుద్ధానికి సన్నద్ధమవుతోందని అమెరికా, ఇజ్రాయెల్ నిఘావర్గాలు గుర్తించాయి.

24 గంటల్లో దాడులు..!

ఇజ్రాయెల్‌పై 24 గంటల్లో ఇరాన్ దాడులు జరగవచ్చని అమెరికా నిఘా సంస్థలు హెచ్చరించాయి. "ఇరాన్ తన సరిహద్దుల నుంచి డ్రోన్లు, మిసైల్స్‌తో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడే ప్రమాదముంది. ఇరాన్ తన సరిహద్దుల నుంచి 2 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలిగే క్షిపణులను మోహరించింది. ఆదివారం ఏ క్షణాన్నైనా దాడులు జరగవచ్చు" అని వెల్లడించాయి.

ఇజ్రాయెల్‌కు బైడెన్ హామీ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మరోమారు స్పందించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా దాడి చేసేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని అంచనా వేశారు. "మాకు వచ్చిన రహస్య సమాచారం జోలికి నేను వెళ్లాలనుకోవడం లేదు. ఇజ్రాయెల్‌ను రక్షించేందుకు మేం కట్టుబడి ఉన్నాం. ఇరాన్ విజయం సాధించబోదు" అని వ్యాఖ్యానించారు. "చేయకండి" అంటూ బైడెన్ ఏకపదంతో ఇరాన్‌కు సందేశాన్ని పంపారు. అదే సమయంలో ఐరోపా సమాఖ్య కూడా తమ యూనియన్ ప్రధాన మంత్రులతో ఇరాన్‌కు సందేశాలు పంపింది.

'అమెరికాకు సహకరించం'

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరిగితే.. అమెరికా ఒకవేళ జోక్యం చేసుకుంటే.. అగ్రరాజ్యానికి సహకరించబోమని పలు గల్ఫ్ దేశాలు స్పష్టం చేశాయి. తమ భూభాగాలను వినియోగించుకునేందుకు అమెరికాకు అనుమతి ఇచ్చేది లేదని తేల్చిచెప్పాయి. ఈ నేపథ్యంలో యుద్ధం ఆలోచన నుంచి వెనక్కి తగ్గేలా ఇరాన్‌పై ఒత్తిడి తీసుకురావాలంటూ సౌదీ అరేబియా, ఖతార్ దేశాలకు అమెరికా సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ కూడా యుద్ధం జోలికి వెళ్లకూడదని సూచిస్తున్నట్లు సమాచారం.

ఎయిరిండియా ప్రత్యామ్నాయాలు


ఇరాన్ ఇప్పటికే తన రాజధాని నగరం టెహ్రాన్ గగనతలాన్ని మూసివేయడం.. పశ్చిమాసియాలో యుద్ధం ముప్పు నేపథ్యంలో ఇరాన్ మీదుగా వెళ్లే విమానాలను మళ్లించనున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఇందుకోసం ఆస్ట్రేలియా, జర్మనీ విమానయాన సంస్థలు క్వాంటస్, లుఫ్తాన్సాల సాయం తీసుకోనున్నట్లు వెల్లడించింది.

ఇజ్రాయెల్‌కు చుట్టూ సమస్యలే!

హమాస్‌పై పోరు పేరుతో గాజాలో ఇజ్రాయెల్ భీకర యుద్ధమే చేసింది. అలాగే లెబనాన్ భూభాగంపై నుంచి దాడులు చేస్తున్న హిజ్బుల్లా ఉగ్రవాదులను ఎదుర్కొంటోంది. హమాస్ ముప్పు తటస్థమైనా.. హిజ్బుల్లా, ఎర్ర సముద్రంలో యెమన్ భూభాగం నుంచి నౌకలపై డ్రోన్ దాడులు చేస్తున్న హౌతీలతో ముప్పును ఎదుర్కొంటూనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఇరాన్‌తో యుద్ధం ఇజ్రాయెల్‌కు ఇబ్బందికరమైన పరిస్థితేనని విశ్లేషకులు చెబుతున్నారు. తాజాగా శనివారం లెబనాన్ నుంచి హిజ్బుల్లా ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై డజన్ల కొద్దీ మిసైల్స్‌ను ప్రయోగించారు.


'హెల్త్ డ్రింక్స్' నుంచి బోర్నవిటా ఔట్!

- ఈ-కామర్స్ సంస్థలకు కేంద్రం ఆదేశం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: కేంద్ర ప్రభుత్వం బోర్నవిటాకు, ఆ తరహా ఉత్పత్తులకు ఝలక్ ఇచ్చింది. వాటిని ఆరోగ్య పానీయాల (హెల్త్ డ్రింక్స్) విభాగం నుంచి తొలగించాలని ఈ-కామర్స్ సంస్థలను ఆదేశించింది. బోర్నవిటాలో సగానికి సగం చక్కెరే ఉంటోందని ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఆహార భద్రత, ప్రమాణాల (ఎఫ్ఎస్ఎస్) చట్టం-2006 'హెల్త్ డ్రింక్' అని దేన్నీ నిర్వచించలేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అలాగే భారత ఎఫ్ఎస్ఎస్ ప్రాధికార సంస్థ కానీ, బోర్నవిటా, క్యాడ్బరీతో పాటు పలు ప్రముఖ బ్రాండ్ల యాజమాన్య సంస్థ 'మాండెలెజ్ ఇండియా' కానీ సమర్పించిన నిబంధనల్లోనూ 'హెల్త్ డ్రింక్'కు నిర్వచనం లేదని తెలిపింది. ఈ విషయం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్) నిర్వహించిన విచారణలో నిర్ధారణ అయిందని పేర్కొంది. దాని సిఫారసు ప్రకారం నిర్ణయం తీసుకున్న కేంద్రం... అన్ని ఈ-కామర్స్ సంస్థలు తమ పోర్టళ్లలో బోర్నవిటా సహా ఇతర పానీయాలను (డ్రింక్స్/బేవరేజెస్) 'హెల్త్ డ్రింక్స్' క్యాటగిరీ నుంచి తొలగించాలని ఆదేశించింది. గత ఏడాది ఏప్రిల్‌లోనే ఎన్సీపీసీఆర్ బోర్నవిటాకు మొట్టికాయ వేసింది. తప్పుదోవ పట్టించే వాణిజ్య ప్రకటనలు, ప్యాకేజింగ్, లేబుళ్లను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. పిల్లలకు బలవర్ధకమైదన్న నమ్మకంతో దశాబ్దాలుగా వాడుతున్న బోర్నవిటాపై 'ఫుడ్‌ఫార్మర్'గా పేరొందిన రేవంత్ హిమత్‌సింగ్‌కా యూట్యూబ్ వీడియో గగ్గోలు పుట్టించింది. బోర్నవిటాలో సగానికిసగం చక్కెర ఉంటోందని, కోకో సాలిడ్స్, కలరెంట్ల వల్ల పిల్లలు క్యాన్సర్ సహా తీవ్ర ఆరోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఓటు కావాలా... లాస్ట్ చాన్స్



- ఈ ఎన్నికల్లో ఓటు వేయాలంటే రేపటిలోగా నమోదు చేసుకోండి
- సులభతరంగా ఇంటి నుంచే దరఖాస్తు

అమరావతి ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మీ పేరు ఓటర్ల జాబితాలో ఉందా? ఇప్పటి వరకూ మీరు ఓటరుగా నమోదు చేసుకోలేదా? వెంటనే స్పందించండి. ఓటరుగా నమోదు చేసుకోవడానికి సోమవారం, 15వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉంది. ఆలోగా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఈ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం వస్తుంది. ఆ తరువాత నమోదు చేసుకున్న వారు ఓటు వేయాలంటే మరో ఐదేళ్లు ఆగాల్సిందే. అయితే ఇప్పటికే జిల్లాల్లో ఎన్నికల అధికారులు ఓటరు నమోదు కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారు. గడువులోపల వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, విచారించి అనుబంధ ఓటర్ల జాబితాలో చేరుస్తారు.

ఇంటి నుంచే నమోదుకు అవకాశం

ఓటరుగా మీ పేరు నమోదు చేసుకోవడానికి మీరు ఎక్కడికో వెళ్లనవసరం లేదు. కంప్యూటర్, ల్యాప్‌టాప్, సెల్ ఫోన్.. ఏది ఉన్నా క్షణాల్లో మీరు మీ పేరును నమోదు చేసుకోవచ్చు. అందుకు మీకు అవసరమైనవి మీ పూర్తి వివరాలు, ఫొటో, మీ పుట్టిన తేదీని నిర్ధారించే పత్రాలు, చిరునామా, ఆ చిరునామాలో మీరు ఉంటున్నట్లు నిర్ధారించగలిగే పత్రాలు (డిజిటల్ ఫార్మేట్‌లో ఉండాలి) ఉంటే చాలు. 2006, మార్చి 31 తేదీలోపు జన్మించిన వారెవరైనా ఓటు హక్కుకు అర్హులే. కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫాం 6ను ఎంచుకోవాలి.

ఏ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి?

ఎన్నికల కమిషన్ అధీకృత వెబ్ సైట్‌లోకి మాత్రమే మీరు వెళ్లాలి. అలాగే ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. మీ మొబైల్‌లో లేదా మీ కంప్యూటర్‌లో బ్రౌజర్ తెరవండి. దానిలో https://voters.eci.gov.in టైప్ చేయాలి. వెబ్ సైట్‌లో కుడివైపు పై భాగంలో లాగిన్, సైన్ అప్ అనే రెండు ఆప్షన్లు ఉంటాయి. మీకు ఖాతా లేకపోతే సైన్ అప్ అనే ఆప్షన్ ఎంచుకోవాలి. ఖాతాను సృష్టించుకున్న తరువాత లాగిన్ కావాలి.

మొబైల్ నంబరు లేదా ఈమెయిల్ ఐడీ, పాస్ వర్డ్, క్యాప్చా కొట్టిన తరువాత మీకు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేస్తే వెబ్‌పేజ్ ఓపెన్ అవుతుంది. దానిలో ఫాం 6ను క్లిక్ చేసి దరఖాస్తు పూర్తి చేయాలి. వివరాలు పూర్తి చేసే క్రమంలో మీ పాస్‌పోర్టు ఫొటో, పుట్టిన తేదీని రుజువు పరిచే పత్రాలు, అలాగే చిరునామా ధృవీకరణ పత్రం డిజిటల్ ఫార్మాట్‌లో ఉంటే చాలు. ఒక్కో ఫైలు సైజు 2 ఎంబీని మించకుండా చూసుకుంటే మీ పని సులువుగా అయిపోతుంది. దరఖాస్తులో అడిగిన వివరాలను పూర్తి చేస్తూ ముందుకు సాగండి. చివరిగా మీరు పూర్తి చేసిన వివరాలను మరోసారి పరిశీలించుకొని సబ్మిట్ కొడితే మీ దరఖాస్తు నమోదు చేసుకున్నట్లే. ఆ వెంటనే మీకు ఓ రిఫరెన్స్ నంబరు వస్తుంది. మీ ఓటరు నమోదు ప్రక్రియ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికి మీ ఖాతాలోకి లాగిన్ అయిన తరువాత కుడివైపు పై భాగంలో 'ట్రాక్ అప్లికేషన్' ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి వివరాలు పూర్తి చేస్తే మీ దరఖాస్తు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు. కాగా, అర్హులైన ఓటర్ల వివరాలతో ఈ నెల 25న ఓటర్ల అనుబంధ జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం ఉంది.



శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి

శ్రీవారి సేవలో జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి

తిరుమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామివారిని దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

చంద్రబాబు సీఎం కావాలని మోకాళ్లపై తిరుమలకు



తిరుమల మెట్లెక్కుతున్న శ్రీనివాసులు, శరవణకుమార్

తిరుమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ సీఎం కావాలనే ఆకాంక్షతో ఇద్దరు అభిమానులు శనివారం మోకాళ్లపై మెట్లెక్కి తిరుమలకు వచ్చారు. తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీ పరిధిలోని శేషాద్రినగర్‌కు చెందిన శ్రీనివాసులు, శరవణకుమార్ తెలుగుదేశం పార్టీ అభిమానులు. చంద్రబాబు సీఎం కావాలని, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పులివర్తి నాని గెలుపొందాలని కోరుకుంటూ అలిపిరి మెట్లమార్గంలో మోకాళ్లపై తిరుమలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అలిపిరి పాదాలమండపం నుంచి తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వరకు మోకాళ్లపై వచ్చి మొక్కులు చెల్లించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎన్ని సీట్లు వస్తాయో అన్నిసార్లు ఇలానే మోకాళ్లపై తిరుమల కొండెక్కుతామని మొక్కుకున్నట్టు తెలిపారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. ఇంటర్ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల కావడం, ఆదివారం తమిళ ఉగాది పర్వదినం కావడంతో ఇటు ఏపీతో పాటు తమిళనాడు నుంచి భక్తులు భారీగా తిరుమలకు వస్తున్నారు. పరీక్షల్లో పాసైన పిల్లలు, వారి తల్లిదండ్రులు మొక్కులు చెల్లించుకునేందుకు అధిక సంఖ్యలో అలిపిరి, శ్రీవారిమెట్ల మార్గంలో తిరుమలకు చేరుకుంటున్నారు. దీంతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శన సమయం పడుతోంది. అలాగే టైంస్లాట్ భక్తులకు కూడా 3 నుంచి 4 గంటల సమయం పడుతోంది. మరోవైపు తిరుమలలో కాటేజీలకు డిమాండ్ పెరిగింది.

మంత్రి ధర్మానపై చర్య తీసుకోండి

- వలంటీర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు: సీఈవోకి టీడీపీ ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వలంటీర్లను కించపరిచేవిధంగా మాట్లాడిన మంత్రి ధర్మాన, ముఖ్యమంత్రి కోసం విద్యార్థులతో ఎన్నికల సర్వేలు చేయిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాదొరెడ్డిపై, ఎన్నికల నియమావళిపై కనీస అవగాహన లేని విజయవాడ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, మాజీ మంత్రులు దేవినేని ఉమా, జవహర్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. అనంతరం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. వర్ల రామయ్య మాట్లాడుతూ మాట వినని వలంటీర్లను రాజీనామా చేయమనండి లేదంటే మనమే తీసేద్దామని నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. జగన్‌కు, వైసీపీకి సేవ చేయడం కోసం మాత్రమే వలంటీర్లను పెట్టుకున్నారని వారి మాటలతో అర్థమవుతోందన్నారు. వలంటీర్లను భయభ్రాంతులకు గురిచేసిన ధర్మానపై కేసు నమోదు చేయాలన్నారు. విద్యార్థులతో ఎన్నికల సర్వేలు చేయిస్తున్న ఏయూ వీసీపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరామన్నారు.

వలంటీర్లతో వైసీపీ నేతల సమావేశం..

- జనసైనికులు రావడంతో పరుగులు



జనసేన నాయకులు రావడంతో పరుగులు తీస్తున్న వలంటీర్లు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), ఏప్రిల్ 13: ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అధికార పార్టీ నేతలు వలంటీర్లతో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అభ్యర్థుల విజయానికి కృషి చేయాలంటూ వారిపై ఒత్తిడి తెస్తున్నారు. నెల్లూరు 49, 50వ డివిజన్లకు చెందిన వలంటీర్లతో సంతపేటలోని పీఎంఆర్ స్కూల్లో శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలుసుకున్న జనసేన నాయకులు అక్కడకు చేరుకుని వైసీపీ నాయకులను నిలదీశారు. దీంతో వారు అక్కడ నుంచి జారుకోగా వలంటీర్లు ముఖాలకు ముసుగులు వేసుకొని పరుగులు తీశారు. ఈ సందర్భంగా జనసేన నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ ఎన్నికల కమిషన్ సూచనలను బేఖాతరు చేస్తున్న వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు.

డాక్టర్ వరుణ్ కార్డియాక్‌లో అరుదైన శస్త్ర చికిత్స

- తలలో కిలోన్నర ట్యూమర్ తొలగింపు
- డాక్టర్ పువ్వాడ రామకృష్ణ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతం





సమావేశంలో మాట్లాడుతున్న రోగి మోహన్... చిత్రంలో డాక్టర్ వరుణ్, డాక్టర్ పువ్వాడ రామకృష్ణ తదితర వైద్య బృందం (ఇన్‌సెట్)భారీ కణితి

విజయవాడ, ఏప్రిల్ 13: నగరంలోని వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్‌లో ప్రపంచంలోనే అత్యంత అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రి న్యూరో విభాగం డైరెక్టర్, ప్రఖ్యాత న్యూరో సర్జన్ డాక్టర్ పువ్వాడ రామకృష్ణ ఈ శస్త్ర చికిత్సను చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఆసుపత్రిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైద్యుల బృందం వివరించింది. గుడివాడకు చెందిన మోహన్‌రామ్ (40) తల భాగంలో గడ్డతో చిన్న వయసు నుంచి బాధపడుతున్నాడు. ఈ విషయం బయట వ్యక్తులకు తెలియకుండా టోపీ పెట్టుకునేవాడు. 20 రోజుల క్రితం హఠాత్తుగా ఆ కణితి భారీగా పెరిగింది. దాని బరువుతో రోగి తలను నిలబెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఆ కణితి అలా పెరుగుతూ పుర్రె ఎముకలపై ఒత్తిడి పెరగడంతో మెదడుపై ఒత్తిడి ఎక్కువై భరించలేనంత నొప్పితో బాధపడేవాడు. ఈ పరిస్థితుల్లో మోహన్‌రామ్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్‌ను సంప్రదించాడు. 18 సెంటీమీటర్ల వెడల్పు, 10 సెంటీమీటర్లు పొడవుతో ఉన్న ఈ ట్యూమర్ వల్ల మెదడుపై దుష్ప్రభావం ఏర్పడి ప్రాణాపాయం సంభవించవచ్చని వైద్యులు గుర్తించారు. దాదాపు 4 గంటల పాటు శ్రమించి కణితిని తొలగించారు. 'ఈ లార్జ్ ఇన్‌ఫెక్టెడ్ న్యూరోఫైబ్రోమా ట్యూమర్‌లో 250 ఎంఎల్ చీము ఉంది. రక్త ప్రసరణ ఉంది. దీంతో సర్జరీ కష్టంగా మారింది. కిలోన్నరకుపైనే బరువున్న కణితిని తొలగించిన తరువాత రోగి వేగంగా కోలుకోవడం ప్రారంభించాడు. ప్రపంచంలోనే ఇది అత్యంత అరుదైనది. దేశంలోనే ఇలాంటి శస్త్ర చికిత్స మొదటిది' అని డాక్టర్ రామకృష్ణ వివరించారు. అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ పువ్వాడ రామకృష్ణ, అనస్థీషియా వైద్యులు డాక్టర్ సూర్య, డాక్టర్ దీప్తిలకు, రేడియాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్‌కు ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ అభినందనలు తెలిపారు.

జస్టిఫికేషన్ లేకుండానే ప్రతిపాదన

- వెనక్కివచ్చిన ఫైలు
- ఇంటి పట్టాల పంపిణీపై అజయ్‌జైన్
- ఇదేకదా 'ఆంధ్రజ్యోతి' చెప్పింది
- సీఎస్‌కు దురుద్దేశాలు ఆపాదించారంటూ రెవెన్యూ స్పెషల్ సీఎస్ అక్కసు
- సమర్థనీయ కారణాలు లేకుండా కమిటీ ముందుకు ఎలా తెచ్చారు?
- సీఎస్, స్పెషల్ సీఎస్ చేసే పనులేనా? తప్పుచేసి అజయ్‌జైన్ వితండవాదం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఆంధ్రజ్యోతి'పై అక్కసు వెళ్లగక్కే పేరిట జగన్ సర్కారు అసలు నిజాలు ఒప్పుకొంది. సరైన సమర్థనీయ కారణాలు (జస్టిఫికేషన్) లేకుండానే ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్, పంపిణీని చేపట్టేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి కోరాలని ప్రతిపాదన వచ్చిందని విస్పష్టంగా అంగీకరించింది. అంటే.. కోడ్‌కు విరుద్ధమని తెలిసినా ఎన్నికల సమయంలో ప్రజలను ప్రసన్నం చేసుకోవాలన్న జగన్ అనుకూల ప్రయత్నాలు చేసినట్లు, ఈ పేరిట ఎన్నికల కమిషన్ కళ్లకు గంతలు కట్టి ముందు నుంచే అమలవుతున్న పథకంగా చూపించాలనుకున్నట్లుగా సర్కారు అసలు విషయం చెప్పింది. నిజాలు మాట్లాడుతూనే.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి, సీఎంవోకు దురుద్దేశాలను ఆపాదించాలని సీఎస్‌ను కించపరిచే వార్తలు రాసిందని 'ఆంధ్రజ్యోతి'పై అక్కసు వెళ్లగక్కుతూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ వివరణ పంపారు. అంతే తప్ప 'ఆంధ్రజ్యోతి' వార్తా కథనంలో ప్రస్తావించిన అంశాలు అవాస్తవమని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. 'ఆంధ్రజ్యోతి'పై అక్కసు వెళ్లగక్కే పేరిట స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్.. పట్టాల రిజిస్ట్రేషన్‌లోని లోగుట్టును, జగన్ కోసం పడ్డ తాపత్రయాన్ని చెప్పకనే చెప్పారు.

అజయ్‌జైన్ ఏం చెప్పారంటే..

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్, పంపిణీ రెగ్యులర్‌గా అమలవుతున్న కార్యక్రమమని రెవెన్యూ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ వివరించారు. "ఈ ఏడాది జనవరి 27 నుంచే అమల్లో ఉన్న కార్యక్రమం. 22.80 లక్షల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కుగాను మార్చి 15 నాటికి 15.33 లక్షలు పూర్తిచేశాం. ఆ తర్వాత 16వ తేదీన ఎన్నికల కోడ్ వచ్చింది. మిగిలిన 7.08 లక్షల పట్టాల (సీఎం ఫొటోలు, నవరత్నాల లోగో లేకుండా) రిజిస్ట్రేషన్‌కు ఎన్నికల కమిషన్ అనుమతి కొరకు సీసీఎల్‌ఏ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. సీఎస్ నేతృత్వంలోని స్ర్కీనింగ్ కమిటీ ముందు ఈ ప్రతిపాదన ఉంచాము. ప్రతిపాదనకు పూర్తి వివరాలు, సరైన జస్టిఫికేషన్ (సమర్థనీయ కారణాలు) లేనందున తిరిగి డిపార్ట్‌మెంట్‌కు పంపించారు" అని అజయ్‌జైన్ తన వివరణలో పేర్కొన్నారు. వాస్తవాలను పరిశీలించకుండా సీఎంఓకు, సీఎస్‌కు దురుద్దేశాలు ఆపాదించారని 'ఆంధ్రజ్యోతి'పై అక్కసు వెళ్లగక్కారు. కానీ ఆయన అక్కసులోనూ వాస్తవికత, జస్టిఫికేషన్ లేదు.

'ఆంధ్రజ్యోతి' చెప్పింది ఇదే..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా జగన్ బొమ్మలు, నవరత్నాల లోగో ఉన్న ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్, పంపిణీ చేపట్టబోతున్నారని 'ఆంధ్రజ్యోతి' పేర్కొంది. ముందు నుంచే అమలవుతున్న పథకంగా చూపించి ఈ స్కీమ్‌ను ఎన్నికల నాటి వరకు (మే 13) కొనసాగించాలనుకుంటున్నారని, ఈ పేరిట రెవెన్యూ సిబ్బందిని ఇంటింటికి పంపించి జగన్ అనుకూల ప్రచారం చేయాలన్నది సర్కారు వ్యూహమని వెల్లడించింది. ఇప్పటికిప్పుడు ఎన్నికల సమయంలో అమలు చేసే కార్యక్రమం కాదని, ఎన్నికల అనంతరం కూడా అమలు చేయవచ్చని వివరించింది. కోడ్‌కు విరుద్ధమని తెలిసి సీఎస్ నేతృత్వంలోని స్ర్కీనింగ్ కమిటీ ఈ ప్రతిపాదనను చర్చించి, అమలు కోసం ఈసీ అనుమతి కోరుతూ లేఖ రాయబోతున్నారని 'ఆంధ్రజ్యోతి' స్పష్టంగా వివరించింది.

ఇది నిజం కాదా అజయ్‌జైన్?

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక జగన్ బొమ్మలు, నవరత్నాల లోగోలతో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చేసి పేదలకు ఇవ్వాలనుకోవడం తప్పు. అది మీకు తెలుసు కాబట్టే, స్ర్కీనింగ్ కమిటీలో ఆమోదించి ఈసీ అనుమతి కోరాలనుకున్నారు. ఈ పని చేయాలంటే ఆ ప్రతిపాదన సమర్థనీయంగా ఉండాలి. కానీ అది సమర్థనీయంగా లేదని కమిటీ వెనక్కి పంపించిందని మీరే చెబుతున్నారు. ఈ ఫైలు కమిటీకి ప్రతిపాదించడానికి ముందు దానికి జస్టిఫికేషన్ లేదని అజయ్‌జైన్‌కు తెలియదా? ఆ విషయం తెలియకుండానే ప్రతిపాదించారా? అంటే.. ఆయన వివరణను పరిశీలిస్తే 'తెలుసనే' సమాధానం వస్తోంది. సమర్థనీయ కారణాలు లేని ప్రతిపాదనను స్ర్కీనింగ్ కమిటీలో ఆమోదింపచేసి, దాని అమలు కోరుతూ ఈసీకి లేఖరాయాలని ప్రతిపాదించడం తప్పు కాదా? ఇది తప్పని సీఎస్, స్పెషల్ సీఎస్‌కు ఆ మాత్రం తెలియదా? అంటే.. అన్నీ తెలిసే ప్రయత్నించారని స్పష్టమవుతోంది. ఈ ప్రతిపాదనపై జరిగిన కమిటీలో సీఎస్, జీఏడీ కార్యదర్శితో పాటు రెవెన్యూ స్పెషల్ సీఎస్‌గా అజయ్ జైన్ పాల్గొన్నారు. జస్టిఫికేషన్ లేదని కమిటీ చెప్పిందంటే.. అజయ్‌జైన్ తప్పుడు ప్రతిపాదన చేశారని కమిటీ స్పష్టంగా చెప్పినట్లే కదా! జస్టిఫికేషన్ లేని ఫైలును అజయ్‌జైనే తీసుకెళ్లి దాన్ని ఎలా సమర్థించుకుంటారు?

ఆ ఫైలు వెనక్కి

ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ ప్రతిపాదన ఫైలును సీఎస్ నేతృత్వంలోని స్ర్కీనింగ్ కమిటీ వెనక్కి పంపించింది. సరైన సమర్థనీయ కారణాలు చూపిస్తూ ఈసీ అనుమతి కోరేలా ప్రతిపాదనలు పంపించాలని రెవెన్యూ శాఖకు తిప్పిపంపించింది. సీసీఎల్‌ఏకు ఫైలు వెనక్కి పంపించినట్లు తెలిసింది.

డొల్లతనం బయటపడేసరికి విన్యాసాలు

నిజానికి ఇంటి పట్టాలను నిరంతర కార్యక్రమంగా అమలు చేయాలనుకుంటే కోడ్ వచ్చినా అనుమతి కోరుతూ వెంటనే ఈసీకి ప్రతిపాదన పంపొచ్చు. కానీ సర్కారు ఆ పనిచేయలేదు. సరిగ్గా ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఈ పని చేయాలనుకుంది. అందుకే, ఏప్రిల్ 12న ప్రతిపాదన చేశారు. ఇంటి పట్టాలను మే 13 తర్వాత కూడా రిజిస్ట్రేషన్ చేయవచ్చు. లేదా సర్కారుకు చిత్తశుద్ధి ఉన్నట్టయితే జనవరి నుంచి మార్చి 15 నాటికే పూర్తిచేయవచ్చు. కానీ ఆ పని చేయకుండా వ్యూహాత్మకంగా కొంత మాత్రమే పూర్తి చేసి, మిగిలిన దాన్ని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక అమలు చేద్దామనుకున్నారు. అందుకే కోడ్ వచ్చిన వెంటనే.. అంటే మార్చి 16వ తేదీన ఈ స్కీమ్ అమలు గురించి ఈసీకి లేఖ రాయాలనుకోలేదు.

కందుకూరు ప్రాంత అభివృద్ధి గురించి, సీఎం ఇచ్చిన హామీలు అమలు కాకపోవటాన్ని ప్రశ్నించిన విలేకరులపై వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఎదురుదాడికి దిగారు. 'మీరు డిస్టర్బ్ చేయటానికే ఇక్కడికి వచ్చారు. ఒక విలేకరి ఆ పనిచేస్తుంటే ఆయనకు 'ఆంధ్రజ్యోతి' విలేకరి తోడయ్యాడు' అంటూ విలేకరుల సమావేశాన్ని ముగించేశారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

- మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో ఎంపిక
- ప్రధాన పరీక్షకు 4496 మంది
- సెప్టెంబరులో మెయిన్స్ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రాథమిక(ప్రిలిమ్స్) పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో ఈ ఫలితాలను వెల్లడించడం గమనార్హం. మార్చి 17న జరిగిన ప్రాథమిక పరీక్షకు 91,463 మంది హాజరయ్యారు. వీరిలో ఉత్తీర్ణులైన వారిని ఒక్కొక్క పోస్టుకు 50 మంది చొప్పున 4,496 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేశారు. సెప్టెంబరు 2 నుంచి 9 వరకు మెయిన్స్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక 13వ తేదీన ఫలితాలు విడుదల చేసిన ఏపీపీఎస్సీ, 12నే విడుదల చేసినట్లు చూపించింది. అంత హడావుడిగా అర్ధరాత్రి దాటాక ఫలితాలు విడుదల చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే దానిపై ఏపీపీఎస్సీ వివరణ ఇవ్వలేదు. కాగా, ఇటీవల గ్రూప్-2లో మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి తీసుకున్నందున, గ్రూప్-1కు కూడా అదే నిష్పత్తిలో ఎంపిక చేయాలని పరీక్షలు రాసిన వారు డిమాండ్ చేశారు.

మే 22 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ కోర్సుల్లోకి ప్రవేశాలు మే 22న ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను ఇంటర్ విద్యా మండలి శనివారం విడుదల చేసింది. మే 15 నుంచి దరఖాస్తుల విక్రయం ప్రారంభం అవుతుందని, 22 నుంచి మొదటి విడత అడ్మిషన్లు ప్రారంభమవుతాయని పేర్కొంది. జూన్ 10 నుంచి రెండో విడత అడ్మిషన్లు తీసుకోవచ్చని తెలిపింది. జూన్ 1తో మొదటి విడత, జూలై 1తో రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవుతుంది.

రూ.3 కోట్ల బంగారం సీజ్

- కాకినాడ తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



కాకినాడ జిల్లాలో బంగారం తరలిస్తున్న సీక్వెల్ లాజిస్టిక్ వాహనం

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 13: అనుమతి పత్రాలు లేకుండా, నిబంధనలు పాటించకుండా వాహనంలో తరలిస్తున్న రూ.3కోట్ల విలువైన బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు-పిఠాపురం మధ్య 216వ జాతీయ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శనివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. విశాఖ నుంచి కాకినాడ వెళ్తున్న సీక్వెల్ లాజిస్టిక్ పార్సిల్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. అందులో బంగారం తరలిస్తున్నట్టు గుర్తించిన అధికారులు పత్రాలు, బిల్లులు కోసం అడగగా చూపించలేకపోయారు. దీంతో బంగారంతో సహా వాహనాన్ని ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు పిఠాపురం తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.

జానపదాల బిరుదురాజు



కొందరు శిష్యవర్గం ప్రచారంతో, మరికొందరు అభిమానుల ఆదరణతో, ఇంకొందరు అధికార ప్రాభవంతో గొప్పవారుగా గుర్తింపు పొందుతున్న ఈ రోజులలో, కేవలం తన పరిశోధనల వల్ల, దాని ఫలితమైన రచనల వల్లనే ఎవరికీ సాధ్యం కానంత ఉన్నత శిఖరాలు అధిరోహించిన అక్షరాల జాతీయ ఆచార్యుడు- డా. బిరుదురాజు రామరాజు. ఈ నెల 16న 99వ జయంతి జరుగుతున్న జానపద సాహిత్యోద్ధారకుడు రామరాజు- ఆనాటి నుంచి శతజయంతి సంవత్సరంలో ప్రవేశిస్తున్నాడంటే- నిజాయితీ, కృతజ్ఞత గల పరిశోధక ప్రముఖులకు, వారి శిష్యులకు, బంధుమిత్ర వర్గానికి, ప్రతిభాసంపన్నుల కృషిని గుర్తించి, గౌరవించే ప్రభుత్వానికి ఎంత అపురూపమైన, స్ఫూర్తిదాయకమైన ఘటనో! కాని ఇంతవరకు ఆ దాఖలాలు కన్పించకపోవడం శోచనీయం.

ఈనాడు అన్ని విశ్వవిద్యాలయాల్లో జానపద సాహిత్యానికి విశిష్ట సాహిత్యంతో సమానమైన పీఠం లభించిందంటే, దాని వెనక రామరాజు కృషి ఎంతో ఉంది. శిథిలమై, జీర్ణమైపోతున్న జానపద సాహిత్య విలువలను వెలికి తెచ్చి, దేశం ముందు పెట్టి, అందులోని గొప్పతనాన్ని, కమ్మదనాన్ని రుచి చూపించిన పండిపోయిన పండితుడు రామరాజు. ఇంటర్నెట్, గూగుల్ సౌలభ్యం లేని కాలంలో అహోరాత్రులు, కాలిబాటల్లో, ముళ్లదారుల్లో, ఎడ్లబండ్లలో, ఎండ-వానల్లో ఊరూరా తిరిగి మరుగున పడిపోతున్న పసిడి సాహిత్యాన్ని అష్టకష్టాలు పడి సేకరించి 'జానపద సాహిత్యం'పై సాధికారమైన పరిశోధన గ్రంథం వెలువరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో

నేడు అన్ని విశ్వవిద్యాలయాల్లో జానపద సాహిత్యానికి విశిష్ట సాహిత్యంతో సమానమైన పీఠం లభించిందంటే, దాని వెనక బిరుదురాజు రామరాజు కృషి ఎంతో ఉంది. శిథిలమై, జీర్ణమైపోతున్న జానపద సాహిత్య విలువలను వెలికి తెచ్చి, దేశం ముందు పెట్టి, అందులోని గొప్పతనాన్ని, కమ్మదనాన్ని రుచి చూపించిన పండిపోయిన పండితుడు ఆయన.

తెలుగులో చేసిన తొలి పరిశోధనే కాకుండా, జానపద సాహిత్యం గురించి దక్షిణ భారతంలోని విశ్వవిద్యాలయాల్లో అన్ని భాషల్లోను ఇది తొలి పరిశోధన. వారి తర్వాతనే మిగతా విశ్వవిద్యాలయాల్లో ఇతర భాషల్లోను జానపద సాహిత్యంపై పరిశోధన ప్రారంభమైంది, జానపదుల జీవన విధానాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రారంభమైంది. ప్రామాణికమైన వీరి పరిశోధనా వ్యాసమే ఆ తర్వాత వారందరికీ మార్గదర్శకమైంది. అందులో నుంచే చిలవలు పలువలుగా ఎన్నెన్నో సిద్ధాంతగ్రంథాలు వచ్చాయి. వీరి పరిశోధనా గ్రంథమే సినీ కవులకు మూలగ్రంథం.

వీరి సిద్ధాంత గ్రంథాన్ని కొందరు చాదస్త పండితులు చులకనగా చూశారు. దానితో వారిని ఢీకొనాలనే ధ్యేయంతోనే వందలాది సంస్కృత ఆంధ్ర తాళపత్ర గ్రంథాలను సేకరించి పరిష్కరించి ముద్రించారు. సంస్కృతంలో కూడా ఎం.ఏ చేశారు. 'సంస్కృత సాహిత్యానికి ఆంధ్రుల చేయూత' అనే అంశంపై సిద్ధాంత గ్రంథం పూర్తి చేశారు. కాని కారణాంతరాల వల్ల సమర్పించనే లేదు. ఆ గ్రంథాన్ని వారు 2002లో వెలువరించారు. ఇందులో 224 మంది కవుల రచనల గురించి సమగ్రంగా ఒకచోట ఇవ్వడం వారి పఠన శీలాన్ని, పరిశోధనా సామర్థ్యాన్ని తేటతెల్లం చేస్తుంది. ఇంగ్లీషులో ఈ అంశంపై వెలువడింది కేవలం ఇదొక్కటే గ్రంథం కావచ్చు.

తొలినాళ్లలో వీరొక చక్కని కవి. కాని వీరిలోని పరిశోధనా పాటవాన్ని గమనించిన సుప్రసిద్ధ సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి సలహా మేరకు కవిత్వం రాయడం మానివేసి తన జీవితం సమస్తం పరిశోధనా రంగానికే అంకితం చేసిన పరమేశ్వరుడు ఆయన. వారు కవిత్వం రాసిన రోజుల్లో ఎం.ఏలో ఉన్నప్పుడు, బి.ఏ చదువుతున్న సి. నారాయణరెడ్డితో కలిసి 'రామనారాయణ కవులు'గా జంట కవిత్వం రాశారు. సినారె స్థాయిలో కవిత్వం చెప్పగలిగిన రామరాజు, కవిత్వం జోలికి పోకుండా తన జీవితాన్ని పరిశోధనకు, విమర్శకు అంకితం చేయడం వెనక ఎంత పట్టుదల, పరిశ్రమ ఉందో వేరుగా చెప్పనవసరం లేదు. "జానపద సాహిత్యం శిష్ట సాహిత్య సౌధానికి పునాది" అన్నది రామరాజు అభిప్రాయం.

దాదాపు మూడున్నర దశాబ్దాల కాలం విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడుగా సేవలందించి ఎంతోమందిని ఉత్తమ ఆచార్యులుగా తీర్చిదిద్దారు. పేర్వారం జగన్నాథం, రవ్వా శ్రీహరి లాంటి వీరి శిష్యులు వైస్ ఛాన్సలర్లు అయ్యారు. ఆచార్య రామకోటి శాస్త్రి, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, ఆచార్య యం. వీరభద్ర శాస్త్రి, అక్కిరాజు రమాపతిరావు, ఇందుర్తి ప్రభాకరరావు, ఇటీవల ఆచార్య తిరుమలరావు వంటి ఎందరో శిష్యులు, ప్రశిష్యులు వివిధ విశ్వవిద్యాలయాల్లో తెలుగు జానపద శాఖల్లో ఉన్నా, ఎందుచేతనో గాని కేవలం ఒకే ఒక విదుషీమణి- కంచి విజయలక్ష్మి మాత్రమే "డా. రామరాజు జీవితం-రచనలు" అనే అంశంపై పరిశోధన 25 సంవత్సరాల క్రితం చేశారు.

ఊరు పేరు తెలియని ఎందరో అనామకులపై అనేక పరిశోధనలు చేయించే, లేదా ఒకే అంశంపై పదేపదే పరిశోధనలు చేయించే విశ్వవిద్యాలయ ఆచార్యులకు డా. రామరాజు పరిశీలించి, పరిష్కరించి, వెలుగులోకి తెచ్చిన సంస్కృత గ్రంథాలపై పరిశోధన వేరుగా చేయించవచ్చుననీ, వారు సేకరించిన తాళపత్ర గ్రంథాలను, ప్రపంచానికి తెలియజేసిన వ్యాసావళి పైనే ప్రత్యేక పరిశోధన చేయించవచ్చునని తెలియకపోదు. అంతేకాదు మరుగునపడిన మాణిక్యాలను తాను వెలికి తీశారు. చరిత్రకెక్కని చరితార్థులను పరిచయం చేశారు. వాటిపై కూడా పరిశోధన చేయించవచ్చు. సంస్కృత భాషా సాహిత్యాలకు ఆంధ్రులు చేసిన సేవలను గురించి, ఇంగ్లీషులో రచించిన పలు పరిశోధన వ్యాసాలపై పరిశోధన చేయించవచ్చు. అంతదాకా ఎందుకు? 'ఆంధ్ర యోగులు' గొలుసు గ్రంథాలపైనా పరిశోధన చేయవచ్చు. కాని అలక్ష్యం జరిగింది. వారి శతజయంతి సందర్భంగానైనా ఈ అంశాలలో కొన్నింటిపైనైనా, మన విశ్వవిద్యాలయాలు పరిశోధనకు శ్రీకారం చుడితే సంతోషం.

వరంగల్ సమీపంలోని దేవునూరులో 1925 ఏప్రిల్ 16న లక్ష్మీదేవి -నారాయణరాజు దంపతులకు జన్మించిన రామరాజు, మడికొండలో వారి పెదనాన్న రాఘవరాజు కనుసన్నలలో పెరిగి విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. అక్కడ పుట్టిన హేమాహేమీలు, సమకాలీనులైన అభినవ పోతన వానమామలై వరదాచార్యులు, 'రైతు రామాయణం' కర్త వానమామలై జగన్నాథాచార్యులు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, వారి సోదరుడు కాళోజీ రామేశ్వరరావు, 'గంగిరెద్దు' కావ్యకర్త పల్లా దుర్గయ్య, 'సరస్వతీ సాక్షాత్కారం' లాంటి కావ్యాలు రాసిన అనుముల కృష్ణమూర్తిల స్నేహం లభ్యమై తెలుగు పట్ల అభిమానానికి, మమకారానికి దోహదం చేసింది. ఇంటర్మీడియెట్ స్థాయిలో హైదరాబాద్‌కు రావడంతో, పరిశోధనా రంగంలో విశేష కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి దృష్టి ఆకర్షించారు. ఆయన వద్దే తాళపత్ర గ్రంథ సేకరణ, శోధన నేర్చుకున్నారు. చదువుకుంటూ హైదరాబాద్ సివిల్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి సెలక్టయి, జిల్లా పంచాయితీ అధికారిగా ఉద్యోగం సంపాదించారు. అదే ఉద్యోగంలో కొనసాగి ఉంటే రాష్ట్ర ప్రభుత్వంలో శిఖర స్థాయికి చేరేవారు. కాని ఆయన ఆ ఉద్యోగంలో చేరక నిజాం కళాశాలలో బి.ఏలో చేరారు. హైదరాబాద్ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడై హైదరాబాద్ విమోచనకై నిజాం వ్యతిరేక సత్యాగ్రహంలో పాల్గొని జైలుకెళ్లారు. ఆ తర్వాత ఎం.ఏ పూర్తి చేశారు. దేశంలో జరుగుతున్న తొలి ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ టికెట్ ఇస్తామన్నా, సురవరం వారి సలహాపై తిరస్కరించారు. పిన్న వయసులోనే 1951లో లెక్చరర్తె, పిదప రీడర్ అయి, ఆచార్య పదవి అలంకరించి ఎంతో మంది శిష్యప్రశిష్యులకు స్ఫూర్తిమంతమైన గురువయ్యారు.

ప్రామాణికమైన వీరి పరిశోధనా వ్యాసమే ఆ తర్వాత వారందరికీ మార్గదర్శకమైంది. అందులో నుంచే చిలవలు పలువలుగా ఎన్నెన్నో సిద్ధాంతగ్రంథాలు వచ్చాయి. వీరి పరిశోధనా గ్రంథమే సినీ కవులకు మూలగ్రంథం.

తెలుగు శాస్త్రీయ పరిశోధన రంగంలో మార్గదర్శకుడైన డా. రామరాజు- 123 సంవత్సరాల క్రితం తెలుగుభాషకు ఏ మాత్రం ఆదరణలేని నిజాం నిరంకుశ పాలనా కాలంలో తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సంస్కృతీ వికాసానికి పాటుపడే మహదాశయంతో స్థాపించిన 'శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం'కు 1956 నుంచి 1959 దాకా, మళ్లీ 1963 నుంచి 1965 దాకా గౌరవ కార్యదర్శిగా, అంతకుముందు 1960 నుంచి 1962 దాకా ఉపాధ్యక్షులుగా సేవలందించారు.

వారి గౌరవార్థం మా భాషా నిలయం 2019లో 'డా. బి. రామరాజు స్మారక పరిశోధక పురస్కారం' ఏర్పాటు చేసి, ప్రతియేటా ఒక పరిశోధక ప్రముఖుడికి ప్రదానం చేస్తున్నాం. ఈ యేడాది 'డా. రామరాజు జీవితం-రచనలు' అనే అంశంపై పరిశోధన చేసిన ఏకైక విదుషీమణి శ్రీమతి కంచి విజయలక్ష్మికి ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు రావిచెట్టు రంగారావు సభామందిరం, (శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం)లో భాషా నిలయం గౌరవ అధ్యక్షులు డా. కె.వి. రమణాచారి ప్రదానం చేస్తారు.

■ టి. ఉడయవర్లు

(ఏప్రిల్ 16: బిరుదురాజు రామరాజు శతజయంతి సంవత్సరం ఆరంభం)

ELECTORAL BONDS

పులుగడిగిన ముత్యాలు ఎవరు?

మర్రిమాను విశాలమైన ప్రాంతమంతటా ఊడలు దించుకున్నట్టు అవినీతి దేశమంతటా వ్యాపించి ఉంది. అది లేని చోటు లేదంటే అతిశయోక్తి కాదు. మనమంతా అవినీతి పంకజాలమే అంటే చాలా మందికి కోపం రావొచ్చేమో కానీ, అది వాస్తవం. మన ఆర్థికవ్యవస్థ మూలాలే అవినీతిలో కూరుకుపోయి ఉన్నాయి. ఆశ్రితపెట్టుబడి దేశం నరనరానా ప్రవహిస్తున్న చోట కేంద్రప్రభుత్వ ఆర్థికనిర్ణయాలే ఎలెక్టోరల్ బాండ్ల మీద ఆధారపడి వెలువడుతున్నప్పుడు మనమంతా దొర్లుతున్నది అవినీతి పంకిలంలోనే. ఆ పంకిలాన్ని ఎదుటివారి మీద చల్లడంలో ఎవరి శక్తిసామర్థ్యాలు ఎక్కువైతే వారిదే పైచేయి అవుతుంది. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వ అవినీతిని భూతద్దంలో చూపి ఢిల్లీ రామ్ లీలా మైదాన్ వేదికగా ఆర్ఎస్ఎస్ ప్రాయోజిత అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని బీజేపీ బాగా రక్తి కట్టించింది. అది ఆ ఎన్నికల్లో

ఎప్పుడూ ఎదుటివారినే దొంగలుగా చూపించి తాను పులుగడిగిన ముత్యాన్ని అని చెప్పుకుంటున్న బీజేపీ మనల్నీ అదే నమ్మమంటోంది. జాతీయ మీడియా అండతో నీతికి నిలువెత్తు కటౌట్‌గా పోజు కొడుతోంది. అవినీతిపరులంతా ప్రతిపక్షంలోనే ఉన్నారని మోదీ దేశప్రజలను నమ్మింపజూస్తున్నారు. ధగధగలాడే నీతికిరీటంతో మెరిసిపోతున్న తనను మూడోసారి ప్రధానిని చేయడం మినహా వేరే దారి లేదని వారికి స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అవినీతిని భూతద్దంలో చూపించి ప్రయోజనం పొందదలచినట్టు మోదీ ప్రసంగాలు స్పష్టపరుస్తున్నాయి. తన పదేళ్ల పాలనలో పేరుకుపోయిన మురికి ఎంత ఉతికినా వదలదనే విషయాన్ని కప్పిపెట్టి అందరి ముందు యూపీఏని దోషిగా నిలబెట్టడం ద్వారా ఆయన పబ్బం గడుపుకోవాలనుకుంటున్నారు.

యూపీఏ ఓటమికి, దాని సారథి కాంగ్రెస్ పార్టీ ఘోరపరాజయానికి కారణమయింది. అలా పాలనాపగ్గాలు చేపట్టిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే అవినీతి అస్త్రాన్ని మరింత సునిశితంగా, జుగుప్సాకరంగా ప్రతిపక్షాల మీద సంధిస్తూ ఉండడం విశేషం. పాలకపక్షంగా బీజేపీ స్వతంత్ర దర్యాప్తుసంస్థలను సైతం తన చెప్పుచేతల్లో పెట్టుకుని ప్రతిపక్షానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అవినీతి వ్యతిరేక ఉద్యమం నుంచి పుట్టిన 'ఆప్' అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అదే అవినీతి ఆయుధంతో మద్యం కేసులో అరెస్ట్ చేయించి చిరునవ్వు నవ్వుకుంటోంది. హేమంత సోరెన్‌తో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయించి జైల్లో తోసింది. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర భగేల్ ముఖ్యమంత్రిగా ఉండగానే ఆ రాష్ట్ర ఎన్నికల నడిమధ్యలో ఆయన మీద అవినీతి కేసు బిగించింది.

ఎప్పుడూ ఎదుటివారినే దొంగలుగా చూపించి తాను పులుగడిగిన ముత్యాన్ని అని చెప్పుకుంటున్న బీజేపీ మనల్నీ అదే నమ్మమంటోంది. జాతీయమీడియా అండతో నీతికి నిలువెత్తు కటౌట్‌గా పోజు కొడుతోంది. ఇటీవల ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో మహాసభ నిర్వహించిన ప్రతిపక్ష కూటమి 'ఇండియా', అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ల అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని సునిశిత దాడి చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగిన ఎన్నికల సభలో ప్రధాని మోదీ దీనిపై స్పందిస్తూ అవినీతిపై పోరాటం కొనసాగి తీరుతుందని స్పష్టంచేశారు. 'మోదీని ఎవరూ ఆపలేరు, ప్రతి ఒక్క అవినీతిపరుని మీద చర్య తీసుకుంటాం. నన్ను భయపెట్టడం కోసం అవినీతిపరులంతా ఒక్కచోట చేరారు. అది ఇంతకు ముందుకంటే బలమైన సంకల్పంతో అవినీతిపై రాజీలేని పోరుకు నన్ను సమాయత్తం చేసింద'ని హెచ్చరించారు. అంటే, అవినీతిపరులంతా ప్రతిపక్షంలోనే ఉన్నారని ఆయన దేశప్రజలను నమ్మింపజూస్తున్నారు. ధగధగలాడే నీతికిరీటంతో మెరిసిపోతున్న తనను మూడోసారి ప్రధానిని చేయడం మినహా వేరే దారి లేదని వారికి స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అవినీతిని భూతద్దంలో చూపించి ప్రయోజనం పొందదలచినట్టు మోదీ ప్రసంగాలు స్పష్టపరుస్తున్నాయి. తన పదేళ్ల పాలనలో పేరుకుపోయిన మురికి ఎంత ఉతికినా వదలదనే విషయాన్ని కప్పిపెట్టి అందరి ముందు యూపీఏని దోషిగా నిలబెట్టడం ద్వారా ఆయన పబ్బం గడుపుకోవాలనుకుంటున్నారు. ఈ సందర్భంలో మోదీని జాతి అడగవలసిన ప్రశ్నలు చాలానే ఉన్నాయి. వాస్తవానికి ఎటువంటి రంగుకళ్లద్దాలు లేని నిష్పాక్షిక పరిశీలకులు వాటిని తరచూ ఆయన పైకి సంధిస్తున్నారు కూడా. విస్తృతప్రాచుర్యం గల జాతీయ మీడియా సంస్థలు వాటికి ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో అవి ప్రజల దృష్టిలో పడడంలేదు. గత పదేళ్లలో ఒక్క ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగమే లక్షకోట్ల రూపాయల అవినీతి సొమ్మును స్వాధీనం చేసుకుందని, తన అవినీతి నిర్మూలన యజ్ఞం ఎట్టిపరిస్థితులలోనూ ఆగబోదని మోదీ ప్రకటించారు.

ఐతే గత పదేళ్ల కాలంలోకి మనం ఒకసారి చూపు సారిస్తే వ్యక్తిగతంగా మోదీపైనే దట్టంగా అల్లుకున్న అవినీతిమేఘాలు చెక్కు చెదరకుండా కనిపిస్తాయి. తనకు అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీని వెంటబెట్టుకుని విదేశయాత్రలు కూడా చేసిన ప్రధాని మోదీ, హిండెన్‌బర్గ్ పరిశోధనలు అతడి స్టాక్‌మార్కెట్ మోసాలచిట్టా విప్పిన తర్వాత పార్లమెంటుకు ముఖం చూపించలేకపోయారన్న చేదువాస్తవం అందరికీ తెలిసిందే. మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌ను 'మౌన్ మోహన్ సింగ్' అని ఎద్దేవా చేసిన ఆయన ఈ విషయంలో మౌన వ్రతం పాటించడం ప్రపంచానికి వినోదమయింది. యుద్ధవిమానాల తయారీరంగంలో బొత్తిగా అనుభవం లేని అనిల్ అంబానీకి అనుకూలంగా మోదీ ఫ్రెంచ్ రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందాన్ని స్వయంగా కుదిర్చిపెట్టడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీజేపీ పాలితరాష్ట్రాల్లో వ్యాపం (మధ్యప్రదేశ్) వంటి భారీ అవినీతి కుంభకోణాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. పాలకపక్షంగా కీలకమైన నిర్ణయాలు తీసుకునే విశేషాధికారాలను చూపించి కార్పొరేట్ సంస్థల నుంచి క్విడ్ ప్రో కో రూపంలో విశేష ధన రాసులను మూటకట్టుకోడానికి దుర్భేద్యమైన రీతిలో రూపొందించిన ఎలెక్టోరల్ బాండ్ల పథకం ముసుగును సుప్రీంకోర్టు స్వహస్తాలతో తొలగించింది. ఈ బాండ్ల ద్వారా పార్టీలకు చేరిన మొత్తం సొమ్ములో దాదాపు సగం ఒక్క బీజేపీకే అందిందన్న కఠోరవాస్తవం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అందరూ అనుకుంటున్నట్టు బాండ్ల ద్వారా తమ పార్టీకి అందినది విశేషమొత్తమేమీ కాదని, మొత్తం రూ.20000 కోట్లలో తమకు ముట్టినది రూ.6000 కోట్లేనని, మిగతా రూ.14000 కోట్లు ఇతర పార్టీల ఖాతాల్లోకే వెళ్లాయని అమిత్ షా బుకాయించారు. అయితే వాస్తవం దీనికి విరుద్ధంగా ఉంది. మొత్తం బాండ్ల విలువ రూ 16,518 కోట్లు కాగా అందులో బీజేపీ ఖాతాకు వెళ్ళింది రూ 8251.8 కోట్లని తేలింది. ఇలా ఎక్కడికక్కడ తన నిజస్వరూపాన్ని కప్పిపుచ్చుకోడానికి అబద్ధాల దడి కట్టుకోవడం కంటే జుగుప్సాకరం ఇంకేముంటుంది?

బీజేపీకి వెలుపల ఉన్నవాళ్లంతా అవినీతిపరులు, ఈడీ సంకెళ్లకు అర్హమైనవారు. ఆ పార్టీలో చేరిపోతే మాత్రం వారే నీతిమంతులు. ఈడీ కాదు కదా, ఈగ కూడా వారి మీద వాలదనే అభిప్రాయం దేశప్రజల్లో బలపడిపోయింది. దేశమంతటా అనేకమంది తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీలో చేరి నిష్పూచీగా బతుకుతున్నారు. ఇప్పటికే ప్రతిపక్ష 'ఇండియా' కూటమి, కాంగ్రెస్‌నేతలు ఈడీ, సీబీఐలను బీజేపీ జవాన్లని పిలుస్తున్నారు. ఎంతటి అవినీతి నేతలనైనా పాలకపక్షంలో చేరగానే నీతిమంతులుగా మార్చివేసే వాషింగ్ మెషీన్ అంటూ ఆ పార్టీని ఎద్దేవా చేస్తున్నారు. ఇలా తీవ్ర ఆర్థిక నేరాభియోగాలుండి బీజేపీ లేదా దాని మిత్రపక్షాల్లో చేరిన వెంటనే పరమపావనులైపోయినవారి ఉదంతాలు ప్రతి రాష్ట్రంలోనూ ఉన్నాయి. మహారాష్ట్రలోని యవత్మల్‌వాషిమ్ నియోజకవర్గ ఎంపీ భావన గవాలి (శివసేన) అయిదుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. సీనియర్ శివసేన నాయకుడు, మాజీ ఎంపీ పుందికేరావు గవాలి కుమార్తె ఈమె. మహిళా ఉత్కర్ష ప్రతిష్ఠాన్ ఛైర్‌పర్సన్‌గా ఆమె రూ.7 కోట్ల దుర్వినియోగానికి పాల్పడినట్టు 2020లో ఈడీ ఆరోపించింది. ఆమెకు సన్నిహితుడైన సయీద్‌ఖాన్‌ను అరెస్టు చేసింది. గవాలిని పిలిచి ఈడీ అనేకసార్లు విచారణ జరిపింది. ఈ కేసులో ఛార్జిషీట్ కూడా దాఖలయింది. 2022 జూలైలో భావన గవాలి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరారు. వెంటనే ఆమెను లోక్‌సభలో ఆ పార్టీ చీఫ్‌విప్‌గా చేశారు. అంతే, ఈడీ కేసు హుష్ కాకి అయింది. ఆమెపై ఒక్క అనుబంధ ఛార్జిషీట్ దాఖలు కాలేదు. ఈడీ మళ్ళీ ఆమెను విచారణకు పిలవనే లేదు. ఇలాగే అజిత్‌పవార్ మీద మహారాష్ట్ర అవినీతి నిరోధక శాఖ కోర్టు పర్యవేక్షణలో మొదలుపెట్టిన విచారణ ఇప్పుడు ఏమైందో ఐపు లేదు. 2019లో ఇలా పుట్టి అలా గిట్టిపోయిన దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వంలో అజిత్ ఉపముఖ్యమంత్రిగా చేరినప్పుడు ఏసీబీ ఆయనకు అన్ని అభియోగాల నుంచి విముక్తి కలిగిస్తూ బొంబాయి హైకోర్టులో క్లీన్‌చిట్ దాఖలు చేసింది.



ప్రతిపక్షంలో ఉంటే కేసులు, బీజేపీలో లేదా దానితో మిలాఖత్ అయిన మిత్రపక్షాల్లో చేరితే అనాయాసంగా క్లీన్ చిట్‌లు లభించేస్తున్నాయి. ప్రధాని మోదీ తన విశాలమైన ఛాతీ మీద చేయివేసి అవినీతి అంతు చూస్తానని చేసే ప్రకటనలు, ప్రతిజ్ఞల అసలు బండారం ఇదన్నమాట. కాంగ్రెస్‌ను వీడి అజిత్‌పవార్ నాయకత్వంలోని ఎన్‌సీపీలో చేరిన బాంద్రా ఎమ్మెల్యే బాబా సిద్దికి, అజిత్‌పవార్ వర్గంలో చేరిన ఓబీసీ నేత ఛగన్ భుజ్‌బల్, మరికొంతమంది మహారాష్ట్ర నాయకులు, బీజేపీకి అనుకూలంగా రాజకీయ విధేయతలు మార్చుకుని అవినీతి ఊబిలోంచి బయటపడి నీతి యోగ్యతాపత్రాలతో మెరిసిపోతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో 'నారదవల' (ఒక కంపెనీకి మేలు చేయిస్తే నగదు లంచం ఇచ్చే విధంగా అంగీకారం కుదిర్చిన ఒక వార్తా సంస్థ స్టింగ్ ఆపరేషన్)కు చిక్కిన ఒకప్పటి తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు సువేందు అధికారి 2020లో బీజేపీలో చేరి కడిగిన ముత్యమైపోయారు, ప్రతిపక్షానికి నాయకుడిగా కొత్త అవతారమెత్తారు. మోదీ ఆశ్రితులై అవినీతిగతాన్ని వదిలించుకుని నీతి నిష్ఠాగరిష్ఠులైపోయిన మాజీ విపక్షనేతలు ఎందరెందరో.

తప్పు జరిగితే తక్షణమే శిక్ష విధించాలి. అందులో మరో మాటకు అవకాశమే లేదు. 2022 జూలై, ఆగస్టులో నమోదైన మద్యం విధానం కేసును ఇంతకాలం నాన్చి నాన్చి ఇప్పుడు అత్యంత కీలకమైన లోక్‌సభ ఎన్నికల ముందు రాజకీయ దురాశ, పేరాశతోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారన్నది బహిరంగ రహస్యం. 2014 తర్వాత కేంద్ర దర్యాప్తుసంస్థలు కేసులు పెట్టి వేధించిన వివిధ పార్టీలకు చెందిన 25 మంది ప్రముఖ నాయకులు బీజేపీలో చేరి ఊరట పొందారని ఆంగ్ల దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జరిపిన స్వతంత్ర దర్యాప్తులో తేలింది. కాంగ్రెస్ పాలనలోనూ ఇటువంటివి ఉన్నప్పటికీ ఇంత దారుణంగా ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తుసంస్థలను దుర్వినియోగపరచడం ఇంతకు ముందెన్నడూ జరగలేదని ఆ పత్రిక దర్యాప్తు నిగ్గుతేల్చింది. అపరిమిత అధికారం వ్యవస్థలు, సంస్థల నిష్పాక్షికతను బలి తీసుకోవడం దేశానికి అత్యంత హానికరం. తన నిండా పూడ్చలేని కంతలు ఉంచుకుని ఎదుటివారిని వేలెత్తిచూపడం పిల్లి కళ్ళు మూసుకుని దొంగతనంగా పాలు తాగుతూ లోకం తనను గమనించడం లేదని అనుకోడం వంటిదే.


ELECTORAL BONDS

కీలకమైన లోక్‌సభ ఎన్నికల ముందు రాజకీయ దురాశ, పేరాశతోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారన్నది బహిరంగ రహస్యం. 2014 తర్వాత కేంద్ర దర్యాప్తుసంస్థలు కేసులు పెట్టి వేధించిన వివిధ పార్టీలకు చెందిన 25 మంది ప్రముఖ నాయకులు బీజేపీలో చేరి ఊరట పొందారని ఆంగ్ల దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జరిపిన స్వతంత్ర దర్యాప్తులో తేలింది.



• శ్రీరామమూర్తి గార

సీనియర్ జర్నలిస్ట్



డాక్టర్ అంబేడ్కర్ కేవలం దళితుల నాయకుడు మాత్రమేకాదు, 140 కోట్ల మందికి పైగా భారతీయుల నాయకుడు. ఆయన ఆలోచనల విస్తృతి, విశాలత మన రాజ్యాంగంలో పూర్తిగా ప్రతిబింబించాయి. బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రవర్తించాలని అంబేడ్కర్ జీవితమూ, ఆదర్శాలు మనకు నేర్పుతున్నాయి. అలా ప్రవర్తించని పక్షంలో 2047 సంవత్సరం నాటికి సమ్మిళిత వికసిత భారతాన్ని నిర్మించుకోలేము. సామాజిక అస్తిత్వాలపై మనలో ఎటువంటి దురభిప్రాయాలు ఉండకూడదు. వికసిత భారత్ నిర్మాణానికి అదే మొదటి అడుగు.

వికాస భారత వైతాళికుడు


సమ్మిళిత భారతదేశ నిర్మాణానికి భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అందించిన సేవలు ఎప్పటికీ మరిచిపోలేనివి, సదా గౌరవ భావంతో స్మరించుకోవలసినవి. ఆయన ఒక సామాజిక న్యాయ ప్రవక్త; సమ్మిళితత్వం, న్యాయం, సమానత్వ వైతాళికుడు. ప్రశస్త న్యాయకోవిదుడు, ప్రతిభావంతుడైన ఆర్థికవేత్త, మానవతావాది. సాంఘిక సంస్కర్తగా అంబేడ్కర్ తన జీవితాన్ని కుల వివక్షను రూపుమాపడానికి, అణగారిన, వెనుకబడిన వర్గాలను సముద్ధరించేందుకు అంకితం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ పౌరులు అందరికీ ప్రాథమిక హక్కులు, రక్షణలు సమకూరేందుకు ఆయన చాలా శ్రద్ధ వహించారు. దళితులు, ఇతర అణగారిన వర్గాల వారి హక్కులను కాపాడేందుకు ఆయన నిరంతరాయంగా చేసిన కృషి మన సామాజిక వ్యవస్థలో మౌలిక సంస్కరణలకు దారి తీసింది.

మహోన్నత సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం ఆదర్శాల స్ఫూర్తితో రూపుదిద్దుకున్న ఆయన సామాజిక న్యాయ దార్శనికత నుంచి మనం నేర్చుకోవలసింది, అనుసరించవలసింది ఎంతో ఉంది. భారతీయ సమాజంలో శతాబ్దాలుగా పాదుకుపోయి ఉన్న అసమానతలను, ముఖ్యంగా కుల వ్యవస్థ దౌష్ట్యాన్ని ఆయన గుర్తించారు. వేదాల ప్రబోధాలకు విరుద్ధంగా మన సమాజంలో అమానుషంగా అమల్లో ఉన్న అస్పృశ్యతను నిర్మూలించడానికి ఆయన పోరాడారు.

కుల వ్యవస్థ దుర్మార్గాలకు అంబేడ్కర్ స్వయంగా బాధితుడు అయ్యారు. హిందూ సమాజానికి గుణపాఠం చెప్పేందుకు, భారతీయ విలువలు, సంప్రదాయల నుంచి ప్రభవించిన బౌద్ధ మతాన్ని ఆయన స్వీకరించారు. హిందూ మతం పట్ల ఆగ్రహం ఎంతగా ఉన్నప్పటికీ ఆ మతాన్ని ఆయన వ్యతిరేకించలేదు. హిందుత్వకు ఆయన ప్రతికూలం కాదు. ఇస్లామిక్, క్రైస్తవ మత పెద్దలు తమ మతం స్వీకరించేలా అంబేడ్కర్‌ను ప్రభావితం చేసేందుకు ఎంతగా ప్రయత్నించినప్పటికీ పరాయి సీమలలో ప్రభవించిన ఆ మతాలలో దేనినీ ఆయన స్వీకరించలేదు.

పేద కుటుంబంలో జన్మించిన అంబేడ్కర్ బాల్యంలోనే అనేకానేక సామాజిక, ఆర్థిక కష్టాలను ఎదుర్కొన్నారు. అయితే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యాన్ని ఆయన విడనాడలేదు. కష్టనష్టాలన్నిటినీ చాలా ధైర్యంగా అధిగమించారు. తల్లిదండ్రులకు ఆయన 14వ బిడ్డ. తండ్రి ఆ బిడ్డను ఉత్తమ సంస్కారిగా తీర్చిదిద్దారు. తుకారామ్, జ్ఞానేశ్వర్, రవిదాస్ ప్రబోధాలను వివరించి చెప్పేవారు. రామాయణ, మహాభారత గాథలను బాల అంబేడ్కర్ తన తండ్రి నుంచే విన్నారు. 1908లో ఎల్ఫిన్ స్టోన్ ఉన్నత పాఠశాల నుంచి మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణుడయ్యారు. ఎల్ఫిన్ స్టోన్ కళాశాలలో ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రంను ఆయన అభ్యసించారు. 1912లో బాంబే విశ్వవిద్యాలయం నుంచి ఆయన బిఏ డిగ్రీ పొందారు. మహారాజా బరోడా ఇచ్చిన ఉపకార వేతనంతో ఉన్నత విద్యాభ్యాసానికై కొలంబియా విశ్వవిద్యాలయానికి వెళ్లారు. 'పురాతన భారతీయ వాణిజ్యం' అన్న అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని రచించడం ద్వారా 1915లో ఆ ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఆ తరువాత ఆ వర్శిటీలోనే 'ది ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ: ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్' అన్న అంశంపై పరిశోధన చేసి పట్టా పొందారు. 1920లో లండన్ విశ్వవిద్యాలయం ఆయనకు డిఎస్‌సి ప్రదానం చేసింది. తరువాత జర్మనీలోని బాన్ విశ్వవిద్యాలయంలో తన అధ్యయనాలు, పరిశోధనలను ఆయన కొనసాగించారు. ఆ కాలంలో కొలంబియా (అమెరికా), లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ బాన్ నుంచి డిగ్రీలు, డాక్టొరేట్ పొందిన ఏకైక భారతీయ రాజకీయవేత్త అంబేడ్కర్ మాత్రమే. 'అధ్యయనం, పోరాటం' అన్న సూత్ర స్ఫూర్తితో మేధో ప్రపంచంలో తనకొక అనితరసాధ్యమైన స్థానాన్ని సాధించుకున్న మహా మేధావి అంబేడ్కర్.

అణగారిన కులాల వారి సాధికారత, విముక్తికి విద్య, రాజకీయ ప్రాతినిధ్యం అత్యంత ఆవశ్యకాలని డాక్టర్ అంబేడ్కర్ భావించారు. సామాజిక న్యాయం గురించిన తన దార్శనికతలో ఆయన ఈ అంశానికి అగ్ర ప్రాధాన్యమిచ్చారు. ప్రజాస్వామ్య భావన, ఆదర్శాలను ఆయన సంపూర్ణంగా విశ్వసించారు. ఉన్నతాదర్శాల సాధనకు సాయుధ పోరాటం అవసరమని ఆయన భావించలేదు. సహ జీవన సూత్రాన్ని ఆయన పరిపూర్ణంగా విశ్వసించారు. అన్నికులాల, మతాల ప్రజలను సమభావంతో గౌరవించాలన్న ఆదర్శాన్ని పాటించారు. అణగారిన, వెనుకబడిన వర్గాల వారి విముక్తికి విద్య ఒక సాధనమని ఆయన నొక్కి చెప్పుతుండేవారు. ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా కుల వివక్ష, సామాజిక అసమానతల కారణంగా చారిత్రకంగా చదువు సంధ్యలకు నోచుకోని బడుగు వర్గాల వారికి సంపూర్ణ విద్యావకాశాలు కల్పించాలని ఆయన సదా కోరేవారు. సహానుభూతి, న్యాయం, సామాజిక సమానత్వం భావాలను ప్రతి ఒక్కరూ మనసా వాచా కర్మణా అనుసరించాలని ఆయన కోరేవారు. మేధో



శక్తులను పరిపూర్ణంగా వికసింప చేసుకోవడమే మానవ అస్తిత్వ అంతిమ ధ్యేయంగా ఉండాలని ఆయన అభిలషించేవారు. మహిళా సాధికారతకు ఆయన ఎనలేని కృషి చేశారు. 'ఒక సామాజిక సమూహం అభ్యున్నతిని, ఆ సమూహానికి చెందిన మహిళలు సాధించిన పురోగతి ప్రాతిపదికన చూడాలని' అంబేడ్కర్ సదా అంటుండేవారు.

జాతీయ ఐక్యత, సమగ్రతపై అంబేడ్కర్ ఆలోచనలను గుర్తు చేసుకోకపోతే మనం ఆయనను అగౌరవపరిచిన వారమవుతాం. ఒక జాతి అభ్యున్నతి, సుస్థిరతకు సమైక్యత, సమగ్రతలు పునాదులని ఆయన భావించారు. ప్రతి వ్యక్తికి సమాన హక్కులు, అవకాశాలు ఉండే సమాజాన్ని మనం నిర్మించుకోవాలని ఆయన కోరేవారు. సామాజిక సామరస్యం, పరస్పర గౌరవం సంఘ జీవనంలో చాలా ముఖ్యమని ఆయన నొక్కి చెప్పుతుండేవారు. మన కార్మిక చట్టాల పరిణామంలో అంబేడ్కర్ పాత్ర విశిష్టమైనది. ఆయన దార్శనికత, కృషి కారణంగానే సమాన వేతనాలు, బాల కార్మికతపై నిషేధం మొదలైన నిబంధనలను రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది. స్వతంత్ర భారతదేశ ప్రథమ న్యాయశాఖ మంత్రిగా ఫ్యాక్టరీల చట్టం, కనీస వేతనాల చట్టం, పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టం ఇత్యాది ప్రగతిశీల శాసనాలను తీసుకువచ్చారు. కార్మిక హక్కుల సాధనకు, పారిశ్రామిక పురోగతికి అవి ఇప్పటికీ ఇతోధికంగా దోహదం చేస్తున్నాయి.

సమాజంలోని బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు, దేశ సమైక్యతను కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య సంప్రదాయాలు, లౌకిక వాద విలువలు, రాజ్యాంగ బద్ధ విధానాలకు మనం కట్టుబడి ఉండాలని అంబేడ్కర్ గట్టిగా వాదించేవారు. వైవిధ్యమనేది విభేదాలకు కాకుండా సమైక్యపరిచేదిగా ఉంచే సమ్మిళిత, బహుళత్వ సమాజాన్ని నిర్మించుకోవాలని ఆయన అభిలషించారు. సమాజంలోని కొన్ని వర్గాల వారి పట్ల అమానుషమైన వివక్షను చూపడాన్ని తీవ్రంగా ఖండించారు. అంటరానితనం అనేది నైతిక నేరమేగాక సామాజిక పురోగతికి, దేశ సమైక్యతకు తీవ్ర అవరోధమని ఆయన గర్హించేవారు. అస్పృశ్యతను సంపూర్ణంగా రూపుమాపాలని, ఇందుకు చట్టపరమైన చర్యలతో పాటు సాంఘిక సంస్కరణలు అవసరమని ఆయన భావించారు. ఆయన నిరంతర కృషి వల్లే 1936లో దేవాలయాలలో ప్రవేశానికి అస్పృశ్యులకు చట్టబద్ధమైన అనుమతి లభించింది. అంబేడ్కర్ తన ప్రముఖ గ్రంథమైన 'ఎనిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్'లో దళితుల హక్కుల గురించి గట్టిగా వాదించారు. కుల వ్యవస్థను పూర్తిగా రద్దు చేయవలసిన అవసరం గురించి స్పష్టంగా చెప్పారు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ భారతీయ సమాజంలో తీవ్ర అసమానతలకు ఎలా కారణమవుతుందో ఎత్తి చూపారు. అసమానతలు, వివక్షను ప్రోత్సహించడమే కాకుండా వ్యక్తి స్వేచ్ఛకు, జాతీయ వికాసానికి కుల వ్యవస్థ కారణమవుతుందని అంబేడ్కర్ సహేతుకంగా నిరూపించారు.

స్వతంత్రభారతదేశ ప్రజాస్వామిక సంస్థల పురోగతికి డాక్టర్ అంబేడ్కర్ ఆదర్శాలు, కృషి విశేషంగా తోడ్పడుతున్నాయి. ఆయన ప్రతిపాదనలు దేశ సామాజిక-రాజకీయ పరిస్థితులలో మౌలిక మార్పులకు దారి తీశాయి. ఆర్థిక, న్యాయ శాస్త్రాలలో ఆయన అపార పాండిత్యం, సాంఘిక సంస్కరణలను తీసుకురావడంలో ఆయన కృషి మనకు పేదరికం-అసమానతల నిర్మూలనలో మార్గదర్శకాలు. మరింత సమ్మిళిత, దయాశీల సమాజాన్ని నిర్మించుకోవలసిన అవసరాన్ని అంబేడ్కర్ జీవితం మనకు సదా గుర్తు చేస్తుంటుంది.

నేడు డాక్టర్ అంబేడ్కర్ జయంతి. ఆయనకు మన కృతజ్ఞతను వ్యక్తం చేయవలసిన సందర్భమిది. అంతే కాదు ప్రజాస్వామిక, లౌకిక, సమ్మిళిత జాతి నిర్మాణం విషయమై మన నిబద్ధతను పునరుద్ఘాటించాల్సిన సమయమిది. అటువంటి సమాజంలో మాత్రమే దేశ పౌరులందరికీ ప్రాథమిక హక్కులు, సామాజిక న్యాయం, సమానవకాశాలు దక్కుతాయని, ప్రజల మధ్య శాంతి సామరస్యాలు వర్ధిల్లుతాయనే సత్యాన్ని మనం విస్మరించకూడదు. డాక్టర్ అంబేడ్కర్ కేవలం దళితుల నాయకుడు మాత్రమేకాదు, 140 కోట్ల మందికి పైగా భారతీయుల నాయకుడు. అంబేడ్కర్ ఆలోచనల విస్తృతి, విశాలత మన రాజ్యాంగంలో పూర్తిగా ప్రతిబింబించాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు ఎంతో మంది ఆర్థిక స్తోమత లేక పాఠశాల విద్య మధ్యలోనే ఆపివేయడం జరుగుతోంది. వారి విద్యాభ్యాసానికి మనం తోడ్పడవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రవర్తించాలని ఆయన జీవితమూ, ఆదర్శాలు మనకు నేర్పుతున్నాయి. బాధ్యతాయుత పౌరులుగా ప్రవర్తించని పక్షంలో 2047 సంవత్సరం నాటికి సమ్మిళిత వికసిత్ భారత్‌ను నిర్మించుకోలేము. సామాజిక అస్తిత్వాలపై మనలో ఎటువంటి దురభిప్రాయాలు ఉండకూడదు. వికసిత భారత నిర్మాణానికి అదే మొదటి అడుగు.

○ బండారు దత్తాత్రేయ

హర్యానా రాష్ట్ర గవర్నర్

(నేడు అంబేడ్కర్ జయంతి)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 14 ఏప్రిల్ 2024



కనకదుర్గమ్మ వారధి వద్ద..



పాత బస్టాండ్ వద్ద..

నగరాన్ని అస్తవ్యస్తం చేశారు.. అష్టదిగ్బంధనం చేశారు.. చక్రబంధంలో ఇరికించారు.. వ్యాపారాలు మూయించారు.. విద్యుత్‌ను నిలిపివేయించారు.. చెట్లు నరికించారు.. ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి రాకపోకలను నిలువరించారు. షరామామూలుగానే శనివారం నాటి సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర నగరవాసికి నరకం చూపించింది. ప్రధాన మార్గాలను బారికేడ్లతో మూసేయడం, సీఎం యాత్ర ఎప్పుడో సాయంత్రం అయితే, ఉదయం నుంచే చిరు వ్యాపారులను మూసివేయించడం, కీలక మార్గాల్లో చెట్లను నరికివేయించడం వంటి ఘటనలు ప్రజాగ్రహానికి గురయ్యాయి.

యాత్ర.. యాతన

నగరంలో చుక్కలు చూపించిన సీఎం జగన్ బస్సు యాత్ర



రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ అష్టదిగ్బంధనం



బందరు రోడ్డులో రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు

విజయవాడ-ఆంధ్రజ్యోతి/పాయకాపురం/వన్‌టౌన్ : సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' యాత్ర ఏమో గానీ, నగరం మొత్తం అస్తవ్యస్తమైపోయింది. ఆయన యాత్ర బయల్దేరిన ప్రతిచోటా జనాలను చిక్కుల్లో పడేశారు. ముఖ్యంగా నగరం మొత్తాన్ని ట్రాఫిక్ చక్రబంధంలోకి నెట్టేశారు. ఓవైపు ట్రాఫిక్‌తో నగరవాసులకు ముచ్చెమటలు పడితే, మరోవైపు వ్యాపారాల మూసివేతతో వ్యాపారస్తులకు చుక్కలు చూపించారు. జగన్ నగరంలోకి ప్రవేశించడానికి ముందే ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. వాహనదారులు ఎక్కువగా రాకపోకలు సాగించే మార్గాల్లో జగన్ యాత్ర సాగింది. అలాంటి కీలక మార్గాలను పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. దీంతో వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెహ్రూ వంతెన నుంచి పశువుల ఆసుపత్రి జంక్షన్, కార్మేల్ రోడ్డు, శిఖామణి సెంటర్ మీదుగా సీఎం యాత్ర సాగింది. సీతారామపురం జంక్షన్ నుంచి ఎంజీ రోడ్డుకు వచ్చేవారు కార్మేల్ రోడ్డును ఎక్కువగా ఉపయోగిస్తారు. శిఖామణి సెంటర్ వద్ద, నైస్‌బార్ జంక్షన్ వద్ద బారికేడ్లను అడ్డుగా పెట్టడంతో వాహనదారులు మొగల్రాజపురంలోని మధు గార్డెన్స్ నుంచి వెళ్లాల్సి వచ్చింది. జగన్‌కు స్వాగతం పలకడానికి వైసీపీ నేతలు ఆటోల్లో జనాన్ని భారీగా తరలించారు. ఇలా వచ్చిన ఆటోలు, వాహనాలు రోడ్డుపై ఇష్టానుసారంగా నిలుపుదల చేశారు. దీంతో ట్రాఫిక్ చిక్కులు మరింత ఎక్కువయ్యాయి. ప్రైవేట్ పార్కింగ్ ప్రదేశాల్లో ఈ వాహనాలను నిలుపుదల చేశారు. ఫలితంగా అక్కడ వాహనాలను నిలుపుకోవాల్సిన వారు ఇబ్బందులు పడ్డారు.

నరకయాతన అనుభవించిన వాహనదారులు, వ్యాపారులు

- అంతర్గత రహదారులకు అడ్డుగా బారికేడ్లు
- చాలాచోట్ల వాహనాల రాకపోకలు నిలుపుదల
- ఫలితంగా నగరమంతా అష్టదిగ్బంధనం
- బందరురోడ్డు, ఏలూరురోడ్డులో ఒకటే ట్రాఫిక్
- వారధిపై కిలోమీటర్లకొద్దీ నిలిచిన వాహనాలు
- సాయంత్రం నుంచి సాగిన జగన్ యాత్ర
- ఉదయం నుంచే చిరువ్యాపారాలు బంద్

ఉదయం నుంచే దుకాణాలు మూత

సీఎం జగన్ తన బస్సులో శనివారం సాయంత్రానికి నగరంలోకి వచ్చారు. అయితే, చాలా ప్రాంతాల్లోని వ్యాపారాలను శనివారం మధ్యాహ్నం నుంచి మూయించేశారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణే ఘంటసాల ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల సెంటర్. ఈ వీధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారాలను ఉదయం నుంచి మూయించారని వ్యాపారులు గొల్లుమన్నారు. సీఎం బస్సు యాత్రకు, వ్యాపారాలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. కార్మేల్ రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ మార్గంలో ఉన్న వ్యాపారులు స్వచ్ఛందంగా మూసుకోవాల్సి వచ్చింది.

చీకట్లో యాత్ర

జగన్ బస్సుయాత్ర పలు ప్రాంతాల్లో చీకట్లోనే సాగింది. యాత్ర సాగుతున్న ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. సత్యనారాయణపురంలోని కొత్త వంతెన నుంచి ముత్యాలంపాడు వరకు చీకట్లోనే యాత్ర చేపట్టారు. అజిత్‌సింగ్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి. దీనిపై సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడిగా ట్రోల్స్ నడిచాయి. వేసవి కావడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సాంకేతికలోపం కారణంగా ఇలా జరిగిందా, లేక విద్యుత్ శాఖ సిబ్బంది ముందస్తు చర్యగా నిలుపుదల చేశారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. అయితే, సీఎం బస్సు టాప్‌పై నిలబడి ప్రజలకు అభివాదం చేస్తున్నారని, మధ్యలో ఎక్కడైనా విద్యుత్ తీగలు తగిలే అవకాశం ఉండటం వల్లే ముందస్తుగా సరఫరా నిలుపుదల చేశారని కొందరు చెబుతున్నారు.

ఉద్వేగభరితం

నిజం గెలవాలంటూ భువనేశ్వరి పదునైన ప్రసంగం



తిరువూరులో సభకు విచ్చేసిన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న భువనేశ్వరి

- తిరువూరులో ముగింపు సభ విజయవంతం
- మాటల తూటాలతో ప్రభుత్వంపై నిప్పులు
- భువనేశ్వరి మాటలకు దద్దరిల్లిన సభా ప్రాంగణం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/తిరువూరు) : మాటల తూటాలు.. విమర్శల అస్త్రాలు.. పదునైన ప్రసంగాలు.. తిరువూరులో శనివారం జరిగిన 'నిజం గెలవాలి' బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రసంగం ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అన్న క్యాంటీన్ల నిలిపివేత.. ప్రజావేదిక కూల్చివేత.. రాజధాని అమరావతి వంటి అంశాలను ఆమె ప్రస్తావించినప్పుడు సభా ప్రాంగణంలో కూర్చున్న మహిళల నుంచి విశేష స్పందన వచ్చింది. ప్రాంగణమంతా చప్పట్లతో మార్మోగిపోయింది. వైసీపీ ప్రభుత్వంపై విమర్శలతో పాటు చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధిని ఆమె సోదాహరణంగా వివరించారు. విజన్-2020 పేరుతో ఐటీ రంగాన్ని రాష్ట్రానికి తీసుకురావాలని చంద్రబాబు సంకల్పిస్తే కొందరు ఎద్దేవా చేశారని, అలాంటి ఐటీ వల్లే నేడు ఎన్నో కుటుంబాలు దర్జాగా బతుకుతున్నాయన్నారు. రాజధాని అమరావతిని వైసీపీ పెద్దలు ఎలా నాశనం చేశారో చెబుతూ.. మూడు రాజధానులంటున్న ప్రబుద్ధులు చివరికి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని దుయ్యబట్టారు.

విజయవంతంగా..

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమం తిరువూరులో విజయవంతంగా ముగిసింది. తిరువూరు పట్టణంలో శనివారం సాయంత్రం జరిగిన ఈ సభకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు జిల్లావ్యాప్తంగా మహిళలు భారీగా రావడంతో సుమారు 30 వేల సీటింగ్ సామర్థ్యంతో ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో పలువురు మహిళలు రోడ్డుపైనే నిలిచిపోయారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని ఆధ్వర్యంలో ముగింపు సభ ఏర్పాట్లు చేశారు. తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట టీడీపీ నాయకులను సమన్వయం చేసుకుంటూ ముగింపు సభను విజయవంతం చేయడంలో సక్సెస్ అయ్యారు. సభకు అశేషంగా హాజరైన మహిళలను చూసి భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు.

పరామర్శలు

సభకు ముందు భువనేశ్వరి తిరువూరు నియోజకవర్గంలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతిచెందిన కుంచం సుబ్బారావు, కాకర్ల విశ్వనాథం కుటుంబాలను పరామర్శించారు. అనంతరం సభా ప్రాంగణానికి చేరుకుని తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె తన ప్రసంగంలో చంద్రబాబు అరెస్టు క్రమాన్ని వివరించినప్పుడు మహిళలు కంటతడి పెట్టారు. నిజం గెలవాలి కార్యక్రమాన్ని ఏ ఉద్దేశంతో ప్రారంభించారో వివరించినప్పుడు మహిళల నుంచి భారీ స్పందన వచ్చింది. దేవాలయం లాంటి అసెంబ్లీలో తనకు జరిగిన అవమానాన్ని భువనేశ్వరి వివరించారు.

నేడు, రేపు బస్సుల్లేవ్..!

- గుడివాడ సిద్ధం సభకు 1,200 ఆర్టీసీ బస్సులు
- భీమవరం సిద్ధం సభకు మరో 1,200
- స్థానిక డిపోలవారీగా కేటాయింపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆది, సోమవారాల్లో ఆర్టీసీ ప్రయాణికులు అవస్థలు పడాల్సిందే. బస్సు యాత్రలో భాగంగా ఆదివారం గుడివాడలో తలపెట్టే 'మేమంతా సిద్ధం' సభకు 1,200, సోమవారం భీమవరంలో తలపెట్టే సభకు మరో 1,200 బస్సులు అద్దెకు తీసుకున్నారు. ఈ బస్సుల్లో సింహభాగం ఎన్టీఆర్ జిల్లా నుంచి 240, కృష్ణాజిల్లా నుంచి 150 బస్సుల చొప్పున తీసుకెళ్తున్నారు. దీంతో ఈ రెండు రోజుల పాటు ప్రయాణికులకు బస్సులు పెద్దగా అందుబాటులో ఉండవు. సిటీ బస్సులనే ఎక్కువగా అద్దెకు ఇచ్చారు. రోజూ రెండు లక్షల మందికిపైగా ప్రయాణికులు విజయవాడ బస్టాండ్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. పీఎన్‌బీఎస్‌కు వచ్చిన వారంతా నగరంలోకి వెళ్లడానికి సిటీ బస్సులనే ఆశ్రయిస్తారు. వీరందరికీ ఈ రెండు రోజులు ఇబ్బందులు తప్పవు. ఈ పరిణామంతో ఆటోవాలాలు పండుగ చేసుకుంటున్నారు. భారీగా చార్జీ వసూలు చేస్తున్నారు.

విమానాశ్రయ నిర్వాసితులతో మరో జగన్నాటకానికి తెరలేపారు. బస్సు యాత్రలో భాగంగా ఆదివారం గన్నవరంలోని తన బస ప్రాంతంలో నిర్వాసితులతో జగన్ సమావేశం కావటానికి అధికార పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. జగన్‌తో సమావేశానికి నిర్వాసితులు అయిష్టత చూపినా.. అతికష్టంమీద పదిమందిని భేటీకి ఒప్పించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు నిర్వాసితుల గోడు పట్టని సీఎం ఎన్నికలు ముందు ముఖాముఖి నాటకానికి తెరలేపడం వెనుక అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.





గన్నవరంలోని ఆర్ఆర్ఆర్ లే అవుట్

మరో జగన్నాటకం

విమానాశ్రయ నిర్వాసితులతో నేడు జగన్ ముఖాముఖి

ఐదేళ్లుగా పట్టించుకోక.. ఎన్నికల ముందు మాయ
నిర్వాసితులు రాబోమంటున్నా బలవంతంగా భేటీ
420 మంది నిర్వాసితులుండగా పదిమందితోనే..
వచ్చేది లేదని తేల్చిచెప్పిన భూములిచ్చిన రైతులు
సీఎం షెడ్యూల్ నుంచి తొలగింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ విమానాశ్రయ అభివృద్ధి కోసం అజ్జంపూడి, బుద్ధవరం, దావాజీగూడేనికి చెందిన దాదాపు 420 మందికి పైగా గూడు వదులుకుని నిర్వాసితులయ్యారు. వీరికి కిందటి టీడీపీ ప్రభుత్వం చిన్న అవుటపల్లిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించాలని నిర్ణయించి 48 ఎకరాలు సేకరించింది. మోడల్ గృహాలను నిర్మించాలనుకుని ప్లాట్లను కేటాయించే సమయానికి ఎన్నికలొచ్చాయి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేసింది. ఆ తర్వాత నిర్వాసితుల ఆందోళనల కారణంగా వారిని మభ్యపెట్టే కార్యక్రమాలు చేపడుతూ వచ్చింది. 'ఇళ్లు మీరే కట్టుకోండి. ఇంటికి రూ.9 లక్షలు రెండు విడతలుగా ఇస్తాం..' అని మభ్యపెట్టింది. ఈ ప్రతిపాదనకు నిర్వాసితులు అయిష్టంగానే ఒప్పుకొన్నారు. కరోనా తర్వాత మెటీరియల్ ధరల పెరుగుదల కారణంగా ఇంటి నిర్మాణ వ్యయం అమాంతం పెరిగింది. ప్రభుత్వం ఇస్తామన్న డబ్బు సరిపోని పరిస్థితి ఏర్పడింది. నిర్వాసితులు ఆందోళన ప్రారంభించగానే, ప్రభుత్వం ఏదో జీవోలను విడుదల చేస్తూ నాటకాలు ఆడింది. అప్పటి వరకు లే అవుట్‌లో కనీసం ప్లాట్లు కూడా కేటాయించని పరిస్థితుల్లో లాటరీ తీశారు. దీంతో నిర్వాసితుల ఆందోళనను కొంతకాలం వరకు ఆపగలిగారు. ఇలా కొంతకాలం కాలక్షేపం చేశారు. విసుగెత్తిన నిర్వాసితులు నిరాహార దీక్షకు దిగటంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేపట్టారు. రిజిస్ట్రేషన్ అయితే చేశారు కానీ, పట్టాలు ఇవ్వలేదు. దీంతో సహనం నశించిన నిర్వాసితులు విమానాశ్రయ మైనర్ ఇరిగేషన్ కాలువను తవ్వేస్తామని కార్యాచరణకు పిలుపునివ్వటంతో పట్టాలు అందజేశారు. కానీ, ఈ ఐదేళ్లలో ఇళ్ల నిర్మాణానికి రూపాయి ఇచ్చింది లేదు. నిర్వాసితులు ఆమరణ దీక్షకు దిగుతామనడంతో మరో జీవోను తెరపైకి తెచ్చారు. ఈలోగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి ఆ ప్రతిపాదన కూడా వెనక్కిపోయింది.

అద్దెలు ఇచ్చిందీ లేదు..

విమానాశ్రయ అభివృద్ధి కోసం ఇళ్లను వదులుకున్న నిర్వాసితులు ఇప్పుడు వేలల్లో అద్దెలు కట్టుకుంటున్నారు. అద్దె డబ్బు చెల్లించాలన్న ఒప్పందం ఉన్నా ప్రభుత్వం ఒక్క రూపాయి ఇచ్చింది లేదు. అద్దెతో పాటు ఇళ్లు కట్టుకోవడానికి డబ్బు ఇవ్వాలని విమానాశ్రయ నిర్వాసితులు ఐదేళ్లుగా పోరాడుతున్నా కనికరం చూపలేదు. ఎన్నికలు రావటంతో మరోమారు మభ్యపెట్టడానికి జగన్ ముఖాముఖి పేరుతో నిర్వాసితులపై మరో కుట్రకు తెరతీశారు. నిర్వాసితులెవరూ జగన్‌తో సమావేశం కావటానికి ఆసక్తి చూపకపోయినా అధికార పార్టీ నేతలు సిద్ధంచేసిన పదిమందితో సమావేశం నిర్వహించనున్నారు.

గన్నవరం రైతుల అనాసక్తి

విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులను కూడా ఆహ్వానించారు. రైతులెవరూ రాబోమని చెప్పటంతో ఈ కార్యక్రమాన్ని షెడ్యూల్ నుంచి

అపరిష్కృతంగా విమానాశ్రయ సమస్యలు

గతంలో టీడీపీ ప్రభుత్వం విమానాశ్రయ అభివృద్ధికి కృషి చేసింది. దాదాపు 700 ఎకరాలను సమీకరించి ఇచ్చింది. ఈ భూములను స్వాధీనం చేసుకున్న ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అనేక అభివృద్ధి పనులను చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక విమానాశ్రయ సమస్యలన్నింటినీ గాలికొదిలేసింది. దీంతో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మలివిడత చర్యలు చేపట్టలేకపోతోంది. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు ఇప్పటివరకు పూర్తికాలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనీసం ఒక్కరోజు కూడా సమీక్ష జరపలేదు.



జోరువాన



ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులపై శనివారం కురిసిన వర్షపు జల్లులు కాస్త ఉపశమనాన్ని కలిగించాయి. నగరవ్యాప్తంగా వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కొన్ని రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

బూడిద తరలింపునకు

అనుమతులిచ్చింది జగనే

» బూడిద, మట్టి తిన్నది వాళ్లే..నిందలు నాపై వేశారు: వసంత

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13: "తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే సోదరుడికి బూడిద తరలించేందుకు జగన్మోహన్‌రెడ్డి అనుమతులు ఇచ్చారు. బూడిదను దోచుకున్నది వాళ్లే నిందలు మాత్రం నాపై వేశారు." అని టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి మైలవరం అభ్యర్థి వసంత వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో బూడిద, మట్టి తిన్నది ఎవరో ప్రజలందరికీ తెలు సునన్నారు. శనివారం జూపూడి, కేతనకొండ, కొటికలపూడి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాగళం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ విధానాలు నచ్చక పార్టీకి దూరంగా ఉన్న సమయంలో ఇబ్రహీంపట్నంలో బూడిద మాఫియా యథా విధిగా నడిచిందన్నారు. బూడిద లోడింగ్ చేసే ఆపరేటర్ వద్దకు వెళ్లి విచారణ చేస్తే ఎవరు మాఫియా చేస్తున్నారో తెలిసిపోతుందన్నారు. బూడిద కాలుష్యంపై ఎదిరించి ప్రశ్నించకుంటే బెదిరించే వాడిదే రాజ్యమవుతుందన్నారు. ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో ప్రజల ఆయుష్షు తరిగిపోతోందన్నారు. బూడిద డబ్బులు మీకు జబ్బులు ప్రజలకా అని వసంత ప్రశ్నించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానన్న సీఎం జగన్ ఆ హామీని తుంగలో తొక్కారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే 70 ఎకరాల్లో ఎన్టీటీపీఎస్ చుట్టూ హరితవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.



వసంతతో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు, నాయకులు

మైలవరం సమగ్రాభివృద్ధే ధ్యేయం: వసంత

» గొల్లపూడిలో ఎన్నికల ప్రచారం..ఘనస్వాగతం పలికిన ప్రజలు

గొల్లపూడి, ఏప్రిల్ 13: మైలవరం నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ప్రజలకు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మైలవరం అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. శనివారం గొల్లపూడిలో టీడీపీ జిల్లా ఉపాధ్య క్షుడు బొమ్మసాని సుబ్బారావుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిం చారు. వసంతకు ప్రతి గడపలోనూ ఆత్మీయ స్వాగతం లభించింది. మహిళలు హార తులు పట్టి బ్రహ్మరథం పట్టారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కూటమి అధి కారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. మే 13న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. వడ్లమూడి జగన్మో హన్‌రావు, నర్రా వాసు, గూడపాటి పద్మశేఖర్, నూతులపాటి వెంకటేశ్వరరావు, బొర్రా తిరుపతిరావు, రంగినేని నరేంద్రబాబు, నూతులపాటి జగన్మోహన్‌రావు, వడ్ల మూడి చలపతిరావు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌లలో నిరాశాజనక ఫలితాలు

» కృష్ణాలో ఫస్టియర్ 37, సెకండియర్ 32 శాతం ఉత్తీర్ణత

» సున్నా శాతం ఉత్తీర్ణత పాఠశాలలు ఫస్టియర్ 4, సెకండియర్ 2

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13: వైసీపీ ప్రభుత్వం వనరులు లేకుండా పాఠ శాలల్లో హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించడంతో కృష్ణాజిల్లాలో ఆశించినంతగా ఫలి తాలు రాలేదు. ల్యాబొరేటరీలు లేకుండా హైస్కూల్ ప్లస్ పాఠశాలలు ప్రారంభిం చడంతో వి ద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని పాఠశాలల్లో జీరో శాతం ఉత్తీ ర్ణత వచ్చింది. జిల్లాలో 23 హైస్కూల్ ప్లస్ పాఠశాలలుండగా మొదటి సంవత్సరం 287 మంది వి ద్యార్థులు పరీక్షలు రాస్తే 106 మంది ఉత్తీర్ణులయ్యారు. 37 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి, ఘంటసాల, గూడూరు మండలం మల్లవోలు, పెడన మండలం చెన్నూరు పాఠశాలల్లో జీరో శాతం నమో దైంది. సెకండియర్ పరీక్షలకు 146 మంది హాజరు కాగా, 48 మంది ఉత్తీర్ణులై 32 శాతం నమోదైంది. 23 పాఠశాలల్లో రెండు పాఠశాలల్లో జీరో శాతం నమోదైంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు బోధించేందుకు సరిపడా లెక్చరర్లు, ల్యాబొ రేటరీలు, వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 25 హైస్కూల్ ప్లస్ పాఠశాలలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది.



అన్నవరంలో ఈనెల 10న వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఐకేపీ సమైక్య అధ్యక్షురాలు ధారావత్ శ్యామల, బుక్ కీపర్ కందుకూరి సుమలత (వృత్తంలో ఉన్న మహిళలు)

విధుల నుంచి ఐకేపీ

సమాఖ్య మండల అధ్యక్షురాలు, బుక్‌కీపర్ తొలగింపు

» అన్నవరంలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్నందుకు చర్యలు

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 13: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా మం డలంలోని అన్నవరం గ్రామంలో వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఐకేపీ సమాఖ్య మండల అధ్యక్షురాలు ధారావత్ శ్యామల, బుక్ కీపర్ కందుకూరి సుమల తను విధుల నుంచి తొలగించినట్లు డీఆర్డీఏ జిల్లా పీడీ శ్రీనివాసరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఈనెల 10న గ్రామంలో నిర్వహించిన వైసీపీ కార్యక్రమంలో శ్యామల, సుమలత పాల్గొన్నారని జగ్గయ్యపేటకు చెందిన రామకృష్ణ ఫిర్యాదు చేశారని, దానిపై సమగ్రంగా విచారణ జరిపి, వారిని తొలగిం చామని ఆయన తెలిపారు. ప్రస్తుత మండల ఉపాధ్యక్షురాలిగా ఉన్న సుబ్బలక్ష్మిని పదోన్నతిపై ఐకేపీ సమాఖ్య మండల అధ్యక్షురాలిగా నియమించామని తెలిపారు. అన్నవరం గ్రామంలో పనులు సజావుగా సాగేందుకు బుక్‌కీపర్‌గా అర్చన గ్రామ సంఘం వీఏవో మాధవికి అదనపు బాధ్యతలు అప్పగించామని తెలిపారు.

17న కోనేరు సెంటర్‌లో

చంద్రబాబు, పవన్ బహిరంగసభ

» విజయవంతం చేయాలని కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13: కోనేరుసెంటర్‌లో ఈనెల 17న సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న ప్రజాగళం బహిరంగ సభను విజయ వంతం చేయాలని ప్రజలను టీడీపీ-జనసేన-బీజేపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజ కవర్గ అభ్యర్థి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. పోతేపల్లిలో మీడియాతో కొల్లు రవీంద్ర మాట్లాడారు. బహిరంగ సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబు నాయుడుతో పాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఏడుగురు జనసేన సమన్వయకర్తల నియామకం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13: టీడీపీ, బీజేపీలతో జనసేన సమన్వయంతో పని చేసేందుకు కూటమి మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి సూచనల మేరకు నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు ఏడుగురు సమన్వయకర్తలను పార్టీ నియమించినట్టు జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తెలిపారు. శనివారం జనసేన అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవనిగడ్డ నియోజకవర్గానికి చిలకలపూడి పాపారావు, పెనమలూరుకు బాడిత శంకర్, పెడ నకు బోనె పార్వతి, గుడివాడ అజయ్‌వర్మ, గన్నవరానికి అక్కల గాంధీ, మచిలీ పట్నం బండి రామకృష్ణ, పామర్రు పంచకర్ల సందీప్‌లను పార్టీ నియమించిందని ఆయన తెలిపారు.



గుడివాడలో వైసీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు మౌలాలికి కండువా కప్పి టీడీపీలో చేర్చుకుంటున్న వెనిగండ్ల రాము



వడ్లమన్నాడులో వెనిగండ్ల రాము సమక్షంలో టీడీపీలో చేరుతున్న గరికపాటి కుటుంబం, అనుచరులు

వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన గుడివాడ, మచిలీపట్నం మైనార్టీ నేతలు

ఎన్నికల్లోపు గుడివాడలో వైసీపీ ఖాళీ: వెనిగండ్ల

గుడివాడ: "వైసీపీకి కంచుకోటలైన లింగవరం, జొన్నపాడు, వడ్ల మన్నాడు, గుడివాడలో ఆ పార్టీ కీలక నేతలు టీడీపీలో చేరుతున్నారు. ఎన్నికల్లోపు గుడివాడలో వైసీపీ ఖాళీ అవుతుంది. నిబద్ధత గల మైనార్టీ సీనియర్ నాయకుడు షేక్ మౌలాలి పార్టీలో చేరడం శుభపరిణామం." అని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. శనివారం 11వ వార్డులో ఎన్నికల ప్రచారంలో మౌలాలిని కండువా కప్పి ఆయన టీడీపీలో చేర్చుకున్నారు. నాని పచ్చి మోసగాడు. అవసరం తీరాక వదిలేయడంలో ఆరితేరిన వ్యక్తి అని రాము ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గ ప్రజలు ఇరవై ఏళ్లు మోసపోయారని, ఇక మోసపోరని, రాజకీయ నాయకులు, ప్రజలు కూటమికి పట్టంకట్టాలని నిర్ణయానికి వచ్చారని రాము తెలిపారు.

వైసీపీలో భజన కొట్టే వారికే విలువ: మౌలాలి

పదేళ్ల నుంచి వైసీపీలో పనిచేస్తున్నానని, మైనార్టీల అభ్యున్నతికి ఎంపీ బాలశౌరి కృషి చేశారని మౌలాలి తెలిపారు. అంజుమన్ భవన నిర్మాణానికి ఎంపీ లాడ్స్ నుంచి రూ.20 లక్షలు సమకూర్చారన్నారు. షాదీఖానా నిర్మాణానికి రూ.కోటి సమకూరుస్తానని హామీ ఇచ్చారన్నారు. వైసీపీ వ్యవహారాలన్నీ నాని ముఖ్య అనుచరుడు శశి కనుసన్నల్లోనే జరుగుతాయని, ఆ పార్టీలో భజన కొట్టేవారికి విలువనిస్తారని ఆరోపించారు. వైసీపీలో ఎంతలా కష్టపడ్డానో వెనిగండ్ల గెలుపునకు రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, షేక్ ఇబ్రహీం, షేక్ జానీ, సయ్యద్ జబీన్, షేక్ ముజాహిద్, కరీముల్లా, పట్టపు చిన్నా పాల్గొన్నారు.

వడ్లమన్నాడులో టీడీపీలో చేరిన

గరికపాటి కుటుంబం, అనుచరులు

గుడ్లవల్లేరు: వడ్లమన్నాడులో వైసీపీ సీనియర్ నాయకుడు గరికపాటి గోపాలస్వామి(గోపి), వైస్ సర్పంచ్ గరికపాటి రాంబాబు, వారి సోదరుల కుటుంబసభ్యులు, అనుచరులు పెద్ద సంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి వెనిగండ్ల రాము కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శేరికల్వపూడి, జొన్నపాడు, వడ్లమన్నాడు ఇలా రోజుకో ఊరు నుంచి వైసీపీని నాయకులు వీడుతున్నారని ఆయన అన్నారు. ఈసారి గుడివాడలో టీడీపీ జెండా రెపరెపలాడుతుందని రాము అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, శాయన పుష్పావతి, బెల్లంకొండ ఏడుకొండలు, కొడాలి రామరాజు, పెన్నేరు రమేష్, జంగం మోహనరావు, తూము పద్మజ, పి.కన్నెబాస్కరరావు, సత్తార్, పామర్తి సత్తిబాబు, ఈడే కృష్ణ, మన్నెం నరసింహారావు, పెద్దిరాజు, వీరన్న పాల్గొన్నారు.



షేక్ జలీల్‌ను టీడీపీలో చేర్చుకుంటున్న చంద్రబాబు

పేర్ని అనుచరుడు జలీల్ టీడీపీలోకి..

మచిలీపట్నం టౌన్: పేర్ని నాని కన్నా ముందునుంచి వైసీపీలో ఉన్న మైనారిటీ నాయకుడు షేక్ జలీల్ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో చంద్రబాబు సమక్షంలో పాతికమంది మైనార్టీ నాయకులతో కలిసి శనివారం టీడీపీలో చేరారు. జలీల్‌కు చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ప్రారంభంలో వైసీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా పనిచేసిన జలీల్ ప్రస్తుతం జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్నారు. జలీల్ మచిలీపట్నంలో రాజకీయంగా పట్టున్న నాయకుడు. చాలాకాలంగా పేర్ని నాని వెంట ఉంటున్నారు. ఆయనతో పాటు నజీర్ అహ్మద్, మా అబ్బాస్, బషీర్ అహమ్మద్, అప్సర ఐస్క్రీం మహమ్మద్ అలీ, ఆరీఫ్, ఆది సుమన్, అమీర్, ఖదీర్, ఖాదర్ పార్టీలో చేరారు.

పేర్ని నానివి కల్లబొల్లి మాటలు: షేక్ జలీల్

"పేర్ని నానివి కల్లబొల్లి మాటలు. ఆయన మాటలు నమ్మి చాలామంది మోసపోయి ఆస్తులను పోగొట్టుకున్నారు. ముందు నుంచి పార్టీలో ఉన్నా నాకు రాజకీయంగా ప్రాధాన్యమిస్తామని ఇవ్వలేదు. అన్నీ మౌనంగా భరించాను. భవిష్యత్తులో బందరు అభివృద్ధి చెందాలంటే కొల్లు రవీంద్ర వెంట ఉండటం మంచిదని టీడీపీలో చేరాను" అని జలీల్ తెలిపారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన

వైసీపీ మొవ్వ నేతలు, కార్యకర్తలు

కూచిపూడి: ఏఎంసీ మాజీ చైర్మన్, వైసీపీ నేత, మొవ్వ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, మొవ్వ గ్రామానికి చెందిన మండవ రత్నగిరిరావుతోపాటు పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు చంద్రబాబు సమ క్షంలో టీడీపీలోకి చేరారు. వీరందరికీ కండువా కప్పి చంద్ర బాబు పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా, నన్నపనేని వీరేంద్ర, తాతినేని పూర్ణచం ద్రరావు, మండవ వెంకటేశ్వర రావు, మండవ శ్రీకృష్ణ, ఈడే నాగే శ్వరరావు, లింగమనేని రామలింగేశ్వరరావు ఉన్నారు.



మండవ రత్నగిరిరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

రాష్ట్రాన్ని నాశనం చేసిన దుర్మార్గుడు జగన్

తిరువూరు 'నిజం గెలవాలి' బహిరంగ సభలో కేశినేని చిన్ని విమర్శ

తిరువూరు, ఏప్రిల్ 13: "ఒక్క చాన్స్ అంటూ ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన దుర్మార్గుడు. ప్రజలు మరో అవకాశం ఇవ్వరని జగన్‌కు తెలుసు. ఆ దుర్మార్గుడికి ఒక్క చాన్స్ ఇచ్చినందుకు రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారు. ఆ పొరపాటును సరిదిద్దుకునేందుకు వారంతా ఎదురుచూస్తున్నారు." అని టీడీపీ-జనసేన -బీజేపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివ నాథ్(చిన్ని) అన్నారు. శనివారం పట్టణంలో నారా భువనేశ్వరి పాల్గొన్న నిజం గెలవాలి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నిజం, జగన్మోహనరెడ్డి అబద్ధం అన్నారు. ఈ నియోజకవర్గంలో భువనేశ్వరి రెండు రోజులు పర్యటించటం అదృష్టమన్నారు. నిజాయితీపరుడైన చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడంతో 203 మంది టీడీపీ కార్యకర్తలు మరణిస్తే, వారి కుటుంబాలను భువనమ్మ పరామర్శించారని, వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారని అన్నారు. రాష్ట్రంలో ఎటువంటి ఇబ్బంది వచ్చినా తక్షణం ఆదుకునేది ఎన్టీఆర్ ట్రస్టు ఒక్కటేనని అటువంటి ట్రస్టును నడుపుతున్న మహోన్నత వ్యక్తి భువనమ్మ అని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థుల గెలుపుతోనే నిజం గెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ నాయకులు కార్యకర్తలు పనిచేయాలని ఎన్టీఆర్‌జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ పిలుపునిచ్చారు. చంద్రబాబుపై పెట్టిన స్కిల్ డవలప్‌మెంట్ కేసులో ఆధారాలు చూపించలేక ఫైళ్లు తగలబెట్టారని అన్నారు. జనసేన తిరువూరు ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల సంగ్రామంలో అవినీతి రాక్షస పాలనను అంతమొందించేందుకు జనసైనికులంతా పని చెయ్యాలన్నారు. కూటమి తిరువూరు అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన తిరువూరులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఈ ప్రాంత ప్రజలు తాగునీరు లేక కన్నీరు తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి విజయంతో అమరావతి రాజధాని అవుతుందని తిరువూరు ప్రాంతంలో విద్యా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తాను కృషి చేయడంతో పాటుగా, సాంకేతిక ఉన్నత విద్యా అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సభల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశినేని చిన్ని

'నిజం గెలవాలి'తో మృతుల కుటుంబాలకు ఆత్మస్థైర్యం: పంచుమర్తి అనురాధ

చంద్రబాబు అరెస్టును తట్టుకోలేకి మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను తన కుటుంబాలుగా భావించి వారిని ఓదార్చి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర చేశారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. ఈ యాత్ర బాధిత కుటుంబాలతో పాటుగా ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెంచిందన్నారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా మద్యం గంజాయికి యువతను బానిసలుగా చేసిందని ఆమె ఆరోపించారు. మహిళలను మహాశక్తులుగా మార్చి కష్టాల్లో ఉన్న పార్టీని కార్యకర్తల్ని కాపాడుకునేందుకు భువనేశ్వరి చేపట్టిన యాత్ర నారీలోకానికి స్ఫూర్తిదాయకం అని తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ నియోజకవర్గంలో మృతిచెందిన కార్యకర్తల కుంటుంబాలను పరామర్శించి, ఆదుకున్న భువనేశ్వరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కాపునాడు సమావేశం వద్ద తోపులాట

» బందరు సువర్ణ కల్యాణ మండపంలో కాపునాడు పేరుతో పేర్ని నాని బాధితుల సమావేశం

» ఆహ్వానం లేకున్నా సమావేశానికి వెళ్లిన వైసీపీ కార్పొరేటర్లు, కాపు నాయకులు

» ఆహ్వానించకుండా వచ్చారేంటని ప్రశ్నించి, గేటు వద్దే అడ్డుకున్న నిర్వాహకులు

» వైసీపీ నేతలు, నిర్వాహకుల మధ్య తోపులాట..పోలీసుల రంగప్రవేశం..సమావేశం వాయిదా



సువర్ణ కల్యాణమండపం వద్ద గుమికూడిన కాపు సంఘం నాయకులు

మచిలీపట్నం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోంది. బందరు సువర్ణ కల్యాణ మండపం వద్ద నిర్వహిస్తున్న కాపునాడు సమావేశం వద్దకు వచ్చిన వైసీపీ కాపు నాయకులకు, నిర్వాహకులకు మధ్య తోపులాట జరిగింది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పేర్ని నాని బాధితులు, జనసేన, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాపునాడు పేరుతో పరాసుపేట సెంటరులోని సువర్ణ కల్యాణ మండపంలో శనివారం రాత్రి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. వైసీపీకి చెందిన కాపు నాయకులను, కార్పొరేటర్లను ఆహ్వానించలేదు. ఆహ్వానం లేకున్నా, వైసీపీ కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, శీలం బాబ్జీ, పర్ణం సతీష్, పలువురు సర్పంచ్‌లు ఈ సమావేశానికి వచ్చారు. దీంతో సమావేశం ఏర్పాటుచేసిన చలమలశెట్టి జస్వంత్, రాజా, చలమలశెట్టి ఆదికిరణ్ తదితరులు మిమ్మల్ని పిలవలేదు కదా.. మీరెందుకు వచ్చారంటూ గేటువద్దనే ప్రశ్నించి లోపలకు అనుమతించలేదు. వాట్సాప్ గ్రూపులో వచ్చిన సమాచారంతో సమావేశానికి వచ్చామని వైసీపీ నాయకులు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి తోపులాటకు దారితీసింది. వైసీపీ నాయకులు ఈసమావేశం జరగకుండా నిలిపివేసేలా మరింతగా నిర్వాహకులతో వాగ్వివాదాన్ని పొడిగించారు. వైసీపీ నాయకులంతా రోడ్డుకు ఇటు వైపునకు వచ్చేయాలని, ఈ సమావేశం ఎలా నిర్వహిస్తారో చూద్దామని వైసీపీ కార్పొరేటర్లు చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వైసీపీ నాయకులను ఈ సమావేశానికి ఆహ్వానించలేదని నిర్వాహకులు చెబుతున్నారని, మీరు వచ్చి గలాటా చేయడం మంచి పద్ధతి కాదని చెప్పారు. సమావేశానికి నిర్వాహ కులు అనుమతులు తీసుకున్నారా లేదా అని వైసీపీ నాయకులు ఆరా తీయడంతో పోలీసులు తీసుకున్నారని చెప్పారు. పోలీసులు సూచనలతో వైసీపీ నాయకులు వెళ్లిపోయారు. వైసీపీ నాయకులు వెళ్లిపోయాక సమావేశం నిర్వహించకుండానే నిర్వాహకులు వాయిదా వేశారు.

పేర్ని వ్యతిరేక వర్గీయుల నేతృత్వంలో..

ఐదేళ్లుగా ఎమ్మెల్యే పేర్ని నాని వైఖరి కారణంగా భూములు, ఇళ్లస్థలాల వివాదాలు, ఇతరత్రా కారణాలతో పోలీస్ కేసుల్లో బాధితులుగా మారి ఇబ్బందుల పాలైన వారంతా కాపునాడు పేరుతో ఈ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. జనసేన, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీలోని కాపు నాయకులంతా హాజరై ఐదేళ్లలో పేర్ని నాని కారణంగా తీవ్ర ఇబ్బందుల పాలైన 50 మందితో వారు పడిన ఇక్కట్లను, ఆర్థికంగా దెబ్బతీసిన అంశాలను చెప్పించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పేర్నినాని తన వర్గానికి చెందిన కాపు నాయకులను అక్కడకు పంపి సమావేశం జరగకుండా రసాభాస చేశారని ఆ సామాజికవర్గం నాయకులు చెప్పుకొంటున్నారు.

దోషరహితంగా ఈవీఎంల కేటాయింపు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 13: తొలి విడత ర్యాండమైజేషన్ ద్వారా పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ సజావుగా, దోషరహితంగా జరిగిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ ఆధారంగా గొల్లపూడి ఈవీఎం గోదాము వద్ద పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కాగా, శనివారం కూడా ఇది కొనసాగింది. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా ఆర్వోలు, సహాయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ర్యాండమైజేషన్‌లో నియోజకవర్గాలకు అనుసంధానమైన ఈవీఎంలను వేరుచేసి ప్రత్యేక నెంబరింగ్ ఇవ్వడం, స్కానింగ్ చేయడం, బాక్సింగ్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లకు ట్రాన్స్‌పోర్టింగ్, ఇలా ప్రతి దశలోను అప్రమత్తంగా వ్యవహరించామని తెలిపారు. మొత్తం 1,781 పోలింగ్ స్టేషన్లకు 20 శాతం రిజర్వ్‌తో కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, 30 శాతం రిజర్వ్‌తో వీవీ ప్యాట్లను అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో, తూర్పు నియోజకవర్గ ఆర్వో బీహెచ్ భవానీశంకర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పశ్చిమ నియోజకవర్గ ఆర్వో కిరణ్మయి, తిరువూరు ఆర్డీవో కె.మాధవి, నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్వో జి.వెంకటేశ్వర్లు, ఈవీఎం నోడల్ అధికారి జి.మహేశ్వరరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



గొల్లపూడి ఈవీఎం గోదాము వద్ద పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపులను పరిశీలిస్తున్న కలెక్టర్ దిల్లీరావు

1,216 ఫిర్యాదుల పరిష్కారం: దిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 13: ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్(ఎన్‌జీఎస్‌పీ) మార్గాల ద్వారా 1,250 ఫిర్యాదులు రాగా 1,216 ఫిర్యాదుల పరిష్కారం పూర్తైందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ దిల్లీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్ (1950) ద్వారా 195 ఫిర్యాదులు రాగా 195 పరిష్కారమయ్యాయన్నారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా 384 ఫిర్యాదులు రాగా 374 పరిష్కరించినట్లు తెలిపారు. వాట్సాప్ నెంబరు 9154970454 ద్వారా 29 ఫిర్యాదులు రాగా 26, కాల్‌సెంటర్ (0866-2570051) ద్వారా 22 రాగా 22 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీఎంఎస్) ద్వారా 54 ఫిర్యాదులు రాగా 46 పరిష్కరించినట్లు వెల్లడించారు. 62 ప్రతికూల వార్తలకు సంబంధించి ఫిర్యాదులొస్తే 56 పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

● పీవో, ఏపీవోలతో కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక: పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారులు(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో) కీలకమని, మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు సూచించారు. శనివారం నగరంలోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈనెల 13, 14 తేదీల్లో ఇచ్చే శిక్షణను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని, ఏ సందేహమున్నా మాస్టర్ ట్రైనర్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఆర్వో కిరణ్మయి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.96

22 నుంచి స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 13: ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకె)లో ఈనెల 22 నుంచి నెల రోజుల పాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులు నిర్వహిస్తున్నట్లు ఎంబీవీకే కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ యువీ రామరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పోకెన్ ఇంగ్లీషు బోధనలో 20 ఏళ్ల అనుభవంతో పాటు అనేక కార్పొరేట్ సంస్థల్లో సెమినార్లు నిర్వహించిన పాగోలు రాజు నేతృత్వంలో క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 21వ తేదీ లోపు 0866-2578044, 94900 98408 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం

భవానీపురం, ఏప్రిల్ 13 : పశ్చిమ నియోజకవర్గ ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం ఈనెల 15న ఉదయం 8 గంటలకు భవానీపురం దేసు సుబ్బారావు కల్యాణ మండపంలో జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరీ, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)లు హాజరవుతున్నారు. ఆర్యవైశ్యులంతా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భాస్కరరావు కోరారు.

వైభవం కొప్పరపు కవుల ప్రాభవం



మాశర్మకు అభివాదం చేస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, ఏప్రిల్ 13 : తెలుగు సాహిత్య మాఘంలో పద్యాల సిరులను పండించిన కొప్పరపు కవుల ప్రాభవం ఆనాడు ఎంతో వైభవంగా సాగిందని హైదరబాద్‌కు చెందిన మాశర్మ అన్నారు. దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో చైత్రమాస వసంత నవరాత్రోత్సవాల సందర్భంగా జరుగుతున్న ప్రత్యేక సాహిత్య కార్యక్రమాలలో భాగంగా శనివారం కొప్పరపు కవుల కవితా వైభవాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మాశర్మ తన శ్రావ్యమైన కంఠంతో అవధాన ప్రతిభామూర్తులైన కొప్పరపు కవుల గురించి విశదీకరించారు. సుమారుగా 3లక్షలకు పైగా పద్యాలను కొప్పరపు కవులు ఆశువుగా చెప్పారని అంతటి సాహిత్య ప్రజ్ఞాదురీణులు చాలా అరుదన్నారు. సరస్వతీ దేవికి అపూరూపమైన పుత్రులుగా వారు వెలుగొందారన్నారు. అనంతరం మాశర్మను ఈవో కె.ఎస్.రామారావు సత్కరించారు.

యువత భవితను అంధకారం చేసిన జగన్

గద్దె అనురాధ ధ్వజం



12వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో గద్దె అనురాధ

పటమట, ఏప్రిల్ 13 : ప్రతీ ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తానని హామీ ఇచ్చిన జగన్ రాష్ట్రంలో గంజాయి తెచ్చి విచ్చలవిడిగా సరఫరా అయ్యేలా చేసి యువత భవిష్యత్‌ను నాశనం చేశారని జడ్పీ మాజీ చైర్మన్ గద్దె అనురాధ అన్నారు. 12వ డివిజన్ అయ్యప్పనగర్‌లో గొట్టిపాటి బ్రహ్మయ్య వీధిలో జనసేన, బీజేపీ కూటమి బలపర్చిన టీడీపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గద్దె అనురాధ మాట్లాడుతూ జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం సర్వ నాశనం అయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన బలపర్చిన కూటమి అభ్యర్థులను గెలిపించా లన్నారు. పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, నీరజ, మేదరమెట్ల నారాయణ, మాదల చిన్నితల్లి, అబ్దుల్ కరీమ్ పాల్గొన్నారు.



10వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న గద్దె క్రాంతికుమార్

కల్తీ మద్యంతో..

జగన్‌మోహన్‌రెడ్డి మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం రేట్లు విపరీతంగా పెంచి కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ పేదల రక్తమాంసాలతో తన ఖజానా నింపుకుంటున్నారని గద్దె అనురాధ విమర్శించారు. శనివారం సాయంత్రం 13వ డివిజన్ ఎన్‌ఎస్ఎం స్కూల్ కౌండిన్య నగర్ ఏరియాలో గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరుతూ అనురాధ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, పోతంశెట్టి నాగేశ్వరరావు, గద్దె ప్రసాద్, రాజేశ్వరి, వీరంకి డాంగే కుమారి, శొంఠి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవాడకు చేసింది శూన్యం

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో విజయవాడ నగరాభివృద్ధిని అసలు పట్టించుకోలేదని జగన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని నగరానికి వచ్చాడని గద్దె రామ్మోహన్ తనయుడు క్రాంతికుమార్ ప్రశ్నించారు. 10వ డివిజన్‌లో భద్రయ్య నగర్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవినేని అపర్ణ, గోపిచందు, పొన్నం శ్రీనివాస్, బొర్రా రవీంద్రబాబు, చలసాని వాసు, నాగమణి, మార్త సూర్యకుమారి పాల్గొన్నారు.

ఒక్క అవకాశంతో విధ్వంసం

జగన్ ఒక్క అవకాశం ఇవ్వమని ప్రజల ఓట్లతో గద్దె నెక్కి, తన నైజాన్ని బయటపెట్టి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని గద్దె క్రాంతికుమార్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని క్రాంతి, హేమాన్షులు 11వ డివిజన్ హైస్కూల్ రోడ్డు, గోల్డెన్ టవర్స్ ఏరియాల్లో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కోనేరు రాజేష్, పాశం సుజాత, నాగమణి, దేవరపల్లి అంజనేయులు, పాలడుగు ప్రసాద్ పాల్గొన్నారు.



ఓపెన్ చేసిన యూజీడీ మూత వద్ద హెచ్చరికగా నిలబెట్టిన కర్ర

జమ్మిచెట్టు ఏరియా జలమయం

మొగల్రాజపురం, ఏప్రిల్ 13 : మొగల్రాజపురం జమ్మి చెట్టు సెంటర్ జలమయం అయింది. శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై కొద్ది సేపు కురిసింది. సీఎం జగన్ బస్సు యాత్ర సందర్భంగా ట్రాఫిక్ మళ్లించడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నామమాత్రంగా వచ్చిన ఇద్దరు పారిశుధ్య కార్మికులు నీటి పారుదలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. రోడ్డుకు ఒక పక్కన ఉన్న మ్యాన్ హోల్ మూత తెరచి వర్షం నీరు మళ్లించడంతో సమస్య కొద్ది సేపటికి తొలగింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

వన్‌టౌన్, ఏప్రిల్ 13 : బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాలు కావడంతో గుంటూరుకు చెందిన వ్యక్తి (48) మృతి చెందినట్లు శనివారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదైంది. గుంటూరు ఆనంద్‌పేటకు చెందిన సయ్యద్ మున్వర్ భార్య ఇద్దరు కుమారులతో ఉంటున్నాడు. గుంటూరు నల్లచెరువులో గోనెసంచులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రంజాన్ పండుగ సందర్భంగా ఇతను 12న గన్నవరంలోని బంధువు అల్తాఫ్ ఇంటికి వెళ్లాడు. పండగ జరుపుకుని రాత్రి 9.30 గంటలకు బైక్‌పై గుంటూరు బయలుదేరాడు. విజయవాడ వారధి సమీపంలోని రాణిగారి తోట ఫీడర్ రోడ్డువైపు నుంచి సాయిబాబా గుడివైపు వెళుతున్న ఓ వ్యక్తిని మున్వర్ ఢీకొనబోయాడు. దాంతో బైక్ అదుపు తప్పింది. దాంతో మున్వర్ రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు.

చికిత్స పొందుతూ యువకుడు..

మోటార్ సైకిల్ అదుపుతప్పి తీవ్రగాయాలై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు(27) మృతి చెందినట్లు శనివారం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కృష్ణాజిల్లా ఘంటసాల మండలం చిలకలపూడి గ్రామానికి చెందిన కొణతం నాగేశ్వరరావు కుమారుడు మణికంఠ ప్రసాద్ భవానీపురం ఐరన్‌యార్డులోని ఓ పైపుల కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పనికి వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంటకు పనినిమిత్తం బైక్‌పై షాపు నుంచి బయటకు వెళ్లాడు. భవానీపురం బైపాస్ రోడ్డులో అట్కిన్‌సన్ స్కూల్ సెంటర్ నుంచి సితార వైపునకు వెళుతుండగా పాత భవానీపురం పోలీస్‌స్టేషన్ వెళ్లే వైపు యూటర్నింగ్ తీసుకుంటూ సడెన్ బ్రేక్ వేశాడు. బైకు అదుపుతప్పి రోడ్డుమీద పడ్డాడు. తీవ్రగాయాలు గాయడంతో బాధితుడిని 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అతను మృతి చెందాడు. మృతుడి తల్లి శశిరేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జగన్ పాలన అస్తవ్యస్తం

జై భారత్ పార్టీ అభ్యర్థి పోతిన రాము



బ్రహ్మంగారిమఠం ప్రాంతంలో స్థానిక మహిళలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పోతిన రాము

చిట్టినగర్, ఏప్రిల్ 13: జగన్‌రెడ్డి పాలన అంతా అస్తవ్యస్తమని, సంక్షేమమని చెబుతూ ప్రజలపై భారాలు మోపి తీవ్ర ఇబ్బందులు పెట్టాడని జై భారత్ పార్టీ అభ్యర్థి పోతిన రాము అన్నారు. ఆంజనేయవాగు, బ్రహ్మంగారి మఠం కొండ ప్రాంతంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. విద్యుత్ బిల్లుల పేరట వచ్చే కాస్తా పింఛన్‌లు కోత పెట్టి వృద్ధులను క్షోభ పెడుతున్నారన్నారు.

కేబీఎన్ కళాశాలకు ఏ డబుల్ ప్లస్ గ్రేడ్



ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సర్టిఫికేట్‌ను ప్రదర్శిస్తున్న కేబీఎన్ కళాశాల నిర్వాహకులు

వన్‌టౌన్, ఏప్రిల్ 13 : వన్‌టౌన్‌లోని కేబీఎన్ కళాశాల ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించింది. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి బాబా విజయకుమార్, కళాశాల కోశాధికారి అన్నం రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులు సర్టిఫికెట్‌ను ప్రదర్శించారు.

రానున్న ఎన్నికల్లో వార్ వన్‌సైడే

టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి జానకీలక్ష్మి



సత్యనారాయణపురంలో ప్రచారం చేస్తున్న కేశినేని జానకీలక్ష్మి

సత్యనారాయణపురం, ఏప్రిల్ 13: కూటమి విజయంతోనే రాష్ట్రపురోగతి ఆధారపడి ఉందని చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపైన ఉందని విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలో శనివారం బొండా సుజాతతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కరపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో 33వ డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్, మంచి కంటి ధనలక్ష్మి, నిర్మల చౌదరి, తంగిరాల లక్ష్మి, జొన్నలగడ్డ సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను దగా చేస్తున్న వెలంపల్లి

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్

పాయకాపురం, ఏప్రిల్ 13 : నియోజకవర్గాలు మారుతూ వెలంపల్లి శ్రీనివాస్ ప్రజలను మోసం చేయడం కుదరదని, సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అన్నారు. 64వ డివిజన్ కండ్రికలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. పరుచూరి ప్రసాద్ మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు వెలంపల్లి రాజకీయ జీవితానికి చరమగీతం పాడటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నేతలు సూరవరపు నాగరాజు, పలగాని శివ, ఇప్పిలి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న పరుచూరి ప్రసాద్



గంగిరెడ్డులదిబ్బలో టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

గుణదల : పేదలు మధ్యతరగతి కుటుంబీకులు సూపర్ సిక్స్ పథకాలను అందుకోవాలంటే 2024లో టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమని తూర్పు నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడు దేవరపల్లి ఆంజనేయులు అన్నారు. మూడో డివిజన్ పరిధిలోని గంగిరెడ్డుల దిబ్బ ప్రాంతంలో శనివారం ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. మద్యపానాన్ని నిషేధిస్తానని హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చి అడుగడుగునా మద్యం పాయింట్లకు అనుమతులు ఇచ్చి మరింతగా ప్రోత్సహించారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దాసరి గాబ్రియేలు, దోమకొండ జ్యోతి, దోమకొండ రత్నాకరరావు, మహేష్, పొట్ల రమణ, పరిసపోవు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో గ్రామాల అభివృద్ధి

పెనమలూరు, ఏప్రిల్ 13 : బాబు పాలనలో గ్రామాల అభివృద్ధి జరిగిందని, వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను బోడె హేమ కోరారు. యనమలకుదురు భగత్ సింగ్‌నగర్‌లో శనివారం పాదయాత్ర నిర్వహించి, ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికి వివరించారు. ఆమె వెంట అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, బలగం నాగరాజు, మల్లంపాటి విజయలక్ష్మి, బట్టు సరస్వతి, తమ్ము అశోక్, బెజవాడ వెంకటేష్, కందుల శివరాం, వెలగపూడి రాజశేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రొద్దుటూరు (కంకిపాడు) : దళితులను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దళితులపై దాడులు చేయడం హేయమైన చర్య అని బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ అన్నారు. ప్రొద్దుటూరులో శనివారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రొద్దుటూరుకు చెందిన అధికార పార్టీ నాయకులు గ్రామానికి చెందిన ఒక దళితుడిపై దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు.

'మనూ'లో కోర్సులు

దిక్సూచి

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)- రెగ్యులర్ మోడ్‌లో అందిస్తున్న పలు అకడమిక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **వెబ్‌సైట్:** www.manuu.edu.in

ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా...

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు: ఉర్దూ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనావిక్స్, సోషియాలజీ, దక్కన్ స్టడీస్, ఎడ్యుకేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ ఉర్దూ కల్చర్ స్టడీస్, కంపారటివ్ స్టడీస్, లా, సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్‌క్లూజన్ పాలసీ, లాంగ్వేజ్ టీచింగ్ ఇన్ మదర్సా

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్(కంప్యూటర్ సైన్స్), ఎంఈడీ, మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం)

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీటెక్(కంప్యూటర్ సైన్స్), బీటెక్-కంప్యూటర్ సైన్స్(లేటరల్ ఎంట్రీ), ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీఈడీ.

ప్రొఫెషనల్ డిప్లొమాలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ), పాలిటెక్నిక్ డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, అప్పారెల్ టెక్నాలజీస్), పాలిటెక్నిక్ డిప్లొమా లేటరల్ ఎంట్రీ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

అకడమిక్ మెరిట్ ద్వారా...

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ(ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, అరబిక్, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్ ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎంఎస్‌డబ్ల్యు(సోషల్ వర్క్), ఎంఏ జేఎంసీ(లేటరల్ ఎంట్రీ), ఎంకాం, ఎమ్మెస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ), ఎం ఒకేషనల్(ఎంఎల్‌టీ, ఎంఐటీ), ఎంసీఏ(లేటరల్ ఎంట్రీ)

ఇవి కాకుండా ఫుల్‌టైమ్ పార్ట్ టైమ్ కోర్సులు మరికొన్ని కూడా ఉన్నాయి.

పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ డిప్లొమాలు: హైదరాబాద్ క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లు అందిస్తోంది.

(ఇవి కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లోని క్యాంపస్‌ల్లో ఉన్న కోర్సులు - అర్హతలు తదితరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.)

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZmApBfv**లో చదవండి.**

PUBLIC NOTICE

Notice is hereby given to public at large and more particularly in Film Trade that we have acquired entire Non-Linear Rights (as per Film Trade), Exclusive video rights for both commercial and non-commercial purposes including the exclusive Rights on all Electronic and Digital Media, the exclusive Rights on Internet and Mobile Technology based platforms, exclusive Rights for exploitation as VOD (Video On Demand), AVOD, FVOD, SVOD, TVOD, EST (Electronic sale through), non-exclusive sub-titling Rights (in all languages of the world including English), Audio Visual Songs (Non Exclusive), Exclusive Rights for exploitation as pay per View on all internet, Mobile, Cable TV and DTH (Direct To Home) platforms Mobile, Telephony, Free TV, MOD, MVOD, NVOD, DTU, DBS, MMDS, Sea Borne Rights, Rail Borne, Air Borne, Road Borne, exclusive Rights to publish sell or market the movie in the current mediums or which are invented in future which could use both Analog or Digital technology, Storage Device Rights, Internet and Mobile Broadcasting Technology Rights, Mobile Application Rights, Mobile Wireless Technology Rights, IPTV, Video Ringtone Rights, Video Mobile Rights, Video Synchronization Rights, Mechanical Synchronization Rights, Internet Transmission, Internet Streaming, Internet Simulcasting, Live Streaming through Internet Rights, Broadband Rights, Web Based Technology Rights, Download Rights using all modes of exploitation, Web Download Rights, Web Casting, Live Web Telecasting, Live Streaming using Broadband and Internet, Web TV, Pay TV Rights, Wall Paper Rights, Intranet Rights for Entire World including India for a Perpetual and Permanent Period

Sr.No	Film Name	StarCast	Rights	Term Period
1	GOODACHARI-2/G2	ADIVI SESH AND OTHERS	NON-LINEAR	PERPETUAL & PERMANENT

Any person, party, firm or company having any claim or any objections of whatsoever nature against the aforesaid rights of the above mentioned Film, by way of Unpaid Dues, outstanding payments, Assignment, Pledge, Gift, LIEN, Mortgage, License, Sale, Transfer of any kind Reservation, Litigation of any nature etc., are required to inform to us in writing along with documentary proof (certified true copies) and/or evidence of claim or objection at our address mentioned below with in (15) days from the date of publication hereof, failing which the transaction will be completed without reference to such claims and the same, if any, will be deemed to have waived.Further, it is advised that any person who may be dealing with the said rights is doing so at their own peril, cost and consequences.

Date: 14.04.2024.

Issued By:-MANGO MASS MEDIA PVT. LTD.Plot No.2,
Women's Co-operative Society,Road No.2, Banjara Hills, Hyderabad-500034,Telangana, India

చిత్ర పరిశ్రమకు, అభిమానులకు అంకితం

- రామ్‌చరణ్



హీరో రామ్‌చరణ్ 'గౌరవ డాక్టరేట్' అందుకున్నారు. సినీ, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేసిన సేవలకు గాను చెన్నైలోని ప్రముఖ 'వేల్స్ యూనివర్శిటీ' ఆయనకు శనివారం సాయంత్రం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత సాంకేతిక విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, యూనివర్శిటీ వ్యవస్థాపకుడు, ఛాన్స్‌లర్ డాక్టర్ ఐసరి గణేశ్ చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ... 'నా పై ఇంత అభిమానంతో గౌరవ డాక్టరేట్ బహూకరించిన వేల్స్ వర్శిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు. 38 ఏళ్లుగా నడుస్తున్న యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ వస్తోందంటే ముందు మా అమ్మే నమ్మలేదు. ఆర్మీలాంటి గ్రాడ్యుయేషన్స్ మధ్య నేను ఇలా ఉండడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది నా తల్లిదండ్రులకు, అభిమానులకు, దర్శకులకు, నిర్మాతలకు, తోటి నటీనటులకు అంకితమిస్తున్నా.' అన్నారు. తాను చెన్నైలోని విజయా హాస్పిటల్లోనే జన్మించానని, పద్మశేషాద్రి స్కూల్లో చదివానన్నారు. ఈ ప్రాంతం తనకెంతో ఇచ్చిందన్నారు. తన తండ్రి చిరంజీవి జీవన ప్రయాణం కూడా ఇక్కడి నుంచే ప్రారంభించారన్నారు. తన సతీమణి ఉపాసన కుటుంబం అపోలో హాస్పిటల్స్‌ను కూడా ఇక్కడి నుంచే ప్రారంభించిందన్నారు. 80 శాతం తెలుగు సినిమాలు ఇక్కడే రూపొందేవని, తెలుగు సినీ పరిశ్రమకు ఇది పుట్టిల్లులాంటిదన్నారు. ఏదైనా సాధించాలని కలలు కని, చెన్నైకి వస్తే అది తప్పకుండా నెరవేరుతుందని వ్యాఖ్యానించారు. అది ఈ ప్రాంతం గొప్పతనమన్నారు. అన్ని రంగాల వారికి ఈ భూమి కలలు నెరవేర్చేదన్నారు. తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తను నటిస్తున్న 'గేమ్ చేంజర్' మూవీ సెప్టెంబర్-అక్టోబరు నెలల్లో విడుదలయ్యే అవకాశముందని రామ్‌చరణ్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి, చెన్నై.

జీరో బడ్జెట్‌తో శరపంజరం



గంగిరెద్దుల అబ్బాయితో జోగిని ప్రేమలో పడితే ఎటువంటి పరిణామాలు సంభవించాయన్న ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న 'శరపంజరం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంద. నవీన్‌కుమార్ గట్టు, లయ జంటగా నటించారు.ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నవీన్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డాను. ఎంతో మంది మిత్రులు నాకు అండగా నిలిచారు. జీరో బడ్జెట్‌తో కేవలం స్నేహితుల సహకారంతో ప్రారంభించిన ఈ యజ్ఞం పూర్తి చేసి విడుదల వరకూ వచ్చాం. గణపతిరెడ్డి మాకు ఎంతో సహకరించారు.' అని చెప్పారు. సంగీత దర్శకుడు మల్లిక్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందనీ, ఆకలితో ఉన్న వాడికి అన్నం పెడితే జీవితాంతం గుర్తుంచుకుంటాడని, ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలనీ గణపతిరెడ్డి అన్నారు.

వినోదం పంచే కొంచెం హట్కే



గురుచరణ్, కృష్ణ మంజూష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కొంచెం హట్కే'. అవినాశ్ కుమార్ దర్శకత్వంలో అభిమాన థియేటర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇందులో హీరో హీరోయిన్లు ఉండరు. పాత్రలే ఉంటాయి. సినిమా వినోదాత్మకంగా ఉంటుంది' అన్నారు. కొంతమంది కలిసి సినిమా తీయడానికి చేసే ప్రయత్నాలు వినోదం పంచుతాయని గురుచరణ్ తెలిపారు.

గొప్ప కంటెంట్‌తో టెనెంట్

సత్యం రాజేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించారు. ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. నటుడు ప్రియదర్శి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యం రాజేశ్ మాట్లాడుతూ 'డబ్బింగ్ చెబుతున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి. ఇందులో గొప్ప కంటెంట్ ఉంది. ప్రేక్షకులు ప్రతి క్షణం ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మహిళలకు కనెక్ట్ అయ్యే



కథ ఇది. మా నిర్మాత రాజీపడకుండా నిర్మించారు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే చిత్రమవుతుంద'న్నారు. నిర్మాత మాట్లాడుతూ "బలగం, కాంతార' లాంటి సహజత్వం ఉన్న కథతో తెరకెక్కిన సినిమా 'టెనెంట్'. ఈ చిత్రంలో భావోద్వేగాలు అద్భుతంగా పండాయి' అని చెప్పారు.

మేకప్ మాన్‌కు క్లాప్



దివంగత నటుడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం మేనల్లుడు శ్రీకాంత్ అవుటూరి హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మేకప్ మ్యాన్'. దివాకర్ యడ్ల దర్శకత్వం వహిస్తున్నారు. కుమార్ మెట్టుపల్లి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు రవి కుమార్ చౌదరి క్లాప్ కొట్టగా, లయన్ సాయి వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. భరత్ పారేపల్లి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ప్రతి చిత్రానికి కీలకమైన మేకప్ మ్యాన్‌ల పాత్రను, వారి జీవితాన్ని ఇందులో చూపించనున్నామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో కట్టా రంజిత్, ఆనంద్ భారతి, చిట్టిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ, ఎడిటర్: వాసు వర్మ, సంగీతం: ఎం ఎం శ్రీలేఖ.

నవ్య 'దృశ్యం'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zvr6wiU లో చదవండి.

సండే సెలబ్రిటీ



'క్రాక్' సినిమాతో తాను వైవిధ్యమైన నటినని నిరూపించుకున్న వరలక్ష్మీ శరత్‌కుమార్... ప్రస్తుతం అనేక చిత్రాలలో ముఖ్యమైన పాత్రల్లో నటిస్తోంది. తాజాగా ఆమె నటించిన 'శబరి' విడుదలకు సిద్ధంగా ఉంది. "ఇప్పటిదాకా నేను చేసిన పాత్రలన్నీ ఒక ఎత్తు. 'శబరి'లో పాత్ర మరో ఎత్తు" అంటున్న వరలక్ష్మీ శరత్‌కుమార్‌తో 'నవ్య' ఇంటర్వ్యూ..

సినిమా ఫ్లాప్ అయితే హీరోయిన్‌నే అంటారు

మీరు సినిమా కుటుంబం నుంచి వచ్చారు? ఒక నటిగా మీ జర్నీ ఎలా సాగుతోంది?

చాలా బాగా ఉంది. అనేక పాత్రలు నాకు వచ్చాయి. ఈమధ్య కాలంలో రైటర్లు నా కోసం పాత్రలు రాస్తున్నారు. దీని వల్ల వైవిధ్యభరితమైన పాత్రలలో నటించగలుగుతున్నా. చెప్పాలంటే ఒక విధంగా చాలా సంతృప్తిగా ఉంది.

మీ విషయంలో రకరకాల పాత్రలు వస్తున్నాయి కదా! మీరు వాటిని ఎలా ఎంచుకొంటారు?

నా ఉద్దేశంలో ఒక సినిమాకు హీరో... స్క్రిప్ట్. ఈ స్క్రిప్ట్‌లో నా పాత్ర ఎంత ఉందనే విషయంపైనే నా దృష్టి ఉంటుంది. ఆ క్యారెక్టర్ నేను అంతకు ముందుగా చేశానా లేదా అనే విషయాన్ని ఆలోచిస్తా. ఒకవేళ నేను అప్పటికే ఆ తరహా పాత్ర చేసి ఉంటే దానిలో ఏదైనా వైవిధ్యం చూపించగలమా... అనే విషయాన్ని ఆలోచిస్తా. అప్పుడు ఆ పాత్రను ఒప్పుకుంటా.

మీరు మెయిన్ రోల్స్‌నే ఎంచుకొంటారా?

లేదండి. ఒక నటిగా నన్ను నేను ఇంకా నిరూపించుకోవాల్సి ఉంది. అందువల్ల ఎప్పటికప్పుడు కొత్త తరహా పాత్రలను ఎంచుకొంటూ ఉంటాను. ఉదాహరణకు ఇప్పటిదాకా నేను కామెడీ పాత్రలు చేయలేదు. అలాంటి పాత్ర వస్తే చేయాలని ఉంది. అదే విధంగా ఒక పీరియడ్ ఫిల్మ్ చేయలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే... నన్ను నేను నటిగా నిరూపించుకొనే పాత్ర ఇప్పటి దాకా రాలేదు. అలాంటి పాత్ర కోసం ఎదురుచూస్తున్నా.

చేద్దామని మిస్ అయిన పాత్రలు ఏమైనా ఉన్నాయా?

లేవు. నాకు ఈ మధ్యకాలంలో కొన్ని రకాల బోల్డ్ పాత్రలు వస్తున్నాయి. బహుశా ఆ కేటగిరిలో నాలా చేసేవాళ్లు ఎవరు లేరనుకుంటా! నెమ్మదిగా నాకు వైవిధ్యభరితమైన పాత్రలు వస్తున్నాయి.

సాధారణంగా అక్కలు... వదినల పాత్రలు ఎక్కువుంటాయి. మీకు అలాంటి పాత్రలు రాలేదా?

అలాంటి పాత్రలైనా నాకు ఎలాంటి సమస్యా లేదు. కానీ నాకు ఇప్పటి దాకా అలాంటివి ఎక్కువ రాలేదు. అలాంటి పాత్రలు చేయటానికి కూడా నాకు అభ్యంతరం లేదు. నా దృష్టిలో ఏదైనా పనే! అది చిన్నది కావచ్చు.. పెద్దది కావచ్చు.. ఎప్పుడూ నటిగా నా పరిధిని పెంచుకోవటానికి ప్రయత్నిస్తూ ఉంటా!

మీరు తమిళం నుంచి వచ్చారు. అక్కడ సంస్కృతి.. వేషభాషల ప్రభావం మీపై ఉందా?

అదృష్టవశాత్తు నన్ను ఒక తమిళ నటిగా ఎవరూ గుర్తించలేదు. మొదటి నుంచి నేను అన్ని భాషల్లోనూ యాక్ట్ చేశాను. అన్ని భాషలవారూ నన్ను గుర్తించారు. ఇప్పటికీ చాలా మంది నన్ను తెలుగు అమ్మాయి అనుకుంటారు. కన్నడలో యాక్ట్ చేస్తే... వాళ్లు తమ అమ్మాయి అనుకుంటారు.

చిన్నప్పుడు ఎప్పుడైనా సినిమాల్లోకి రావాలనుకున్నారా?

చిన్నప్పటి నుంచి నేను థియేటర్‌లో యాక్టివ్‌గా ఉండేదాన్ని. అనేక నాటకాలు కూడా వేశాను. కానీ ఎప్పుడూ సినిమాల్లోకి రావాలని అనుకోలేదు. నా దృష్టిలో నటనకు సినిమాలు ఒక్కటే వేదిక కాదు. నేను యాక్టింగ్ స్కూలుకు వెళ్లినప్పుడు నాలో ఈ సినిమాల పట్ల ప్రత్యేక ఆసక్తి ఉందనే విషయం అర్థమయింది. చిన్నప్పుడు నాకు డాక్టర్ కావాలని ఉండేది. కానీ చివరకు యాక్టర్ అయ్యాను.

మీరు ఒక స్టార్ కిడ్ కదా. మీకు సినిమా రంగంలో ప్రవేశం సులభమయిందా?

ఈ ప్రశ్న నన్ను చాలా కాలంగా వెంటాడుతోంది. స్టార్‌కిడ్‌లకు ప్రవేశం సులభం అవుతుంది అంతే! విగిలిన కష్టాలన్నీ వాళ్లు కూడా పడాలి. చాలా మంది స్టార్‌కిడ్స్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంటుందనుకుంటారు. కానీ అలా ఉండదు. ప్రేక్షకులకు నచ్చకపోతే కెరీర్ పోతుంది. సినిమాలో నటించేవారు... స్టార్ కిడ్సా లేదా సాధారణ నేపథ్యం నుంచి వచ్చినవారా అనే విషయాన్ని ప్రేక్షకులు చూడరు. వారికి సినిమా బావుండాలంతే! నా ఉద్దేశంలో టాలెంట్, అదృష్టం ఉండాలి. కొన్నిసార్లు ఎంత కష్టపడినా విజయం రాదు. నన్నే తీసుకోండి... నేను ఇండస్ట్రీకి వచ్చి చాలా కాలమయింది. కానీ 'క్రాక్' సినిమా తర్వాతే నాకు సక్సెస్ వచ్చింది. అంత కాలం నేను సరైన పాత్ర కోసం వేచి చూశానంతే! కష్టపడి పనిచేయాలి. మంచి ఫలితం కోసం వేచి చూడాలి. అంతకన్నా వేరే మార్గం లేదు.

కానీ అలా వేచి చూడటం వెనక చాలా మానసిక ఒత్తిడి ఉంటుంది కదా..!

ఉంటుంది. యాక్టర్స్‌కు చాలా ఒత్తిడి ఉంటుంది. దానిని బయటకు చెప్పలేం. ఎవరైనా నా దగ్గరకు వచ్చి సినిమాల్లోకి వస్తానంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకొమ్మని చెబుతా! ఎందుకంటే ఇండస్ట్రీలో మనుగడ సాగించటం అంత సులభం కాదు. మనపై ఎవరో ఒకరు కామెంట్స్ చేస్తూ ఉంటారు. పాత్రల కోసం వేచి చూస్తూ ఉండాలి. సినిమాల పట్ల అవితమైన ప్రేమ, ఆత్మనిబ్బరం ఎక్కువగా ఉన్న వ్యక్తులు మాత్రమే సినిమా రంగానికి రావాలి. ఒక్క ఛాన్స్ దొరకాలి. సినిమా విడుదల కావాలి. అది హిట్ కావాలి. హీరోయిన్లకు ఇంకా కష్టం. సినిమా హిట్ కాకపోతే... హీరోయిన్‌ది ఐరెన్ లెగ్ అంటారు. ఛాన్స్ ఇవ్వద్దంటారు. కథ బావుండక సినిమా ఫ్లాప్ అయితే.. దానికి హీరోయిన్‌కు సంబంధమేమిటి?

మీరు ఎమోషనల్‌గా ఉంటారా?

లేదు. నేను వీలైనంత బ్యాలెన్స్‌గా ఉంటా! ఎప్పుడూ ఆనందంగా ఉండటానికి ప్రయత్నిస్తా. అనవసరపు విషయాలను ఎక్కువగా పట్టించుకోను. చిన్నప్పటి నుంచి నేను ఇంతే! నాకు జీవితంలో అనేక కష్టనష్టాలొచ్చాయి. నాకు ఎన్ని కష్టనష్టాలొచ్చినా పాజిటివ్‌గానే ఉండేదాన్ని.

ఈ తరం వాళ్లకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

లైఫ్ ఈజ్ నాట్ ఈజీ. అనేక అడ్డంకులు ఎదురవుతాయి. కొత్త కొత్త సవాళ్లు వస్తాయి. వాటిని అధిగమిస్తూ ముందుకు వెళ్లాలి. నన్నే ఒక ఉదాహరణగా తీసుకోండి... నేను సినిమాల్లోకి వచ్చిన తర్వాత నాకు గొప్ప పాత్రలు రాలేదు. ఆ సమయంలో నిరాశ పడివుంటే నేను ఈ రోజు ఇలా ఉండేదాన్ని కాదు. నేను ఈ రంగంలోనే ఉండాలనుకున్నా.

సీవీఎల్‌ఎన్ ప్రసాద్



'పీఎస్'లో ఉంటాననుకున్నారు

'పీఎస్' చిత్రంలో నేను ఉంటానని అందరూ అనుకున్నారు. చాలా మంది చెప్పారు కూడా. నా చేతిలోకి పాత్ర వచ్చి.. ఆ తర్వాత నన్ను వద్దనుకుంటే ఫీలవ్వాలి. కానీ అసలు సినిమాలో పాత్రకే నన్ను ఎంపిక చేయనప్పుడు నేను ఫీలవ్వాల్సిన అవసరం ఏముంది? డైరక్టర్‌కు ఒక విజన్ ఉంటుంది. దానికి తగ్గట్టుగా పాత్రలను ఎంపిక చేస్తారు.

బెస్ట్ కాంప్లిమెంట్

ఒకప్పుడు నా వాయిస్ బావుండదనేవారు. డబ్బింగ్ పెట్టుకుంటే మంచిదనేవారు. ఇప్పుడు వాళ్లే నా వాయిస్ చాలా బావుందంటున్నారు. నేనే డబ్బింగ్ చెప్పాలనుకుంటున్నారు. అదే నాకు వారు ఇచ్చే బెస్ట్ కాంప్లిమెంట్.

డైరక్షన్ చేస్తా

ఏదో ఒక రోజు నేను డైరక్షన్ చేస్తా. అది కూడా నా జర్నీలో ఒక భాగమే!

వైరల్



రికార్డులు 'ఎత్తేసింది'

ఈ చిన్నారిని చూస్తున్నారుగా... పేరు అర్షియా గోస్వామి. ఉండేది హరియాణాలోని పంచకుల. వయసు తొమ్మిదేళ్లు. కానీ వెయిట్‌లిఫ్టింగ్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. వయసుకు మించిన బరువులు ఎత్తేసి... అబ్బుర పరుస్తోంది. ఇటీవల 75 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో మరో అరుదైన ఘనత సాధించింది. ఈ ఫీట్‌ను వీడియో తీసి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు ఒకరు. ఇక చెప్పేదేముంది... అర్షియా నైపుణ్యానికి నెటిజనులు ఫిదా అవుతున్నారు. వేల లైక్స్‌తో ఆ చిన్నారిని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. వెయిట్‌లిఫ్టింగ్ రికార్డులు అర్షియాకు కొత్తేమీ కాదు. ఆరేళ్ల వయసులో 45 కేజీల డెడ్‌లిఫ్ట్ ప్రదర్శించి, ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. అదే ఏడాది 35.8 కేజీల బరువును ఎత్తిన 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో తన పేరు నమోదు చేసుకుంది.

అలుపెరుగని ప్రయాణం

నాలుగు దశాబ్దాలుగా తెర మీద కనపడుతోంది. బాలీవుడ్‌తోపాటుదక్షిణాది భాషల్లోనూ నటిగా ఆమె క్రేజ్ వేరు. ఆమే.. టబు. ఇటీవలే 'క్రూ' చిత్రం విడుదలైన సందర్భంగా టబు గురించి కొన్ని విశేషాలు..

ఇటీవలే కరీనా కపూర్, కృతిసనన్‌తో కలసి టబు ఎయిర్‌హోస్టెస్‌గా 'క్రూ' చిత్రంలో నటించింది. ఈ కామెడీ ఫిల్మ్‌లో టబు నటనకు ఫిదా అవుతున్నారు. టబు ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు నలభై రెండేళ్లయింది.. అంటే ఎవరూ నమ్మరు. అయినా ఇప్పటికీ నటిగా ఆమె ఏమాత్రం తగ్గలేదు. 'మేల్ ఓరియంటెడ్ ఇండస్ట్రీలో ఓ ముగ్గురు కథానాయికలం కలసి వందకోట్ల వసూళ్లను సాధించాం. ఇదెంతో ఆనందం' అంటుంది టబు.

ఇదీ నేపథ్యం

టబు నేపథ్యం హైదరాబాద్‌తో ముడిపడి ఉంటుంది. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగింది. పూర్తి పేరు తబస్సుమ్ ఫాతిమా హష్మీ. తన తండ్రి పాకిస్తాన్ నటుడు. పేరు జమాల్ అలీ హష్మీ. తల్లి పేరు రిజ్వానా. 'మా అమ్మ నుంచి విడిపోయాక మా అమ్మమ్మతో కలసి హైదరాబాద్‌నుంచి మనాలి వెళ్లిపోయాం. అక్కడ రెండు పెంపుడు కుక్కలు, చేపలు నా ప్రపంచం. మా పూర్వీకులు అంతా చదువుకున్నవాళ్లే. అమ్మమ్మ దగ్గర ప్రపంచం అర్థమైంది. పుస్తకాల నుంచి ఉర్దూ కవిత్వం వరకూ చదివా. 1975-76 ప్రాంతంలో చిన్నప్పుడు అమ్మమ్మతో, కజిన్స్‌తో కలసి సాయంత్రాల్లో సినిమా చూడటం, వీధి చివర దోశలు తినటం బాగా గుర్తు. మా అమ్మమ్మతో సంభాషించేప్పుడు సినిమాల కంటే ఉర్దూ కవిత్వమే డామినేట్ చేసేది' అంటుంది టబు.

అలా ఇండస్ట్రీలోకి..

స్కూలింగ్ చదివేప్పుడే 'బజార్' అనే చిత్రంలో నటించింది. ఆ తర్వాత దేవానంద్ కూతురిగా పద్నాలుగేళ్ల వయసులో ఓ సినిమా చేసింది. అయితే కథానాయికగా ఆమె తొలి చిత్రం 'కూలి నంబర్ 1' (తెలుగు) కావటం విశేషం. 'జీత్' తర్వాత .. 1996 సంవత్సరంలో వచ్చిన 'కాదల్ దేశం' (ప్రేమదేశం) చిత్రంతో ఆమె దక్షిణాదిలో పాపులర్ అయింది. అదే ఏడాది 'మచ్చిస్' చిత్రంతో నటిగా జాతీయ అవార్డు దక్కించుకుంది. 'ఇరువర్', 'చాచి 420', 'బివి నంబర్ వన్' 'హమ్ సాత్ సాత్ హే', 'చాందినీ బార్', 'మక్బూల్', 'మీనాక్షి- ఎ టేల్ ఆఫ్ త్రీ సిటీస్', 'లైఫ్ ఆఫ్ పై', 'హైదర్', 'దృశ్యం', 'అందాధూన్'.. ఇటీవల వచ్చి 'క్రూ' చిత్రం వరకూ టబు పాత్రలు గుర్తుండిపోయేవే. అందుకే ఆమె నటనకు జాతీయస్థాయిలో క్రేజ్ ఉంది.

భిన్నంగా ఉంటా...

'కొత్త పాత్రలు వస్తే వదులుకోను. రొటీన్‌కు భిన్నంగా ఆలోచించాలి. చిన్నప్పటి నుంచీ ఇదే తీరు. 'మక్బూల్', 'చాందినీ బార్', 'హైదర్' లాంటివి అలాంటివే. ఫలానా దర్శకుడు మంచి కథనంతో వచ్చి 'మీరైతే సరిపోతారు ఈ పాత్రకు' అంటుంటారు. ఇది నిజంగా గొప్ప విషయం అనిపిస్తుంది. నాకోసమే పాత్రలు రాసే రచయితలున్నారు. ఇప్పటి వరకూ 92 చిత్రాల దాకా నటించా. అన్ని చిత్రాల స్క్రిప్టును చదివా. 1990ల్లో రోజుకు మూడు షిఫ్టుల్లో పని చేసిన సందర్భాలెన్నో. ఏడాదికి పన్నెండు చిత్రాలు విడుదలయ్యేవి. ఇప్పుడు అలా కాదు.. ఏడాదికి రెండు చిత్రాల్లో నటిస్తే గొప్ప విషయం. కాలం మారిందిలా. మెయిన్ స్ట్రీమ్ ప్రేక్షకులు మారిపోయారు. కొత్త కాన్సెప్టులు ఉంటేనే చూస్తున్నారు. ఇచ్చిన పాత్రలో ప్రేక్షకులను ఎలా మెప్పించామన్నదే యాక్టర్‌కు ఉన్న సవాల్.'





అలనాటి కథ

ఓ రాజకుమారి విషాద గాథ

కొన్ని అందమైన కథలు చివరికి విషాదాంతాలుగా మిగులుతాయి. అలాంటి ఒక అందమైన కథ... ప్రిన్సెస్ నిలోఫర్‌ది. ప్రిన్స్ మొజంజాని వివాహం చేసుకొని టర్కీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన నిలోఫర్ తన చివరి దశలో పారిస్‌లో స్థిరపడ్డారు.



ఇప్పటి తరం వారిని 'నిలోఫర్ ఆసుపత్రికి.. మొజంజాహీ మార్కెట్‌కు సంబంధం ఏమిటి?' అని అడిగితే వెంటనే సమాధానం చెప్పలేకపోవచ్చు. నిలోఫర్ ఆసుపత్రిని కట్టించింది ప్రిన్సెస్ నిలోఫర్. మొజాంజాహీ మార్కెట్ ఉన్న ప్రాంతంలోనే ప్రిన్స్ మొజంజా బహదూర్ పేరిట వెలిసింది. ఒకప్పుడు వీరిద్దరూ హైదరాబాద్ హైసొసైటీలో 'పవర్ కపుల్' అని చెప్పవచ్చు. వీరితో నాకు మంచి అనుబంధం ఉంది.

ప్రిన్సెస్ నిలోఫర్ తండ్రి సుల్తాన్ దామాద్ మోర్లిజేడ్ షహలుద్దీన్ ఆలీ బే... టర్కీ ఆఖరి సుల్తాన్. ఆ సమయంలో నిజాం వంశీకులతో సంబంధాలు పెట్టుకోవాలనే ఉద్దేశంతో ఆమెను మొజంజా బహదూర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరిద్దరూ హిల్‌ఫోర్ట్ ప్యాలెస్‌లో నివసించేవారు. ఆ సమయంలోనే ఆమె అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. వాటిలో నిలోఫర్ ఆసుపత్రి కూడా ఒకటి. ప్రిన్స్ మొజంజా బహదూర్, ప్రిన్సెస్ నిలోఫర్ మా ఇంటికి తరచూ వస్తూ ఉండేవారు. వారికి నాన్న ధన్‌రాజ్‌గిర్ అతిథ్యం ఇస్తూ ఉండేవారు. ఇక్కడ మొజంజా బహదూర్ గురించి కొంత చెప్పాలి. ఆయన సహజంగా కవి. తాను రాసిన కవితలను పాడించి వినటం ఆయనకు ఒక సరదా. అదే విధంగా ఆయన అనేక నాటకాలు కూడా రాశారు. ఆ నాటకాలను జ్ఞాన్‌బాగ్ పాలెస్‌లో ఉన్న జూనో, హెర్క్యులిస్ విగ్రహాల వద్ద రాత్రిళ్లు ప్రదర్శించేవారు. ఆ సమయంలో ప్రత్యేక లైటింగ్స్ పెట్టేవారు. ప్యాలెస్ అంతా కళకళలాడుతూ ఉండేది. ఆయన నాతో చాలా ప్రేమగా ఉండేవారు. అప్పుడప్పుడు నాకు ఒకటి రెండు కాదు.. పదేసి పెర్‌ఫ్యూమ్ బాటిల్స్ ఇచ్చేవారు. ఒకసారి నేపాల్ రాజవంశం వారు ఆయనకు బహూకరించిన బంగారు పూత పూసిన డిన్నర్ ప్లేట్ సెట్ కూడా బహుమతిగా ఇచ్చారు.



ప్రిన్సెస్ నిలోఫర్, మొజంజా

సాధారణంగా మేమందరం మ్యూజిక్ రూమ్‌లో కలిసేవాళ్లం. ఒకసారి నాన్న ముంబయిలోని ధన్‌రాజ్ మహల్‌లో ఒక పార్టీ ఇచ్చారు. దీనికి నిలోఫర్‌తో కలిసి ఆయన బొంబాయి వచ్చారు. అప్పుడు మా ఇంట్లోనే వారు మా ప్యాలెస్ టాప్ ఫ్లోర్‌లో ఉండేవారు. నిలోఫర్ మా అందరితోనూ కలివిడిగా ఉండేది.

సందర్భం వచ్చింది కాబట్టి ఇక్కడ బొంబాయి పార్టీ సీను గురించి కూడా చెప్పాలి. హైదరాబాద్ పార్టీలలో ఆల్కాహాల్ ఇచ్చేవారు కాదు. టీ, ఇతర తినుబండారాలతో సరిపెట్టుకొనేవారు. కానీ బొంబాయిలో పార్టీ అంటే షాంపైన్ ఇవ్వాల్సిందే. ఆ రోజు మా నాన్నగారు ఇచ్చిన పార్టీకి అనేక మంది రాజకుటుంబీకులు వచ్చిన జ్ఞాపకం. టాటాలు, విస్త్రీలు, బరోడా మహారాజు, గ్వాలియర్ మహారాజులతో పాటుగా అనేక మంది రాజకుటుంబీకులు వచ్చేవారు. ఆ పార్టీలో నిలోఫర్ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిలోఫర్, మొజంజా బహదూర్ రెడ్ కార్పెట్‌మీద నడిచి వస్తుంటే అందరూ చప్పట్లు కొట్టిన జ్ఞాపకం. ఇంకో విషయమేవిటంటే... హైదరాబాద్ పార్టీలలో లైవ్ బ్యాండ్ ఉండేది కాదు. కానీ బొంబాయిలో ఉండాల్సిందే. పార్టీకి వచ్చినవారందరూ డ్యాన్స్ చేయాల్సిందే. మా పార్టీలో నిలోఫర్ కూడా డ్యాన్స్ చేసిన జ్ఞాపకం ఉంది. పార్టీలకు వచ్చినప్పుడు నిలోఫర్ ఎంత ఉత్సాహంగా ఉండేవారో... సామాజిక సేవా కార్యక్రమాలు చేసే విషయంలోనూ అంతే ఉత్సాహంగా ఉండేవారు. ఒకసారి హైదరాబాద్‌లో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఆ సభలో నిలోఫర్- ప్రాథమిక విద్య అందించే బాధ్యత ప్రభుత్వానిదే ఎలా అవుతుందనే విషయంపై చేసిన ప్రసంగం ఇంకా నాకు గుర్తుంది. ఈ మధ్య పుస్తకాలు తిరగేస్తుంటే ఆమె ప్రసంగం దొరికింది. "మన జీవితాలకు వెలుగునిచ్చేవి పల్లెటూర్లు. దురదృష్టమేమిటంటే వాటిని మనం చిన్నచూపు చూస్తున్నాం. ఇలాంటి పల్లెటూర్లను అభివృద్ధి చేయాలంటే ధనం అవసరం. కానీ మన దగ్గర అంత డబ్బు లేదు కానీ మంచి ఆలోచనలున్న మనుషులు ఉన్నారు. వారికి మంచి విలువలు నేర్పితే వారే పల్లెటూళ్లను అభివృద్ధి చేస్తారు. డబ్బు కన్నా ఆలోచన ముఖ్యం. మంచి చెడుల మధ్య వ్యత్యాసం తెలుసుకోవటమే అసలైన విద్య" అని ఆమె చేసిన ప్రసంగం అందరినీ ఆశ్చర్యచకితులు చేసింది. సభ అయిన తర్వాత కూడా అనేకమంది ఆమె ప్రసంగం గురించే మాట్లాడుకున్నారు.

నిలోఫర్ కొద్ది కాలం హైదరాబాద్‌లో నివసించారు. ఆ తర్వాత ముంబయికి, అక్కడి నుంచి ప్యారిస్‌కు వెళ్లిపోయారు. చాలా కాలం ఆమె దగ్గర నుంచి ఎలాంటి సమాచారం లేదు. కొద్ది కాలం తర్వాత ఆమె ఫ్రెంచ్ దేశస్తుడిని పెళ్లి చేసుకున్నట్లు విన్నాను. ఒకసారి నేను ప్యారిస్ వెళ్లినప్పుడు- ఆమె నెంబర్ సంపాదించి ఫోన్ చేశా. ఇంటికి వచ్చి కలుస్తానన్నా. ఆమె నన్ను కలవటానికి ఇష్టపడలేదు. "నేను గతంలో ఎలా ఉండేదాన్నో.. అలాగే ఉన్నాననుకో.. అలాగే ఊహించుకో" అని ఫోను పెట్టేసింది. ఆ తర్వాత నాకు ఎవరో... ఆమెకు మొహం కండరాల క్యాన్సర్ వచ్చిందని.. చాలా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని చెప్పారు. ఒకప్పటి అందాల యువరాణి నిలోఫర్‌కు.. ప్యారిస్‌లో క్యాన్సర్‌తో బాధ పడుతున్న నిలోఫర్‌కు సంబంధం లేదన్నారు. నా మనస్సు బాధతో నిండిపోయింది. ఆ తర్వాత కొద్ది కాలానికి ఆమె అక్కడ దీనస్థితిలో మరణించారు. నిలోఫర్‌ను తలుచుకున్నప్పుడల్లా ముంబాయి ధన్‌రాజ్ మహల్‌లో పార్టీలోకి ప్రవేశిస్తున్న యువరాణే గుర్తుకొస్తుంది. చాలా మందికి నిలోఫర్ చివరి రోజుల గురించి తెలియదు. రాజకుటుంబీకుల జీవితాలు పూలపాన్పులే అనుకుంటున్నారు. కానీ చాలా మంది జీవితాల్లో విషాదం ఉంటుందనే విషయం గమనించరు.

బొంబాయి ధన్‌రాజ్ మహల్‌కు అనేక ప్రత్యేకతలుండేవి. నాన్న అక్కడ ఉంటే పార్టీలు జరగాల్సిందే. ప్రతి పార్టీకి కనీసం రెండు వందల మంది దాకా అతిథులు వచ్చేవారు. కొన్ని సార్లు బాలేలు.. కొన్ని సార్లు కేబరేలు.. ఇలా రకరకాల థీమ్‌లు ఉండేవి. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ధన్‌రాజ్ మహల్‌ను భారతీయ నేవీ నెలకు 5 రూపాయల అద్దెకు తీసుకొంది. ఆ సమయంలోనే మేము బొంబాయి వదిలేసి హైదరాబాద్ వచ్చేశాం. ఆ తర్వాత కాలంలో నేను ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ మహల్‌ను మా కుటుంబ ఆధీనంలోకి వచ్చేలా చేశాను.

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

స్పోర్ట్స్

విజయవాడ ● ఆదివారం 14 ఏప్రిల్ 2024

ఇప్పటికి వీరే..

పరుగులు



విరాట్ కోహ్లీ (బెంగళూరు)

319 పరుగులు

వికెట్లు



చాహల్ (రాజస్థాన్)

11 వికెట్లు

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా X లఖ్‌నవూ	మ.3.30 గం. నుంచి
ముంబై X చెన్నై	రాత్రి 7.30 గం. నుంచి

గట్టెక్కిన రాజస్థాన్



హెట్‌మయెర్ (10 బంతుల్లో 27 నాటౌట్)

ఆఖరి ఓవర్‌లో విజయం

హెట్‌మయెర్ మెరుపులు ● పోరాడిన పంజాబ్ బౌలర్లు

ముల్లాపూర్ (చండీగఢ్): లో స్కోర్ థ్రిల్లర్‌లో రాజస్థాన్ రాయల్స్ ఒత్తిడిని జయించింది. అయితే కేవలం తమ 147 పరుగుల స్కోరును కాపాడుకోవడంలో అటు పంజాబ్ బౌలర్లు సైతం పట్టువదలకుండా పోరాడారు. దీంతో ఆఖరి ఓవర్ వరకు ఇరువైపులా మ్యాచ్ చేతులు మారుతూ వచ్చింది. కానీ హెట్‌మయెర్ (10 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 27 నాటౌట్) హిట్టింగ్ మరో బంతి ఉండగా ఆర్ఆర్‌ను గట్టెక్కించింది. ఫలితంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాయల్స్ 3 వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే పాయింట్ల పట్టికలో 10 పాయింట్లతో తమ అగ్రస్థానాన్ని మరింత పదిలపర్చుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 147 పరుగులు చేసింది. అశుతోష్ (16 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 31), జితేశ్ (29) మాత్రమే రాణించారు. కేశవ్, అవేశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 19.5 ఓవర్లలో 7 వికెట్లకు 152 పరుగులు చేసి నెగ్గింది. జైశ్వాల్ (39), తనుష్ (24) ఫర్వాలేదనిపించారు. రబాడ, కర్రాన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హెట్‌మయెర్ నిలిచాడు.

ఒత్తిడికి లోనైనా..: స్వల్ప ఛేదనే అయినా స్లో వికెట్‌పై రాజస్థాన్ కూడా తడబడింది. ఆరంభంలో ఇన్నింగ్స్ నిదానంగా సాగడంతో పాటు వికెట్లను కోల్పోయి ఒత్తిడికి లోనైంది. ఇక ఓటమి ఖాయమే అనిపించినా.. ఆఖర్లో హెట్‌మయెర్ బాదుడు జట్టును ఆదుకుంది. ఐపీఎల్ అరంగేట్రం చేసిన తనుష్, జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. అయితే, ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 56 పరుగులు జత చేసినా వేగం లోపించింది. అడపాదడపా ఫోర్లతో పవర్‌ప్లేలో జట్టు 43 పరుగులు చేసింది. బంతులు ఎక్కువగా వృథా చేసిన తనుష్‌ను తొమ్మిదో ఓవర్‌లో లివింగ్‌స్టోన్ అవుట్ చేశాడు. అటు శాంసన్ (18) 6,4తో 13 పరుగులు వచ్చాయి. అయితే తొలిసారి ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేసిన జైస్వాల్‌ను, శాంసన్‌ను వరుస ఓవర్లలో రబాడ అవుట్ చేయడం ఆర్ఆర్‌ను ఇబ్బందుల్లోకి నెట్టింది. దీనికి తోడు ఫామ్‌లో ఉన్న పరాగ్ (23), ధ్రువ్ జురెల్ (6) కూడా వెంటవెంటనే అవుట్ కావడంతో ఉత్కంఠ నెలకొంది. 16 బంతుల్లో 33 పరుగులు కావాల్సిన వేళ మ్యాచ్ ఇరువైపులా మొగ్గు చూపింది. కానీ హెట్‌మయెర్ 18వ ఓవర్‌లో 4,6.. తర్వాతి ఓవర్‌లో పోవెల్ (11) రెండు ఫోర్లతో పంజాబ్‌లో గుబులు రేపారు. అదే ఓవర్‌లో పోవెల్, కేశవ్ (1)లను సామ్ కర్రాన్ అవుట్ చేసి ఆర్ఆర్‌లో ఆందోళన రేపాడు. ఇక ఆఖరి ఓవర్‌లో 10 రన్స్ కావాల్సిన వేళ.. అర్షదీప్ రెండు డాట్ బాల్స్ వేసినా హెట్‌మయెర్ ఆ తర్వాత 6,2,6తో రాజస్థాన్‌ను సంబరాల్లో ముంచాడు.

బౌలర్లదే జోరు: తొలి పది ఓవర్లలో 53/4. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ స్కోరిది. రాజస్థాన్ బౌలర్లు అదరగొట్టడంతో పరుగులు రాకపోగా, వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి జట్టు కష్టాల్లో పడింది. చివరి ఓవర్లలో అశుతోష్ ధాటికి కాస్త పరువు దక్కించుకుంది. కెప్టెన్ ధవన్ గాయంతో బరిలోకి దిగకపోగా.. బెయిర్‌స్టో (15)కు జతగా అథర్వ (15) బరిలోకి దిగాడు. అయితే నాలుగో ఓవర్‌లోనే అతడిని పేసర్ అవేశ్ వెనక్కి పంపాడు. ఇక వరుస ఓవర్లలో ప్రభ్‌సిమ్రన్ (10)ను చాహల్, బెయిర్‌స్టోను కేశవ్ అవుట్ చేయడంతో పంజాబ్ పతనం మొదలైంది. ఈ మ్యాచ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన సామ్ కర్రాన్ (6)ను పదో ఓవర్‌లో కేశవ్ అవుట్ చేశాడు. ఇదే ఓవర్‌లో శశాంక్ (9) ఎల్బీ కావాల్సి ఉన్నా అంపైర్ కాల్‌తో గట్టెక్కాడు. ఐదు ఓవర్లపాటు కనీసం ఫోర్ కూడా రాకపోగా 12వ ఓవర్‌లో జితేశ్, శశాంక్‌ల ఒక్కో ఫోర్‌తో 12 రన్స్ వచ్చాయి కానీ తర్వాతి ఓవర్‌లోనే శశాంక్‌ను పేసర్ కుల్దీప్ అవుట్ చేయగా, మరుసటి బంతికే లివింగ్‌స్టోన్ క్యాచ్‌ను కీపర్ శాంసన్ అందుకోలేకపోయాడు. పరుగులు మరింత కష్టంగా మారిన వేళ 15వ ఓవర్‌లో జితేశ్ తమ ఇన్నింగ్స్‌లో తొలి సిక్సర్‌ను బాదాడు. 16వ ఓవర్‌లోనూ జితేశ్ మరో సిక్సర్‌తో పాటు లివింగ్‌స్టోన్ 4,6తో 17 రన్స్ రాగా స్కోరు కూడా వంద దాటింది. ఇక పంజాబ్ ఆటలో వేగం పెరిగిందనుకునేలోపే అవేశ్ ఓవర్‌లో జితేశ్ పెవిలియన్‌కు చేరగా, లివింగ్‌స్టోన్ రనౌటయ్యాడు. అప్పటికి 18 ఓవర్లలో స్కోరు 122/7 మాత్రమే. ఈ స్థితిలో అశుతోశ్ 19వ ఓవర్‌లో ఇచ్చిన క్యాచ్‌ను శాంసన్, అవేశ్ ఢీకొని వదిలేశారు. ఆ తర్వాత రెండు సిక్సర్లతో అత్యధికంగా 18 రన్స్ రాబట్టాడు. అయితే ఆఖరి ఓవర్‌లో బౌల్ట్ ఆరు పరుగులే ఇచ్చి అశుతోష్ వికెట్ తీశాడు.



కేశవ్ మహరాజ్ (4-0-23-2)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	6	5	1	0	10	0.767
కోల్‌కతా	4	3	1	0	6	1.528
చెన్నై	5	3	2	0	6	0.666
లఖ్‌నవూ	5	3	2	0	6	0.436
హైదరాబాద్	5	3	2	0	6	0.344
గుజరాత్	6	3	3	0	6	-0.637
ముంబై	5	2	3	0	4	-0.073
పంజాబ్	6	2	4	0	4	-0.218
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	6	1	5	0	2	-1.124

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

పంజాబ్: అథర్వ (సి) కుల్దీప్ (బి) అవేశ్ 15, బెయిర్‌స్టో (సి) హెట్‌మయెర్ (బి) కేశవ్ 15, ప్రభ్‌సిమ్రన్ (సి) జురెల్ (బి) చాహల్ 10, కర్రాన్ (సి) జురెల్ (బి) కేశవ్ 6, జితేశ్ (సి) పరాగ్ (బి) అవేశ్ 29, శశాంక్ (సి) జురెల్ (బి) కుల్దీప్ 9, లివింగ్‌స్టోన్ (రనౌట్) 21, అశుతోష్ (సి) కేశవ్ (బి) బౌల్ట్ 31, హర్‌ప్రీత్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 147/8; వికెట్ల పతనం:** 1-27, 2-41, 3-47, 4-52, 5-70, 6-103, 7-122, 8-147; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-22-1, కుల్దీప్ సేన్ 4-0-35-1, అవేశ్ ఖాన్ 4-0-34-2, చాహల్ 4-0-31-1, కేశవ్ మహరాజ్ 4-0-23-2.

రాజస్థాన్: జైస్వాల్ (సి) హర్షల్ (బి) రబాడ 39, తనుష్ (బి) లివింగ్‌స్టోన్ 24, సంజూ శాంసన్ (ఎల్బీ) రబాడ 18, రియాన్ పరాగ్ (సి) రబాడ (బి) అర్షదీప్ 23, ధ్రువ్ జురెల్ (సి) శశాంక్ (బి) హర్షల్ 6, హెట్‌మయెర్ (నాటౌట్) 27, పావెల్ (సి) జితేశ్ (బి) కర్రాన్ 11, కేశవ్ (సి) లివింగ్‌స్టోన్ (బి) కర్రాన్ 1, బౌల్ట్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 19.5 ఓవర్లలో 152/7; వికెట్ల పతనం:** 1-56, 2-82, 3-89, 4-113, 5-115, 6-136, 7-138; **బౌలింగ్:** అర్షదీప్ 3.5-0-45-1, రబాడ 4-0-18-2, కర్రాన్ 4-0-25-2, లివింగ్‌స్టోన్ 3-0-21-1, హర్షల్ 2-0-21-1, హర్‌ప్రీత్ బ్రార్ 3-0-22-0.

రజత రాధిక

శివానికి కాంస్యం ● ఆసియా రెజ్లింగ్



రాధిక

బిష్కెక్ (కిర్గిస్థాన్): ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్ మహిళల తొలిరోజు పోటీల్లో భారత రెజ్లర్లు అదరగొట్టారు. ఒక రజతం, ఓ కాంస్య పతకంతో సత్తా చాటారు. శనివారం జరిగిన 68 కిలోల ఫైనల్లో రాధిక 2-15తో నొనొకా ఒజాకి చేతిలో ఓటమిపాలై రజత పతకం దక్కించుకుంది. అంతకుముందు తొలి బౌట్‌లో అల్బినా (కజకిస్థాన్)పై సాంకేతిక ఆధిపత్యంతో నెగ్గిన రాధిక..సెమీస్‌లో గుల్‌నూరా (కిర్గిస్థాన్)ను చిత్తు చేసింది. ఇక 50 కేజీల విభాగం కాంస్య పతక పోరులో శివాని 9-7తో మంగోలియాకు చెందిన డోల్గోజొవ్‌ను చిత్తుచేసింది.

పంత్‌పై ఓ మ్యాచ్ నిషేధం?



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌పై ఓ మ్యాచ్ సస్పెన్షన్ విధించే అవకాశం కనిపిస్తోంది. స్లో ఓవర్ రేట్ కారణంగా పంత్‌పై ఇప్పటికే రెండుసార్లు జరిమానా పడింది. గత నెల 31న చెన్నైతో మ్యాచ్‌లో, ఈ నెల 3న కోల్‌కతాతో మ్యాచ్‌లో సమయ నిబంధనను అతిక్రమించాడు. అయితే, శుక్రవారం లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో కూడా ఢిల్లీ నిర్ణీత సమయానికి వేయాల్సిన ఓవర్ల కంటే తక్కువే బౌల్ చేసింది. 16 ఓవర్ల వరకూ సమయపాలనలో క్యాపిటల్స్ వెనుకబడినా.. చివరి ఓవర్ బౌల్ చేసేలోపు ఆ ఆలస్యాన్ని భర్తీ చేసింది. అంతేకాకుండా అంపైర్‌తో పంత్ వాగ్వాదానికి కూడా దిగాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం మూడోసారి స్లో ఓవర్ రేట్‌కు పాల్పడితే ఆ టీమ్ కెప్టెన్‌పై రూ. 30 లక్షల జరిమానాతో పాటు ఓ మ్యాచ్ నిషేధం విధించే అవకాశం ఉంది. అయితే, పంత్ జరిమానా విషయమై ఐపీఎల్ నిర్వాహకుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.



6 బంతుల్లో.. సిక్సులు

నేపాల్ బ్యాటర్ దీపేంద్ర రికార్డు

అల్ అమీరత్ (ఖతార్): నేపాల్ బ్యాటర్ దీపేంద్ర సింగ్ ఐరీ ఒకే ఓవర్‌లో ఆరు వరుస సిక్సర్లతో దుమ్మురేపాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సులు బాదిన మూడో బ్యాటర్‌గా సింగ్ రికార్డులకెక్కాడు. ఏసీసీ ప్రీమియర్ కప్‌లో కతార్‌తో జరిగిన మ్యాచ్‌లో దీపేంద్ర ఈ అరుదైన ఫీట్‌ను నమోదు చేశాడు. 2007 టీ20 వరల్డ్‌కప్‌లో బ్రాడ్ బౌలింగ్‌లో యువరాజ్ సింగ్ ఒకే ఓవర్‌లో ఆరు సిక్సులు బాదగా.. 2021లో శ్రీలంకతో మ్యాచ్‌లో స్పిన్నర్ ధనంజయ బౌలింగ్‌లో వెస్టిండీస్ బ్యాటర్ కీరన్ పొలార్డ్ ఈ రికార్డును సాధించాడు. వన్డేల్లో గిబ్స్ (సౌతాఫ్రికా), జస్‌కరణ్ మల్హోత్రా (యూఎస్) కూడా ఈ ఫీట్‌ను నమోదు చేశారు. కాగా, దీపేంద్ర నిరుడు మంగోలియాతో జరిగిన టీ20 మ్యాచ్‌లో 9బంతుల్లోనే అర్ధసెంచరీ బాది రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే.

హుసాముద్దీన్‌పై వేటు

- బాక్సింగ్ జట్టులో మళ్లీ అమిత్
- ఒలిపింక్ క్వాలిఫయింగ్ టోర్నీ

న్యూఢిల్లీ: వరల్డ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత అమిత్ పంగల్ భారత బాక్సింగ్ జట్టులో పునరాగమనం చేశాడు. బ్యాంకాక్‌లో వచ్చేనెల 25 నుంచి జరిగే ఒలింపిక్స్ ఆఖరి క్వాలిఫయింగ్ టోర్నీకి శనివారం ప్రకటించిన జట్టులో అతడు చోటు దక్కించుకున్నాడు. గత నెలలో ఇటలీలో జరిగిన క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో మన బాక్సర్లు ఘోరంగా విఫలమై ఒక్కరూ విశ్వ క్రీడల బెర్త్ సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో..బ్యాంకాక్‌లో జరిగే పోటీలకు జట్టులో సమూల మార్పులు చేశారు. తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ (57కి.), దీపక్ భోరియా (51కి.), శివ థాపా (63.5కి.) లక్ష్యా చాహర్ (80కి.), జాస్మిన్ లంబోరియా (60కి.) సహా ఇటలీ టోర్నీలో తలపడిన ఐదుగురు బాక్సర్లపై వేటు వేశారు.

శరత్ కమల్‌కు డాక్టరేట్



చెన్నై (ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్‌కు చెన్నైలోని 'వేల్స్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం వర్సిటీ ప్రాంగణంలో జరిగిన 14వ స్నాతకోత్సవం సందర్భంగా అఖిల భారత సాంకేతిక విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, వర్సిటీ వ్యవస్థాపకులు, చాన్స్‌లర్ డాక్టర్ ఐసరి గణేష్ డాక్టరేట్‌ను శరత్‌కు అందజేశారు.

హాకీలో ఐదోదీ పాయె

పెర్త్: ఆస్ట్రేలియాతో హాకీ టెస్టు సిరీస్‌లో భారత పురుషుల జట్టు పూర్తిగా విఫలమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన ఆఖరి పోరులోనూ పరాజయం పాలైంది. భారత్ 2-3తో ఆతిథ్య ఆసీస్ చేతిలో కంగుతింది. ఫలితంగా ఈ సిరీస్‌ను ఆసీస్ 5-0తో క్లీన్‌స్వీప్ చేసింది.

టెన్నిస్‌లో అమ్మాయిలకు నిరాశ

చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్‌లో భారత టెన్నిస్ అమ్మాయిల జట్టుకు నిరాశ ఎదురైంది. ఆసియా/ఓసియానియా గ్రూప్-1లో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 1-2తో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. ఫలితంగా ఆరు జట్లు తలపడే ఈ గ్రూప్-1 పోరులో భారత్ మూడోస్థానంతో సరిపెట్టుకుంది. దీంతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైన భారత జట్టు మళ్లీ గ్రూప్-1కే పరిమితమైంది. కివీస్‌తో పోరులో తొలి సింగిల్స్‌లో రుతుజా ప్రత్యర్థిని ఓడించి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించినా, ఆ తర్వాత రెండో సింగిల్స్‌లో అంకితా రైనా ఓటమిపాలైంది. అనంతరం జరిగిన డబుల్స్ పోరులోనూ అంకిత-ప్రార్థన జోడీ ఓడడంతో భారత్‌కు నిరాశ తప్పలేదు.

బిజినెస్

మార్కెట్లోకి హెచ్‌పీ ఏఐ ఆధారిత ల్యాప్‌ట్యాప్స్



హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి హెచ్‌పీ ఇండియా ఏఐ ఆధారిత ల్యాప్‌టాప్స్‌ను విడుదల చేసింది. గేమర్స్, క్రియేటర్స్ కోసం ఈ ల్యాప్‌ట్యాప్స్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు సంస్థ హెడ్ (కన్స్యూమర్, గేమింగ్ పీసీ) టీ గణేశ్ వెల్లడించారు. ఒమెన్ ట్రాన్సెండ్ 14, హెచ్‌పీ ఎన్వీ ఎక్స్360 14 పేరుతో వీటిని తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ఇందులో ఒమెన్ ట్రాన్సెండ్ 14ను ఎన్‌విడియా జీఈ ఫోర్స్ ఆర్‌టీఎక్స్ 4060 గ్రాఫిక్స్‌తో రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా హెచ్‌పీ తీసుకువచ్చిన అతి తేలికైన గేమింగ్ ల్యాప్‌ట్యాప్ ఇదని గణేశ్ తెలిపారు. కాగా మైక్రోసాఫ్ట్ కోపైలట్ బటన్‌తో ఎన్వీ ఎక్స్ 360 ల్యాప్‌ట్యాప్స్‌ను రూపొందించామన్నారు. ఇంటెల్ కోర్ అల్ట్రా ప్రాసెసర్స్‌తో కూడిన ఈ ల్యాప్‌ట్యాప్స్ హై-ఎండ్ గేమింగ్, క్రియేషన్‌కు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఇందులో హెచ్‌పీ ఒమెన్ ట్రాన్సెండ్ ధర రూ.1,74,999గా ఉండగా హెచ్‌పీ ఎన్‌వీ 360 ధర రూ.99,999గా ఉన్నాయి.

దేశీయ రియల్టీ రంగంలో 55% తగ్గిన సంస్థాగత పెట్టుబడులు



- జనవరి- మార్చి త్రైమాసికంలో 55.2 కోట్ల డాలర్లకు పరిమితం
- విదేశీ సంస్థాగత పెట్టుబడుల్లో 99% క్షీణత

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన తొలి త్రైమాసికంలో దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలోకి సంస్థాగత పెట్టుబడులు వార్షిక ప్రాతిపదికన 55 శాతం తగ్గి 55.2 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. అందులో విదేశీ సంస్థాగత పెట్టుబడులు 99 శాతం క్షీణించి 1.1 కోట్ల డాలర్లకు పడిపోగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు మాత్రం 21 శాతం పెరుగుదలతో 54.1 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టింగ్ సేవల సంస్థ వెస్టియన్ తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది తొలి త్రైమాసికంలో ఈ రంగంలోకి దేశీయ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల మొత్తం పెట్టుబడులు 123 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు కొత్త పెట్టుబడుల విషయంలో అప్రమత్త ధోరణితో వ్యవహరించారని వెస్టియన్ సీఈఓ శ్రీనివాస్ రావు అన్నారు.

దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రం భారత ఆర్థికాభివృద్ధి అవకాశాలపై అత్యంత ఆశావహంగా ఉన్నారని, స్థిరాస్తి రంగంలో పెట్టుబడులను కొనసాగించారన్నారు. గడిచిన మూడు నెలలకు నమోదైన సంస్థాగత పెట్టుబడుల్లో అత్యధికంగా 23.16 కోట్ల డాలర్లు కమర్షియల్ రియల్ ఎస్టేట్ (ఆఫీస్, రిటైల్, కో-వర్కింగ్, హాస్పిటాలిటీ ప్రాజెక్టులు)లోకి వచ్చాయని వెస్టియన్ రిపోర్టు వెల్లడించింది. కాగా, రెసిడెన్షియల్ ప్రాజెక్టుల్లోకి 22.5 కోట్ల డాలర్ల పెట్టుబడులొచ్చాయి. పారిశ్రామిక, గిడ్డంగుల రంగంలోకి పెట్టుబడులు వార్షిక ప్రాతిపదికన 73 శాతం తగ్గి 5.89 కోట్ల డాలర్లకు పడిపోయాయి.

నగరాలవారీగా చూస్తే, బెంగళూరు అత్యధికంగా 29.9 కోట్ల డాలర్ల సంస్థాగత ఇన్వెస్ట్‌మెంట్లను ఆకర్షించింది. 11 కోట్ల డాలర్ల పెట్టుబడులతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మార్కెట్ ఆ తర్వాత స్థానంలో నిలిచింది. మొత్తం సంస్థాగత పెట్టుబడుల్లో 74 శాతం ఈ రెండు నగరాల్లోకే తరలిరావడం గమనార్హం. కాగా, ఎడెల్‌వీజ్ క్యాపిటల్ అత్యధికంగా 30 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేసినట్లు నివేదిక తెలిపింది. దేశ ఆర్థిక మూలాలు మరింత బలపడటంతో పాటు గిరాకీ పుంజుకున్న నేపథ్యంలో మున్ముందు నెలల్లో ఈ రంగంలోకి సంస్థాగత పెట్టుబడులు మళ్లీ జోరందుకోవచ్చని శ్రీనివాస్ రావు అభిప్రాయపడ్డారు.

పసిడి పరుగు ఎందాకా..?



ఇప్పటికే 2,400 డాలర్లకు ఔన్స్ గోల్డ్

- ఏడాది చివరినాటికి 3,000 డాలర్లకు చేరే చాన్స్
- బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు కొండెక్కుతున్నాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా వీటి ధరలు సరికొత్త రికార్డు స్థాయిలకు పెరిగాయి. దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం రూ.73,000 స్థాయిని దాటగా.. కిలో వెండి రూ.90,000కు చేరుకుంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ క్రితం సెషన్‌లో 2,400 డాలర్లకు ఎగబాకింది. ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పాటు సెంట్రల్ బ్యాంక్‌లు బంగారం నిల్వలను గణనీయంగా పెంచుకోవడం వంటి అంశాలు ధరల ర్యాలీకి ప్రధాన కారణం. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తే వచ్చే ఏడాది నాటికి ఔన్స్ గోల్డ్ 3,000 డాలర్లకు చేరుకోవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా వేసింది.

మరో అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ కూడా బంగారంపై అంచనాలను పెంచింది. ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ బంగారం 2,300 డాలర్లకు పెరగవచ్చని గతంలో అంచనా వేసిన కంపెనీ.. తాజాగా అంచనాను 2,700 డాలర్లకు పెంచింది.

ఫెడ్ రేట్లు-గోల్డ్ డిమాండ్‌ది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో బంగారం కంటే స్థిర ఆదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి మళ్లుతుంటాయి. అమెరికాలో ధరలు మార్కెట్ అంచనాల మేరకు తగ్గకపోవడంతో జూన్ నుంచే ఫెడ్ రేట్ల తగ్గింపు మొదలు కావచ్చన్న అంచనాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. దాంతో పసిడి రేట్లు కాస్త తగ్గుముఖం పట్టవచ్చని బులియన్ వర్గాలు భావించిన తరుణంలో ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయనుందన్న వార్తలు వెలువడ్డాయి. ఇలాంటి అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారానికి డిమాండ్ మళ్లీ పుంజుకుంది. మధ్యలో స్వల్ప దిద్దుబాటుకు లోనయ్యే అవకాశాలున్నప్పటికీ, దీర్ఘకాలికంగా రేట్లు మరింత ఎగబాకడం ఖాయమని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రస్తుత ర్యాలీలో బంగారం ధరలకు 2,450-2,500 డాలర్ల స్థాయిలో గట్టి నిరోధం కన్పిస్తున్నదని.. 2,300-2,250 డాలర్ల స్థాయిలో మద్దతు లభించవచ్చని కమోడిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు.

కళ తప్పిన నగ

బంగారం ధరలు శరవేగంగా పెరగడంతో ఆభరణాల కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయని కోల్‌కతాకు చెందిన సెన్‌కో గోల్డ్ అంటోంది. గడిచిన నెల రోజుల్లో తులం బంగారం ధర 10 శాతం పెరిగింది. 6 నెలల్లో 25-30 శాతం వరకు పెరిగింది. దాంతో ఆభరణాల విక్రయాలు ఇండస్ట్రీ పరంగా 15-20 శాతం వరకు తగ్గాయని సెన్‌కో గోల్డ్ ఎండీ, సీఈఓ సువెంకర్ సేన్ అన్నారు. ధరల పెరుగుదలతో పాటు లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వెంట తీసుకెళ్లగలిగే నగదుపై పరిమితులు కూడా నగల అమ్మకాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు.

కృష్ణపట్నం ఎల్‌పీజీ స్టోరేజీ టెర్మినల్ షురూ

పెట్రోగాజ్ ఇండియా వెల్లడి

చెన్నై: ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం వద్ద రూ.600 కోట్లతో ఏర్పాటు చేసిన ఎల్‌పీజీ దిగుమతి, స్టోరేజీ టెర్మినల్‌ను ప్రారంభించినట్లు పెట్రోడెక్ గ్రూప్ అనుబంధ సంస్థ పెట్రోగాజ్ ఇండియా వెల్లడించింది. అదానీ కృష్ణపట్నం ప్రైవేట్ పోర్టులో ఏర్పాటు చేసిన ఈ కొత్త స్టోరేజీ టెర్మినల్‌తో ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో పాటు గృహ, వాణిజ్య, పారిశ్రామిక, ఆటోమోటివ్ వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందని తెలిపింది. ఈ టెర్మినల్ వార్షిక సామర్థ్యం 15 లక్షల మెట్రిక్ టన్నులు. సరైన రోడ్ నెట్‌వర్క్ కలిగి ఉండటంతో ఈ టెర్మినల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంది. ఈ టెర్మినల్‌లో రెండు రిఫ్రిజిరేటెడ్ స్టోరేజీ ట్యాంకులు, మోడర్న్ జెట్టీ, అన్ని రకాలైన ఎల్‌పీజీ వెస్సెల్స్‌ను నిలిపే అవకాశంతో పాటు 16 ట్రక్ లోడింగ్ బేస్ ఉన్నాయని పెట్రోగాజ్ వెల్లడించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,550 ▼	66,500 ▼	89,000 ▼
ముంబై	73,174 ▲	67,027 ▲	83,819 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ

హైదరాబాద్	390	విజయవాడ	400
చిత్తూరు	468	విశాఖపట్నం	415
గోదావరి	400	వరంగల్	392
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	136	గోదావరి	137
వరంగల్	136	విజయవాడ	137
కరీంనగర్	136	గుంటూరు	137
మహబూబ్‌నగర్	136	ఒంగోలు	137
కర్నూలు	136	చిత్తూరు	151
విశాఖపట్నం	124		

డబ్బు రాకున్నా జీఎస్‌టీ చెల్లించాలా..?

ఇదీ GST



రాంబాబు గొండాల

సుధీర్ ఒక మార్కెటింగ్ నిపుణుడు. వ్యాపార సంస్థలు తమ అమ్మకాలను, లాభాలను పెంచుకోవటానికి, వ్యాపార విస్తరణకు తగు సూచనలు, సలహాలు ఇస్తుంటాడు. ఇందులో భాగంగా ఒక వ్యాపార సంస్థతో రూ.10 లక్షల విలువైన కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు. ఒప్పందం ప్రకారం ముందుగా రూ.5 లక్షలు, పని పూర్తయిన తర్వాత మిగతా రూ.5 లక్షలు సదరు వ్యాపార సంస్థ తగిన జీఎస్‌టీతో సుధీర్‌కు చెల్లించాలి. మొదటి విడత రూ.5 లక్షలను సుధీర్ తన నెలవారీ రిటర్న్‌లో చూపించటంతో పాటుగా దాని మీద జీఎస్‌టీని కూడా ప్రభుత్వానికి చెల్లించాడు. అయితే కాంట్రాక్ట్ మొత్తం పూర్తయిన తర్వాత ఇవ్వవలసిన రూ.5 లక్షలకు గాను తాను ఆ వ్యాపార సంస్థకు జీఎస్‌టీతో కూడిన ఇన్వాయిస్ ఇచ్చాడు. కానీ ఆ వ్యాపార సంస్థ నుంచి ఇంకా తనకు డబ్బు అందలేదు. నిబంధనల ప్రకారం ఆ ఇన్వాయిస్ వివరాలను జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో చూపించాడు. అయితే తనకు ఇంకా డబ్బు అందకపోవటంతో సంబంధిత వివరాలను జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌లో చూపలేదు. అంటే దానికి సంబంధించిన జీఎస్‌టీ చెల్లించలేదు.

ఇదిలా ఉండగా, ఒక రోజు సుధీర్‌కు జీఎస్‌టీ డిపార్ట్‌మెంట్ నుంచి ఒక ఈ-మెయిల్ వచ్చింది. జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-3బీ కి మధ్య వ్యత్యాసం ఉన్న కారణంగా ఆ మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలి అని దాని సారాంశం. తాను చేసిన పని తాలుకా డబ్బు గానీ, సంబంధిత జీఎస్‌టీ గానీ ఇంకా తనకు అందకపోవటంతో తాను జీఎస్‌టీ చెల్లించలేదని, డబ్బు అందగానే చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లిస్తానని చెప్పినా.. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఈ మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని అధికారులు వివరించటంతో సుధీర్ కొంత గందరగోళానికి లోనయ్యాడు. తనకు రాని డబ్బు మీద పన్ను చెల్లించాల్సి రావటం ఇబ్బందికరంగా అనిపించింది. ముందే ఇన్వాయిస్ ఇవ్వకుండా, డబ్బులు తీసుకునే సమయంలోనే ఇన్వాయిస్ ఇచ్చి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదేమో అని ఆలోచించాడు. కానీ, ఇన్వాయిస్ ఇవ్వకున్నా జీఎస్‌టీ మాత్రం తగు సమయంలో చెల్లించాలన్న విషయం సుధీర్‌కు తెలియదు. పన్ను ఎప్పుడు చెల్లించాలనే కనీస అవగాహన లేకపోవటం ఈ గందరగోళానికి కారణం.

నిజానికి ఈ విషయంలో చాలా మందికి కొంత అవగాహనా లోపం ఉంది. డబ్బు వచ్చినప్పుడే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని అనుకుంటారు. కానీ, ఇది అన్ని వేళలా నిజం కాదు. జీఎస్‌టీలో పన్ను ఎప్పుడు చెల్లించాలనే విషయం గురించి టైమ్ ఆఫ్ సప్లయ్ నిబంధన చెబుతుంది. సర్వీస్‌లు, గూడ్స్‌కు ఈ నిబంధనలు వేర్వేరుగా ఉంటాయి. పైన చెప్పిన ఉదాహరణలో సుధీర్ సేవల రంగంలో ఉన్నాడు. కాబట్టి సర్వీస్‌లకు సంబంధించిన నిబంధనల గురించి తెలుసుకుందాం.

సర్వీస్‌లకు సంబంధించి టైమ్ ఆఫ్ సప్లయ్ నిబంధన ఇన్వాయిస్ జారీ చేసిన సమయాన్ని బట్టి నిర్ధారణ అవుతుంది. అంటే ఇన్వాయిస్ నిర్ణీత సమయంలో ఇచ్చారా లేదా అనే దాన్ని బట్టి ఉంటుంది. సాధారణంగా సర్వీస్‌లకు ఇన్వాయిస్ ఇవ్వడానికి నిర్ణీత సమయం అంటే సర్వీస్ పూర్తయిన తర్వాత నెల రోజుల లోపు. ఒకవేళ నెల రోజుల లోపు ఇన్వాయిస్ ఇస్తే ఇన్వాయిస్ ఇచ్చిన తేదీ లేదా దానికి సంబంధించిన పేమెంట్ తేదీ.. ఈ రెండింటిలో ఏది ముందైతే అది టైమ్ ఆఫ్ సప్లయ్. ఒకవేళ ఇన్వాయిస్ నిర్ణీత సమయంలో ఇవ్వకుంటే సర్వీస్ పూర్తయిన తేదీ లేదా పేమెంట్ వచ్చిన తేదీ ఈ రెండిట్లో ఏది ముందైతే అది టైమ్ ఆఫ్ సప్లయ్ కింద లెక్కించాలి.

పైన చెప్పిన ఉదాహరణలో పేమెంట్ ఎలాగూ రాలేదని చెప్పుకున్నాం. కాబట్టి ఇన్వాయిస్ నిర్ణీత సమయంలో ఇచ్చి ఉంటే, ఇన్వాయిస్ ఇచ్చిన తేదీ టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. ఒకవేళ ఇన్వాయిస్ నెల రోజుల లోపు జారీ చేయకుండా, డబ్బులు వచ్చే ముందు జారీ చేయవచ్చని అనుకుంటే, సర్వీస్ పూర్తయిన తేదీ టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. కాబట్టి జీఎస్‌టీ ఎప్పుడు చెల్లించాలనే అంశం కేవలం పేమెంట్ మీదనే ఆధారపడి ఉండదు. జీఎస్‌టీ కింద నమోదైన అందరూ ఈ విషయంలో అవగాహన కలిగి ఉండాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

రాయలసీమను రక్తసముద్రంగా మార్చాడు

- అప్పులు చేసి నవరత్నాల పేరిట జగన్ దోచేశాడు: బాలకృష్ణ
- కదిరిలో 'స్వర్ణాంధ్ర సాకారయాత్ర' ప్రారంభం



శ్రీసత్యసాయి జిల్లా కదిరి జీవిమాను సర్కిల్‌లో నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

కదిరి, ఏప్రిల్ 13: సీఎం జగన్ రాయలసీమను రక్త సముద్రంగా మార్చాడని టీడీపీ నేత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి నియోజకవర్గ కేంద్రం నుంచి శనివారం ఆయన 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర'ను ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నికల శంఖం పూరించారు. తొలుత కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, ఆలం ఖాన్ దర్గాలో ప్రార్థనలు చేశారు. తర్వాత యాత్రను ప్రారంభించి.. కదిరి జీవిమాను సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో బాలకృష్ణ ప్రసంగించారు. రాయలసీమకు జగన్ రక్తపు మరకలు అంటించాడని విమర్శించారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి.. కోడికత్తి డ్రామాలు ఆడుతున్నాడని మండిపడ్డారు. రాష్ట్రానికి జగన్ చేసింది ఏమీ లేదని, మూడు రాజధానుల పేరిట కాలం గడిపారని విమర్శించారు. అప్పులు చేసి, నవరత్నాల పేరుతో డబ్బు దోచుకున్నారని ఆరోపించారు. ఆడపడుచుల ఆస్తిలో ఆయన వాటా అడుగుతున్నాడన్నారు. రైతుల అన్నపు మెతుకులను రక్తపు కూడుగా మార్చిన నయ వంచకుడు జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. ముస్లింల రిజర్వేషన్‌లకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని తెలిపారు.

జగన్ ప్రచారంలో 'భారతి' బిల్డప్!

- తాడేపల్లి వద్ద జనంలో ఉండి సీఎంకు అభివాదం
- వైసీపీ వెబ్‌సైట్‌లో ఫొటో ప్రచారం.. నీలి మీడియాలో కూడా..



అమరావతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు తెచ్చిపెట్టుకున్న అద్దె జనం తప్ప.. వైసీపీ శ్రేణుల నుంచి, ప్రజల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో సీఎం జగన్ బిల్డప్ ప్రచారానికి తెరలేపారు. సెంటిమెంటును రంగరించేందుకు.. బస్సుయాత్రలో ఉన్న తనకు భార్య భారతీ రెడ్డి అభివాదం చేసిన ఫొటోను ప్రచారంలో పెట్టారు. శనివారం తాడేపల్లి జాతీయ రహదారి మీదుగా జగన్ బస్సుయాత్ర సాగింది. ఈ సమయంలో భారతీరెడ్డి జగన్‌ను నేరుగా కలువకుండా జనం నుంచే పలుకరిస్తూ అభివాదం చేశారు. వాస్తవానికి గత నెల 27వ తేదీ నుంచి ఇంటికి దూరంగా యాత్రలో ఉన్న ఆయన్ను నేరుగా కలసి యోగక్షేమాలు తెలుసుకోవచ్చు. కానీ దానివల్ల పెద్దగా ప్రచారం రాదనుకున్నారో ఏమో.. తాడేపల్లి రోడ్డుపై జనం మధ్య నుంచే జగన్‌కు ఆమె అభివాదం చేస్తున్న ఫొటోను వైసీపీ అధికార వెబ్‌సైట్లో పెట్టారు. సెంటిమెంటు బిల్డప్‌తో రాజకీయ లబ్ధి పొందాలని నీలి మీడియా కూడా ఆ ఫొటోకు తెగ ప్రచారం కల్పించింది. సీఎం భార్య సహజంగా జనంలోకి వస్తే వారు విస్మయానందాలు వ్యక్తం చేస్తారు. ఆమెను పలకరించేందుకు, కలిసేందుకు, చేరువగా వెళ్లడానికి ప్రయత్నిస్తారు. ఇక వైసీపీ కార్యకర్తలైతే నినాదాలతో హోరెత్తిస్తారు. అయితే ఇక్కడ అలాంటి దృశ్యాలేవీ కనిపించలేదు. అక్కడున్న మహిళలెవరూ భారతీరెడ్డిని పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. దీంతో ఈ ప్రచారంపై సోషల్ మీడియాలో నెగెటివ్ కామెంట్లు వచ్చాయి. 'చాల్లే బిల్డప్‌లు' అని నెటిజెన్లు విమర్శించారు. జగన్ అండ్ కో ఇక మారరంటూ ఇంకొందరు వ్యాఖ్యానించారు.

తప్పుడు ప్రచారకర్తలను వదిలిపెట్టం: బీజేపీ

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దురుద్దేశంతో, రాజకీయంగా నష్టం చేకూర్చేందుకు బీజేపీ నేతలపై తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తుల్ని వదిలిపెట్టే ప్రసక్తేలేదని బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, 'మా పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి అనని మాటల్ని ఏబీఎన్, ఈటీవీ తదితర మీడియా పేర్లతో ఫేక్ వీడియోలు సృష్టించారు. వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఈ పనికి పాల్పడుతున్నది వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవ్ అని మా అనుమానం. ఇప్పటికే సైబర్ పోలీసులకు, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. త్వరలో కేంద్ర ఏజెన్సీలకు కూడా ఫిర్యాదు ఇచ్చి ఫేక్ గాళ్లను జైలుకు పంపుతాం' అని పాతూరి ధీమా వ్యక్తం చేశారు.

చంద్రబాబుకు మద్దతు తెలిపిన క్రిస్టియన్ సెల్

రేపల్లె, ఏప్రిల్ 13: తెలుగుదేశం ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించి, వారి అభ్యున్నతికి కృషి చేసిందనని ఆ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాసు అన్నారు. రేపల్లెకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం క్రిస్టియన్ సెల్ బిషప్పులు, పాస్టర్లు కలసి మద్దతు ప్రకటించారు. టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని హామీనిచ్చారు.

జగన్ దంపతుల ఓట్లు పులివెందులలోనా: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాత్రిళ్లు ఎక్కడ నిద్రపోతే అక్కడే ఓట్లు ఉండాలని తమ పార్టీ నాయకుడు బొండా ఉమాను అన్నప్పుడు... ఐదేళ్లుగా తాడేపల్లిలో ఉంటున్న జగన్ దంపతుల ఓట్లు పులివెందులలో ఎలా ఉంటాయని టీడీపీ ప్రశ్నించింది. వలంటీర్లను కించపరిచేలా నోటికొచ్చినట్లు మాట్లాడి, వారిని అగౌరవపరిచిన మంత్రి ధర్మానపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. 'జగన్ జిందాబాద్' అంటూ వాట్సాప్‌లో మెస్సేజ్‌లు ఫార్వార్డ్ చేసిన నాగార్జున యూనివర్సిటీ సూపరింటెండెంట్ వెంకటప్పరెడ్డిని సస్పెండ్ చేసిన విధంగానే.. జగన్ కోసం విద్యార్థులతో ఎన్నికల సర్వేలు చేయిస్తున్న ఆంధ్ర వర్సిటీ వీసీ ప్రసాదరెడ్డిని కూడా వెంటనే సస్పెండ్ చేయాలని టీడీపీ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ కోరారు.

కారుకు దారివ్వలేదని వైసీపీ ఎంపీపీ దాడి

- అడ్డొచ్చిన మహిళ చెయ్యి విరగ్గొట్టిన ఎంపీపీ



బాధితులు ఆదిలక్ష్మమ్మ, వెంకటేశ్

హిందూపురం, ఏప్రిల్ 13: కారులో వెళుతున్న తనకు దారి ఇవ్వలేదన్న సాకుతో టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ ఎంపీపీ దాడి చేసిన ఘటన ఇది. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం హుసేన్‌పురంలో ఈ ఘటన జరిగింది. చిలమత్తూరు ఎంపీపీ, వైసీపీ నాయకుడు పురుషోత్తంరెడ్డి మూడు రోజుల కిందట తన స్వగ్రామం హుసేన్‌పురానికి కారులో వెళుతున్నాడు. అదే సమయంలో టీడీపీ సానుభూతిపరుడు వెంకటేశు, మరోవ్యక్తి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్నారు. తాను వస్తున్నా పట్టించుకోకుండా రోడ్డుకు అడ్డంగా నడుస్తున్నారని ఆగ్రహిస్తూ.. పురుషోత్తం రెడ్డి కారు ఆపి వారిని దూషించాడు. అక్కడి నుంచి వెళ్లిపోయి.. బంధువులు, అనుచరులతో కలిసి వచ్చి వెంకటేశ్ ఇంటిపై దాడి చేశారు. వెంకటేశ్‌ను చితకబాదారు. అడ్డొచ్చిన అత్త ఆదిలక్ష్మమ్మను కూడా కొట్టారు. ఈ దాడిలో ఆమె కుడి చెయ్యి విరిగింది. బాధితురాలిని కుటుంబ సభ్యులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పురుషోత్తంరెడ్డి, మరో నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ దాడి గురించి మీడియాకు చెప్పకూడదని పోలీసులు హెచ్చరించడంతో.. మూడు రోజుల తర్వాత బాధితులు ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు.



వెయ్యి మంది జగన్‌లు వచ్చినా..



ప్రత్తిపాడులో నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం, నాగలితో చంద్రబాబు అభివాదం

19న చంద్రబాబు తరపున భువనేశ్వరి నామినేషన్

కుప్పం, ఏప్రిల్ 13: టీడీపీ అధినేత చంద్రబాబు తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 19న నామినేషన్ దాఖలు చేయనున్నారు. పార్టీ వర్గాల నుంచి సేకరించిన సమాచారం మేరకు.. 'ఈనెల 18న భువనేశ్వరి కుప్పం చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్త చంద్రబాబు తరపున 19వ తేదీ మధ్యాహ్నం 12.33 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి పెద్ద ఊరేగింపు నిర్వహించాలని నియోజకవర్గ పార్టీ సంకల్పించింది. నామినేషన్ దాఖలుకు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రభంజనంలా తరలి రావాలని పార్టీ విజ్ఞప్తి చేసింది. ఆమేరకు పార్టీ సామాజిక మాధ్యమాల్లో టీడీపీ వర్గాలు శనివారం నుంచే విస్తృత ప్రచారం చేస్తున్నాయి.

అమరావతిని కదిలించలేరు

(మొదటి పేజీ తరువాయి)

తెచ్చా. నాలెడ్జ్ హబ్‌గా మార్చాలని కోరుకున్నా. తిక్కలోడు వచ్చాడు. నాశనం చేశాడు' అంటూ ముఖ్యమంత్రి జగన్‌పై మండిపడ్డారు. సిగ్గుంటే.. ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాగళంలో భాగంగా శనివారం గుంటూరు జిల్లా తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రాల్లో ఆయన భారీ బహిరంగ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల చేసే రోజే అమరావతే రాజధాని అని మీరంతా వేడుక జరుపుకొనే రోజని, ఆ రోజున జగనాసుర వధ.. అమరావతి రక్షణ రెండూ జరుగుతాయని చెప్పారు. 'ఇది తాడికొండ కాదు.. ఇది అమరావతి. రాష్ట్ర రాజధాని అమరావతి. నేను ఈరోజు వచ్చింది రాజధాని అమరావతికి. రాష్ట్రం నడిబొడ్డు నుంచి మాట్లాడుతున్నా.. అధికార కేంద్రం నుంచి మాట్లాడుతున్నా.. ఎవ్వరూ అమరావతిని ఒక వెంట్రుకవాసి కూడా కదిలించలేరు!' అని తేల్చిచెప్పారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చేందుకు ముందుకొచ్చిన 29 వేల మంది రైతులకు శిరస్సు వంచి నమస్కారాలు తెలిపారు. 'ఒకనాటి శాతవాహనుల రాజధాని, దేవతల రాజధాని అమరావతి. దేశంలోని అన్ని దేవాలయాలు, నదులు, మసీదులు, చర్చిల నుంచి పవిత్రమైన మట్టి, పుణ్యజలం తెచ్చి అమరావతిని పునీతం చేశా. అందువల్ల ఇలాంటి జగన్‌లు వంద మంది కాదు..

> గుంతలు పడిన రోడ్లలో మట్టి వేయలేని వాడు.. మూడు రాజధానులు కడతాడా? సీపీఎస్‌ను వారంలో రద్దు చేస్తానని అధికారంలోకి వచ్చి ఎన్ని వారాలైనా ఎదురు చూడాల్సిందేనా? ఇదీ ఆయన విశ్వసనీయత. చేసేవన్నీ తప్పుడు పనులు.. చెప్పేవన్నీ అబద్ధాలు.
>
> - చంద్రబాబు

వెయ్యి మంది వచ్చినా అమరావతిని ఒక్క ఇంచ్ కూడా కదలించలేరు. దాని ముహూర్తబలం.. స్థానబలం అలాంటిది' అని స్పష్టం చేశారు. తాను రాజధానిపై 2019లో చేసిన హెచ్చరికలను ప్రజలకు గుర్తుచేశారు. 'తిక్కలోడికి ఓటేయొద్దని చెప్పా. ముద్దులు పెట్టాడు. బుగ్గలు తాకాడు. మీరంతా ఐసైపోయి అవకాశం ఇచ్చేశారు. ఒక్కసారని కరెంటు తీగలు పట్టుకుంటే ఏమవుతుందో తెలిసిందా' అని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమన్నారంటే..

రాజధాని మహిళలకు అభినందనలు..

అమరావతి నిర్మాణానికి నాకిచ్చిన అవకాశాన్ని ఏమాత్రం వృథా చేయకుండా రాజధాని పనులు చేపట్టాను. రాయి రాయి పేర్చుకుంటూ నిర్మించాను. దానిని జగన్ ధ్వంసం చేశాడు. రాజధాని అమరావతి పరిరక్షణ కోసం రైతులు, మహిళలు అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ప్రత్యేకించి అమరావతి మహిళల పోరాటం అమోఘం.. వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. 3 వేల కేసులు.. అడుగడుగునా అవమానాలు, పోలీసుల హింస, స్టేషన్లో, జైల్లో పెట్టి వేధింపులు. ఎన్ని చేసినా పోరాటం ఆపకుండా న్యాయస్థానం టూ దేవస్థానం పాదయాత్ర చేపడితే దారి మధ్యలో భోజనం చేయడానికి లేకుండా దుర్మార్గుడు జగన్ వేధించాడు. అయినా సరే రోడ్డు మీదే తిని పోరాటం కొనసాగించిన మహిళలు, రైతుల పోరాటం మరువలేనిది. మీ పోరాటంతోనే అమరావతి గెలిచింది. నిలిచింది. అయితే రాజధాని విధ్వంసం వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ప్రభుత్వానికి రావలసిన 4-5 లక్షల కోట్ల ఆదాయం నష్టం జరిగింది. కనీస ఇంగిత జ్ఞానం ఉన్నవాడైతే 10 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను కూల్చేస్తాడా? మళ్లీ నేను రాగానే దాని నిర్మాణం జరుగుతుంది.

సీఎంగా విఫలం..

జగన్ మొద్దబ్బాయి. ముఖ్యమంత్రిగా విఫలమయ్యాడు. సీఎంగా ఏమాత్రం పనికిరాడు. 99 శాతం హామీలు అమలు చేశానంటున్నాడు. ప్రజలు మాత్రం ఆయన ఐదేళ్ల పాలనకు ఇచ్చే మార్కులు సున్నా. ఎన్నికలకు ముందు కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్నాడు. అదే ఈ రాష్ట్రానికి సంజీవని అని కూడా చెప్పాడు. ఆయన మాటలు నమ్మి ప్రజలు అధికారం ఇచ్చినందుకు సర్వనాశనం చేశాడు. ఇసుక మాఫియాకు డాన్ జగన్. అధికారంలోకి వస్తూనే ఉచిత ఇసుకను రద్దు చేసి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్ట కొట్టాడు. ఈ రోజుకూ వాళ్లు తేరుకోలేదు. పొత్తులతో ప్రజల ముందుకు వచ్చాం. మా మూడు పార్టీల జెండాలు వేరైనా ఎజెండా ఒక్కటే. నేను కష్టాల్లో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ వచ్చి సంఘీభావం తెలిపారు. అవసరమైతే త్యాగాలు చేద్దాం తప్ప ఓటు చీలకూడదన్నారు. ఇందుకోసం అందరం కొంత తగ్గాం. మాతో ఎంఆర్‌పీఎస్ కూడా జత కట్టింది. ఆనాడు నేనే ఎస్సీల వర్గీకరణ చేశాను. ప్రధాని మోదీ కూడా అంగీకరించారు. అధికారంలోకి రాగానే జిల్లాల వారీగా వర్గీకరణ చేసి అందరికీ సమన్యాయం చేస్తా.

వలంటీర్లూ.. బెదిరిస్తే భయపడొద్దు

వలంటీర్లు కూడా మనుషులే. మీ జీతాలు కూడా పెంచుతా. రూ.5 వేలను రూ.10 వేలు చేస్తానని ప్రకటించా. ఈ దెబ్బకు వైసీపీ పెద్దలు గిజగిజలాడుతున్నారు. వారితో రాజీనామా చేయిస్తున్నారు. చేయనంటే బెదిరిస్తున్నారు. వచ్చేది మేమే. రాజీనామా చేస్తే ఉద్యోగం గోవిందా! మళ్లీ ఉద్యోగాలు రావు. మిమ్మల్ని బెదిరిస్తే నా పేరు చెప్పండి. చంద్రన్న చెప్పాడు. మీ బెదిరింపులకు భయపడం.. మా జీవితాలు బాగుపడతాయి.. రూ.10 వేలు వస్తుంది. అంతేకాదు రూ.లక్షలు సంపాదించే మార్గం చూపిస్తా. నిన్న తిక్కల మంత్రి అధర్మాన మాట్లాడుతున్నాడు. వలంటీర్లకు నెత్తిన కిరీటం పెడితే ఇప్పుడు మాకే మోసం చేస్తారా? మీ భరతం పడతానన్నాడు. నేను చెబుతున్నా.. ధర్మానా.. నువ్వు ఉండబోయేది ఎక్కడో గుర్తుపెట్టుకో. ఎన్నికల ముందే నీ భరతం వాళ్లు పడతారు. వలంటీర్లు తప్పులు చేసి జీవితాలు నాశనం చేసుకోవద్దు. నేను అండగా ఉంటా.

సూపర్ సిక్స్‌తో జగన్ గుండె ఆగింది..

నేను సూపర్ 6 ప్రకటించగానే జగన్ గుండె ఆగినంత పనైంది. నా మొదటి ప్రాధాన్యం ఆడబిడ్డలకే. అందుకే సూపర్ సిక్స్‌లో మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ప్రకటించాం. నేను సురక్షితమైన డ్రైవర్‌ను. రాష్ట్రాన్ని భద్రతగా ముందుకు నడిపిస్తా. ఆంక్షలు లేకుండా ఇంటివద్దనే రూ.4 వేల పింఛను ఇప్పిస్తాను. 'నేను అసెంబ్లీకి రాను. అది కౌరవసభ. నేను గెలిచి దాన్ని గౌరవ సభగా మార్చి జూన్ 4వ తేదీన గౌరవ సభలో అడుగుపెడతానని చెప్పా. ఆ మాట ప్రకారం సగౌరవంగా అసెంబ్లీలో అడుగుపెడతా.

అమర్‌నాథ్ సోదరి హేమశ్రీకి అండగా ఉంటాం: చంద్రబాబు

రేపల్లె, ఏప్రిల్ 13: ప్రజాగళం పర్యటనకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబును అమర్‌నాథ్ గౌడ్ కుటుంబసభ్యులు శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కలిశారు. వారి యోగక్షేమాలను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. గతేడాది తన అక్కను వేధించిన వైసీపీ సానుభూతిపరుడు వెంకటేశ్వర్లురెడ్డిని ప్రశ్నించినందుకు పదో తరగతి విద్యార్థి అమర్‌నాథ్‌గౌడ్‌పై పెట్రోల్ పోసి, నిప్పంటించి హత్య చేసిన సంగతి తెలిసిందే. అమర్‌నాథ్ కుటుంబానికి టీడీపీ అండగా నిలిచి పోరాడింది. పార్టీ తరఫున చంద్రబాబు ఆ సమయంలో రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. అమర్‌నాథ్‌గౌడ్ సోదరి హేమశ్రీ ఎన్టీఆర్ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్ పూర్తి చేశారు. హేమశ్రీని ఉన్నత చదువులు చదివించే బాధ్యతను తాను తీసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. తాను పోలీస్ అవ్వాలనుకుంటున్నానని హేమశ్రీ చెప్పగా, 'నువ్వు కష్టపడి చదువు.. అన్ని విధాలా నేను అండగా ఉంటానని బాబు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



చిట్టిబాబును కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల

వైసీపీని వీడిన మరో దళిత ఎమ్మెల్యే

- షర్మిల సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకున్న పీ గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అమరావతి(ఆంధ్రజ్యోతి), పీ గన్నవరం, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికలకు ముందు తూర్పుగోదావరి జిల్లాలో సీఎం జగన్మోహన్‌రెడ్డికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పీ గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు వైసీపీకి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. శనివారం కడప లోక్‌సభ పరిధిలో జమ్మలమడుగు ప్రచారంలో ఉన్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వైసీపీలో సీటు దక్కక పోవడంతో ఆయన కొన్ని రోజులుగా ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూవచ్చారు. రాజకీయ భవిష్యత్‌పై అధిష్ఠానం నుంచి హామీ కోసం ఆయన పట్టుబట్టినట్లు ప్రచారం జరిగింది. రెండురోజులు క్రితం ఆయన అనుచరులు, కాంగ్రెస్ నాయకులతో మామిడికుదురు మండలంలో సమావేశం ఏర్పాటుచేసి భవిష్యత్ కార్యక్రమంపై చర్చించారని, త్వరలోనే పార్టీని వీడతారని ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది.

జగన్‌వి హత్యారాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రొద్దుటూరులో కాంగ్రెస్ నిర్వహించిన సభకు హాజరైన జనం

వైఎస్ షర్మిలా రెడ్డిని కాదా!' అని నిలదీశారు. కడప ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగిన ఆమె న్యాయ్‌యాత్ర పేరిట జిల్లాలో చేపట్టిన బస్సుయాత్ర ఐదో రోజైన శనివారం జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో కొనసాగింది. ముద్దనూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరుల్లో ఆమె రోడ్‌షోలకు జనం పెద్ద ఎత్తున హాజరయ్యారు. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్ రెండు సార్లు శంకుస్థాపనలు చేసిన స్థలాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. 'జమ్మలమడుగు నా జన్మస్థానం. ఇదే జమ్మలమడుగులో వైఎస్సార్ పుట్టారు. వైద్యుడిగా రాజశేఖరరెడ్డి ఇక్కడే సేవలు చేశారు. అన్న జగన్, నేను ఇక్కడే పుట్టాం. జగన్ పుట్టడమేమో కానీ, ఇక్కడ ఆసుపత్రి సూపరింటెండెంట్ కూడా కండువా వేసి పార్టీలోకి రావాలని వైసీపీ వారు చెబుతున్నారు. జమ్మలమడుగు గుట్టల ప్రాంతం. ఇక్కడ వైఎస్సార్ కడప స్టీలుప్లాంటు కట్టాలనుకున్నాడు. ఆయన బతికున్నప్పుడే అయ్యేది. చంద్రబాబు ఒకసారి, జగన్ రెండుసార్లు భూమిపూజ చేశారు. చేయాలి చెల్లికి పెళ్లి మళ్లీ మళ్లీ అన్నట్లుగా స్టీలు ఫ్యాక్టరీ తయారైంది. భూమిపూజ తప్ప ఇంకేం చేశారు? జిల్లావాసి సీఎం అయినా జనాలకు ప్రయోజనం లేదు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైతులకు డ్రిప్, వివిధ పథకాలు అందుబాటులో ఉండేవి. వైఎస్ జగన్ ఎన్నో హామీలు ఇచ్చాడు. ఒక్క హామీ అమలు కాలేదు. అందరూ వలస పోతున్నారు. జగన్ రాష్ట్ర విభజనను బీజేపీకి తాకట్టుపెట్టారు. అందుకు వైఎస్సార్ బిడ్డ ఇక్కడ అడుగు పెట్టింది. జగన్ రాష్ట్రాభివృద్ధిని పక్కనబెట్టి హత్యారాజకీయాలు చేస్తున్నాడు. ఇది న్యాయమా?.. ధర్మమా?..' అని షర్మిల ప్రశ్నించారు.

ప్రభుత్వ పథకాల్లోనూ వైఎస్సార్ కనుమరుగు..

'వీళ్ల పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ పార్టీలో వైఎస్ ఉన్నాడా..? ఎక్కడా వైఎస్ కనబడడు! చివరికి ప్రభుత్వ పథకాల్లో కూడా వైఎస్సార్‌ను కనుమరుగు చేస్తున్నారు. వై అంటే వైవీ సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే రామకృష్ణారెడ్డి(సజ్జల). వీళ్ల పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారు. తెలంగాణలో పార్టీ పెట్టి మూసారంటున్నారు. ఆంధ్ర నా పుట్టిల్లు, తెలంగాణ మెట్టినిల్లు. తెలంగాణలో నియంతకు వ్యతిరేకంగా పార్టీ పెట్టా. అక్కడ కూడా వైఎస్సార్ అనే పెట్టా. మీలాగా యువజన శ్రామిక రైతు పార్టీ అని చెప్పుకోవడం కాదు. ఒక నియంతను గద్దె దింపింది ఈ వైఎస్సార్ బిడ్డ. పదవుల కోసం, అధికారం కోసం, ముఖ్యమంత్రి పీఠం కోసం ఏపీకి రాలేదు. ప్రజల కోసం ఇక్కడ వైఎస్ షర్మిల అడుగు పెట్టింది. నేను కడపలో ప్రచారంలో పాల్గొన్నది ఐదు రోజులే. నా ప్రచారంతో వైసీపీలో వణుకు పుట్టింది. ఎంపీ అభ్యర్థి అవినాశ్‌రెడ్డిని మార్చాలని చూస్తున్నారు. నాకు భయపడే కడప ఎంపీని మారుస్తున్నారు. అవినాశ్‌రెడ్డి హంతకుడని ప్రజలు నమ్ముతున్నారు' అని షర్మిల తెలిపారు.

ఎంతకాలం హత్యలు?: సునీత..

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత మాట్లాడుతూ.. వివేకా హత్య విషయంలో న్యాయం కోసం తాను తొక్కని గడప లేదన్నారు. 'ఎంత కాలం హత్యలు చేస్తారు? వివేకా హత్య విషయంలో న్యాయం కావాలి. మీరు న్యాయం వైపు నిలబడాలి. న్యాయ పోరాటంలో షర్మిల ఉంది. న్యాయం గెలవాలంటే షర్మిలను గెలిపించండి. జిల్లా బాగుపడాలంటే షర్మిల ఎంపీ కావాలి. కడప అంటే ఒకప్పుడు ఫ్యాక్షన్. వైఎస్ వివేకాను దారుణంగా హత్య చేశారు. మళ్లీ కడప అంటే అదే గుర్తుకు వస్తోంది. హత్య చేసిన వారికి శిక్ష వేయాలన్నదే మా ప్రయత్నం. ఇటువంటి వారికి శిక్ష పడితే ఇంకో ఘటన జరగకుండా ఉంటుంది. హత్యచేసిన వారు చట్టసభల్లో ఉండకూడదు. షర్మిల గెలిస్తే మా బాధ ఢిల్లీకి వెళుతుంది. విమలమ్మ మా మేనత్త. ఆమె ఏ గొడవా పడలేదు. ఆమెకు ఏమైందో, మా మీద ఎందుకు మాట్లాడుతోందో అర్థం కావడంలేదు' అన్నారు.

'కేసుల'పైనా కుట్రలు!

పోలీస్ సేవా యాప్ బంద్

విపక్షంపై జగన్ కుట్ర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఎన్నికల నామినేషన్ల ఘట్టం 18న ప్రారంభం కానుంది. అభ్యర్థులకు ఆస్తుల వివరాలతో పాటు తమపై నమోదైన పోలీసు కేసుల వివరాలు కూడా కావాలి. ఈ నేపథ్యంలో పోలీసు సేవా యాప్ నుంచే వీటిని డౌన్ లోడ్ చేసుకునే అవకాశం ఉంది. వీటిని తమ అఫిడవిట్లకు జత చేసి అభ్యర్థులు ఎన్నికల అధికారులకు సమర్పిస్తారు. అయితే.. ఇక్కడే అధికార పార్టీ వైసీపీ భయంకరమైన కుట్రకు తెరదీసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోటీ చేసే విపక్ష అభ్యర్థుల కేసుల వివరాలను తొక్కిపెట్టడం ద్వారా నామినేషన్ల ఘట్టం సమయంలోనే వారిని అనర్హులను చేయాలన్నదే ఈ కుట్ర అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. పోలీసు యాప్ వారం రోజులుగా బంద్ అయిపోయింది. అంతే కాదు.. ఈ నెల 25 వరకు ఈ యాప్ పనిచేయదని అంటున్నారు. ఈ వ్యవహారం టెక్నికల్‌గా జరిగిందా? లేక.. ఉద్దేశపూర్వకంగానే నిలిపివేశారా? అనేది తేలాలి. సీఎం జగన్ 2020, సెప్టెంబరు 21న 'ఏపీ పోలీస్ సేవ' పేరుతో సిటిజన్ సర్వీస్ అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 87 రకాల సేవల్ని ఈ యాప్ ద్వారా పొందవచ్చని, ఫిర్యాదు చేసే బాధితులు తమ కేసు స్థితిగతులు, నిందితులు తమపై నమోదైన కేసుల్లోని ఆరోపణలు మొత్తం అరచేతిలోనే తెలుసుకోవచ్చన్నారు. అరెస్టులు, ఎఫ్ఐఆర్‌లు అన్నీ ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని.. స్టేషన్ పరిధి, ఫోన్ నంబరు అన్నీ ఉంటాయన్నారు.

కుట్ర కోణం?

పోలీసు సేవా యాప్‌ను వారం రోజులుగా రాష్ట్ర హోం శాఖ బంద్ చేసింది. రోజూ వేలాది మంది వీక్షించే యాప్ ఎందుకు ఆగిపోయిందని పలువురు ఫోన్లు చేసి ఆరా తీసినా టెక్నికల్ సర్వీసెస్ నుంచి కనీస స్పందన లేదు. ఉగాది, రంజాన్ సెలవులంటూ జిల్లాల్లోని పోలీసులు చెబుతున్నారు. అయితే ప్రతిపక్ష అభ్యర్థులు పోటీ చేయకుండా అనర్హులను చేయడమే అధికార వైసీపీ కుట్రగా చర్చ సాగుతోంది. విపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో పలువురిపై అక్రమ కేసులు పెట్టేందుకు అధికార పార్టీ వ్యూహం పన్నింది. కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ ఆన్‌లైన్‌లో పెడితే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఇచ్చే అఫిడవిట్‌లో ఆ వివరాలను పేర్కొంటారు. అయితే, విపక్ష అభ్యర్థుల్ని దెబ్బ కొట్టేందుకు పథకం పన్నిన వైసీపీ.. యాప్‌ను నిలుపుదల చేసింది. దీంతో అప్రమత్తమైన విపక్షాలు.. తమపై నమోదైన కేసుల వివరాలు ఇవ్వాలంటూ డీజీపీ, జిల్లాల ఎస్పీలను కోరారు. కనీస స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. నెల క్రితమే తాము అడిగినా పోలీసు శాఖ ఇవ్వలేదని వివరించగా.. 'కేసుల వివరాలు ఇవ్వడానికి ఎంత టైమ్ కావాలి.. ఏఐతో మూడు గంటల్లో ఇవ్వొచ్చు..డీజీపీ ఏం చేస్తున్నారు.. 16లోగా సమాచారం ఇవ్వండి' అంటూ పోలీసు శాఖకు హైకోర్టు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 25వ తేదీతో నామినేషన్ల గడువు ముగిసిపోతుంది. ఆ తర్వాత పోలీసు సేవా యాప్ ఆటోమెటిక్‌గా పనిచేస్తుందనే వ్యాఖ్యలు పోలీసుల్లోనే వినిపిస్తున్నాయి.



ఏపీ పోలీస్ సేవ యాప్‌లో ఎర్రర్ చూపుతున్న దృశ్యం

బాబు అరెస్ట్ అయినప్పుడు కూడా..

దేశంలోనే ఇంతటి గొప్ప సేవ ఎక్కడా లేదని సీఎం జగన్ చెప్పిన ఏపీ పోలీస్ సేవా యాప్ ఆగిపోవడం ఆరు మాసాలలో ఇది రెండోసారి. గత ఏడాది సెప్టెంబరు రెండోవారంలో టీడీపీ అధినేత చంద్రబాబును కక్షసాధింపు కేసులో జగన్ ప్రభుత్వం సీఐడీతో అరెస్టు చేయించినప్పుడు ఏపీ పోలీసు సేవ యాప్ ఆగిపోయింది. కేసు వివరాలు తెలుసుకోవడానికి టీడీపీ శ్రేణులు, న్యాయవాదులు, ప్రాత్రికేయులు యాప్‌తోపాటు పోలీసు వెబ్‌సైట్‌లో గాలించారు. కానీ ఈ రెండు సేవలూ ఆగిపోయాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు వివరణ ఇస్తూ అనధికారికంగా ఆపేయాల్సి వచ్చిందని, రాష్ట్రంలో పరిస్థితులు చల్లబడ్డాక పునరుద్ధరిస్తామని చెప్పారు. అక్టోబరులో మళ్లీ పోలీసు సేవ యాప్‌తోపాటు వెబ్‌సైట్ పనిచేసింది. ఇప్పుడు మరోసారి ఎందుకు ఆగిందని తెలుసుకోవడానికి ప్రయత్నించినా పోలీసు శాఖ నుంచి స్పందన రాలేదు. ఎన్నికల సమయంలో ఎక్కడ ఏది జరిగినా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉంటే అధికార పార్టీపై వచ్చే ఫిర్యాదులు నేరుగా ఎన్నికల కమిషన్‌కు తెలిసే అవకాశం ఉన్నందున ఇలా ఆపేశారనే వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి.

జగన్‌పైకి రాళ్లు!


రాళ్ల దాడిలో గాయపడిన తరువాత జగన్


రాళ్ల దాడి తర్వాత మీడియాతో మాట్లాడుతున్న వెలంపల్లి, ఆస్పత్రిలో చికిత్స తర్వాత మాజీ మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సి ఉంది. ఈలోగా జగన్ వెంట ఉన్న స్థానిక నేతలు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ వైద్యులను పిలిపిద్దామని ప్రతిపాదించగా, వద్దని వారించిన జగన్.. ఆస్పత్రికి తానే వస్తానని చెప్పి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. ఆస్పత్రిలో జగన్‌ను ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. అక్కడ ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ మోహన్ ఆధ్వర్యంలో చికిత్స అందించా రు. గాయానికి 3కుట్లు పడ్డాయని, నాలుగైదు రోజుల్లో గాయం నయమైపోతుందని వైద్య వర్గాలు తెలిపాయి. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కూడా అదే ఆస్పత్రిలో తన ఎడమ కంటి కింద తగిలిన గాయానికి చికిత్స తీసుకుని వెళ్లారు.

జగన్ త్వరగా కోలుకోవాలి: ప్రధాని

సీఎం జగన్ త్వరగా కోలుకుని మంచి ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నా..

తీవ్రంగా ఖండిస్తున్నా: చంద్రబాబు

జగన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ సంఘటనపై ఎన్నికల కమిషన్ నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని, బాధ్యులైన అధికారులను శిక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

దాడి బాధాకరం: వైఎస్ షర్మిల

సీఎం జగన్‌పై దాడి, ఆయన ఎడమ కంటిపై గాయం బాధాకరం. దురదృష్టకరం. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందని అనుకుంటున్నాం. అలా కాకుండా ఎవరైనా కావాలని చేసి ఉంటే ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఖండించాల్సిందే. ఆయన త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా.

ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదు: కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై శనివారం జరిగిన దాడిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పేట్టారు. దాడి నుంచి వైఎస్ జగన్ సురక్షితంగా బయటపడినందుకు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి హింసకు చోటు లేదని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేటీఆర్ పేర్కొన్నారు.

ఎన్నెన్నో ప్రశ్నలు?

- శనివారం విజయవాడ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన జగన్ రోడ్‌షోకు చేసిన భద్రతా ఏర్పాట్లపైనా, జరిగిన దాడిపైన విపక్ష పార్టీలు, ఇంటెలిజెన్స్ వ్యవహారాలపై అవగాహన ఉన్న వర్గాలు పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి.
- అజిత్‌సింగనగర్ ప్రాంతానికి యాత్ర చేరే సమయానికి పూర్తిగా చీకటి పడింది. అయినా పోలీసు ఉన్నతాధికారులు పవర్ స్టేషన్ వద్దకెళ్లి మరీ ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఇందుకు వాళ్లు చెబుతున్న కారణం జగన్ బస్సుపై నిలబడి అభివాదం చేస్తుండటంతో వైర్ల వల్ల ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడటం. ఇప్పటిదాకా జగన్ వెళ్లిన పలు ప్రాంతాల్లో రోడ్‌షోకు అడ్డుగా ఉన్న వైర్లను ముందుగానే తొలగిస్తుండటం మనకు తెలిసిందే. మరి ఇక్కడ అలా ఎందుకు చేయలేదు? ఒకవేళ వైర్లు తగిలే పరిస్థితే ఉంటే కరెంటు లేకున్నా అవి తాకడం వల్ల కింద పడిపోయే ప్రమాదమూ ఉంటుంది గదా! పైగా అది నిత్యం బస్సులు తిరిగే రూట్ కావడంతో సీఎంకు వైర్లతో ముప్పు ఉందని కరెంటు ఆపామన్న వాదనపై మరిన్ని సందేహాలు వ్యక్తమవతున్నాయి.
- భద్రతా ప్రొటోకాల్ ప్రకారం పర్యటన ప్రాంతంలో విద్యుత్ లేకపోతే.. ముఖ్యమంత్రి కచ్చితంగా బుల్లెట్ ప్రూఫ్ బస్సులోనే కూర్చోవాలి. కానీ, ఆయన బస్సుపైనే ఉండి ముందుకు సాగారు. దీనికి సీఎం భద్రతా సిబ్బంది ఎలా అనుమతించారు? విద్యుత్ లేనప్పుడు ఫోకస్ లైట్లు వేసి పరిసర ప్రాంతాలను నిశితంగా గమనించాలి. కానీ అలా ఎందుకు జరగలేదు?
- స్పెషల్ బ్రాంచ్ సహా ఇంటెలిజెన్స్ అధికారులు సీఎం ప్రయాణిస్తున్న బస్సు చుట్టుపక్కల డేగకన్ను సారించి మరీ పరిశీలన చేయాలి. అదేసమయంలో అల్లరిమూకల వ్యవహారాలను ముందుగానే పసిగట్టాలి. కానీ, వారు ముందస్తుగా దాడిని ఎందుకు గుర్తించలేకపోయారు?
- ప్రతిరోజూ జగన్ యాత్ర సాగుతున్న ప్రాంతాన్ని రోప్ పార్టీ కచ్చితంగా అనుసరిస్తూ ముందుకు సాగుతోంది. కానీ రాళ్ల దాడి సమయంలో ఆ స్థాయి జాగ్రత్తలు కనిపించలేదు.
- జనం దాదాపు బస్సుకు దగ్గరికంటా చేరిపోవడం, ఆ సమయంలో రెండు రాళ్లు గురి చూసి విసిరినట్టు దూసుకొచ్చి, జగన్‌కు కంటిపైన నుదుటికి, స్థానిక అభ్యర్థి వెలంపల్లి ఎడమ కంటికి కింద తగలడం చకచకా జరిగిపోయాయి. ఈ దాడికి క్యాట్‌బాల్ వాడారా అన్న అనుమానాలున్నాయి. పైగా బస్సు మెల్లగా ముందుకు సాగుతుండగా ఈ దాడి జరగడం గమనార్హం.
- ఇలాంటి హఠాత్పరిణామం జరిగినప్పుడు భద్రతా బలగాలు పూర్తిస్థాయిలో అప్రమత్తమైపోతాయి. ముందుగా సీఎం వెంట ఉంటే బలగాలు బుల్లెట్ ప్రూఫ్ షీట్స్‌ను అడ్డుగా పెట్టేస్తాయి. కింద ఉన్న బలగాలు బస్సు సమీపంలో ఎవరూ లేకుండా క్లియర్ చేసేస్తాయి. కానీ ఇక్కడ ఆ రెండూ జరగలేదు. బస్సు తిరిగి బయల్దేరే వరకు జనం దాదాపు బస్సును ఆనుకునే ఉండి నినాదాలు చేస్తున్నారు.
- ఎన్నికల సమయం కావడంతో సీఎం కాస్త జనంలోకి వెళ్లడం సహజమే కదా అనుకున్నా, చీకటి పడ్డాక, కరెంటు కూడా లేని సమయంలో భద్రతను గాలికొదలడం ఏ విధంగానూ సమర్థనీయం కాదన్న వాదన గట్టిగా వినిపిస్తోంది. బస్సు అక్కడే దాదాపు 15 నిమిషాలు నిలిపి ఉన్నా కనీసం రోప్ పార్టీ కూడా యాక్టివేట్ కాకపోవడం ఏమిటనేది ప్రశ్నార్థకం.
- దాడి జరిగిన వెంటనే రకరకాల వీడియోలను వైసీపీ సోషల్ మీడియాలోకి వదిలారు. మొదట డాక్టర్ హరికృష్ణ ప్రథమ చికిత్స చేయగా, కాస్త ముందుకెళ్లగానే పార్టీ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ మళ్లీ అదే చికిత్స చేసిన వీడియోలు పోస్టు చేశారు. పెట్టిన కొన్ని వీడియోల్లో 'జై చంద్రబాబు' అన్న నినాదాలు కూడా వినపడటం వ్యూహాత్మకంగానే జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- జగన్ కార్యక్రమానికి వచ్చిన వాళ్లందరినీ ఆ పార్టీ నాయకులే తరలించారు. ఆటోలు, బస్సుల్లో డంప్ చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే వైసీపీ సైన్యమే యాత్ర సాగిన మార్గం పొడవునా రహదారులకు ఇరువైపులా ఉంది. అటువంటి వారి మధ్య నుంచి బయటి వ్యక్తి అంత ధైర్యంగా దాడి చేయడం ఎలా సాధ్యమైంది? ఒకవేళ చేసినా అక్కడి నుంచి ఎవరికీ చిక్కకుడా ఎలా పారిపోగలిగాడు? ముఖ్యమంత్రి పర్యటన సాగుతున్న క్రమంలో ఇన్నర్ కార్డన్, ఔటర్ కార్డన్ సహా పూరిస్థాయిలో కట్టుదిట్టమైన బందోబస్తు ఉంది. మరి రాయి దాడి జరినప్పుడు వారంతా ఏం చేస్తున్నారు?
- ఎన్నికలకు మరో నెల రోజుల సమయం ఉండగా జగన్‌పై దాడి జరగడం, 2019 ఎన్నికలకు ముందు విశాఖ విమానాశ్రయంలో జరిగిన కోడి కత్తి దాడిని గుర్తుతెస్తోందన్న వాదన వినిపిస్తోంది. చివరికి వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రికి వెళ్లడం వెనుకా రాజకీయ లబ్ధే పరమావధిగా కనిపిస్తోందన్న వాదన వినిపిస్తోంది.

అప్పుడలా.. ఇప్పుడిలా!

- జగన్‌కు ఎన్నికల 'గాయాలు'
- 2019లో కోడికత్తి ఘటన.. ఇప్పుడు రాయి దాడి

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత, సీఎం జగన్‌కు 'గాయాలవుతున్నాయి'. గత 2019 ఎన్నికలకు ఆరు మాసాల ముందు అంటే.. 2018, అక్టోబరు 25న విశాఖపట్నంలో ప్రజాసంకల్ప యాత్రకు విరామమిచ్చిన అప్పటి విపక్ష నేత జగన్.. హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఈ క్రమంలో విశాఖపట్నం విమానాశ్రయంలో వేచి ఉన్న సమయంలో 'కోడి కత్తి' దాడి జరిగింది. ఎడమ భుజంపై గాయమైంది. అయితే.. అక్కడ ప్రాథమిక చికిత్స చేయించుకున్న జగన్.. విమానం ఎక్కి నేరుగా హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. అక్కడ మాత్రం 'ఎంపిక' చేసుకున్న ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకుని కట్లతో బయటకు వచ్చారు. దీనికి సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టి ఎన్నికల్లో సానుభూతి పొందారు. అనంతరం.. ఎన్నికల ప్రచారంలోనూ తనపై హత్యాయత్నం జరిగిందని జగన్ చెప్పుకొచ్చారు. కట్ చేస్తే.. తాజాగా శనివారం రాత్రి విజయవాడ శివారు ప్రాంతమైన సింగ్‌నగర్ లో జరిగిన 'రాయిదాడి' ఘటన తర్వాత కూడా నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. దాడి జరిగిన వెంటనే సీఎం జగన్ ప్రయాణిస్తున్న బస్సులో ఉన్న వైద్యుడు ఒకరు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం.. బస్సు యాత్ర ముందుకు సాగింది. అయితే.. కొంత దూరం వెళ్లాక.. వైసీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ కూడా గాయానికి మందురాసి బ్యాండెయిడ్ వేశారు. ఇక, శనివారం యాత్ర ముగిసిన తర్వాత నేరుగా విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. వాస్తవానికి ఆయన స్థాయికి తగినట్టు ఏదైనా ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి ఉండగా.. విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అయితే.. ఈ పరిణామాలను గమనిస్తే 2019 ఎన్నికలకు ముందు ఎలా అయితే.. కోడికత్తి గాయాన్ని ప్రచారానికి వాడుకున్నారో.. ఇప్పుడు 'రాయి' ఘటనను కూడా ప్రచారానికి వినియోగించుకునే అవకాశం ఉందని విపక్షాలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి.

కోడి కత్తి 2.0 వెర్షన్... గులకరాయి దాడి!

- కాలం చెల్లిన డ్రామాలు జనం నమ్మరు: అచ్చెన్న

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి స్పందన కరువవడంతో కోడి కత్తి 2.0కి తెరలేపారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. శనివారం రాత్రి ఆయన ఓ ప్రకటన చేస్తూ.. 'ముఖ్యమంత్రి పర్యటన జరుగుతుంటే కరెంటు తీసేయడం ముందుగా వేసుకున్న పథకంలో భాగం కాదా? ఇది ఉద్దేశపూర్వకంగా చేయించుకున్న దాడే. డీజీపీ, ఇంటెలిజెన్స్ ఐజీ నేతృత్వంలో రూపొందించిన డ్రామా ఇది. 2019 ఎన్నికలకు ముందు విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన కోడి కత్తి డ్రామాకు, విజయవాడ సింగ్‌నగర్‌లో జరిగిన గులకరాయి దాడికి పెద్దగా తేడా ఏమీ లేదు. సంఘటన జరిగిన నిమిషాల వ్యవధిలోనే జగన్ అండ్ కో పేర్ని నాని, అంబటి రాంబాబు లైవ్‌లోకి వచ్చి ఇదంతా చంద్రబాబు చేయించాడని నీలి మీడియాలో ప్రచారం చేయడం ముందస్తు ప్రణాళికలో భాగం కాదా? కాలం చెల్లిన ఇటువంటి డ్రామాలు నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్న విషయాన్ని జగన్ గుర్తించాలి' అని పేర్కొన్నారు. 'దున్నపోతు ఈనింది.. దూడను కట్టేయమన్నట్లు'గా వైసీపీ నేతల వ్యవహారం ఉందని టీడీపీ నేత పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. 'జరగని దాడిని జరిగినట్లు ప్రచారం చేసుకుని, సానుభూతి కోసం పాకులాడుతున్నారు. ఇలాంటి ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మరు. ఇది మరో కోడి కత్తి 2.0 తప్ప మరొకటి కాదు. ప్రజలు మీకు త్వరలో బుద్ధి చెప్పడం ఖాయం' అని పయ్యావుల హెచ్చరించారు.

వైసీపీ నాయకుడు మంటల్లోకి నెట్టేశాడు!

- ముఖం, ఎడమ చేతికి గాయాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ


కాలిన గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు రాధ

విశాఖపట్నం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఒక మహిళను వైసీపీ నాయకుడు మంటల్లోకి నెట్టేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. జీవీఎంసీ పరిధిలోని 65వ వార్డు వైసీపీ అధ్యక్షుడు మోదలవలస లోకనాథం, అతని కుటుంబ సభ్యులు కలిసి తనను మంటల్లోకి నెట్టేశారంటూ ఒక మహిళ న్యూపోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు కాలిన గాయాలతో ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితురాలు జలుమూరి రాధ తెలిపిన వివరాల ప్రకారం.. 65వ వార్డు పరిధిలోని భానోజీతోటలో హౌసింగ్‌కమిటీ స్థలాల్లో నిర్మించుకున్న ఇంట్లో రాధ నివాసం ఉంటోంది. ఆమె ఇంటి పొరుగున ఆ వార్డు వైసీపీ అధ్యక్షుడు లోకనాథం ఉంటున్నారు. రాధ ఇంటి పక్కనే ఉన్న సుమారు 60 గజాల ఖాళీ స్థలం ఆమె ఆధీనంలో ఉంది. ఆ స్థలానికి పన్నువిధించాలని కోరుతూ కొన్నాళ్ల కిందట జోన్-6 (గాజువాక) కమిషనర్‌కు రాధ దరఖాస్తు చేసుకున్నారు. రోజులు గడిచినా పన్ను విధించకపోవడంతో ఆమె కమిషనర్‌ను కలిశారు. ఆ స్థలానికి పన్ను విధించవద్దని లోకనాథం ఫిర్యాదు చేశారని అధికారి సమాధానం ఇచ్చారు. దీనిపై లోకనాథంను ప్రశ్నించగా... రూ.20వేలు ఇస్తే పన్ను వేయిస్తానని చెప్పారు. ఈమేరకు రాధ డబ్బు ఇవ్వగా, స్థలానికి పన్ను వేశారు. మరో రూ.50వేలు ఇస్తే పట్టా కూడా ఇప్పిస్తానని లోకనాథం చెప్పగా, నిరాకరించడంతో ఆమెపై కక్ష పెట్టుకున్నారు. ఆ స్థలంలో ఉన్న షెడ్డును తొలగించేందుకు కొంత మంది రౌడీలను పంపించారు. వారు రేకులు తొలగించడంతో రాధ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 11న రాధ ఖాళీ స్థలంలోని చెత్తాచెదారాలను పోగేసి మంట పెట్టింది. దీనిపై లోకనాథం, మరొకరు వాగ్వాదానికి దిగారు. ఆ క్రమంలోనే రాధను మంటల్లోకి నెట్టేయడంతో ఎడమ చేయి, ముఖం కాలిపోయాయి.

నిందితులను అరెస్టు చేయాలి: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మహిళను వైసీపీ నాయకుడు మంటల్లోకి నెట్టేయడం చాలా దారుణమని టీడీపీ నేతలు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. నిందితుడైన లోకనాథం, ఆయనకు సహకరించిన వైసీపీ నేతలను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు.

ఎక్స్‌లో 'నిజం గెలవాలి' ట్రెండింగ్

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర ఎక్స్ సామాజిక వేదికలో శనివారం ట్రెండింగ్‌లో అగ్రస్థానంలో నిలిచింది టీడీపీ వర్గాలు ఈ విషయం తెలిపాయి. యాత్రను విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందిస్తూ నెటిజన్లు పెద్దసంఖ్యలో స్పందించారు. 'నిజం గెలవాలి... ఎన్డీయే రావాలి' అన్న హ్యాష్ ట్యాగ్‌తో వేల సంఖ్యలో సందేశాలు రావడంతో ఈ అంశం కొంతసేపు జాతీయ స్థాయిలో ట్రెండింగ్‌లో మొదటి స్థానంలో నిలిచింది.

మహిళనని చూడకుండా అవమానించారు

- వైసీపీ పాలనలో మహిళలపై అడుగడుగునా దాడులే
- అభివృద్ధి కావాలంటే ఈ రాక్షస ప్రభుత్వాన్ని దించేయండి
- 'నిజం గెలవాలి' ముగింపు సభలో భువనేశ్వరి ప్రసంగం


తిరువూరులో 'నిజం గెలవాలి' ముగింపు సభలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

విజయవాడ/తిరువూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మహిళననే విచక్షణ కూడా లేకుండా దేవాలయం వంటి అసెంబ్లీలో తనపై తప్పుడు విమర్శలు చేశారని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి ఎన్టీఆర్ ఇచ్చిన పౌరుషంతోనే ఈ పరిణామాలను తట్టుకున్నానని చెప్పారు. వైసీపీ రాక్షస పాలనలో మహిళపై అడుగడుగునా దాడులు జరుగుతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో శనివారం 'నిజం గెలవాలి' ముగింపు సభలో ఆమె ప్రసంగించారు. ' చంద్రబాబు అరెస్టు నా జీవితంలో మర్చిపోలేని సంఘటన. సెప్టెంబరు 10న మా పెళ్లి రోజు. ఆ రోజు లోకేశ్ నుంచి ఫోన్ వస్తే పెళ్లి శుభాకాంక్షలు చెప్పడానికి అనుకున్నాను. కానీ నాన్నను అరెస్టు చేశారు అని చెప్పడంతో ఒక్కసారిగా నాకు ఏమీ తోచలేదు. చంద్రబాబు అరెస్టుతో కుటుంబ సభ్యులం అందరం నాలుగు దిక్కులకు చెల్లాచెదురయ్యాం. లోకేశ్ కోర్టు కేసుల గురించి ఢిల్లీ వెళ్లారు. దేవాన్ష్ హైదరాబాద్‌లో ఉండిపోయాడు. నేను, కోడలు బ్రాహ్మణి రాజమండ్రి జైలు వద్దే ఉన్నాం. 53 రోజులు ఎలా బతికామో మాకే తెలియదు. నా భర్త అరెస్టు అక్రమమని నేను బలంగా నమ్మాను. ఏ కేసులోనూ అధికారులు ఒక్క ఆధారం చూపలేకపోవడమే నా నమ్మకానికి నిదర్శనం. తండ్రి, భర్త, కొడుకు రాజకీయాల్లో ఉన్నా ఏనాడూ బయటకు రాని నేను, చంద్రబాబు అరెస్టు అక్రమమని తెలియజేసేందుకు నిజం గెలవాలి కార్యక్రమంతో జనంలోకి వచ్చాను' అని భువనేశ్వరి పేర్కొన్నారు. అన్నక్యాంటీన్ల ద్వారా లక్షల మంది పేదలకు ఆహారం అందిస్తున్న పథకాన్ని రద్దు చేయడంతో పాటు ప్రజావేదిక కూల్చివేతతో వైసీపీ దుర్మార్గపు పాలన ప్రారంభమైందని భువనేశ్వరి నిప్పులు చెరిగారు. ఈ పాలకులకు దోచుకుతినడం తప్ప ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్టదని, అక్రమాల్ని ప్రశ్నించిన వారిపై దాడులకు దిగటం వైసీపీ నీచ సంస్కృతి అని విమర్శించారు. మూడు రాజధానులు అంటున్న ఈ ప్రబుద్ధులు చివరకు ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి కావాలంటే ఎన్నికల కురుక్షేత్రంలో ఓటు అనే ఆయుధంతో వైసీపీ రాక్షస పాలనను అంతమొందించాలని కోరారు. ఎన్డీయే అభ్యర్థుల్ని గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కాగా, చంద్రబాబు అక్రమ అరెస్టు వార్త విని మృతి చెందిన టీడీపీ కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను పరామర్శించి, ఓదార్చాలన్న ఉద్దేశంతో భువనేశ్వరి ప్రారంభించిన నిజం గెలవాలి కార్యక్రమం 6 నెలలపాటు కొనసాగింది. 2023 అక్టోబరు 25న చిత్తూరు జిల్లాలో ప్రారంభమైన ఈ యాత్ర ముగింపు కార్యక్రమం శనివారం తిరువూరులో జరిగింది. ఈ 6 నెలల్లో భువనేశ్వరి 203 మంది కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను కలసి ఓదార్చారు. 150కి పైగా ప్రసంగాలతో ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని నింపారు. 6నెలల సమయంలో ఆమె సుమారు 9,080 కిలోమీటర్ల మేర ప్రయాణించారు.


సీఎం జగన్‌కు రాట్నం జ్ఞాపికను అందజేస్తున్న చేనేత నాయకులు

కులమతాలకు అతీతంగా సంక్షేమం: సీఎం జగన్

మంగళగిరి/తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 13: కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని సీఎం వైఎస్ జగన్ అన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర 14వ రోజు నంబూరు బైపాస్ నుంచి మంగళగిరి మీదుగా సాగింది. మంగళగిరి సమీపంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న సీకే కన్వెన్షన్‌లో చేనేత కార్మికులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో జగన్ ప్రసంగించారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేశామని చెప్పారు. వైసీపీ పాలనలో నేతన్న నేస్తం పథకం ద్వారా రూ.970 కోట్లు నేత కార్మికులకు అందించామని, మొత్తంగా నేతన్నల సంక్షేమం కోసం రూ.3,706 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు.

జగన్ కన్నా ముందొచ్చిన గొడ్డలి!

సీఎం జగన్ పర్యటన అంటేనే సామాన్య జనంతో పాటు పచ్చని వృక్షాలు సైతం విలవిల్లాడిపోతున్నాయి. శనివారం విజయవాడలో జగన్ బస్సు యాత్ర చేయడానికన్నా ముందే ఆ మార్గంలో గొడ్డలి ప్రయాణించింది. ఆయన ప్రయాణించే దారి పొడవునా ఉన్న చెట్లను నరుక్కుంటూ వెళ్లిపోయింది. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం చెంతనే ఉన్న వాటర్ ట్యాంక్ రోడ్డులో దశాబ్దాల తరబడి నీడనిచ్చిన వృక్షాలను మొదళ్లతో సహా అధికారులు నరికేశారు. ఇక గుడివాడలో ఆదివారం జగన్ బస్సు యాత్ర ఉంది. బహిరంగ సభతో పాటు రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో రోడ్ షో జరిగే పట్టణ పరిధిలోని ప్రధాన రహదారి వెంబడి చెట్లను మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు నరికేశారు.

నేతల వద్దకే.. అధినేత!

- అసంతృప్తులను బుజ్జగించేందుకు జనసేనాని పవన్ జిల్లాల పర్యటన
- తాజాగా తిరుపతి నేతలతో భేటీ


తిరుపతిలో పవన్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు భానుప్రకాశ్ రెడ్డి తదితరులు

అమరావతి/తిరుపతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పార్టీలో అసంతృప్తులను బుజ్జగించేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. మొన్నటి వరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కె. నాగబాబు అసంతృప్త నేతలతో చర్చలు జరిపారు. అప్పటికీ సంతృప్తి చెందని నేతలను పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ బుజ్జగించారు. పార్టీలో వీరు కీలక నేతలు కావడంతో వారు చెబితే కొంత మంది నేతలు దారిలోకి వచ్చారు. అయితే, కొన్నిచోట్ల మాత్రం ఎవరు చెప్పినా వినిపించుకోని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పవన్ నేరుగా రంగంలోకి దిగారు. జనసేన తిరుపతి అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులును ప్రకటించడంపై స్థానిక నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ పరిస్థితి చేయి దాటిపోవడంతో పవన్ స్వయంగా తిరుపతిలో పర్యటించారు. స్థానిక జనసేన, టీడీపీ నేతలతో వేర్వేరుగా చర్చలు జరిపారు. తిరుపతి అభ్యర్థిని కచ్చితంగా గెలిపించాలని, అందరూ సహకరించాలని కోరారు. తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్ రాయల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పవన్ నేరుగా వచ్చి చర్చించడంతో పార్టీ కేడర్‌లో మార్పు కనిపించింది. ఆరణి శ్రీనివాసులును గెలిపించి పవన్‌కు గిఫ్ట్‌గా ఇస్తామని పార్టీ నాయకులు హామీఇచ్చారు. ఇక, ఇప్పుడు పాలకొండలో మరో సమస్య తలెత్తింది. జనసేనలో ఈ సీటు కోసం అనేకమంది పోటీ పడ్డారు. ఆ నియోజకవర్గంలో టీడీపీ తరుపున రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయిన నిమ్మక జయకృష్ణ జనసేన కండువా కప్పుకొన్నారు. అయితే, ఇదే స్థానంలో టీడీపీ తరఫున పోటీ చేద్దామని భావించిన భూదేవి కూడా టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఆమెను జనసేన పార్టీలో చేర్చుకున్న 24 గంటల వ్యవధిలో ఉమ్మడి అభ్యర్థిగా జయకృష్ణను ప్రకటించారు. దీంతో ఆమె తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పంచాయతీపై పవన్ దృష్టి పెట్టాల్సి ఉంది.

తిరుమల పవిత్రత నాశనం: పవన్

అసంతృప్తి నేతలను ఏకతాటిపైకి తెచ్చేందుకు తిరుపతికి వచ్చిన జనసేనాని పవన్ శనివారం బీజేపీ నేతలతో భేటీ అయ్యారు. తిరుమల క్షేత్రానికి ఉన్న పవిత్రతను వైసీపీ ప్రభుత్వం, వారు ఏరికోరి నియమించుకున్న అధికారులు మంటగలిపేసిన తీరు భక్తులను మనోవేదనకు గురి చేసిందన్నారు. టీటీడీ నిధులను అడ్డగోలుగా వాడుకొనే కుట్రలకు వైసీపీ నాయకులు తెరతీసిన సమాచారం పార్టీ దగ్గర ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో ధర్మ పరిరక్షణకు నడుం బిగించాలన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


బీఆర్‌టీఎస్ రోడ్‌లో బారికేడ్లు పెట్టి ట్రాఫిక్‌ను నిలిపివేసిన పోలీసులు


చుట్టుగుంట వద్ద ట్రాఫిక్‌ను నిలిపి వేసిన పోలీసులు


ప్రసాదంపాడు వద్ద ట్రాఫిక్


బందరు రోడ్‌లో..



బీఆర్‌టీఎస్ రోడ్‌లో ఫుడ్ జంక్షన్ వద్ద సీఎం జగన్ కటౌట్‌లు ఏర్పాటు చేసిన నేతలు


సీకే ఫంక్షన్ హాల్ వద్ద జగన్ కటౌట్

సీఎం బస్సు యాత్ర.. జనానికి నరకయాత్ర

- ఎక్కడికక్కడ నిలిచిన ట్రాఫిక్
- ఇబ్బందిపడిన వాహనదారులు, పాదచారులు, స్థానికులు

వన్‌టౌన్, ఏప్రిల్ 13: తన సిద్ధం యాత్రతో వైఎస్ జగన్ శనివారం సాయంత్రం నగరంలో ప్రవేశించారు. నగరంలో వారధి వద్ద నుంచి కండ్రిక వైపునున్న రోడ్డులో బస్సుయాత్ర నిర్వహించారు. ఆయన వెళుతున్న మార్గంలోకి ఇతరత్రా వాహనాలు రాకుండా ఉండేందుకు సుమారు గంట నుంచే అన్ని రోడ్ల లోని పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నిలిపేశారు. జగన్ ప్రయాణించిన సమయంలో ఉద్యోగులు, విద్యార్థులు ఇళ్లకు వచ్చే సమయం కావడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచితీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిగో జగన్ వస్తున్నారంటూ గంటకు పైగా ట్రాఫిక్‌ను పోలీసులు నిలిపేయడంతో అప్పుడే కురిసిన వానతో పాదాచారులు, వాహనాదారులు ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ఈ బస్సుయాత్ర సుమారుగా 2 కిలోమీటర్లు అవతలకు వెళ్లిన తరువాత గానీ ట్రాఫిక్‌ను వదలలేదు. దీంతో వారు చాలా ఇబ్బందులకు గురయ్యారు.

జనాన్ని తరలించిన కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు

జగన్ బస్సుయాత్రకు నగరవ్యాప్తంగా ఉన్న వైసీపీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు జనాన్ని తరలించారు. ముందుగా జగన్ సిద్ధం బస్సుయాత్ర వస్తోందని, అందుకు జనాన్ని సమీకరించాలని పార్టీ అధిష్టానం ఒక్కొక్క డివిజన్ నుంచి 300 మందిని తీసుకురావాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ మేరకు వారంతా నానా తంటాలు పడి జనాన్ని సమీకరించారు. 300 మంది స్వచ్ఛందంగా వస్తే సరి, లేదంటే డబ్బులిచ్చైనా తరలించాలని పార్టీ అధిష్టానం నిర్దేశించడంతో నేతలు ఎండలను సైతం లెక్కచేయకుండా జనసమీకరణపై దృష్టిపెట్టారు. చాలామంది విముఖత చూపించడంతో వారికి అదనంగా డబ్బులిచ్చారని చెప్పుకుంటున్నారు. నగరం నుంచి 64 డివిజన్ల నేతలు సుమారుగా 20వేల మందిని తరలించారు. వీరిలో జగన్ ప్రయాణిస్తున్న రూట్‌లో ఆయా పాయింట్ల వద్ద చాలామందిని ఫ్లకార్డులు ఇచ్చి నిలబెట్టారు. నినదాలు చేయాలని సూచించారు. ఇందులో పిల్లలు కూడా ఉండడం విశేషం. ఓటు లేని పిల్లల్ని తరలించారు. వీరిలో కొంతమందిని బస్సు వెంట నగరంలో ఉండేటట్లుగా ప్లాన్ చేశారు. దీంతో బస్సు చుట్టూ రద్దీ ఉన్నట్లు కనిపించింది. చాలాచోట్ల స్థానికులెవ్వరూ జగన్‌ను చూసేందుకు రాలేదని తెలుస్తోంది.





తాడేపల్లి వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

గుణదల వద్ద..


తాడేపల్లి వద్ద ట్రాఫిక్


విశాలాంధ్ర రోడ్‌లో..


కనకదుర్గ వారధి మధ్య సీఎం జగన్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది


ట్రాఫిక్ నిలిపేయడంతో ఖాళీగా మారిన ఇన్నర్‌రింగ్ రోడ్

తెల్లజిల్లేడు, మారేడు, తులసి, మరువం, దవనాలతో

కనకదుర్గమ్మకు పుష్పార్చన


అమ్మవారిని మరువంతో అర్చిస్తున్న అర్చకులు

వన్‌టౌన్, ఏప్రిల్ 13: ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో జరుగుతున్న చైత్రమాస వసంతనవరాత్రి ప్రత్యేక పుష్పార్చనలో 5వ రోజైన శనివారం పంచ శంఖ్యోపాచారిణి కనకదుర్గమ్మకు తెల్లజిల్లేడు, మారేడు, తులసి, మరువం, దవనాలను సమర్పించారు. లలితా సహస్రనామ సంపుటితో అమ్మవారిని ప్రత్యేకంగా అర్చించారు. దేవస్థానం వైదిక సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ఈవో కేఎస్ రామారావు పాల్గొని హారతులను స్వీకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేసవి కావడంతో ఈవో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

దుర్గగుడిలో నిత్యం నిర్వహించే నిత్యాన్నదానానికి హైదరాబాద్ కిస్మత్‌పూర్‌కు చెందిన పాలపర్తి నరసింహరావు శనివారం ఆలయానికి విచ్చేసి కుటుంబసభ్యులతో కలిసి రూ.లక్షవిరాళం అందజేశారు. దుర్గమ్మ దర్శనానంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీర్వచనం అందజేశారు.

ఈవో ఆకస్మిక తనిఖీలు

ఈవో కేఎస్ రామారావు శనివారం కొండపైన ఘాట్‌రోడ్డులోని ప్రసాదాల కౌంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కౌంటర్‌లో రిజిస్టర్‌ను పరిశీలించి ప్రసాదాల తయారీ కేంద్రం నుంచి వస్తున్న స్టాక్‌కు కౌంటర్‌లో విక్రయించిన స్టాక్, నిలువ ఉన్న స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కౌంటర్‌లో మెరుగైన సేవలందించాలని, రికార్డులను పక్కాగా నిర్వహించాలని, స్టాక్‌లో కానీ ప్రసాదాలు అమ్మిన, తరువాత ఉన్న డబ్బుల విషయంలో ఎలాంటి తేడాలు వచ్చినా ఊరుకునేది లేదని హెచ్చరించారు.


ప్రసాదాల కౌంటర్‌లో తనిఖీ చేస్తున్న ఈవో

నగరాలను ఓటు బ్యాంక్‌లా చూసిన పాలకులు

- నగరాల ఆత్మీయ సమావేశంలో కూటమి పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి

చిట్టినగర్, ఏప్రిల్ 13: నగరాలను పాలకులు కేవలం రాజకీయ ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసిందని, వారి సంక్షేమాన్ని మరిచిందని కూటమి పశ్చిమ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణచౌదరి (సుజనా చౌదరి) అన్నారు. శనివారం మిల్క్ ప్రాజెక్ట్ ఫంక్షన్ హాలులో నందమూరి తారక రామారావు అభిమానులు, నగరాల సంఘం నేతలతో ఆత్మీయ సమావేశం జరిగింది. సుజనా చౌదరి మాట్లాడుతూ నగరాల కులస్థుల అండతో గెలిచిన వెల్లంపల్లి పశ్చిమను అభివృద్ధికి అమడ దూరంలో ఉంచారన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి శూన్యమన్నారు. తనని ఎమ్మెల్యేగా గెలిపిస్తే దశాబ్దాలుగా ఉన్న కొండ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కారిస్తానన్నారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ వ్యవస్థతోపాటు విద్యా వైద్య సదుపాయాలను కల్పిస్తానన్నారు. పైలా సోమినాయుడు మాట్లాడుతూ కూటమి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుజనా చౌదరికి నగరాల కులస్థుల సంఘం మద్దతిస్తుందని దుర్గగుడి పాలకమండలి మాజీ చైర్మన్, బీజేపీ నేత పైలా సోమినాయుడు, పలువురు నగరాల సంఘం నేతలు పేర్కొన్నారు. పశ్చిమలో నగరాల కులస్థులు, ఎన్టీఆర్ అభిమానులు సుజనా చౌదరి గెలుపు కోసం కృషి చేస్తారన్నారు. సుజనా చౌదరి నాయకత్వంలో పశ్చిమ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని సుజనా చౌదరిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ కేంద్రంలో వెంకయ్యనాయుడు, సుజనా చౌదరి రాష్ట్ర అభివృద్ధి కోసం పెద్దన్న పాత్ర పోషించారన్నారు. కేంద్రమంత్రిగా పనిచేసిన వ్యక్తి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థిగా రావడం శుభపరిణామన్నారు. రాయల హరిబాబు, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), బంకా నాగమణి, నగరాల సంఘం నేతలు పాల్గొన్నారు.


సుజనాచౌదరిని సత్కరిస్తున్న నగరాల సంఘం నేతలు

ఎన్‌డీఏ కూటమితోనే అభివృద్ధి సాధ్యం


- కూటమి పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి

వన్‌టౌన్, ఏప్రిల్ 13: వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపిస్తే పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ఉమ్మడి కూటమి బీజేపీ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో ఆర్యవైశ్యులతో శనివారం రాత్రి ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత డోగిపర్తి శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. డోగిపర్తి శ్రీనివాసరావు సతీమణి ఝాన్సీలక్ష్మితో కొద్దిసేపు పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి గురించి చర్చించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఆర్యవైశ్యుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. చంద్రబాబు హయాంలో ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. జగన్ పరిపాలనలో ఏ వర్గానికి న్యాయం జరగలేదని, పశ్చిమలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. మంత్రిగా పనిచేసిన వెలంపల్లి శ్రీనివాసరావు అభివృద్ధి చేయకపోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. వైసీపీ నేతలు ఆచరణ సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు, ఆర్యవైశ్య నేతలు డోగుపర్తి శేషగిరిరావు, బీజేపీ నేత పైలా సోమినాయుడు, టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ బేగ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పశ్చిమ నియోజకవర్గ ఉమ్మడి కూటమి బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి

వస్త్రలత సమస్యలు పరిష్కరిస్తా

నగరానికి తలమానికంగా ఉన్న వస్త్రలతలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సుజనా చౌదరి అన్నారు. కూటమి నేతలతో కలిసి శనివారం వస్త్రలతలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వస్త్రలత అసోసియేషన్ నేతలు, సభ్యులతో మాట్లాడారు. అనంతరం అసోసియేషన్ ప్రెసిడెంట్ ఓలేటి జగన్మోహనరావు అధ్యక్షతన అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సుజనా చౌదరి మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వస్త్రలత సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వస్త్రలత అసోసియేషన్ ప్రెసిడెంట్ ఓలేటి జగన్మోహనరావు మాట్లాడుతూ సుజనా చౌదరిని ఎమ్మెల్యేగా గెలిపించుకునే బాధ్యత తీసుకుంటామన్నారు. అసోసియేషన్ సెక్రటరీ కొత్త అనిల్‌కుమార్, వస్త్రవ్యాపారస్తులు, కూటమి నేతలు అడ్డూరి శ్రీరామ్, పైలా సోమినాయుడు, ఎంఎస్ బేగ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆశీర్వచనం తీసుకుంటున్న సుజనా చౌదరి

170 రైల్వే స్టేషన్లలో వాటర్ కూలర్లు



రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాపులు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 13: వేసవి దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే తన నెట్‌వర్క్‌లోని అన్ని రైల్వేస్టేషన్లలో మంచినీటి సదుపాయాలను సిద్ధం చేసింది. రైలు ప్రయాణికులకు తగినంత మంచినీరు లభ్యమయ్యేలా అధికారులు సమీక్షిస్తున్నారు. సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు స్వచ్ఛమైన చల్లని మంచినీటిని అందించేందుకు మండల, డివిజన్, జోన్ స్థాయిలో పరిశీలిస్తున్నారు. నీటి డిమాండ్‌పైన, సరఫరా సామర్థ్యాల పైన ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, పర్యవేక్షకులతో సమీక్షిస్తున్నారు. ఏదైన అత్యవసర పరిస్థితుల్లో వెంటనే మంచినీటి సదుపాయాల ఏర్పాటు కూడా చేస్తున్నారు. రైల్వేజోన్‌లోని 170 స్టేషన్లలో 448 నీటి కూలర్లను ఏర్పాటు చేశారు. డివిజనల్ సెంట్రల్ కంట్రోల్ ఆఫీస్ మంచినీటి సరఫరాపై 24 గంటల మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్య వచ్చినట్లైతే వెంటనే పర్యవేక్షకులను సంప్రదించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోపక్క నియమిత విధానాల మేరకు నీటి నాణ్యతను పరీక్షించేందుకు చర్యలు తీసుకున్నారు. తక్కువ సమయంలో ప్రధాన స్టేషన్లలో నీటిని సరఫరా చేసేందుకు ఆటోమెటిక్ వాటర్ సప్లయ్ సిస్టమ్‌ను సిద్ధం చేశారు. స్టేషన్లలో మంచి నీటి కుళాయిల పనితీరు పరిశీలనకు, మరమ్మతులు నిర్వహించేందుకు పర్యవేక్షక బృందాలు పనిచేస్తాయి. ముఖ్యంగా జనరల్ కోచ్‌లు ఆగే ప్లాట్‌ఫారాల పైన నీటి కుళాయిల పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాలువల ద్వారా వచ్చేనీటిని నిల్వ ఉంచడానికి మంచినీటి ట్యాంకులను అదనంగా నిర్మించారు. ఇతర ప్రదేశాల్లోని ట్యాంకుల్లో కూడా నీటి నిల్వకు నిరంతర పర్యవేక్షణ జరుగుతోంది. అవసరమైన చోట స్థానిక మున్సిపాలిటీ నుంచి నీటి సరఫరా పొందేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. భూగర్భ జలాలను పెంచేందుకు జోన్ పరిధిలోని పలు స్టేషన్లలో వర్షపు నీటి గుంతలు ఏర్పాటు చేసి వాటి పనితీరును పర్యవేక్షిస్తున్నారు.



రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి సదుపాయం


ఖాళీ బిందెలు చూపుతున్న ఇందిరానగర్-2 వాసులు

యనమలకుదురులో దాహం కేకలు

పెనమలూరు, ఏప్రిల్ 13: వారంరోజులుగా తమ ఇళ్లకు నీళ్లు రావడం లేదంటూ యనమలకుదురు కాల్వ కట్ట ఇందిరానగర్-2 వాసులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గతంలో తమ ఇళ్లకు అరకొర నీళ్లు వచ్చేవని, వారం రోజులుగా కనీసం చుక్క నీరు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి తమ నీటి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

నీటి ఇబ్బందులను తీరుస్తాం: మునిసిపల్ కమిషనర్

ఇందిరానగర్-2 నీటి ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని తాడిగడప మునిసిపల్ కమిషనరు వెంకటేశ్వరరావు తెలిపారు. ట్యాంకర్లతో కొన్నిరోజులు నీటిని సరఫరా చేశామని, ఇందిరానగర్‌లో నీటి సరఫరా అంతరాయాలను తొలగించడానికి పను చేయిస్తున్నామన్నారు. ఆదివారం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు.

పెదపులిపాక ఎంఎల్‌వో ఆశిష్‌పై చర్యలకు ఆర్వో రాజు సిఫారసు

మన పెదపులిపాక సచివాలయం పేరుతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి టీడీపీ అధినేత చంద్రబాబుపై అభ్యంతరకర పోస్టులు పెడుతున్న పెదపులిపాక ఎంఎల్‌వో ఆశిష్‌పై తగు చర్యలకు సిఫార్సు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజు తెలిపారు. పంచాయతీ రాజ్ అధికారులకు అభ్యంతరకర పోస్టులు పెడుతున్న ఆశిష్‌పై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసినట్టు తెలిపారు.

సింహాద్రి ఎక్స్‌ప్రెస్ లోకో పైలెట్లకు ప్రశంసలు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 13: విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ ఎన్‌కే మోహన్‌క మార్ అసిస్టెంట్ లోకో పైలట్ రజత్‌కుమార్ ప్రదర్శించిన వృత్తి నైపుణ్యంపైన, చాకచక్యంతో పెద్ద ప్రమాదాన్ని నివారించడంపైన రైల్వే డివిజన్‌లోని అధికారులు, ఉద్యోగులతో పాటు ప్రయాణికులు అభినందనలు తెలిపారు. శనివారం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో రాజమండ్రికి చెందిన లోకో పైలట్ ఎన్‌కే మోహన్‌కుమార్, అసిస్టెంట్ లోకో పైలట్ రంజిత్ కుమార్ అలారం చైన్‌ను రీసెట్ చేయడంలో ఎంతో చాకచ క్యం ప్రదర్శించారు. శనివారం ఈ రైలు ఉదయం గొల్లప్రో లు స్టేషన్‌లో ఆగిన తరువాత పిఠాపురం సెక్షన్‌లో తిరిగి ప్రయాణాన్ని ప్రారంభించింది. 5 నిముషాల తరువాత 5వ నెంబర్ జనరల్ కోచ్‌లోని ఒక వ్యక్తి అలారం చైన్‌ను లాగడంతో రైలు ఆకస్మికంగా ఆగిపోయింది. రైలు కదలికలో మార్పును గమనించిన అసిస్టెంట్ లోకో పైలట్ రజత్‌కుమార్ వాకిటాకీలో గార్డుతో మాట్లాడి వివరాలు తీసుకున్నా రు. అనంతరం లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ ఇద్ద రు చైన్ పుల్లింగ్ పరికరాన్ని రీసెట్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో అలారం పుల్లింగ్, చైన్ పుల్లింగ్ ప రికరాన్ని సరిచేయాలంటే వంతెనపై ఉన్న రైల్వే భోగి కిం దకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. ఈ క్రమంలో ఏదై నా అనుకోని సంఘటన జరిగితే ఇబ్బంది పడాల్సి వస్తుంద ని, పెద్ద ప్రమాదం జరుగుతుందని ఊహించారు. అనంత రం ఆయన మండుటెండలో రైలు భోగి కిందకు చాకచక్యం గా ప్రవేశించాడు. అక్కడ అలారం చైన్ పరికరాన్ని గుర్తించి వెంటనే దాన్ని సరిచేసి తదుపరి ప్రయాణానికి సిద్ధం చేశా డు. సుమారు అరగంటలోనే అలారం చైన్ పుల్లింగ్ పరికరాన్ని రీసెట్ చేయడం రైలు బయలుదేరడం జరిగింది. ఈ సాహసోపేతమైన చర్యను డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్, సిబ్బంది, అధికారులు, ఉద్యోగులు, ప్ర యాణికులు ప్రశంసించారు. రైలు ప్రమాదాల నివారణలో లోకో పైలట్లది కీలకపాత్రన్నారు. విధుల పట్ల నిబద్ధత ప్రదర్శించిన వారిద్దరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఒక సూచన చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో తప్ప అలారం చైన్‌ను లాగకూడదని, సహేతుకమైన కారణం లేకుండా చై న్‌ను లాగడం రైల్వే చట్టం కింద నేరమన్నారు. 1989 సెక్షన్ 141 ప్రకారం ఇది శిక్షార్హమైన నేరమని ఏడాది జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధించడానికి అవకాశముందన్నారు.

1:100 విధానాన్ని గ్రూప్-1 ఫలితాలకు

అమలు చేయాలి

- ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంతకుమార్

భవానీపురం, ఏప్రిల్ 13: గ్రూప్-2 ఫలితాల మాదిరిగానే గ్రూప్-1 ఫలితాలకు కూడా 1:100 విధానాన్ని మెయిన్స్ ఎంపికకు ఆచరించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ ఏపీపీఎస్సీని డిమాండ్ చేశారు. 2024 ఫిబ్రవరి 25న గ్రూప్-2 నిర్వహించారని, మార్చి 17న గ్రూప్-1 నిర్వహించడంతో మధ్యలో ఉన్న వ్యవధి 22 రోజులే ఉండటంతో చాలా మంది గ్రూప్-2 సిలబస్ చదివి, గ్రూప్-1 సిలబస్ కూడా చదవడానికి సతమతమయ్యారని, అభ్యర్థుల శ్రేయస్సు దృష్ట్యా మరొకసారి 1:100గా ఇవ్వాలని ఏపీపీఎస్సీ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

- సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య

మొగల్రాజపురం, ఏప్రిల్ 13: విద్యార్థులు చదువుకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖ సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య చెప్పారు. మొగల్రాజపురం కేవీఎస్ఆర్ ఫార్మసీ కళాశాలలో స్కాప్స్ అలియాంజ 2024 శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సిద్ధార్థ విద్యాసంస్థలు క్రమశిక్షణకు మారుపేరని ఈ విద్యాలయాల్లో చదువుకున్న వేలాది మంది వివిధ రంగాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు సాధించారని గుర్తు చేశారు. నేటి పోటీ ప్రపంచంలో చదువు ఒక్కటే ప్రధాన పాత్ర వహిస్తున్న ఈ రోజుల్లో ఇంకా సిద్ధార్థ విద్యాసంస్థలు తమ విద్యార్థులను చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ ప్రోత్సహిస్తుండటం అభినందనీయమన్నారు. చదువు ఉపాధి, ఉద్యోగాలను చూపిస్తే క్రీడలు మానసిన దృఢత్వాన్ని నాయకత్వ లక్షణాలను ఇస్తాయన్నారు. నేటితరం విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా శారీరక మానసిక శక్తిని సాధిస్తారన్నారు. ప్రిన్సిపల్ సునీత అధ్యక్షత వహించగా 400 మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల కన్వీనర్ శ్యామ్ కృష్ణ, స్పోర్ట్స్ స్టాఫ్ కో-ఆర్డినేటర్ సాయినాథ్, పీడీ వినయ్‌శేఖర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినిమా డైరెక్టర్ వీఎన్ ఆదిత్య

జగన్ వల్లే అధ్వానంగా ఇంటర్ ఫలితాలు: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌రెడ్డి పనికిమాలిన ప్రయోగాలు, నిర్వాకం వల్లే ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ఫలితాలు అధ్వానంగా వచ్చాయని తెలుగుదేశం పార్టీ విమర్శించింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం శనివారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'రూ.వేల కోట్లు విద్యా వ్యవస్థ మీద ఖర్చు చేస్తున్నామని ఉపన్యాసాలు దంచుతున్న సీఎం జగన్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ ఫలితాలు ఇంత హీనంగా రావడానికి కారణం ఏమిటో సమాధానం చెప్పాలి. ఇంటర్ కళాశాలల్లో బోధన ఎలా జరుగుతోందో పట్టించుకొన్న నాథుడు లేడు. ఈ వైఫల్యాన్ని ఇప్పుడు ఈ ఫలితాల్లో కనిపిస్తోంది. ఇంత హీనంగా ఫలితాలు వచ్చినందుకు ప్రభుత్వం సిగ్గుతో తల దించుకోవాలి' అని అన్నారు.

ఓటు కోసం చేనేతలపై జగన్ కపట ప్రేమ: నిమ్మల

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు వస్తాయని చేనేత వర్గాల వారిపై సీఎం జగన్మోహన్‌రెడ్డి కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని టీడీపీ నేత, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ధ్వజమెత్తారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో ఆన్‌లైన్‌లో మాట్లాడారు. 'రాష్ట్రంలో చేనేత వృత్తిలో రెండున్నర లక్షల మంది కార్మికులు ఉంటే వారిలో కేవలం లక్షలోపు మందికి మాత్రమే జగన్ పథకాల సాయం అందింది. ఆ మాత్రం దానికే జగన్ ఆకాశం దిగివచ్చిన సాయంలో ఊదరగొడుతున్నారు. ప్రభుత్వ సాయం ముందు పేదలకు అందాలి. మగ్గాలపై పనిచేసే పేద కార్మికులకు సాయం చేయకుండా మిగిలిన వారికి వస్త్ర కాల లబ్ధి అందిస్తే ఏం ఉపయోగం? కార్మికులు దీనిపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి సూటిగా సమాధానం చెప్పలేక దాటవేస్తున్నారు. జగన్ విధానాలవల్ల వైసీపీ హయాంలో 100 మంది చేనేత కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన పాఠం చెబుతారు' అని కిష్టప్ప హెచ్చరించారు.

ప్రచారం పిచ్చి ముదిరింది: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి యాత్రలో బస్సు వద్దకు ఒక పేషెంట్‌ను స్ట్రెచర్‌పై తీసుకురావడం వివాదంగా మారింది. జగన్‌కు ప్రచారం పిచ్చి ముదిరిందని టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఈ సంఘటనపై వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లాలో శుక్రవారం జగన్ పర్యటనలో ఈ సంఘటన చోటుచేసుకొంది. ఆయన బస్సు యాత్ర మార్గ మధ్యంలో నల్లపాడు వద్ద ఒకచోట ఒక పేషెంట్‌ను స్ట్రెచర్‌పై తీసుకువచ్చి కుటుంబ సభ్యులు నిలిపి ఉంచారు. ఆ పేషెంట్‌కు సెలైన్ కూడా పెట్టి ఉంది. ఆ దారి ముందే వెళ్తినట్లుగా సరిగ్గా ఆ స్ట్రెచర్ ఆగి ఉన్న ప్రదేశం దగ్గర ఆయన బస్సు ఆగింది. జగన్మోహన్‌రెడ్డి బస్సు దిగి ఆ పేషెంట్‌ను పరామర్శించారు. కుటుంబ సభ్యులు ఆ పేషెంట్‌కు సాయం చేయాలని అభ్యర్థించారు. తమ వారికి చెబితే వారు చూసుకొంటారని ఆయన హామీ ఇచ్చారు. పక్కనే జగన్ ఫొటోలో ఫ్లెక్సీలు కూడా ప్రదర్శించారు. ఈ మొత్తం సంఘటనను వైసీపీ ప్రచార విభాగం వీడియో తీసి తమ సామాజిక మాధ్యమాల్లో ఉంచింది. ఈ సంఘటనపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ముఖ్యమంత్రి బస్సు యాత్రలో బస్సు వద్దకు పేషెంట్‌ను ఆ స్థితిలో తీసుకురావడం దారుణం. ఆక్కడ తోపులాటలో లేదా ఎండ వేడిమికి ఆ పేషెంట్‌కు జరగరాని ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులు? పేషెంట్‌ను ఆస్పత్రిలో ఉంచి కుటుంబ సభ్యులు కలవదలిచి వస్తే వారికి కలసి సాయం ఇస్తే బాగుండేది. ఏకంగా పేషెంట్‌ను తీసుకురావడం ప్రచారం కోసమే చేసినట్లుంది' అని విమర్శలు వినిపించాయి. టీడీపీ నేత లోకేశ్ ఈ సంఘటన వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసి దానిపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

నియంత చేతుల్లో రాష్ట్రం విలవిల: రామకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ ఒక నియంత చేతుల్లో చిక్కింది. ఫలితంగా గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోంది' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి ప్రతినిధులు శనివారం విజయవాడలోని దాసరి భవన్‌కు వచ్చి రామకృష్ణను కలిశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 'ఈ ఎన్నికల్లో ప్రజా కంటక పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి కలిగించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి' అని అన్నారు.

మరో 16 మంది పేర్లతో కాంగ్రెస్ జాబితా విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: మరో 16 లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ శనివారం అభ్యర్థులను ప్రకటించింది. చండీగఢ్ నుంచి కేంద్ర మాజీ మంత్రి మనీశ్ తివారీ పోటీ చేయనున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీలో బీజేపీ అభ్యర్థి, ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌కు ప్రత్యర్థిగా విక్రమాదిత్య సింగ్‌ను నిలబెట్టింది. ఆయన హిమాచల్ పీసీసీ చీఫ్ ప్రతిభా సింగ్ కుమారుడు కావడం గమనార్హం.

కరెంటు కోసం కేంద్రం ముందుజాగ్రత్త

» మే 1 నుంచి గ్యాస్ ప్లాంట్లు విద్యుదుత్పత్తి చేయాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: వేసవిలో కరెంటు వినియోగం పెరగనున్న దృష్ట్యా కేంద్రప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. దేశంలోని గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు మే 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు కరెంటు ఉత్పత్తి చర్యలకు అవసరమైన కేంద్ర విద్యుత్‌శాఖ ఆదేశించింది. వాణిజ్య కారణాల రీత్యా పలు గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి జరగడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం తాజా ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, విదేశీ బొగ్గు దిగుమతులపై ఆధారపడి కరెంటు ఉత్పత్తి చేస్తున్న కంపెనీలను కూడా.. అక్టోబరు 15వ తేదీ వరకు పూర్తిస్థాయిలో పని చేయాలని విద్యుత్‌శాఖ ఆదేశించింది. జూన్ 30వ తేదీ వరకు పూర్తి సామర్థ్యంతో పని చేయాలని గతంలో ఈ కంపెనీలను ఆదేశించిన కేంద్రం తాజాగా వాటిని అక్టోబరు 15 వరకూ పొడిగించింది.

అధిష్ఠానం చెప్తే సీఎం పదవిని వదులుకుంటా

» కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తాను ముఖ్యమంత్రిగా కొనసాగాలా లేదా? అనేది కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, పార్టీ సూచిస్తే సీఎం పదవిని వదులుకుంటానని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. మైసూరులో శుక్రవారం ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. రెండేళ్ల తర్వాత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం పదవి కట్టబెట్టాలనే అంశంపై ఆయన ఈ విధంగా స్పందించారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి ఆశించిన స్థానాలు రాకపోవచ్చుననే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు. ఎన్డీయే కూటమికి కూడా మెజారిటీ సాధ్యం కాకపోవచ్చునని అన్నారు. బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించలేదనీ ఎన్డీయే కూటమిని ఏర్పాటు చేసుకుందని అన్నారు.

ఎన్ఐఏ కస్టడీకి కెఫె పేలుళ్ల కేసు నిందితులు

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల కేసు నిందితులు ముసావిర్ హుసేన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ తాహాను ఎన్ఐఏ 10 రోజుల కస్టడీకి తీసుకుంది. కోల్‌కతా నుంచి వారిద్దరిని శుక్రవారం రాత్రి పొద్దుపోయాక బెంగళూరుకు తీసుకొచ్చారు. మడివాళలోని ఫోరెన్సిక్ ల్యాబ్ కేంద్రానికి అనుబంధంగా ఉండే ఇంటరాగేషన్ సెల్‌లో విచారణ జరిపారు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత కోరమంగల నేషనల్ స్పోర్ట్స్ విలేజ్‌లోని జ్యుడీషియల్ క్వార్టర్స్‌కు తీసుకువెళ్లి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి ఆదేశించారు.

బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉగ్రదాడులు

» 11 మందిని చంపిన మిలిటెంట్లు

కరాచీ, ఏప్రిల్ 13: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోయారు. తాజాగా రెండు వేర్వేరు దాడుల్లో 11 మందిని మిలిటెంట్లు పొట్టనబెట్టుకున్నట్లు శనివారం అధికారులు తెలిపారు. క్వెట్టా నుంచి తఫ్తాన్‌కు జాతీయ రహదారిపై వెళ్తున్న బస్సును గుర్తు తెలియని మిలిటెంట్లు ఆపి అందులో నుంచి తొమ్మిది మంది ప్రయాణికులను బయటకు లాక్కెళ్లారని, అనంతరం వారిని చంపేశారని ఓ అధికారి చెప్పారు. ఈ తొమ్మిది మంది మృతదేహాలను సమీప పర్వత ప్రాంతాల్లోని వంతెన సమీపంలో గుర్తించామని, ఘటనాస్థలంలో చాలా బుల్లెట్ గాయాలున్నాయన్నారు. ఇదిలా ఉండగా.. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు పాక్ సైనికులు, ఒక ఎలైట్ సీనియర్ సైనికుడు మరణించినట్లు అధికారులు తెలిపారు.

గోవాలో ఐదేళ్ల బాలికపై హత్యాచారం

వాస్కో, ఏప్రిల్ 13: దక్షిణ గోవాలోని వాస్కోలో దారుణం చోటుచేసుకుంది. ఓ దుండగుడు ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేసి, ఆపై పీక నులిమి హత్య చేశాడు. కనీసం 15 మంది దుండగుడిని ఈ నేరం జరిగిన సంఘటనం కలిగించింది. దీనిపై దక్షిణ గోవా ఎస్పీ సునీతా సావంత్ మాట్లాడారు. ఆ బాలికపై లైంగిక దాడి జరిగినట్టు, అనంతరం గొంతు నులిమి హత్య చేసినట్లు పోస్టుమార్టంలో తేలిందని చెప్పారు.

బదిలీ అయినా కదలరా?!

» క్యాంపు కార్యాలయాన్ని వీడని ఐజీ పాలరాజు
» పది రోజులు దాటినా అక్కడే తిష్ఠ
» అనధికారికంగా వ్యవహారాలు నడుపుతున్నట్లు ఆరోపణలు

గుంటూరు, ఏప్రిల్ 13 : అధికార పార్టీతో అంటకాగుతూ ఎన్నికల కమిషన్ ఆగ్రహానికి గురై బదిలీ వేటు పడిన గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు వ్యవహారశైలి మరోసారి వివాదాస్పదమైంది. ఎన్నికల షెడ్యూలు విడుదలైన తర్వాత కూడా కొందరు ఐపీఎస్ అధికారులు అధికార పార్టీకి ఊడిగం చేస్తూ ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నెల 2న తెలుగు రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ఐపీఎస్ అధికారులను, మరో ముగ్గురు ఐఏఎస్ లను అప్పటికప్పుడు బదిలీ చేసిన విషయం విదితమే. వీరిలో గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ వైరవిశంకర్ రెడ్డి, ప్రకాశం ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, నెల్లూరు ఎస్పీ కె.తిరుమలేశ్వర్ రెడ్డి, చిత్తూరు ఎస్పీ జాషువా, అనంతపురం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తదితరులు ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులంతా ఆదేరోజు విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయా స్థానాల్లో ఈ నెల 4న కొత్తగా ఆరుగురు డైరెక్ట్ ఐపీఎస్ అధికారులను నియమించారు. దీనిలో భాగంగా గుంటూరు రేంజ్ గా సర్వ శ్రేష్ఠ త్రిపాఠి నియమించడంతో ఆదే రోజు ఆయన ఆగమేఘాలపై వచ్చి విధుల్లో చేరారు. అయితే, పాలరాజు క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేయకపోవడంతో త్రిపాఠి గుంటూరులోని పోలీసు అతిథి గృహంలో ఉండాల్సి వస్తోంది.



పాలరాజుపై వేటు పడింది ఇలా!

గత నెల 17న చిలకలూరిపేట పరిధిలోని బొప్పూడి వద్ద తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ప్రజాగళం పేరుతో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఎలాగైనా సభను విఫలయత్నం చేయాలనేది వైసీపీ ఉద్దేశం కాగా అందుకు అనుగుణంగా రేంజ్ పరిధిలోని ఐజీ పాలరాజుతో పాటు పల్నాడు, ప్రకాశం, నెల్లూరు ఎస్పీలు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా ప్రధాని పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడింది. ప్రధాని పాల్గొన్న సభలో జనాన్ని నియంత్రించకపోవడంతో వారు సౌండ్ సిస్టం స్టాండ్ పైకి పెద్ద సంఖ్యలో యువకులు ఎక్కడం, ప్రధాని మాట్లాడుతున్నప్పుడు పలు దఫాలు మైకు ఆగిపోవడం, ప్రజాగళం సభకు వచ్చే వాహనాలకు అడ్డంకులు సృష్టించడం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించకపోవడం వంటి అనేక వైఫల్యాలు కేవలం పోలీసుల దురుద్దేశం కారణంగానే చోటుచేసుకున్నట్లు కేంద్ర నిఘా వర్గాలు సైతం గుర్తించి నివేదిక పంపాయి. అంతేగాక అటు ప్రకాశం జిల్లాలోనూ ఇటు పల్నాడు లోనూ టీడీపీ కార్యకర్తల హత్య, హత్యాయత్నాల నేపథ్యంలో శాంతిభద్రతల వైఫల్యం వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకున్న ఎన్నికల కమిషన్ వీరిని తక్షణం విధుల నుంచి తప్పించింది. అంతేగాక వారికి ఎన్నికలకు సంబంధం లేని ఎటువంటి విధులు కేటాయించవద్దని కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే విధుల నుంచి ఈ నెల 2వ తేదీన తప్పుకున్న రేంజ్ ఐజీ పాలరాజు నేటి వరకు అధికారిక నివాసాన్ని ఖాళీ చేయకుండా అందులోనే ఉంటున్నారు. ఐజీ క్యాంపు కార్యాలయంలోనే ఐజీ కార్యాలయం కూడా ఉంటుంది. పాలరాజు ఖాళీ చేయకపోవడంతో నూతన ఐజీగా నియమితులైన ఎస్ఎస్ త్రిపాఠి ఆ రోజు నుంచి గుంటూరులోని పోలీస్ అతిథి గృహంలోనే ఉంటూ, అక్కడి నుంచి తన కార్యాలయానికి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. కాగా, పాలరాజు అధికారికంగా విధుల నుంచి తప్పుకున్నప్పటికీ క్యాంపు కార్యాలయాన్ని వీడకుండా అనధికారికంగా వ్యవహారాలు నడుపుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఫోన్ ద్వారా రేంజ్ పరిధిలోని అధికారులతో మాట్లాడుతూ అనధికారికంగా ఆదేశాలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బదిలీ వేటుపడిన అధికారి అదే క్యాంపు కార్యాలయంలో నివాసం ఉంటుంటే కింద్యిస్థాయి పోలీస్ అధికారులకు ఎటువంటి సందేశం వెళుతుందని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అలాగే కొత్త ఐజీ త్రిపాఠి ఏ విధంగా స్వేచ్ఛగా పనిచేయగలుగుతారనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో ప్రతిపక్షాలు ఐజీ పాలరాజుపై మరోసారి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నాయి.

పోలీసులపైనే దాడులా..!

» డ్యూటీలో ఉన్నవారిని చితకబాది తీవ్రంగా గాయపరిచారు
» వైసీపీ నేతలపై చర్యలు తీసుకోండి: మన్నవ

అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్న సిద్ధం సభలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లపై వైసీపీ నేతలు దాడి చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలి' అని గుంటూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనాను కలసి దీనిపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'శుక్రవారం ఏటుకూరు వద్ద జరిగిన మేమంతా సిద్ధం సభలో వైసీపీ విద్యార్థి విభాగం నేతలు పోలీసులపై దాడి చేశారు. సీఎం భద్రతా చర్యల్లో భాగంగా సభా ప్రాంగణాన్ని వర్చువల్‌ క్రిందకుండు గ్రీన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రీన్ కెమెరాలను పోలీస్ సాంకేతిక విభాగానికి చెందిన రమేశ్, సుబ్బారెడ్డి ఆపరేట్ చేస్తున్నారు. ఫ్రోన్ కెమెరాలను సైతం పగలగొట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా వైసీపీ నేతలు ఆగడాలు ఆగలేదు. పోలీసులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు ఎలా రక్షణ ఉంటుంది? ఇలాంటి దాడులను చూసి ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు ఎలా వినియోగించుకుంటారు? ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరగాలంటే ఇలాంటి దాడులను అరికట్టి, ఇందుకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పల్నాడు జిల్లా రెంటచింతల మండలం తుమ్మకోటలో టీడీపీ కార్యకర్త పఠాన్ జలీల్ ఖాన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దానికి టీడీపీ నాయకులను ఆహ్వానించారు. ఇఫ్తార్ విందు ఇచ్చినందుకు జలీల్ ఖాన్ చాంద్ బాషాలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై దాడిచేసిన వారిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరాం' అని మన్నవ చెప్పారు.

ఉక్కుకు మరో చిక్కు!


విశాఖ ఉక్కు కర్మాగారం

» ఉత్పత్తికి అనుగుణంగా అందని బొగ్గు
» గంగవరం పోర్టులో కార్మికుల సమ్మె ఫలితం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'ఏంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది' అన్నట్టుగా.. గంగవరం పోర్టులో కార్మికుల సమ్మె ప్రభావం విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై పడింది. జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అదానీ గంగవరం పోర్టులో కార్మికులు చేపట్టిన ఆందోళన శనివారం నాలుగో రోజుకు చేరింది. పోర్టులోకి ఉద్యోగులను సైతం వెళ్లకుండా అడ్డుకోవడం వల్ల లోపల ఆపరేషన్లన్నీ స్తంభించిపోయాయి. స్టీల్‌ప్లాంటుకు అవసరమయ్యే ముడిసరుకులన్నీ గంగవరం పోర్టు ద్వారానే వస్తాయి. వీటిలో బొగ్గు ప్రధానమైనది. రోజుకు 12 వేల టన్నులు అవసరం. ఒక ర్యాక్ (గూడ్స్ రైలు)లో నాలుగు వేల టన్నుల బొగ్గు పడుతుంది. అలాంటివి రోజూ మూడు ర్యాక్‌లతో బొగ్గు వస్తేనే ఆ కోక్‌తో కోక్ తయారు చేసి, ఆ తరువాత అనేక దశల్లో స్టీల్ తయారు చేస్తారు. కోక్ తయారు చేయడానికి కోక్ ఓవెన్ బ్యాటరీలు ఐదు వరకు ఉన్నాయి. వీటి ఖరీదు ఒక్కొక్కటి రూ.700 కోట్లు. ఇవి నిత్యం బొగ్గుతో మండుతూనే ఉండాలి. ఇక్కడ జరిగే పనిని 'పుష్'లతో కొలుస్తారు. సాధారణంగా రోజుకు 320 పుష్‌లు తీస్తారు. అయితే, గంగవరం పోర్టులో ఆందోళన వల్ల నాలుగు రోజులుగా బొగ్గు సరఫరా నిలిచిపోయింది. శనివారం 260 పుష్‌లు మాత్రమే తీశారు. ఆదివారం మరో 260 పుష్‌లు తీయడానికి సరిపడా బొగ్గు ఉంది. సోమవారానికి బొగ్గు లేదు.

ఆది పోర్టు నుంచి రావలసిందే

ఆస్ట్రేలియా నుంచి రెండు నౌకలతో 1.5 లక్షల టన్నుల బొగ్గును స్టీల్‌ప్లాంటు తెప్పించుకుంది. ఆ రెండు నౌకలు పోర్టులోకి వచ్చి ఆగిపోయాయి. సరుకు దిగుమతి చేసే వారు లేరు. మరో 30 వేల టన్నుల బొగ్గు పోర్టు గోడౌముల్లో ఉంది. దానిని పంపాలన్నా పోర్టులో కార్మికులు అవసరం. పోర్టు నుంచి నేరుగా స్టీల్‌ప్లాంటుకు కన్వేయర్ లైన్ ఉంది. దాని ద్వారా సరుకులు పంపుతుంటారు. ఇప్పుడు అది కూడా ఆగిపోయింది. దీంతో అందుబాటులో ఉన్న బొగ్గును కూడా పొదుపుగా వాడుతున్నారు. ఈ సమస్య ఉదయానికి పరిష్కారం లభించకపోతే స్టీల్‌ప్లాంటులో కోక్ ఓవెన్‌లు మూసేయాల్సి వస్తుంది. అలా చేస్తే ఓవెన్లు కుప్పకూలే ప్రమాదం ఉంది. మళ్లీ వాటిని హీట్ చేసి ఉపయోగంలోకి తేవాలంటే నమయంతో పాటు ఖర్చు కూడా ఎక్కువ అవుతుంది. కింకర్తవ్యం..

స్టీల్‌ప్లాంటుకు తక్షణం బొగ్గు అందించడానికి రెండు మార్గాలున్నాయి. అందులో మొదటిది పోర్టులో స్టీల్‌ప్లాంటు బొగ్గు ఉంది. ప్రస్తుతం గోదాములో ఉన్న 30 టన్నుల బొగ్గును లారీల ద్వారా ఆ గేటు ద్వారా ప్లాంటులోకి పంపించవచ్చు. రెండో అవకాశమూ ఉంది. సెయిల్, ఎన్ఎండీసీలకు చెందిన బొగ్గు నౌకలు గంగవరం పోర్టుకు రాగా వాటిని విశాఖపట్నం పోర్టుకు తరలించారు. వారికి ఆ పోర్టులో వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. ఆ రెండు కేంద్ర ప్రభుత్వ సంస్థలే కాబట్టి, వారి దగ్గర బొగ్గు ఉన్నందున విశాఖపట్నం పోర్టు నుంచి రోడ్డు మార్గాన స్టీల్‌ప్లాంటుకు సరఫరా చేస్తే కోక్ ఓవెన్లను ఆపకుండా నడిపే అవకాశం ఉంది.

పోర్టుదే బాధ్యత

దిగుమతి చేసుకున్న సరుకును ప్లాంటులోకి తెచ్చి ఇవ్వాలని పోర్టుతో స్టీల్ యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు దానిని అదానీ యాజమాన్యం చేయలేకపోతోంది. ఈ కారణంగా ఎటువంటి నష్టం జరిగినా దానిని పోర్టు యాజమాన్యమే భరించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

గంగవరం పోర్టులో ఇదీ పరిస్థితి!

కార్మికుల ఆందోళనతో ఏ ఒక్క నౌకా పోర్టులోకి రావడం లేదు. ఆన్నీ ఔట్ ఆన్ కర్స్ (పోర్టుకు సమీపాన సముద్రం)లో ఉండిపోయాయి. బెర్తుల వద్దకు వచ్చిన నౌకల నుంచి సరుకును అన్‌లోడింగ్ చేసేవారు లేరు. బెర్తుల వద్ద, గోడౌముల్లో ఉన్న సరుకులను ర్యాక్‌లకు లోడింగ్ చేయడం వీలు కావడం లేదు. అన్ని ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఆందోళన చేస్తున్న కార్మికులతో పోర్టు యాజమాన్యం చర్చలు జరిపి కొంతున్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో శనివారం చర్చలు జరిగినా ప్రయోజనం లేకపోయింది.

శరత్ రూ.14 కోట్లు ఎందుకిచ్చాడు?



» ఆప్‌కు రూ.25 కోట్లు ఇవ్వమని బెదిరించారా?
» వ్యాపారం చేసుకోలేవని శరత్‌ను భయపెట్టారా?
» జాగృతికి 80 లక్షల విరాళం మతలబేంటి?
» కవితకు 5 గంటలపాటు సీబీఐ ప్రశ్నలవర్షం
» సాక్ష్యాలను ముందు పెట్టినా సమాధానం దాటవేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కుట్రదారులలో ఎమ్మెల్సీ కవిత ప్రధాన సూత్రధారి, పాత్రధారి అని నిరూపించేలా సీబీఐ విచారణ జరుగుతోంది. మద్యం విధానం రూపకల్పన, ఇతరులను బెదిరించినందుకు పాటు ఆమె ఎక్కడ పార్టీకి ఆర్థికంగా నిధుల తరలింపు వ్యవహారంపై తమ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కవితను సీబీఐ అధికారులు శనివారం విచారించారు. విజయ్ నాయర్, ఇతరుల ద్వారా ఆమ్‌ఆద్మీ పార్టీకి రూ.100 కోట్ల తరలింపు, ఆప్‌కు చెల్లించిన డబ్బులను ఇతరుల నుంచి వసూలు చేయడంలో ఎలుకున్న పద్ధతులపై ఆమెను ప్రశ్నించింది. లిక్కర్ స్కాంలో ఆప్రూవర్‌గా మారిన వారు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా కవితను సీబీఐ ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. మద్యం కుంభకోణంలో కవితను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ కోసం ఆమెను మూడు రోజుల పాటు సీబీఐ కస్టడీకి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం కవితను 4-5 గంటల పాటు సీబీఐ విచారించింది. ఇతర నిందితుల, ప్రభుత్వ అధికారుల పాత్రపై కవిత దగ్గర నుంచి సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నించింది. అరబిందో శరత్ చంద్రారెడ్డికి ఐదు మద్యం రిటైల్ జోన్లు దక్కినందుకు ప్రతిఫలంగా భూమి అమ్మకం పేరుతో ఆయన దగ్గర నుంచి వసూలు చేసిన రూ.14 కోట్లకు సంబంధించినసాక్ష్యాలను సీబీఐ ఆమె ముందు ఉంచి ప్రశ్నించింది. ఆ డబ్బులను ఎక్కడికి తరలించారో చెప్పాలని కోరింది. డబ్బు చెల్లించాక కూడా శరత్ చంద్రారెడ్డికి భూమి బదలాయింపు చేయక పోవడం, ఐదు రిటైల్ జోన్లకు మొత్తం రూ.25 కోట్లు(జోన్‌కు రూ.5 కోట్ల చొప్పున) ఇవ్వాలని లేకపోతే వ్యాపారానికి నష్టం చేస్తానని బెదిరించారని ఆరోపణలపై ప్రశ్నించినట్లు తెలిసింది. తెలంగాణ జాగృతి సంస్థకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద శరత్‌చంద్రారెడ్డి ఇచ్చిన రూ.80 లక్షలపై ఆరా తీసినట్లు తెలిసింది. వినామీ అరుణ్ పిళ్లై రూపంలో ఇండో స్పిరిట్ హోల్‌సేల్ లైసెన్స్‌లో కవిత భాగస్వామి అయిందన్న ఆరోపణలపై అడిగినట్టు తెలుస్తున్నారు. సీబీఐ అధికారుల ప్రశ్నలల్లో కొన్నింటికి కవిత ముక్తసరిగా సమాధానాలు ఇచ్చారు. చాలా ప్రశ్నలకు సమాధానాలను దాటవేశారు. శనివారం సాయంత్రం కవితను ఆమె భర్త అనిల్, న్యాయవాది మోహిత్‌రావు, పీఏ శరత్ కలిశారు. సీబీఐ దర్యాప్తు తీరుపై వారితో ఆమె చర్చించినట్లు తెలిసింది. సీబీఐ ప్రశ్నించడం, అరెస్టును సవాల్ చేస్తూ దాఖలు చేసిన రెండు పిటిషన్లను కోర్టు శుక్రవారం కొట్టివేసిన నేపథ్యంలో న్యాయపరంగా ముందుకెళ్లడం ఎలా అన్నదానిపై చర్చించినట్లు తెలిసింది.

శ్రీ పద్మావతి హృదయాలయలో 14వ గుండె మార్పిడి ఆపరేషన్ విజయవంతం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 13: తాను చనిపోయా మరో ముగ్గురి ప్రాణాలను కాపాడింది ఓ యువతి. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి (38)కి ప్రమాదవశాత్తూ తలకు బలమైన గాయం తగలడంతో కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. అవయవ దానం చేయాలని వైద్యులు అభ్యర్థించగా ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆమె కిడ్నీని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి, గుండె, లివర్‌ను తిరుపతికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరుపతికి హెలికాప్టర్‌లో తరలించిన గుండె, లివర్‌ను గ్రీన్ చానల్ ద్వారా ఆస్పత్రులకు చేర్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గుండె శ్రీ పద్మావతి హృదయాలయకు, లివర్ స్విమ్స్ ఆస్పత్రికి చేరుకున్నాయి. హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు కృష్ణాజిల్లా కొత్తగూడేనికి చెందిన బాబూరావు(48)కు ఆ గుండెను సుమారు 7 గంటలపాటు శ్రమించి అమర్చారు. దీంతో హృదయాలయ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 14వ గుండె మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా ముగిసినట్లైంది. స్విమ్స్‌కు చేర్చిన లివర్‌ను ఓ రోగికి శనివారం రాత్రి అమర్చారు.



కర్నూలు నుంచి తీసుకొచ్చిన గుండెను శ్రీ పద్మావతి హృదయాలయంలోకి తీసుకువెళుతున్న వైద్యులు

ఇజ్రాయెల్ ఏఐతో భారత్ లింకు

» గాజాలో 'వాంటెడ్'ల పట్టివేతలో ఫేసియల్ రికగ్నిషన్
» హమాస్ చెరలోని బందీల ఆచూకీలోనూ వాడకం

టెల్‌అవీవ్, ఏప్రిల్ 13: గాజాలో హమాస్ ఉగ్రవాదుల వేటకు, తమ దేశానికి చెందిన బందీల జాడ కనుగొనేందుకు ఇజ్రాయెల్ కృత్రిమ మేధ(ఏఐ)తో రూపొందించిన ముఖ గుర్తింపు సాంకేతికత (ఎఫ్ఆర్‌టీ)ను విస్తృతస్థాయిలో వినియోగిస్తోంది. గత ఏడాది అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు దాడికి దిగిన మరుక్షణమే ఈ టెక్నాలజీని వాడకలోకి తెచ్చింది. ఎఫ్ఆర్‌టీని కార్సైట్ ఏఐ అనే సంస్థ తయారుచేసి, పర్యవేక్షిస్తోంది. ఈ కంపెనీ మూలాలు భారత్‌తో సంబంధాలు కలిగి ఉండడం గమనార్హం. ప్రభుత్వరంగ ఆస్ట్రో ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంటీఆర్‌బీఎవ్‌ఎల్), ముంబైకి చెందిన సెక్యూరిటీ సర్వీసుల కంపెనీ వి-సెక్యూర్‌తో 2021లో కార్సైట్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఆస్ట్రో రాజధాని గువాహటి టెక్ సిటీలో ఫేసియల్ రికగ్నిషన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసింది. భారత్‌లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ-ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన ఎఫ్ఆర్‌టీ సాంకేతికతను ఎప్పటికప్పుడు అందించేలా ఏఎంటీఆర్‌వీఎస్‌ఎల్ బలోపేతం చేయడం దీనివెనుక ఉన్న ఉద్దేశం. ఈ సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఏఎంటీఆర్‌వీఎస్-ఎ సెక సంస్థలు భారత్ వ్యాప్తంగా ఉత్తమ అభివృద్ధి అవకాశాన్ని ఎఫ్ఆర్‌టీ సేవలను అందుబాటులోకి తెచ్చాయని కార్సైట్ ఏఐ సీఈవో రాబ్ వాట్స్ ఉన్నారు. కాగా, ఏక కాలంలో 6 లక్షల సీసీ కెమెరాలను విశ్లేషించగల సామర్థ్యం ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణంలో ప్రపంచంలో తెలంగాణ గుర్తింపు ఉన్న నగరాల్లో ఒకటిగా పేరొందింది హైదరాబాద్. ఈ నేపథ్యంలోనే పలు ప్రశ్నలను లేవనెత్తుతూ గత గురువారం కేంద్ర ఐటీ శాఖ, ఏఎంటీఆర్‌వీఎస్‌కు కొందరు లేఖ రాశారు. గాజాలో తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, ఇలాంటి సందర్భంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏఎంటీఆర్‌వీఎస్ ఇంకా కార్సైట్ ఏఐతో ఒప్పందంలో ఉండడాన్ని నిలదీశారు.



జనానికి నరకయాతన

» జగన్ రోడ్ షోతో స్తంభించిన జాతీయ రహదారి
» 3 గంటల పాటు వాహనదారులకు తిప్పలు

విజయవాడ/గుడివాడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర విజయవాడ వాసులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. గుంటూరు-విజయవాడను అనుసంధానం చేసే వారధి మీదుగా యాత్ర సాగినంత మేర ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. శనివారం సాయంత్రం 5గంటలకు ఆయన వారధి మీదుగా విజయవాడలోకి ప్రవేశించారు. మంగళగిరిలో కాన్వాయ్ కదలడానికి ముందునుంచే ఇక్కడ ట్రాఫిక్‌ను నిలుపుదల చేశారు. మంగళగిరి వైపునుంచి విజయవాడలోకి వచ్చే వాహనాలను అనుమతించ లేదు. దీంతో డీజీపీ కార్యాలయం ముందున్న జాతీయ రహదారి నుంచి వారధి వరకు ట్రాఫిక్ స్తంభించింది. యాత్ర నెమ్మదిగా వంతెన మీద నుంచి పశువుల ఆసుపత్రి జంక్షన్‌కు చేరుకున్న తర్వాత పోలీసులు ట్రాఫిక్‌ను వదిలారు. ఆయినా వాహనాలు ముందుకు కదలడానికి 3గంటల సమయం పట్టింది. గంటల తరబడి వాహనాలు నిర్బంధించబడడంతో వాహనదారులు తీవ్ర వేదన వ్యక్తం చేస్తూ హారన్లు మోగించారు. కేకలు వేశారు. సిద్ధం యాత్రలో వైసీపీ నాయకులు ఆడుగడుగునా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. వారధి ఆరువైపులా కట్టిన జెండాలను ఆధికారులు తొలగించకుండా వదిలివేశారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ అవుతు శైలజ భర్త శ్రీనివాసరెడ్డి జెండాలు, తోరణాలు కట్టించారు. ఎన్నికల అధికారులు వాటిని తొలగిస్తుండగా వారిపై ఆయన తిరగబడ్డారు.

కేఆర్ఎంబీకి నిధుల కొరత

» ఈ నెల వేతనాలకు సరిపోని పరిస్థితి
» రూ.138 కోట్లకు గానూ రూ.48.98 కోట్లే చెల్లింపు

హైదరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి నిధులు రాబట్టుకునే అంశంపై చర్చించడానికి వీలుగా ఈనెల 22వ తేదీన ప్రత్యేకంగా బోర్డు సమావేశం నిర్వహించాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) నిర్ణయించింది. ప్రస్తుతం బోర్డు వద్ద ఉన్న నిధులు ఈనెల(మే 1వ తేదీ) వేతనాలకు కూడా సరిపోయే పరిస్థితి లేదు. నిధుల లేకపోవడంతో బోర్డు కార్యకలాపాలు కష్టంగా మారాయి. దీంతో తెలుగు రాష్ట్రాలు.. అంగీకారం మేరకు నిధులు ఇవ్వాలని బోర్డు కోరుతోంది. పదేళ్ల కాలంలో రూ.138 కోట్ల బడ్జెట్‌కు బోర్డు(తెలుగు రాష్ట్రాలతో పాటు కేంద్రం) ఆమోదం తెలుపగా.. ఒక్క రాష్ట్రం రూ.69 కోట్ల చొప్పున విడుదల చేయాల్సి ఉంది. ఏపీ ఇప్పటివరకూ రూ.28.26 కోట్లను చెల్లించగా.. తెలంగాణ రూ.19.71 కోట్లను విడుదల చేసింది. రూ.138 కోట్లకు గానూ తెలుగు రాష్ట్రాల నుంచి కేవలం రూ.48.98 కోట్లు మాత్రమే చేరాయి. గతేడాది ఏపీ నుంచి ఒక్కరూపాయి కూడా బోర్డుకు అందలేదు. తెలంగాణ కూడా రెండేళ్లుగా నిధులు ఇవ్వలేదు. దాంతో మే 1వ తేదీన వేతనాలతో పాటు నిర్వహణకు ఇబ్బందులు ఉండటంతో ప్రత్యేక భేటీని నిర్వహిస్తున్నారు. ఈనెల 22న జరిగే సమావేశంలో తెలుగు రాష్ట్రాలు నిధుల కోసం బోర్డు పట్టుబట్టే అవకాశం ఉంది. వర్కింగ్ మాన్యువల్ కోసం జరిగే సమావేశంలో నిధుల కోసం తెలుగు రాష్ట్రాలను బోర్డు ప్రత్యేకంగా అభ్యర్థించనుంది. ఇక రెండో దశ టెలిమెట్రీ వ్యవస్థ అమలు కోసం ఆత్యవసరంగా నిధులు అవసరమని ఇదివరకే బోర్డు తెలుగు రాష్ట్రాలకు లేఖ రాసింది. పోతిరెడ్డిపాడు నుంచి శ్రీశైలం కుడి ప్రధాన కాలువ మూడు కిలోమీటర్ల వద్ద, కేసీ కెనాల్‌తోపాటు నాగార్జునసాగర్ ఎడమ, కుడి ప్రధాన కాలువలు, ప్రకాశం బ్యారేజీ ప్రధాన కాలువ, పోలవరం రైట్ కెనాల్ కన్‌ఫ్లూయెన్స్ పాయింట్, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఏపీ, తెలంగాణ సరిహద్దు వద్ద టెలిమెట్రీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రతిపాదించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.6.25 కోట్లతో పరిపాలనాపరమైన అనుమతి కూడా ఇచ్చారు. నీటి లెక్కలు తేలాలంటే కచ్చితంగా టెలిమెట్రీ కేంద్రాలు పెట్టాల్సి ఉంటుందని, దీనికోసం తెలుగు రాష్ట్రాలు నిధులు ఇవ్వాలని బోర్డు కోరుతోంది. తెలంగాణ నుంచి వచ్చే నెల నుంచి ఢిల్లీ గవ్వ కూడా లేకపోవడం.. బోర్డు కార్యకలాపాలకు నిధుల కొరత వంటి అంశాల నేపథ్యంలో తక్షణమే సింగిల్ ఎజెండాతో బోర్డు సమావేశం పెట్టాలని నిర్ణయించింది.





కొన్ని కాంబినేషన్ల పై పరిశ్రమలో, ప్రేక్షకుల్లోనూ క్రేజ్. ముఖ్యంగా హీరో హీరోయిన్ల కాంబినేషన్ అయితే ఆ లెక్కే వేరు. అధికారిక ప్రకటన రాకమునుపే అటు హీరోలు, ఇటు హీరోయిన్ల అభిమానుల ఆరాలతో కలయిక వార్తలు పతాక శీర్షికలెక్కుతాయి. అయితే అవి కొన్నిసార్లు నిజం అయి అభిమానులను అలరిస్తాయి. మరికొన్ని సార్లు ఆ కాంబినేషన్ సెట్ అవ్వదు. అభిమానుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న కొత్త జంటలు అంటూ ఇప్పుడు పరిశ్రమలో వినిపిస్తున్న కొన్ని కాంబినేషన్ల సంగతులు ఇవి...

కలయిక కుదిరిందా... వేడుకే ఇక!

సీన్‌లోకి సమంత

'పుష్ప' చిత్రంలో 'ఊ అంటావా మావా' అంటూ తనదైన శైలిలో నర్తించి అభిమానులను మెప్పించారు అల్లు అర్జున్, సమంత జోడీ. తన సినిమాల్లో ప్రత్యేక గీతాలకు పెద్దపీట వేసే దర్శకుడు సుకుమార్. ఇప్పుడు 'పుష్ప 2'లోనూ ఓ ప్రత్యేక గీతం ప్లాన్ చేశారట. ఈ పాట కోసం బాలీవుడ్ కథానాయిక ఊర్వశీ రౌతేలాను రంగంలోకి దింపనున్నారని మొదట వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం సమంత సీన్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. పుష్ప సినిమాకు 'ఊ అంటావా మావా' సాంగ్... అందులో సమంత, బన్నీ స్టెప్పులు ప్రత్యేకార్షణగా నిలిచాయి. ఇప్పుడు కొనసాగింపు చిత్రంలోనూ వీరి కలయిక ప్రత్యేకంగా ఉండబోతోందని తెలుస్తోంది.

'పుష్ప 2: ది రూల్' చిత్రం తర్వాత అల్లు అర్జున్ చేయబోయే సినిమాపై ఇప్పటివరకూ అధికారిక ప్రకటన రాలేదు. కథ కుదిరితే 'పుష్ప 3' చేసే అవకాశముందని బన్నీ ఓ సందర్భంలో చెప్పారు. కానీ ఈ మధ్యన అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ సినిమా ఒకటి ఉండబోతోందనే వార్త బలంగా వినిపిస్తోంది. అయితే తాజా సమాచారం ప్రకారం అర్జున్, సమంతల కలయిక ప్రత్యేక గీతానికే పరిమితమవుతుందా లేదా అట్లీ దర్శకత్వంలో ఏకంగా సినిమానే వస్తుందా అనేది తెలియాలంటే కొంతకాలం ఆగాల్సిందే. హిందీలో 'జవాన్'తో భారీ హిట్ అందుకున్నారు అట్లీ. ఆయన గతంలో విజయ్ హీరోగా రూపొందించిన 'తేరీ' చిత్రంలో సమంత కథానాయికగా నటించారు. ఆ అనుబంధంతోనే ఇప్పుడు అట్లీ మరోసారి సమంతను కథానాయికగా తీసుకోబోతున్నారని కోలీవుడ్ పరిశ్రమలో వినిపిస్తోంది.



అవకాశం అందుకున్నారా?

ఓడలు బళ్లు అవడం అనే సామెత టాలీవుడ్‌లో పూజాహెగ్డే కెరీర్‌కు చక్కగా సరిపోతుంది. చూస్తుండగానే అగ్రకథానాయికగా ఆమె స్టార్‌డమ్‌కు గండిపడడమే కాదు వరుస అపజయాలతో అవకాశాలు సైతం కరవయ్యాయి. ఒకప్పుడు అగ్రహీరోలు ఏరీ కోరి తమ సినిమాల్లో కథానాయికగా పూజాను ఎంచుకున్నారు. కానీ మధ్యలో ఆమె బాలీవుడ్‌కు వెళ్లడం కూడా ఇక్కడ పరిశ్రమకు దూరమవడానికి కారణం. ప్రస్తుతం షాహిద్‌కపూర్‌తో 'దేవా' చిత్రం చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఎట్టకేలకు పూజా హెగ్డే రీ ఎంట్రీకి సిద్ధమవుతున్నారని సమాచారం. గతంలో 'ఓ లైలా కోసం' చిత్రంలో ఆమె నాగచైతన్యతో జోడీ కట్టారు. ఇప్పుడు మళ్లీ నాగచైతన్యతో కలసి నటించబోతున్నారని సమాచారం. నాగచైతన్య హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో పూజాను కథానాయికగా ఎంపిక చేసినట్లు టాక్. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

యశ్‌కు సోదరిగా కరీనా?

కేజీఎఫ్'తో ఓవర్‌నైట్ స్టార్‌గా ఎదిగారు యశ్. ఈ సిరీస్ తర్వాత ఆయన నటిస్తున్న చిత్రం 'టాక్సిక్'. గీతూమోహన్ దాస్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ అగ్ర కథానాయిక కరీనా కపూర్ ఓ హీరోయిన్‌గా నటించనున్నారనే విషయం కొన్నాళ్ల క్రితం ప్రచారంలోకి వచ్చింది. అయితే ఆమె హీరోయిన్‌గా కాదు యశ్‌కు సోదరి పాత్రలో నటిస్తున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇది నిజామా కాదా తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే దాకా ఆగాల్సిందే. కరీనాతో పాటు గతంలో పలువురు హీరోయిన్ల పేర్లు ఈ సినిమా విషయంలో వినిపించాయి. శ్రుతీహాసన్, సాయిపల్లవి, కియారా అద్వానీ పేర్లు వినిపించినా ఆ అవకాశం ఎవరికి దక్కుతుందో.





కొత్త జంట

'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో కథానాయకుడిగా సత్తా చాటారు తేజ సజ్జ. రవితేజతో 'ఈగల్' లాంటి బ్లాక్‌బస్టర్ హిట్ ఖాతాలో వేసుకున్నారు దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని. ఇప్పుడు వీరిద్దరి కలయికలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో కథానాయికగా రితికా నాయక్ పేరు పరిశీలనలో ఉంది. విష్వక్‌సేన్ నటించిన 'అశోకవనంలో అర్జున కల్యాణం' చిత్రంలో హీరోయిన్‌గా ఆమె చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. నాని 'హాయ్ నాన్న'లోనూ మెరిశారు. తన పాత్ర నచ్చడంతో తేజ సజ్జ చిత్రంలో నటించేందుకు ఆమె అంగీకరించారని తెలుస్తోంది. ఈ చిత్రంలో మంచు మనోజ్ మరో హీరోగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది.

విజయ్ నాయిక సస్పెన్స్?

'ఖుషీ' చిత్రంలో సమంతతో జత కలిశారు విజయ్ దేవరకొండ. 'ఫ్యామిలీస్టార్' చిత్రంలో మృణాళినీ ఠాకూర్‌తో ఆడి పాడారు. ఈ సారి ఆయనకు సరిజోడీ ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ ఓ చిత్రం చేస్తున్నారు. తొలుత శ్రీలీలను ఎంపిక చేసినా కొన్ని కారణాల వల్ల ఆమె తప్పుకొన్నారు. ఆ తర్వాత పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించాయి.

అయితే ఇప్పుడు బాలీవుడ్ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే పేరు బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె రవితేజతో 'మిస్టర్ బచ్చన్' చిత్రంలో నటిస్తున్నారు. త్వరలోనే భాగ్యశ్రీ పేరు అధికారికంగా ప్రకటించవచ్చని టాక్.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఎనీవన్ బట్ యూ	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 15
రెబల్ మూన్ 2	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 19
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
థీఫ్ డిటెక్టివ్ 1958	కొరియన్ సిరీస్	ఏప్రిల్ 19
సైరన్	తెలుగు డబ్బింగ్	ఏప్రిల్ 19
ఆహా...		
మై డియర్ దొంగ	తెలుగు చిత్రం	ఏప్రిల్ 19
బుక్ మై షో		
డ్యూన్ 2	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 16
లయన్స్ గేట్ ప్లే		
డ్రీమ్ సినారియో	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 19
ద టూరిస్ట్	వెబ్‌సిరీస్ 2	ఏప్రిల్ 19
జియో సినిమా		
పొన్ ఒండ్రు కండ్రేన్	తమిళ చిత్రం	ఏప్రిల్ 14
ది సింపథైజర్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 14
ఆర్టికల్ 370	హిందీ చిత్రం	ఏప్రిల్ 19



స్ఫూర్తిదాయకమైన ఆయన కథ..
ఇప్పుడు సినిమాగా!

పేరొందిన వ్యక్తుల జీవిత కథలు సినిమాగా రావడం ఇప్పుడు సర్వ సాధారణమైపోయింది. వీటిలో ఎక్కువగా సినిమా తారలు, రాజకీయనాయకులు, క్రీడాకారులవే ఉంటున్నాయి. ఇలాంటి సమయంలో.. 'శ్రీకాంత్' పేరుతో బాలీవుడ్‌లో రూపొందిన చిత్రం ట్రైలర్ విడుదలైంది. అయితే ఇప్పటివరకు వచ్చిన బయోపిక్‌లకు ఈ బయోపిక్‌కు ఎంతో తేడా ఉంది. కారణమేంటంటే పుట్టుకతోనే అంధుడైనా స్వశక్తితో పైకెదిగి.. వ్యాపార వేత్తగా సరికొత్త చరిత్ర సృష్టించిన ఓ వ్యక్తి జీవిత కథ ఇది. ఆ వ్యక్తి మరోవరో కాదు శ్రీకాంత్ బొల్లా. బాలీవుడ్‌లో ప్రస్తుతం అందరి దృష్టి ఈ చిత్రంపైనే ఉంది. ఇటీవలే ఈ చిత్రం ట్రైలర్ విడుదలై అందరినీ ఆకట్టుకుంటోంది. రాజ్‌కుమార్ రావు ఇందులో టైటిల్ రోల్ పోషించారు. అసలు ఎవరీ శ్రీకాంత్..



ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో పుట్టారాయన. పుట్టుకతోనే అంధుడైన ఆయన ఇలా ఎందరికో ఆదర్శవంతుడు అవుతారని అప్పట్లో ఎవరికీ తెలీదు. ఈ విషయం తెలీక ఇరుగు పొరుగు వాళ్లు ఆ పిల్లాడిని వదిలేయ్యమని అతని తల్లితండ్రులకు సలహా ఇచ్చినా అవేమి పట్టించుకోకుండా శ్రీకాంత్‌ను మరింత పట్టుదలతో పెంచారు. మ్యాథ్స్, సైన్స్ అంటే శ్రీకాంత్ బొల్లాకు అమితమైన ఇష్టం. ఆ కోరికతోనే ఐఐటీలో ఈ సబ్జెక్స్‌ను ఎంపిక చేసుకున్నారు. కానీ శ్రీకాంత్ బొల్లాను ఇండియాలోని టాప్ 2 ఐఐటీలు తిరస్కరించాయి. దానిక్కారణం డయాగ్రామ్స్, గ్రాఫ్స్‌తో కూడిన ఈ విద్యావిధానానికి అంధుడైన శ్రీకాంత్ సరిపోడని ఐఐటీ నిర్వాహకులు అనుకోవడమే. 'ఐఐటీలు నన్ను వద్దనుకుంటే..ఐఐటీలు కూడా నాకు వద్దు' అనుకున్న శ్రీకాంత్ అమెరికాలోని మసాచుయేట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చేరి బిజినెస్ మేనేజిమెంట్‌లో పట్టా పొందిన మొదటి అంధ వ్యక్తిగా నిలిచారు. ఇలా జీవితంలో ఇప్పటికే ఎన్నో ఘనతలు సాధించిన శ్రీకాంత్ అసలు సిసలు జీవిత ధ్యేయం భారతదేశానికి మొదటి అంధ రాష్ట్రపతి కావడమే. కాగా, మే 10న విడుదలవుతోన్న ఈ బయోపిక్‌కు తుషార్ హిరనందని దర్శకత్వం వహించారు. భూషణ్ కుమార్, కృష్ణన్‌కుమార్ నిర్మించారు.

"మేనేజ్ చేయడం నా చేతుల్లోనే ఉంది. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో నా నైపుణ్యాలను ఎలా కావాలంటే అలా ఉపయోగించుకోవచ్చు. వ్యాపార ప్రపంచంలో నా ఆలోచనలు అనుకున్న రీతిలో సాకారమైతే.. ఎంతో మందికి నేను సాయం చేసినట్లే" అంటారు శ్రీకాంత్ బొల్లా. వ్యాపారవేత్తగా, సామాజిక సేవకుడిగా, ప్రపంచ ప్రసిద్ధి చెందిన బొల్లాంట్ ఇండస్ట్రీస్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సీఈఓ).. బహుముఖ ప్రజ్ఞాశాలిగా అందరి ప్రశంసలందుకుంటున్న ఆయన జీవితంలో ఎన్నో అటుపోట్లు ఉన్నాయి. అడుగడుగునా ఎన్నో సవాళ్లను దాటుకొని శ్రీకాంత్ ఎదిగిన వైనం ఎందరికో స్ఫూర్తిదాయకం.

తండ్రయిన మనోజ్

మంచు మనోజ్ అభిమానులకు తీపి కబురు అందించారు. మనోజ్,మౌనిక దంపతులకు శనివారం ఆడబిడ్డ జన్మించింది. ఈ విషయాన్ని మనోజ్ సోదరి మంచు లక్ష్మి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటించారు. "దేవతల ఆశీర్వాదంతో ఒక చిన్న దేవత మా జీవితాల్లోకి వచ్చింది. ఈ శుభ సందర్భాన్ని మీతో పంచుకోవడం ఎంతో ఆనందాన్నిస్తోంది. ఈ పండంటి ఆడబిడ్డను మేము 'ఎం ఎం పులి' అని పిలుస్తాం" అని పోస్ట్ చేశారు.





రూ. 45 కోట్లతో
ఇల్లు కొన్న పూజ

ఏడాది క్రితం వరకూ గ్లామర్ హీరోయిన్‌గా హల్‌చల్ చేసిన పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డేకు ఇప్పుడు తెలుగులో ఒక్కటంటే ఒక్క సినిమా కూడా లేదు. మహేశ్‌బాబు 'గుంటూరు కారం', పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాలు చేజారి పోవడంతో ఆమె డైరీ ఒక్కసారిగా ఖాళీ అయిపోయింది. ఆమె డేట్స్ కోసం నిర్మాతలందరూ అడుగుతుంటే ఏ సినిమా చేయాలా అనే కన్‌ఫ్యూజన్ ఒకప్పుడు పూజాకు ఉండేది. ఇప్పుడు ఏ సినిమా వస్తుందా అని ఆమె ఎదురు చూడాల్సి వస్తోంది. కాకపోతే తెలుగులో ఎప్పుడైతే అవకాశాలు తగ్గాయో అప్పుడే పూజా తెలివిగా బాలీవుడ్ మీద దృష్టి పెట్టి కొన్ని సినిమాలు చేజిక్కించుకుంది. షాహిద్ కపూర్ సరసన ఆమె నటించే 'దేవా' చిత్రం త్వరలో పట్టాలెక్కనుంది. 'దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి' అంటారు కదా అందుకే ఇప్పుడు పూజా ఆ పనిలో ఉంది. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో రూ. 45 కోట్లు పెట్టి ఓ ఇల్లు కొనేసింది. నాలుగు వేల చదరపు అడుగుల స్థలం కలిగిన ఇల్లు అది. సీ ఫేసింగ్ ఉండడం ఈ ఇంటి ప్రత్యేకత. ముంబైలో పూజాకు ఇప్పటికే ఓ ఫ్లాట్ ఉంది. అయినా ఖరీదైన బాంద్రా ప్రాంతంలో ఇల్లు ఉండడం సినిమా వాళ్లకు ఓ కల కనుక పూజా కూడా ధైర్యం చేసి అక్కడ ఇల్లు కొనేసింది.. మంచి రోజు చూసుకుని త్వరలో ఆ ఇంట్లోకి షిఫ్ట్ అవడానికి పూజా ఏర్పాట్లు చేసుకుంటోంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 14 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ వర్సిటీలో ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)- రెగ్యులర్ మోడ్‌లో అందిస్తున్న పలు అకడమిక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, ప్రొఫెషనల్ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రోగ్రామ్‌ను అనుసరించి ఎంట్రెన్స్ టెస్ట్/అకడమిక్ మెరిట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. నాలుగేళ్ల డిగ్రీ ప్రోగ్రామ్‌లలో మాత్రం ఎన్‌టీఏ నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. హైదరాబాద్ మెయిన్ క్యాంపస్ సహా వర్సిటీ ఆధ్వర్యంలోని శాటిలైట్ క్యాంపస్‌లు, టీచర్ ఎడ్యుకేషన్ కాలేజీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు.

- వెబ్‌సైట్: www.manuu.edu.in



ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇచ్చే ప్రోగ్రామ్‌లు

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు: ఉర్దూ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, దక్కన్ స్టడీస్, ఎడ్యుకేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ ఉర్దూ కల్చర్ స్టడీస్, కంపారటివ్ స్టడీస్, లా, సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్‌క్లూజన్ పాలసీ, లాంగ్వేజ్ టీచింగ్ ఇన్ మదర్సా.
పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్(కంప్యూటర్ సైన్స్), ఎంఈడీ, మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం)
డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీటెక్(కంప్యూటర్ సైన్స్), బీటెక్-కంప్యూటర్ సైన్స్(లేటరల్ ఎంట్రీ), ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీఈడీ
ప్రొఫెషనల్ డిప్లొమాలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ), పాలిటెక్నిక్ డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, అప్పారెల్ టెక్నాలజీస్), పాలిటెక్నిక్ డిప్లొమా లేటరల్ ఎంట్రీ
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

అకడమిక్ మెరిట్ ద్వారా అడ్మిషన్స్ ఇచ్చే ప్రోగ్రామ్‌లు

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ(ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, అరబిక్, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎంఎస్‌డబ్ల్యు(సోషల్ వర్క్), ఎంఏ జేఎంసీ(లేటరల్ ఎంట్రీ), ఎంకాం, ఎమ్మెస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ), ఎం ఒకేషనల్(ఎంఎల్‌టీ, ఎంఐటీ), ఎంసీఏ(లేటరల్ ఎంట్రీ)
ఫుల్ టైమ్ పీజీ డిప్లొమా: టీచింగ్ ఇంగ్లీష్
పార్ట్ టైమ్ పీజీ డిప్లొమాలు: ఫంక్షనల్ ఉర్దూ, హిందీ అండ్ ట్రాన్స్‌లేషన్, ప్రొఫెషనల్ అరబిక్, ట్రాన్స్‌లేషన్
పార్ట్ టైమ్ డిప్లొమాలు: తహసీన్-ఇ-గజల్, అరబిక్, పర్షియన్, పాష్తో, ఫ్రెంచ్, రష్యన్, ఇస్లామిక్ స్టడీస్
పార్ట్ టైమ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఉర్దూ, ప్రొఫిషియెన్సీ ఇన్ అరబిక్, పర్షియన్, పాష్తో, ఫ్రెంచ్, రష్యన్, తెలుగు, కశ్మీరీ, టర్కిష్
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 30

ఇతర క్యాంపస్‌లు అందిస్తున్న ప్రోగ్రామ్‌లు

లఖ్‌నవూ క్యాంపస్: (ఎంఏ/పీహెచ్‌డీ)(ఉర్దూ, ఇంగ్లీష్, అరబిక్, పర్షియన్)
శ్రీనగర్ క్యాంపస్: (ఎంఏ/పీహెచ్‌డీ)(ఎకనామిక్స్, ఇస్లామిక్ స్టడీస్, ఉర్దూ, పర్షియన్, ఇంగ్లీష్)
కాలేజెస్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్-భోపాల్(మధ్యప్రదేశ్), దర్భంగా(బిహార్): బీఈడీ, ఎంఈడీ, పీహెచ్‌డీ ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు
కాలేజెస్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్-శ్రీనగర్(జమ్మూ అండ్ కశ్మీర్), అసన్‌సోల్(పశ్చిమ బెంగాల్), ఔరంగాబాద్(మహారాష్ట్ర), సంభల్(ఉత్తరప్రదేశ్), నుహ్(హరియాణా), బీదర్(కర్ణాటక): బీఈడీ ప్రోగ్రామ్
పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ డిప్లొమాలు: హైదరాబాద్ క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ); దర్భంగా, బెంగళూరు క్యాంపస్‌లలో డిప్లొమా(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్); కడప-ఏపీ క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, అప్పారెల్ టెక్నాలజీస్); కటక్-ఒడిశా క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్).

అర్హత:
కోర్సును అనుసరించి పదో తరగతి/ఇంటర్/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉర్దూ మీడియంలో గానీ ఉర్దూ ఒక సబ్జెక్టుగా గానీ చదివి ఉండాలి. వర్సిటీ గుర్తింపు పొందిన మదర్సాలలో చదువుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంటెక్



పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ(డీఐఏటీ)- ఫుల్ టైమ్ ఎంటెక్ (సెల్ఫ్ ఫైనాన్స్‌డ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. రాత పరీక్ష ద్వారా రెండు ఫేజ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఎటువంటి స్కాలర్‌షిప్‌లు, అసిస్టెంట్‌షిప్‌లు లభించవు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు మాత్రం ఏఐసీటీఈ పీజీ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

విభాగాలు - స్పెషలైజేషన్‌లు

- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్
- ఏరోస్పేస్ ఇంజనీరింగ్ - గైడెడ్ మిసైల్స్ యూఏవీ
- మెకానికల్ ఇంజనీరింగ్ - మెరైన్, ఆర్మమెంట్ అండ్ కంబాట్ వెహికిల్స్, మెకానికల్ సిస్టం డిజైన్
- ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - రాడార్ అండ్ కమ్యూనికేషన్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- రోబోటిక్స్ - ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్
- ఇతర విభాగాలు: సెన్సార్ టెక్నాలజీ, మోడలింగ్ అండ్ సిమ్యులేషన్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ క్వాంటమ్ కంప్యూటింగ్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ టెక్నాలజీ.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ లేదా మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/అప్లయిడ్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్ సైన్స్/ఫొటోనిక్స్/మెటీరియల్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ సైన్స్/నానో సైన్స్ అండ్ టెక్నాలజీ/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/రేడియో ఫిజిక్స్-ఎలక్ట్రానిక్స్/రిమోట్ సెన్సింగ్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/మేథమెటిక్స్/కెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/స్టాటిస్టిక్స్) లేదా ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి.
రాత పరీక్ష: పరీక్షని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. సంబంధిత స్పెషలైజేషన్ నుంచి 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200

ఫేజ్-1:

- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 18
- **రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 23
- **రాత పరీక్ష తేదీ:** మే 1
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** మే 2న
- **కౌన్సెలింగ్:** మే 2, 3

ఫేజ్-2:

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 19
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 7
- **రాత పరీక్ష తేదీ:** జూన్ 24
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** జూన్ 25
- **కౌన్సెలింగ్:** జూన్ 25, 26
- **స్పాట్ అడ్మిషన్స్:** జూలై 19
- **ఈ-మెయిల్:** mtech-admissions@diat.ac.in
- **వెబ్‌సైట్:** www.diat.ac.in

ఆర్ఐఈఐలో డిప్లొమా, పీజీ డిప్లొమా

బెంగళూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్, సౌత్ ఇండియా(ఆర్ఐఈఎస్ఐ)- దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 'డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్(డీఐఈసీ)', 'పీజీ డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్(పీజీడీఈఎల్‌టీ)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.



డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్(డీఐఈసీ)

అభ్యర్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్: ఒకాబులరీ, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెంపొందించేలా ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫ్లూయెన్సీ, అక్యూరసీ, డిస్కోర్స్ మేనేజ్‌మెంట్ మాడ్యూల్స్‌తోపాటు ఒక ఆప్షనల్ మాడ్యూల్(ఇంగ్లీష్ లాంగ్వేజ్ పెడగాగి/ఇంగ్లీష్ ఫర్ బిజినెస్/ఇంగ్లీష్ ఫర్ మీడియా)కూడా ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తమ్మీద రెండు కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మొదటిది రెండు రోజుల ప్రోగ్రామ్. దీనిని 2024 అక్టోబరులో ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. రెండోది 18 రోజుల ప్రోగ్రామ్. దీనిని 2025 ఏప్రిల్/మేలో ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏ గ్రూపుతోనైనా ఇంటర్/పన్నెండో తరగతి/పీయూసీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు రూ.4,000.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (పీజీడీఈఎల్‌టీ)

ఈ ప్రోగ్రామ్‌లో ప్రొఫిషియెన్సీ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, కోర్ ట్రెయినర్ - స్కిల్స్ - స్ట్రాటజీస్ - టెక్నిక్స్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. లిజనింగ్ అండ్ స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, లాంగ్వేజ్ వర్క్, మెథడ్స్ అండ్ మెటీరియల్స్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, టీచర్ డెవలప్‌మెంట్, టీచింగ్ ప్రాక్టీస్ అంశాలు కూడా ఉంటాయి. ఆరు బుక్‌లెట్స్‌తో కూడిన లెర్నింగ్ మెటీరియల్ ఇస్తారు. వీటికి సంబంధించిన అసైన్‌మెంట్ వర్క్‌లు పూర్తిచేయాలి. ఈ ప్రోగ్రామ్‌లో కూడా రెండు కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మొదటిది మూడు రోజుల ప్రోగ్రామ్. దీనిని 2024 అక్టోబరులో ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. రెండోది 22 రోజుల ప్రోగ్రామ్. దీనిని 2025 ఏప్రిల్/మేలో ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ ప్రోగ్రామ్‌ని గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు రూ.10,000.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు:** పదోతగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్‌లు; ఆధార్ కార్డ్, రెండు ఫొటోలు.
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ద డైరెక్టర్, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్, సౌత్ ఇండియా, జనభారతి క్యాంపస్, బెంగళూరు - 560056.
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూన్ 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.riesi.ac.in

యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామ్



కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్/జీడీఎంవో ఉద్యోగాల భర్తీకి సంబంధించిన కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహిస్తోంది.

కేటగిరీ-1:

- మెడికల్ ఆఫీసర్స్ (గ్రేడ్ ఇన్ జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్-క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్): 163 పోస్టులు

కేటగిరీ-2:

- అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్(రైల్వేస్): 450 పోస్టులు

జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్): 14 పోస్టులు
జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్-2(మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ): 200 పోస్టులు
అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 32 ఏళ్లు మించకూడదు. మెడికల్ ఆఫీసర్స్(గ్రేడ్ ఇన్ జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్-క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్) పోస్టులకు మాత్రం 35 ఏళ్లు మించకూడదు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

పరీక్ష వివరాలు

- ఇందులో రిటెన్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఉంటాయి.
- **రిటెన్ ఎగ్జామినేషన్:** ఇది 500 మార్కులకు ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్ 250 మార్కులకు ఉంటుంది. పేపర్‌కు పరీక్ష సమయం రెండు గంటలు. మొదటి పేపర్‌లో జనరల్ మెడిసిన్ నుంచి 96 ప్రశ్నలు, పీడియాట్రిక్స్ నుంచి 24 ప్రశ్నలు చొప్పున మొత్తం 120 ప్రశ్నలు ఇస్తారు. రెండో పేపర్లో సర్జరీ, గైనకాలజీ, ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ అంశాల నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు చొప్పున మొత్తం 120 ప్రశ్నలు ఇస్తారు. రెండు పేపర్లలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఎంబీబీఎస్ సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. నెగెటివ్ మార్కులు ఉన్నాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే మూడో వంతు మార్కు కోత విధిస్తారు. ఈ ఎగ్జామ్‌లో అర్హత పొందినవారిని మాత్రమే పర్సనాలిటీ టెస్ట్‌కు అనుమతిస్తారు.
- పర్సనాలిటీ టెస్ట్ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అకడమిక్ స్టడీ, జనరల్ నాలెడ్జ్ అంశాల్లో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు. అలాగే నాయకత్వ లక్షణాలు, నిర్ణయాత్మక ధోరణి, ఏకాగ్రత, నూతన అంశాలపై ఉత్సుకత తదితర లక్షణాలను పరిశీలిస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ టెస్టులు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200 (మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 1 నుంచి 7 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి
- **కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024 తేదీ:** జూలై 14
- **వెబ్‌సైట్:** https://www.upsc.gov.in/

UPSC

లిటిల్స్



మీకు తెలుసా?

- డేగ జాతికి చెందిన వీటి పేరు 'ఫాల్కన్'. ప్రపంచవ్యాప్తంగా వీటి జాతి 60 రకాలున్నాయి. గంటకు 242 మైళ్ల వేగంతో గాల్లో ప్రయాణిస్తాయి.
- 3500 ఏళ్ల క్రితం నుంచి కొన్ని రకాల పక్షులను, చిన్న జంతువులను వేటాడటానికి ఉపయోగించేవారు. మగ పక్షులే అగ్రెసివ్‌గా ఉంటాయి.
- మనిషితో పోలిస్తే ఎనిమిది రెట్లు అధికంగా వీటి చూపు ఉంటుంది. రెండు మైళ్ల దూరంలో ఉన్న చిన్న జీవిని కూడా ఇవి గాల్లోంచి చూడగలవు. ఎంత వేగంగా గాలి వీచినా వాటి రెక్కలతో, శరీరంతో అలసి పోకుండా బుల్లెట్‌లా దూసుకుపోగలవు.



- నాలుగు లేదా ఐదు గుడ్లను మాత్రమే పెడతాయి. పొదిగే కాలం ఇరవై ఐదు రోజులు.
- చిన్న పురుగులు, బల్లులు, కప్పలు, చేపలు, పావురాలు, చిన్న బాతులు, నీటి పక్షులను తింటాయివి.
- ఫాల్కన్ పక్షుల బరువు కేజీ ఇరవై గ్రాముల వరకూ ఉంటుంది. ముఖ్యంగా ఈ పక్షులను అరబ్ దేశాల్లో పందేలకోసం ఉపయోగిస్తారు.
- ఇవి బ్రిడ్జిల మీద, ఎత్తయిన చెట్ల మీద, ఎత్తయిన కట్టడాల మీద మాత్రమే గూళ్లు కట్టుకుంటాయి.
- ఎడారులే కాకుండా సముద్ర ప్రాంతాలు, పచ్చికబయళ్లు, దట్టమైన అడవుల్లో కూడా ఇవి నివసిస్తాయి.
- మగపక్షి వేటకు వెళ్లి గూటిలోని పిల్లలకే కాదు ఆడపక్షికీ ఆహారాన్ని తీసుకొచ్చి పెడుతుంది.
- గోధుమరంగు, పసుపు పచ్చ, బూడిద రంగు, తెలుపు, నలుపు రంగుల్లో ఉంటాయి.
- వీటి జీవనకాలం 18 సంవత్సరాలు.

సరైన నీడ ఏది?







10 తేడాలు గుర్తించండి

డైలీ సుడోకు - 281

8	6					3		
			1				6	
7	4	3		6				5
	3	7	8			9		
2								3
		6			9	4	7	
3				1		7	8	6
	1				7			
		2					1	4

సుడోకు - 280 సమాధానం

7	1	4	9	5	6	2	3	8
5	3	9	2	1	8	4	7	6
6	2	8	4	7	3	5	9	1
8	4	1	3	6	7	9	5	2
2	5	7	8	9	4	1	6	3
9	6	3	5	2	1	7	8	4
1	8	2	7	3	9	6	4	5
4	9	6	1	8	5	3	2	7
3	7	5	6	4	2	8	1	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.